# దేవుళ్ళ జల్సాలు

యలమంచిలి వెంకటప్పయ్య



# దేవుళ్ళు ఎవరికొరకు?

**యలమంచిలి వెంకటప్పయ్య**

**1979**

ప్రథమ ముద్రణ :1979 మార్చి
ప్రతులు : 2000

వెల రూ : 5

ముద్రణ :
స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు,
విజయవాడ-4.
ఫోన్ నెం :75302.

# ముందుమాట

నా చిన్నతనంలో మొట్టమొదటగా నాకు మాటలు నేర్పింది మా అమ్మే. మా అమ్మ నాకు నేర్పిన మాటలను "బాస" అంటారు. మా అమ్మ బాస "తెలుగు". తెలుగు బాసను తెనుగు, తెలుంగు త్రిలింగము, ఆంధ్ర అని కూడా అంటారు. మా అమ్మ నేర్పిన తెలుగు బాసలోనే "దేవుళ్ళెవరికొరకు?" అనే యీ పొత్తాన్ని రాసి నా తెలుగు సోదర సోదరీమణులకు అందచేయాలనుకొన్నా.

జనం గాలిలో ఎగిరే ఈ రోజులలోకూడా మన దేశంలో ముఖ్యంగా మన తెలుగునాడులో రోజురోజుకు ఒక్కొక్క కొత్త దేవుడు పుట్టుకొచ్చి ముఖ్యంగా చదువు సంధ్యలేని బీద ప్రజానీకాన్ని నానారకాలుగా తికమకలుపెట్టి వారి కష్టార్జితాన్నేకాక వారి బౌద్ధికసంపత్తిని కూడా (వారి ఆలోచనా శక్తిని కూడా) దోపిడీ చేసి వారిని తెలివితక్కువ వారినిగా చేస్తున్నాడు. అందువలన ప్రజలు అనేక రకాలుగా కష్టనష్టాలు అనుభవిస్తున్నారు. కనుక యీ పొత్తంలో దేవుని ఉనికి (ఉండుట), గుణగణాలు, రుపాలు వగైరాలను గురించి పెద్దలనబడే రుషులు, మునులు, మహర్షులు, మహామునులు, వగైరాలు చెప్పిన విషయాలు రాయబడ్డాయి. తరువాత మన దేశంలో దేవుని పేరిట జరిగే తంతులు విపులంగా రాయబడ్డాయి. తుదకు వాటిని (తంతులను) నిర్మూలించటానికి మార్గాలను కొంతమేరకు సూచించబడ్డాయి.

ఈ పొత్తంలో ఒకే విషయం అనేక సార్లుగా రాయబడ్డది. కారణం ఒకే విషయాన్ని గురించి పలువురు లేఖకులు తమ అభిప్రాయాలను

రాశారు. అందు వలన చెప్పిందే మరల చెప్పటం సహజంగా వుంటుంది. కనక చదువరులు దానిని పునరావృత్తి దోషంగా ఎంచరని ఆశిస్తా"

నేను కొంత మంది లేఖకుల అభిప్రాయాలను ఉన్నవి ఉన్నట్లుగా దీనిలో కూర్చానేగాని యిందులో నా సొంత రచన చాల తక్కువ అని మనవి చేస్తున్నా. ఆ లేఖకులకున్నూ, నన్ను యీ పొత్తాన్ని రాయటానికి ప్రోత్సహించిన మిత్రులకు నా ధన్యవాదాలు. నాకు యీ పొత్తాన్ని అచ్చులోకి తేవటానికి డబ్బు సహాయం చేసిన మిత్రులకు నా ప్రత్యేక ధన్యవాదాలు.

విధేయుడు,

**యలమంచిలి వెంకటప్పయ్య**

ది. 1-2-1979.

# 1

# దేవుళ్ళెవరి కొరకు?

నేడు ప్రపంచం మొత్తంలో సుమారు 400 కోట్ల మంది జనం వున్నారు. వారంతా ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికా, ఐరోపా, భూభాగాల్లో నివసిస్తున్నారు. నేటి మానవులందరిలోనూ "దైవం", "పెండ్లి", "శ్రాద్ధకర్మ" (దినము) ... ఈ మూడు విషయాలు ఒకేరకంగా కాకపోయినా ఏదో ఒక రకంగా వుంటూనే వున్నాయి. ఈ మూడు విషయాలు ప్రతి మనిషిని పెనవేసుకొని వుంటున్నాయి. వీటిలో మొదటి విషయం "దైవం". దైవాన్ని "దేవుడు", "అల్లాహ్", "గాడ్", "ఖుదా" మొదలైన పేర్లతో పిలుస్తారు. ఈ దేవుడు ఎప్పుడు? ఎవరి కొరకు ఊహింపబడి కల్పించబడ్డాడు? దేవుడు ఎట్లా వుంటాడు.? మొదలైన ప్రశ్నలకు కొంతమంది పెద్దలు చెప్పిన సమాధానాలు విపులంగా యీ పుస్తకంలోనే ముందు వివరింప బడతాయి. దేవుణ్ణి తెలుసుకోడానికి తోడ్పడే విధానాన్ని "మతము" అంటారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తంలో చాల మతాలు వున్నాయి. వాటిలో యూదుమతం, ఫార్శీ మతం, క్రీస్తుమతం, ఇస్లామ్‌మతం, (సాహెబ్‌లమతం) బౌద్ధమతం, జైనమతం, సిక్కుమతం, హిందూమతం మొదలైనవి ముఖ్యమైనవి.

మనది హిందూమతం. హిందూమతంలో దైవాన్ని గురించి తెలిసికొనుటకు ప్రయత్నించిన మత సంప్రదాయాలు చాలా వున్నాయి. వాటిలో వేదాల ద్వారా దేవుణ్ణి తెలిసికొని పూజించే సంప్రదాయాన్ని "వైదిక సంప్రదాయం" అని అంటారు. ఈ సాంప్రదాయాన్ని అనుసరించేవారి సంఖ్య హిందువులనబడే వారిలో చాల ఎక్కువ. వేదాలలో దేవుణ్ణి గురించి చెప్పబడిన విషయాలను తెలిసికొనుటకు ముందు వేదాలను గురించి తెలిసికొనడం అవసరం.

వేదాలు ఎప్పుడు చెప్పబడినవో అనే విషయంలో అభిప్రాయభేదాలు గలవు, క్రీస్తుకు పూర్వం 3 వేల సంవత్సరాల నాడని కొందరు, 15 వందల సంవత్సరాల నాడని మరికొందరు అంటారు. వేదాల రచనను (పుట్టుకను) గురించి కూడా అభిప్రాయ బేధాలు గలవు. వేదాలను కొంత మంది ఋషులు, మునులు, యతీశ్వరులు, సన్యాసులు రచించారని (రాశారని) కొందరంటారు. కాదు బ్రహ్మదేవుని నోటినుండే ఊడిపడినవని మరికొందరంటారు.

వేదాలు నాలుగు – 1. ఋగ్వేదము (రుగ్వేదము) 2. సామవేదము. 3. యజుర్వేదము. 4. అధర్వణవేదము.

ఋగ్వేదము : ఇది వేదాలన్నింటిలోనూ మొట్టమొదటగా వెలువడింది. దీనిలో భారతీయ ఆర్యులలోని వివిధ తెగలు, ఆర్య ఋషులు, మునులు, వివిధ దేవతలను ఉద్దేశించి చేసిన స్తోత్రాలు, దేవతలకు వారు తెలిపిన కోర్కెలు, తమ తెగలు చేసిన యుద్ధాలు, పొందిన విజయాలు, యజ్ఞ మంత్రాలు, యజ్ఞాలు చేయు, చేయించే విధానాలు, పరమాత్మ (దేవుడు) ఆత్మ (జీవాత్మ) జగత్తు వగైరాలను గురించిన విషయాలు కూడా వున్నాయి.

సామవేదము : దీనిలోని ఎక్కువ మంత్రాలు ఋగ్వేదం లోనివే. ఈ మంత్రాలన్నీ గేయ పద్ధతిలో (పాటలలో) గానం చేయటానికి (పాడటానికి) వీలుగా వుంటాయి. ఏ పాటను ఏ రాగంలో పాడాలో, ఒకే పాటను వేరు వేరు రాగాలల ఎట్లా పాడాలో దీనిలో తెలుపబడింది.

యజుర్వేదము : ఈ వేదమంతా కర్మకాండలు, యజ్ఞాలు, దానధర్మాలు చేయు విధానాలను తెలుపు మంత్రాలతో నిండి వుంటుంది.

అధర్వ (ణ) వేదము : ఈ వేదాన్ని మంత్ర తంత్ర వేదమని కూడా చెప్పవచ్చు. దీని నిండా తాయిత్తులు, చక్రాలు, దయ్యాలను పారదోలుట, చేతబడులు, శాపాలు, శాంతులు, ఇష్టమైన వారికి మేలు చేయుటకు ప్రయోగించే మంత్రాలు, గిట్టని వారికి కీడు చేయటానికి ప్రయోగించే మంత్రాలు, ఈఈఈఈశ్రాద్ధకర్మలు, చనిపోయినవారి ప్రాణం ఏ లోకానికి పోతుందో ఆ విషయం, పరలోకం అంటే ఏమిటో, స్వర్గ లోక దేవతలు, భూలోక దేవతలైన పౌరోహిత బ్రాహ్మణులు ఇద్దరూ లాలూచీఅయి యజ్ఞాలు చేసిన వారికి స్వర్గంలోకంలో రంభా సంభోగం కలిగే అవకాశాన్ని కలిగించగలమని చెప్పే మంత్రాలు గలవు.

నిజానికి నాలుగు వేదాలలోనూ ఒక్క ఋగ్వేదములో తప్ప (తక్క) తక్కిన మూడు వేదాలలోనూ "దేవుడు", "జీవాత్మ", "జగత్తు" మొదలైన వాటి "ఊసే" లేదు. కనుక ఆ మూడు వేదాల లోనూ "దేవుడు" వగైరాలను గురించి వెతకుట వ్యర్థమే. ఇకపోతే ఋగ్వేదం వుంది. దీనిలో ఆరంభంలో భారతీయ ఆర్యులు ఇంద్రుడు. వరుణుడు, సూర్యుడు, నీరు, నిప్పు, గాలి, భూమి, వగైరాలను దేవతలుగా భావించి ప్రార్థించారు. ఆ దేవతలలో ఇంద్రుడు, భారతీయ ఆర్యులకు చాల ముఖ్యమైన దేవత. ఎందుకనగా ఇంద్రుడు వానలు కురిపించి పంటలు పండించు దేవత అని వారి నమ్మకం. కనుక భారతీయ ఆర్యులు చేయు యజ్ఞాలలో అర్పించే సామాగ్రిలో ఎక్కువ భాగం అనుభవించే దేవత ఇంద్రుడేనని వారి నమ్మకం. భారతీయ ఆర్యులు సూర్యుడు, అగ్ని, ఇంద్రుడు, వగైరా దేవతలను, తమకు సుఖము, ఆరోగ్యము, సంపదలు, సంతానము, ఆయువు వగైరాలను యివ్వమని అదేపనిగా వేడుకొన్నారు. ఈ క్రింది వేడుకోలు చూడండి............

"ఓ భూదేవీ ! ఓ ఆకాశమా!! ఓ వాయుదేవుడా !!! మాకు ధనం యివ్వండి. మాకు మంచి మనస్సు యివ్వండి. మాకు మంచి సంతానం యివ్వండి. మాకు మంచి కళ్ళు యివ్వండి. మా వెంట్రుకలు తెల్లబడకుండావుండు లాగున చేయండి. మా పళ్ళు వూడకుండా వుండేటట్టు చేయండి. మా శరీరాలను నాశనం చేయకండి. మేము నూరేళ్ళు బ్రతికేట్లు చేయండి. ఈ లోపుగా మా కొడుకులు తండ్రులై పోతారు. మాకు మంచి బుద్ధినివ్వండి. తప్పిపోయిన మా పశువులను వెతకటానికి మాకు

సహాయం చెయ్యండి. నీటిలో మునిగిపోతున్న మా పడవలను ఒడ్డుకు చేర్చండి. యుద్ధాలలో అవయవాలు పోగొట్టుకొన్న మా వాళ్ళకు మరలా కృత్రిమ అంగాలను యేర్పాటు చేయండి. పెండ్లికాని మా అమ్మాయిలకు మా అబ్బాయిలకు వరులను, వధువులను చూపించండి. ”

మరొక ప్రార్ధన...

“ఓ అగ్ని దేవుడా అతనిని కాల్చవద్దు. అతనిని మాడ్చవద్దు. అతని కళ్ళను సూర్యుని వద్దకు వెళ్ళనివ్వుము.”

ఈ రకంగా భారతీయ ఆర్యులు తొలిరోజులలో తమకు, తమ వారికి మేలు చేయమని దేవతలను అడుగడుగునా (అదేపనిగా) బ్రతిమాలు కొనేవారు. శరీరానికి సంబంధించిన, ఈ లోక సుఖాలను అనుభవించటానికి మాత్రమే ఎక్కువ అవకాశాలను చూపించమని దేవతల్ని ప్రార్థించేవారు.

చాలాకాలం వరకు భారతీయ ఆర్యులకు “దేవుడు”, “జీవుడు”, “సృష్టి” మొదలైన వాటి సంగతే అంతుపట్టలేదు. కానీ ఋగ్వేదం చివరి భాగంలో కొంతమంది దేవతల పేర్లు కనిపించాయి. అంటే కొంతకాలానికి భారతీయ ఆర్యులు “విష్ణువు” అనే ఒక కొత్త దేవతను ప్రార్థింపసాగారు.

***వేదకాలం తొలి రోజులలో భారతీయ ఆర్యులకు విగ్రహారాధన సంగతి తెలియనే తెలియదు. దేవాలయాలు అసలు లేనే లేవు***. కానీ భారతీయ ఆర్యుల వైదికమతమంతా యజ్ఞాలు, కర్మకాండలు, అగ్ని మొదలైన దేవతలను ప్రార్థించుట, (స్తోత్రము చేయుట) వగైరాలతో నిండి వుండేది.

కొంత కాలానికి కొందరు ఋషులు, మునులు, యజ్ఞ యాగాదులకు కర్మకాండలకు విసుగుజెంది యీ విధంగా ఆలోచింపసాగారు. ..

(1.) “ఈ ప్రపంచ సృష్టికి కారణం ఏమిటి? (2) ఏ శక్తి యీ ప్రపంచాన్ని నడుపుతోంది? (3) ఈ సృష్టిలో మానవుని స్థానం ఏమిటి? (4) మానవునికి సృష్టికి గల సంబంధం ఏమిటి? (5) మానవుని జన్మ అనుకోకుండా జరిగిందా? లేక ఆలోచన పూర్వకంగా జరిగిందా? (6) ఈ జన్మ యింతేనా? మరల జన్మ వుందా? ఈ విధమైన విషయాలను గురించి లోతుగా ఆలోచింప సాగారు. ఇలాంటి

ఆలోచన లతో కొంతమంది ఋషులు, మునులు, యోగులు, యతీశ్వరులు చర్చలు ప్రారంభించారట. ఈ చర్చలనే "ఉపనిషత్తులు" అంటారు. ఉపనిషత్తులను "ఆరణ్యకములు" అని కూడా చెబుతారు. ఎందుకంటే ఋషులు మునులు వగైరాలు అరణ్యాలలో వుంటూ 'దేవుడు', 'జీవుడు', 'జగత్తు' వగైరా విషయాల్ని గురించి బాగా చర్చించి, చర్చించి ఆలోచింప సాగారట. వారి ఆ ఆలోచనలనే అరణ్యకములు లేక "ఉపనిషత్తులు" అంటారు.

ఉపనిషత్తుల కాలంలో దేవుని గురించిన ఆలోచనలు, చర్చలు అనేక రకాలుగా సాగినవట. కొందరు ఋషులు దేవుడు అనే వాడున్నాడంటే కొందరు ఋషులు దేవుడు అనేవాడు లేనేలేడనేవారు. కొందరు ఋషులు ప్రపంచమంతా దేవుని రూపమేనంటే, మరి కొంతమంది ఋషులు దేవుడు వేరు, జీవుడు వేరు అనేవారు. కొందరు మునులు పునర్జన్మ (తిరిగి పుట్టుట) వున్నదంటే, మరికొంత మంది మునులు తిరిగి జన్మ అంటూ ఏదీ లేనే లేదనే వారు. కొందరు యతీశ్వరులు మానవుడు సర్వస్వతంత్రుడు, అతడు యిష్టమొచ్చినట్లు జీవితం గడపగలడంటే, మరికొందరు యతీశ్వరులు మానవుడు దేవుని చేతిలో కీలుబొమ్మ అని అనే వారు. కొంతమంది యోగీశ్వరులు మానవుడు మరణించినపుడు అతని శరీరంతో పాటు అతని ప్రాణం కూడా నాశన మగునంటే మరి కొందరు యోగీశ్వరులు శరీరంతో పాటు అతని ప్రాణం నశించదనే వారు. కొంతమంది ఋషులు, వేదాంతులు ఎంత మంది మానవులు గలరో అన్ని ఆత్మలు గలవంటే, మరికొంతమంది ఋషులు వేదాంతులు ఒకే ఒక పరమాత్మ (దేవుడు) తప్ప అనేక ఆత్మలు లేనేలేవనేవారు. కొంతమంది ఋషులు పరమాత్మ (దేవుడు), జీవాత్మ, జగత్తు యీ మూడు వేరు వేరుగా స్థిరంగా వుండేవంటే, మరికొందరు ఋషులు జీవాత్మ, జగత్తు యీ రెండూ పరమాత్మలో కలిసిపోవుననే వారు. ఈ రకంగా దేవుని, జీవుని, జగత్తును గురించి అనేక వాదోపవాదాలు బయలుదేరాయి.

కొంతమంది ఋషులు దేవుణ్ణి గురించి యిలా వర్ణించారు. "ఎక్కడ ఎవ్వరూ ఏమీ చూడలేరో, ఎక్కడ ఎవ్వరూ ఏమీ వినలేరో, ఎక్కడ ఎవ్వరూ ఏమీ అర్థం చేసుకోలేరో, అదే దేవుడు" .

మరి కొందరు ఋషులు దేవుణ్ణి గురించి యీవిధంగా వర్ణించారు. “దేవుడు నిరాకారుడు (ఆకారం లేనివాడు). దేవుడు అనంతుడు. (చావులేని వాడు). దేవుడు వేదాల ద్వారా గాని గొప్ప పాండిత్యం ద్వారా గాని తెలుసుకోబడడు. ఆయన కేవలం ఆత్మ విచారణద్వారా మాత్రమే (తనను తాను తెలుసుకొన్నప్పుడే) తెలుసుకోబడతాడు. పువ్వులు, పండ్లు, నైవేద్యాలు, నగలు, వెంట్రుకలు వగైరా ద్వారా ఆయన దొరకడు. ఆయనకు రంగులేదు. అవయవాలు లేవు. ఆయన స్థూలం కాదు. సూక్ష్మం కాదు. ఆయనను ఎవ్వరూ అంటుకోలేరు. తెలుసుకోలేరు” స్వసంవేదోపనిషత్తులో హేతువాద యుక్తమైన ఆలోచనలు, నాస్తిక అభిప్రాయాలు గలవు.

“తిరిగి పుట్టుట అనేది లేనే లేదు. దేవుడు, పరలోకం మొదలైనవన్నీ మోసాలే. ప్రకృతియే ప్రబంధకర్త. కాలం నశింపు చేయును. ఈ రెండే అన్నింటిని శాసించేవి. మానవుల సుఖ దుఖాఃలతో వాటికి సంబంధం లేదు.”

కొన్ని ఉపనిషత్తులలో అక్కడక్కడ యీ క్రింది ప్రశ్నలు వేయబడ్డాయి. 1 మనం ఎక్కడనుండి పుట్టాము? 2. దేని వలన మనం జీవిస్తున్నాము? 3. దేనితో మనం నిర్మింపబడ్డాము? 4. ఇక్కడ నుండి మనం ఎక్కడకు వెళ్తాము? 5. ఈ ప్రపంచానికి మూల కారణం ఏమిటి? ఈ రకమైన ప్రశ్నలకు జవాబులు చెప్పబడేవి కాదు.

మరి కొంతమంది ఋషులు దేవుని గురించి యీ విధంగా చెప్పారు. “ఏది వాక్కు వలన తెలియనిదో, దేనిచేత వాక్కు ప్రకాశించుచున్నదో, అదియే దేవుడని నీ వెరుంగుము. దేనిని దేవుడని పూజించుచున్నావో అది దేవుడు కాదు, దేనిని మనస్సుతో తెలిసికో లేవో, దేనిచేత మనస్సు ఆలోచించునో, అదియే బ్రహ్మము (దేవుడు) అని ఎరుంగుము. దేనిని కండ్లు చూడలేవో, దేనిచేత కండ్లు చూచుచున్నాయో అదియే దేవుడు. దేనిని చెవిచే వినజాలవో, దేనివలన చెవి వినబడుతున్నదో అదే బ్రహ్మము. ఏది ప్రాణవాయువుచే శ్వాసించుటలేదో, దేనిచే ప్రాణవాయువు శ్వాసించుచున్నదో అదే దేవుడు. దేవుణ్ణి నేత్రము గాని, వాక్కు గాని, మనస్సు గాని అందుకోలేదు. దేవుని తెలుసుకునే మార్గం కూడా మనకు

తెలియదు. దేవుని గురించి తెలుసుకొన్న దానికంటే తెలుసుకోవాలన్నది యింకా వున్నదని పెద్దలంటారు".

ఈ రకంగా దేవుని అంతుచిక్కనందున యజ్ఞ యాగాదుల, కర్మ కాండల బూటకపు ఆచారాల నుండి తప్పించుకోవాలని మానవాత్మ (మానవుడు) మొదటనుండి ప్రయత్నిస్తూనే వుంది. ఎట్లనగా నాస్తికభావాల ఉత్పత్తి (దేవుడు లేనేలేడనే భావాలు) రుగ్వేద కాలంలోనే అక్కడక్కడ కన్పిస్తున్నాయి. రుషుల, మునుల, మేధాశక్తి (ఆలోచనా శక్తి) యింకా పెరిగి నందువల్ల వారి మనస్సులలో అనేక రకాల సందేహాలు, ప్రశ్నలు పుట్టసాగాయి. సందేహాలతో పాటు ప్రశ్నలెన్నో వేద మంత్రాల్లో కన్పిస్తాయి. భారతీయ ఆర్యులలో ఉపనిషత్తుల కాలమందు దేవుడు, జీవాత్మ, సృష్టి, మోక్షము, ఇంద్రియాలు మొదలైన విషయాలను గురించి వాదోపవాదాలు ఎక్కువయ్యాయి. అందువల్ల కథలు, ప్రశ్నోత్తరాలు, వగైరాల ద్వారా ఆ విషయాలను గురించిన యీ దిగువ వేదాంత వాదాలు వాడుక లోనికి వచ్చాయి. వాటిని మహావాక్యాలంటారు.

1. అహం బ్రహ్మాస్మి.... నేను బ్రహ్మను. (దేవుణ్ణి)
2. తత్వమసి... నీవే దేవుడవు.
3. ఆయమాత్మా బ్రహ్మ – ఈ ఆత్మయే దేవుడు
4. ప్రజ్ఞానం బ్రహ్మ – చైతన్యమే దేవుడు
5. సర్వంల్విదం బ్రహ్మ – ఇదంతా దేవుడే.

ఛాందోగ్యో పనిషత్తులలో ఉద్ధాలక మహా ముని తన పుత్రుడు శ్వేతకేతునితో సృష్టి యొక్క ఉత్పత్తిని గురించి చెప్పి చివరకు దేవుణ్ణి గురించి యిలా బోధించాడు:–

"ఓ శ్వేత కేతు ! నీవే బ్రహ్మవు ( నీవే దేవుడవు" )

ముండకోపనిషత్తులో ఒక ముని యీ విధంగా అంటాడు. "యజ్ఞములు నిరర్ధకమైనవి (పనికిమాలినవి) వాటిలో నీచకర్మ స్పష్టంగా చెప్పబడుచున్నది. కర్మకాండలు గొప్ప మేలు చేయునని చెప్పువారు మూర్ఖులు. వారు ముసలితనానికీ చావుకీ అదేపనిగా గురౌతారు"

తిత్తిరి పేరుగల ముని తైత్తరీయ ఉపనిషత్తులో యిలా చెప్పాడు.

“జడపదార్ధమే (ప్రాణం లేని జగత్తే ) బ్రహ్మం (దేవుడు). ఎందుకనగా యీ ప్రాణులన్నీ యీ జడపదార్దంనుండే పుట్టాయి. పుట్టి ఈ జడపదార్ధం మీదనే జీవిస్తున్నాయి. చనిపోయినపుడు యీ జడపదార్ధంలోనే ప్రవేశిస్తాయి”

కఠోపనిషత్తులో ఒక ముని యిలా అంటాడు. “ఈ ప్రపంచం ఒక సనాతనమైన (చాలకాలం నుంచి వున్న) భౌతిక (పంచభూతాలకు సంబంధంగల) పదార్థంనుండి పుట్టింది.”

బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్య మహాముని యిలా అన్నాడు. “ఈ పంచ భూతాలనుండి (గాలి, నీరు, భూమి, అగ్ని,ఆకాశము) పుట్టిన ప్రతివాడు మరల వాటిలో లీనమైపోతాడు (కనిపించకుండా కలిసిపోతాడు). మరణించిన తరువాత చైతన్యం (ప్రాణశక్తి, ఆత్మ)లేదు.” కొందరు ఋషులు ఉపనిషత్తుల్లో అఖరున దేవుణ్ణి గురించి “నేతి నేతి” అని చెప్పారు. నేతి అనే శబ్ధంలో (న+ఇతి). ఇతి అనగా అంతము; న అనగా లేదు. అంటే అంతము లేనిది. అంటే దేవునికి అంతంలేదు. కనుక దేవుడు అనంతుడు (Infinite). అంతంలేని దేవుణ్ణి అంతంగల శరీరధారులైన మానవులు ఎన్నడూ తెలుసుకోజాలరట.

దేవుణ్ణి గురించి ఆర్యరుషులు, మునులు, యీ రకమైన నిర్ణయాలకు రావటానికి అనేక వేల సంవత్సరాలు పట్టాయి. వారి నిర్ణయాలను మనం మరల ఒకసారి సంక్షేపంగా తెలుసుకుందాం. ఆర్యులలో రానురాను యజ్ఞాలు, కర్మకాండలు వగైరాల వల్ల ఆలోచనారహితమైన శబ్ధాడంబరం (మాటల డాబు) పెరిగి అర్ధంలేని మూఢనమ్మకాలు, మూఢాచారాలు ఎక్కువయి, యజ్ఞాల పేరిట జంతుహింస ఎక్కువైనపుడు హింసాకార్యక్రమ తంతును చూచి మానవ శ్రేయస్సు కోరిన కొంతమంది ఋషులు, మునులు ఆ సంఘాన్ని వదలిపెట్టి, ఆ కర్మకాండను తప్పని చెప్పి బాగా ఆలోచించుకొని వెనుకటి వైదికపద్ధతిని (వేద సమ్మతమైన ) ఉద్ధరించుటకై అడవులలో నివాసాలు ఏర్పరుచుకొని తమ ఆలోచనా శక్తిని జప, తప, యోగ, ఆసనాదులతో పెంచుకొనిరట. ఆ పరిస్థితులలో వారిచేత చెప్పబడిన ఉపదేశాలే “అరణ్యకాలు”. అరణ్యకాలను ఉపనిషత్తులని కూడా అంటారు. ఉపనిషత్తులు వైదిక మతానికి ఆధ్యాత్మిక (దైవ సంబంధమైన ) రూపాన్ని అందించాయి. ఉపనిషత్తులు

యజ్ఞాలను, కర్మ కాండలను బాగా హేళనచేసి నిరసించాయి. యజ్ఞాలను యేయించు వారిని, చేయువారిని అదేపనిగా ఎగతాళి చేశాయి. కర్మకాండ (దినము వగైరాలు) ముక్తికి సాధనం కాకపోగా ఆది మానవుణ్ణి భౌతిక పదార్థాలకు బందీని చేస్తున్నదని బాగా విమర్శించి ముక్తికి జ్ఞానమే మార్గమని ఉపదేశించాయి. పరమాత్మను (దేవుని) గురించి తెలిసికోడానికి ప్రోద్బలమిచ్చాయి. ఒకప్పుడు పౌరోహిత బ్రాహ్మల కర్మకాండను అణచుటలోనూ, పరమాత్మ – విద్యా ప్రచార సాధనలోనూ – ఆధిక్యత (ప్రాబల్యము) క్షత్రీయులకే ఉండేదట. ఇంకను అరణ్యాలలో ఉపనిషత్తులు నిర్మించిన వారిలో ఎక్కువమంది ద్విజేతరులేనట. (శూద్రులేనట). కర్మకాండ, యజ్ఞ యాగాదులు వగైరాలను తెలుపు గ్రంథాలను వ్రాసిన వారంతా బ్రాహ్మలేనట. అందువల్ల వాటిలో వారు యజ్ఞాలను, కర్మకాండలను సమర్థించి తమ వర్ణం (కులం వారికి) భుక్తిమార్గం చూపించటానికి, అనేక తంటాలు పడ్డారు.

ఉపనిషత్తులలో కేవలం బ్రహ్మ (దేవుని) విద్య బోధింపబడ్డది. ఒక్కొక్క ఋషి తాను గ్రహించిన పారమార్థిక (దేవుని గురించిన) స్వానుభవాన్ని వివరిస్తూ చెప్పిన ఉపదేశమే ఒక్కొక్క ఉపనిషత్తుగా పేరుపొందింది. ఉపనిషత్తులు సత్యాన్ని (దేవుణ్ణి) సంవాద (సంభాషణ) రూపంలో ప్రకటిస్తాయి. కథల రూపంలో వ్యక్తం (వెల్లడి) చేస్తాయి. ఉపనిషత్తులు ఏదో ఒక వ్యక్తి ఒక సమయంలో దేవుణ్ణి గురించి తెలిపిన భావాలు కాదట. కాని అవి అనేక మంది ఋషులు, మునులు, యోగులు, యతీశ్వరులు, వగైరాల ద్వారా వేరువేరు కాలాల్లో చెప్పబడ్డాయట. అందువల్లనే వాటితో సమైక్యత (ఏకీభావం) లేకపోవటానికి కారణమని కొందరంటారు. ఉపనిషత్తులభాష నేటి సంస్కృతభాషను పోలి ఉంటుంది. కాని నేటి సంస్కృత మంత సంస్కరింపబడినది కాదని కొంతమంది పండితులు అంటారు. ఉపనిషత్తులలో దేవునికి పరమాత్మ, పరబ్రహ్మ, పరమేశ్వరుడు, వగైరా పేర్లే కన్పిస్తాయి గాని బ్రహ్మ, విష్ణువు, శివుడు, వినాయకుడు, రాముడు, కృష్ణుడు, తిరుపతి వెంకన్న, అంజన్న, దుర్గమ్మ, పోతురాజు, గంగానమ్మ, మొదలైన పేర్లు దేవుని పేర్ల లిస్టులో (జాబితా)లో కన్పించవు. ఈ దేవతలను ఉపదేవతలంటారు. (Demigods –చిల్లర దేవుళ్ళు) ఇవి పరమాత్మ (దేవుడు = Supreme Personality of God ) కాజాలవని వేదాలలోనే తెలుపబడింది. దీనికి నిదర్శనం యీ దిగువన శ్రీకృష్ణుడు తన పెంపుడు

తం(డియగు నందునితో తన ఏడవ ఏటనే యీ దేవతలను, ఉపదేవతలను, వీటికి పరమాత్మకు గల శక్తి సామర్థ్యాలను గురించి చెప్పినదే చాలును. ఆయన ఈ విధంగా బోధించాడు. "ఇం(దుడు,వరుణుడు వగైరా దేవతలు ఉపదేవతలు. వీరికి పరమాత్మకు (తనకు) గల శక్తిలేదు. (ప్రజలకు మేలుగాని, కీడుగాని చేయటానికి వీరికి ఎటువంటి స్వాతం(త్ర్యం లేదు. తాత్కాలిక ఫలితాలనే ఈ చిల్లరదేవతలు యిస్తాయి. అట్టి దేవతలను పూజించువారు తెలివి తక్కువవారని వేదాలలోనే ఉంది. ఈ ఉపదేవతలిచ్చే తాత్కాలిక ఫలితాలనుకూడా పరమాత్మ(దేవుడు) అనుమతిస్తేనే వారు యివ్వగలుగుతారు. మరియు తమకు నిర్ణయింపబడిన కర్మలను (పనులను) చేయు మానవులకు మా(త్రమే ఉపదేవతలు వారు (మానవులు) చేయు కర్మలనుబట్టి ఫలితాలను యివ్వగల్గుతారు. కాని కర్తవ్య కర్మలను చేయని మానవులకు ఉపదేవతలు ఎట్టి సహాయం చేయజాలరు. ఈ విధంగా ఉపదేవతలు తమ యిష్టమొచ్చినట్లు ఎవ్వరికీ ఫలితాలను యివ్వటానికి స్వతం(త్రులు కారు. అందువలన ఉపదేవతలను పూజించుట, (ప్రార్థించుట వ్యర్థము"

అనేక మంది ఋషులు, మునులు, యోగులు వగైరాలు వందల సంవత్సరాలపాటు దేవుని ఉనికిని గురించి (ఉండుటను గురించి) పేరును గురించి, రూపాన్ని గురించి, తెలిసికోవటానికి విశ్వ(ప్రయత్నంచేసి దుదకు "దేవుడు" తమ ఆలోచనలకు కూడా అందలేదని తమ అనుభవాలను తెలుపుచూ "దేవుడు" అనంతుడు" "నిరాకారుడు" "సర్వవ్యాపకుడు" అని మా(త్రం నిర్ణయించగల్గారు.

ఇట్టి అంతంలేని దేవునికి, ఆకారంలేని దేవునికి, పేరులేని దేవునికి, అంతటా వ్యాపించివున్న దేవునికి రూపమును, మంచిగంధపు చెక్కతోనో, రాగితోనో, రాయితోనో, కొయ్యతోనో తయారు చేయించి దానికి ఏదో ఒక పేరు పెట్టి దానిని పాలతోనో, పంచామృతంతోనో, నూనెతోనో, నేతితోనో, నీళ్ళతోనో స్నానం చేయించి దానికి గుడ్డలు, నగలు ధరింపచేసి నైవేద్యాలు, కానుకలు, ముడుపులు సమర్పించి పూజించిన యెడల ఆ నల్లరాతి దేవుడు, ఆ (ప్రాణంలేని రాతిదేవుడు వాటిని (నైవేద్యాలను) ఆరగించి పూజలుచేసి నైవేద్యాలర్పించు వారి కోరికలను నెరవేర్చునని జన్మగత (బ్రాహ్మణ పూజారులు, పండితులు చెబుతారు. ఈ విషయంలోని యథార్థం ముందు తెలుపబడుతుంది.

# 2

ఋషులు, మునులు, వగైరాలు మానవులు చేయదగిన, చేయగూడని పనులను గురించి తెలిపిన విషయాలుగల పుస్తకాన్ని సామాన్యంగా "శాస్త్రము" అంటారు. కాని వేదాలకు మూలమైన మతగ్రంథాన్ని మాత్రమే శాస్త్రమని కొందరంటారు. ప్రాణి శాస్త్రము, అర్ధ శాస్త్రము, జంతు శాస్త్రము, వగైరాలను కూడా శాస్త్రాలంటారు. కాని ప్రకృతి, ఆత్మ, పరమాత్మ (దేవుడు), జగత్తు మొదలైన వాటిని గురించిన వివరాలుగల శాస్త్రాన్ని "దర్శన శాస్త్రము" అంటారు. ఆలోచనాశక్తిని వృద్ధిపరచుకొంటూ ప్రకృతియొక్క పనులలోని రహస్యాన్ని తెలిసికొనేదాన్ని "దర్శనము" అంటారు. ఆదిమానవులు మొట్టమొదటగా సృష్టియొక్క పనులకు అనేక దేవతలను కారణమని నమ్మి చాలాకాలం వరకు తృప్తి పడ్డారు. తరువాత విశాలదృష్టిని సంపాదించుకొని యుక్తి, తర్కము, హేతువు సహాయంతో వారు ప్రపంచముయొక్క పుట్టుక, స్థితి, వినాశము మొదలైన విషయాలను గురించి ఆలోచింపసాగారు. ఈ ఆలోచనా ధోరణే "దర్శన శాస్త్రము" అనబడుతున్నది. దర్శన శాస్త్రాన్ని తత్వశాస్త్రము, వేదాంత శాస్త్రము అని కూడా అనవచ్చు.

*భారతీయ తత్వశాస్త్రాన్ని హిందూ తత్వశాస్త్రము అనకూడదు. భారతీయ తత్త్వశాస్త్రం భారతదేశంలో ఏదో ఒక మతంతోనూ, దానికి సంబంధించిన జీవిత పద్ధతులతోనూ ఆగలేదు. భారతీయ తత్త్వము హిందూతత్త్వము కాదని తెలుసుకోవాలి. ప్రస్తుతం భారతదేశంలోని భారతీయులందరూ పౌరోహిత బ్రాహ్మణులతో కూడిన హిందువులు మాత్రం కాదు. ఎందుకన చాలామంది భారతీయులు పౌరోహిత బ్రాహ్మల హిందూమతాచారాలను అనుసరించి నడవటం లేదు. కనుక భారతీయులందర్నీ హిందువులని వర్ణించుట (చెప్పుట) ఎంత పెడమార్గమో, 'భారతీయ' తత్త్వాన్ని హిందూతత్త్వ మనుకోవడం కూడా* అంత పెడమార్గమే. ఎందుకన క్రీస్తుశకారంభానికి పూర్వం, తర్వాత హిందూమతంలో ఆరు వేరువేరు శాఖలు, చార్వాక, జైన, బౌద్ధ, మతాలు, బ్రహ్మ, ఆర్య, దివ్యజ్ఞాన సమాజములు వగైరాల ప్రభావం ఎంతగానో భారతీయ తత్వశాస్త్రం మీద ఉంది. ఈ రకంగా భారతీయ తత్త్వశాస్త్రము హిందూ తత్త్వశాస్త్రము కంటే విశాలమైనది. *ఉపనిషత్తుల, దార్శనిక, చార్వాక మొదలైన తత్త్వాల కలయికయే, భారతీయ తత్త్వ శాస్త్రము. వీటన్నిటికీ భిన్నమైంది పౌరోహిత బ్రాహ్మల హిందూ* మతతత్త్వము. భారతీయ తత్త్వవేత్త (వేదాంతి) మూల ద్రవ్యాన్ని (Matter) పరిశోధిస్తూ భౌతిక పదార్థాల్ని దాటి, ఒక శాశ్వతమైన, ఆత్మసంబంధమైన పదార్థమే అన్నిటికీ మూలమని గ్రహిస్తాడని కొందరి అభిప్రాయము. క్రీస్తుకు పూర్వం 700-600 సంవత్సరాల మధ్య కాలంలో, భారతీయ ఆర్యులలో పరమాత్మ (దేవుడు), ఆత్మ, జగత్తు, మొదలైన వాటిని గురించిన ఆలోచనలు ఆరంభమయ్యాయి. ఈ ఆలోచనా ధోరణులే "దర్శన శాస్త్రాలు"గా ఎంచబడుతున్నాయి. దర్శన శబ్దము "దృక్" అను ధాతువునుండి "దృశ్" పుట్టింది. "దృశ్" అనగా చూపించు అని అర్థము. అంటే ఏది పరమాత్మను (దేవుని) చూపించునో దానిని దర్శనశాస్త్రము అంటారు.

దర్శన శాస్త్రాలు మొత్తం ఆరు రకాలు. వీటిలో వాటి సొంత రూపాలలో పరమాత్మ (దేవుడు) ఆత్మ, ప్రకృతి, జగత్తు, మొదలైన వాటియొక్క నిరూపణ గలదట.

**1. పూర్వమీమాంస –** ఇది యజ్ఞయాగాదుల్ని, కర్మకాండను, ప్రపంచాన్ని సత్యమని నమ్మును. ఇది ఒక రకంగా అనీశ్వరవాదానికి (నాస్తిక వాదానికి) దగ్గరగా వుంటుంది. ఇది దేవుడు, ఆత్మ, జగత్తు, వగైరాలను గురించి ఏమీ చెప్పదు. మంత్రాలు దేవునికంటే, దేవతల కంటే గొప్పవని ఇది చెబుతుంది. పైపెచ్చు దేవతలు మంత్రాల వల్లనే బ్రతుకుతున్నారని కూడా చెబుతుంది. అట్టి మహత్తుగల మంత్రాలు బ్రాహ్మల ఆధీనంలో గలవని చెబుతుంది. కనక బ్రాహ్మలు దేవతలకంటే దేవుని కంటెను గొప్పవారని చెబుతుంది. బ్రాహ్మడు భూసురుడట. భూసురుడంటే భూలోక దేవత అని అర్థం. బ్రాహ్మడు తనను దేవుని, దేవతల కంటెను గొప్పవాడనని చెప్పుకోడానికి నిదర్శనం ఈ శ్లోకమే చాలును.

“ దైవాధీనం జగత్సర్వం,
మంత్రాధీనవంతు దైవతం.
తన్‌మంత్రం బ్రాహ్మణాధీనం,
బ్రాహ్మణో మమదేవతమ్”

అంటే ప్రపంచమంతా దైవం చేతిలోవుంది. దైవం మంత్రం చేతిలో వుంది. మంత్రం బ్రాహ్మడి చేతిలో వుంది. కనుక బ్రహ్మడే నా దేవత. ఈ మీమాంస కర్మ, కర్మకు సంబంధించిన మంత్రాలను తప్ప, దేవతలనుగాని, దేవుణ్ణిగాని ప్రార్థించి పూజింప పనిలేదని చెబుతుంది. పితృదేవతల్ని (చచ్చిపోయిన పెద్దల్ని) ఉద్దేశించి తర్పణాలు, పిండాలు (పచ్చి వరిపిండి వుండలు) పెట్టి పౌరోహిత బ్రాహ్మలకు దానాలు, దక్షిణలు, స్వయంపాకాలు, గుడ్డలు, బంగారం, గోదానం, భూదానం, మొదలయినవి యిచ్చిన పుణ్యం లభించునని ఈ మీమాంస చెబుతుంది. ప్రజలలో మూఢనమ్మకాలను, మూఢాచారాలను స్థిరంగా వుంచుటే ఈ పూర్వమీమాంస ముఖ్యోద్దేశము. ఈ మీమాంస సిద్ధాంతాలే నేడు హిందువులనబడే వారిలో చాలామందిలో వ్యాప్తిలో వున్నాయి.

మంత్రాల వల్లనే ప్రపంచ కార్యాలన్నీ జరుగుతున్నాయని యీ మీమాంస చెబుతుంది. కాని మంత్రాలకు చింతకాయలు రాలవనే పెద్దల మాటను యీ మీమాంసకులు మరచిపోనన్నా మరచిపోవాలి లేకపోతే వీరు సామాన్యప్రజలను

మోసగించి మంత్ర బలంతో వారికి (ప్రజలకు) కీడుగాని మేలుగాని చేయగలమని మాయపుచ్చి గాని, భయపెట్టిగాని వారినుండి (ప్రజల నుండి) ఆర్థిక లాభాన్ని పొందడానికి పన్నిన పన్నాగమైనా అయివుండాలి వారీ మంత్ర మహిమ.

ఈ మీమాంసకులు వైదిక కర్మ కాండపట్ల గల అత్యాసక్తితో దేవుని సహితము నిరాకరించారు. ప్రపంచానికి సృష్టికర్త ఎవడూ లేడు, సృష్టికి ఆది (మొదలు) అంతాలు లేవు. ప్రళయం, పునసృష్టి (మరలపుట్టుట) లేనేలేవు. సకల వస్తువులతో కూడివున్న యీ భౌతిక ప్రపంచమే వాస్తవమైనదని యీ మీమాంసకులంటారు. మరొకవైపున వీరు ఆత్మ, పునర్జన్మ, మోక్షము, వగైరాలను అంగీకరిస్తారు. కానీ వీరి దృష్టిలో ఆత్మ ఒకటి కాదు. ఎంతమంది మనుషులున్నారో అన్ని ఆత్మలు వున్నాయని వీరి నమ్మిక. భౌతిక వస్తువులు, ఆత్మలు శాశ్వత మైనవే. కాని ఆత్మలకు సొంత శక్తి లేదు. దీనికి శరీరంతో కలిసి వున్నప్పుడే శక్తి వుండగలదు అని వీరంటారు. ఈ విధంగా యీ మీమాంసకులు ఆత్మకంటే శరీరానికే ఎక్కువ ప్రాధాన్యత (విలువను) యిస్తారు.

**2. ఉత్తర మీమాంస:** దీనిని బ్రహ్మ మీమాంస, బ్రహ్మ విద్య, జ్ఞానకాండ, వేదాంత మీమాంస, బ్రహ్మసూత్రాలు అని కూడా అంటారు. దీనిలో భారతీయ ఆర్యులు చిల్లర దేవతలను (Demigods ) పూజించుట మానివేసి పరమాత్మ (దేవుని) జీవాత్మలను గురించి విపులంగా చర్చించి, పరమాత్మ జీవాత్మలు వేరుకాదని నిర్ణయించారు. పరమాత్మను గురించి యీ మీమాంసలో యీ విధంగా చెప్పబడ్డది: "పరమాత్మకు హానిగాని, వయస్సుగాని, దప్పికగాని, ఆకలిగాని, చావుగాని, కోపముగాని పుట్టుకగాని లేదు. ఆయన శుద్ధ చైతన్యము మాత్రమే. ఆయననుండే ప్రాణముగల, ప్రాణములేని సమస్త వస్తువులు పుడతాయి.

ఈ జగత్తు నిలకడలేనిది; నశించునది. కాని పరమాత్మకు నాశనం లేదు, మరియు పరమాత్మకు, జీవాత్మకు భేదం లేదనే సిద్ధాంతాన్ని నాలుగు వాక్యాలలో యీ మీమాంసలో వివరింపబడింది. ఆ వాక్యాలును 'మహావాక్యాలు' అంటారు.

1. అహం బ్రహ్మోస్మి -- నేనే దేవుణ్ణి (Ist Person)
2. తత్వమసి -- దేవుడవు నీవే (2nd Person)

3. అయం ఆత్మా బ్రహ్మ -- ఈ జీవాత్మయే దేవుడు (3rd Person)

4. ప్రజ్ఞానం బ్రహ్మ --- చైతన్యమే దేవుడు (Impersonal)

5. సోऽహం -- ఆ దేవుడను నేనే (Ist Person)

ఈ మీమాంసలో పరమాత్మయొక్క (దేవుని యొక్క) అంశమే జీవాత్మ అని నిరూపింపబడ్డది. చివరకు జీవాత్మ, జగత్తు – యీ రెండూ పరమాత్మలో లీనమైపోవునని ప్రతిపాదింపబడ్డది. అందువలన యీ మీమాంసను అద్వైతవాదమని కూడా అనవచ్చు. అంటే కంటికి కనిపించే జీవాత్మలు, జగత్తు పరమాత్మ రూపాలేనట. కాని అజ్ఞానం వల్ల అవి పరమాత్మకు నేరుగా కన్పిస్తున్నవట. నిజానికి అవి పరమాత్మ స్వరూపమేనట. ఇదే అద్వైత వాదానికి ఆధారం. ఈ మీమాంస దేవుణ్ణి గురించి యింకా యిలా అన్నది. -- "దేవుణ్ణి ఎరుగుదునని చెప్పేవాడు ఆయనను ఎరిగినవాడు కాదు. దేవుణ్ణి ఎరగనని చెప్పేవాడు ఆయనను ఎరుగును. కాని వాస్తవానికి దేవుడు ఊహకు కూడా అందనివాడు. ఎవడు సకల ప్రాణులు తానే ననియు, తనను సకల ప్రాణులుగను తెలుసుకోనునో వాడు దేవు డయిపోవును"

**3. సాంఖ్యయోగము :** ఇది జీవాత్మను, పునర్జన్మను, మోక్షాన్ని ఒప్పుకొనును. కాని దేవుణ్ణి (పరమాత్మను) నిరాకరించును. *దీని దృష్టిలో పరమాత్మ (దేవుడు) అనేవాడు లేనే లేడు.* కనుక దీనిని ఒక రకంగా నిరీశ్వరవాదమని (నాస్తికవాదమని) చెప్పవచ్చు. జీవాత్మ, ప్రకృతి రెండూ ఒక్కటేనని యిది చెబుతుంది. ఈ రెంటికీ ఆవల మరొక వస్తువు ఏదీ లేదని యిది చెబుతుంది. విత్తనము–చెట్టువలె ప్రకృతి ఆత్మలు గలవని దీని అభిప్రాయము. ఇది *వేదాలకు విరుద్ధమైన సంప్రదాయం.* ఇది *నాస్తికవాదయుక్తమైన ప్రాకృతిక ధర్మం వైపుకు మొగ్గు చూపుతుంది. ఇది ఆనాత్మవాదము, జడవాదము యొక్క రూపమే.* వేదపద్ధతిని అవలంబించిన పౌరోహిత బ్రాహ్మలెవరూ యీ సాంప్రదాయ సంస్థాపకులలోనే లేరట. ఇది ఆత్మను (జీవాత్మను) అంగీకరించును కాని ఎందరు ప్రాణులున్నారో అన్ని ఆత్మలుంటాయని దీని నమ్మిక. ఆత్మ శరీరం కాదు. మనస్సు కాదు. బుద్ధికాదు. ఆత్మ వీటన్నిటికీ పైది. ఆత్మకు శరీరంతో సంబంధం ఏర్పడినప్పుడు చలనం (కదలిక) కలుగును. కష్టసుఖాలు ఏర్పడతాయి. శరీర సంబంధం వదిలిపోతే తిరిగి కేవలం

చైతన్యంగా మారిపోతుంది. ఆ స్థితిని పొందుటే మోక్షమని అంటుంది ఈ సాంఖ్యయోగము.

**4. న్యాయ సంప్రదాయం :** ఇది జ్ఞానం సరియైనదో లేదో తెలిసికొనటానికి ఆచరణయే గీటురాయి (పరీక్ష) అని చెబుతుంది. నీవు చూచేది పంచదారో, ఉప్పో అని నీకు సందేహం కలిగితే నాలుక మీద వేసుకొని పరీక్షించమని ఇది చెబుతుంది. ఆచరణద్వారా నీ అభిప్రాయం నిజమో అబద్ధమో స్పష్టమౌతుంది. ఇది పరమాత్మను (దేవుని) జీవాత్మను, జగత్తును అంగీకరిస్తుంది. కానీ శరీరం భూమియొక్క పరమాణువుల (చిన్న చిన్న భాగాలు) సంయోగము (కలయిక) ద్వారా నిర్మితమగు చున్నదని దీని నమ్మిక. కనుక యీ వాదాన్ని 'పరమాణువాదమ' అని కూడా అంటారు. పరమాత్మ, జీవాత్మ, జగత్తు–మూడూ వేరు వేరనీ, జగత్తుకు పరమాత్మ కర్తయనీ ఇది నిరూపిస్తుంది.

**5. వైశేషికము :** ప్రపంచం వాస్తవమైనది. దానికి మూలము పరమాణవులు. పరమాణువులు నిత్యములు. పరమాత్మ, జీవాత్మ, జగత్తు, మూడూ నిత్యములే. కాని పరమాత్మ ప్రేరణద్వారా కలిగిన పరమాణువులలో గతి (చలనము) పుడుతుంది. ప్రపంచంలోని వస్తువులన్నీ పరమాణువుల చేతనే నిర్మింపబడుతున్నాయని ఈ సంప్రదాయం చెబుతుంది. ఈ సంప్రదాయం విధిని (గుడ్డితనాన్ని, అదృష్టాన్ని) అంగీకరించును. ఆత్మ కూడా అణురూపంలో శాశ్వతంగా వుంటుంది. ఆత్మ శరీరంతో కలిసి వున్నపుడే దానికి (ఆత్మకు) చైతన్యం (కదలిక) ఏర్పడుతుంది. అదృశ్యశక్తులకు (కనిపించని శక్తులకు) అనుగుణంగా పూర్వజన్మలో చేసుకొన్న కర్మల ఫలితంగా పునర్జన్మ ఏర్పడుతుందని యీ సాంప్రదాయం చెబుతుంది.

**6. యోగము :** ఉపనిషత్తులను రచించిన మునులలో ఎక్కువ మంది అడవులలో ఆశ్రమాలలో యోగాభ్యాసం ద్వారా దేవుడు, జీవాత్మ– జగత్తు యీ మూడు స్థిరమైనవని నిరూపించారు. జీవాత్మ మోక్షాన్ని పొందాలంటే ప్రాణాయామము, ఆసనాలు వగైరాలను అభ్యసించి చిత్తమును అదుపులో వుంచుకొన్నయెడల మోక్షము లభించునని యిది చెబుతుంది. కాని యోగంవల్ల

కొన్ని అద్భుత శక్తులు కూడా కలుగునట. యోగవాదాన్ని కర్మయోగమనవచ్చు. ఇది (యోగము) వేదాంత చర్చలకు పునాది. దేవుని సంకల్పం (కోరిక) వల్ల ప్రపంచ పరిణామం (మార్పు) జరుగుతుందని యిది చెబుతుంది. యోగాభ్యాసంవల్ల ముఖ్యంగా శరీరము, మనస్సు వగైరాలు అదుపులో వుండగలవట.

ఈ విధంగా దర్శన శాస్త్రాలు దేవుడు, జీవాత్మ, జగత్తు వగైరాలను గురించి ఆలోచించుటలో వేదాలను గ్రుడ్డిగా నమ్మక అవసరమైన చోటున వేదాలను బాగా విమర్శించాయి. కొన్ని చోట్ల వేదాలను త్రోసిపుచ్చాయి. (అంగీకరించలేదు). పూర్వ మీమాంసను ఆయా కాలాలలో గట్టిగా విమర్శించిన సాంఘిక విప్లవాత్మక సంప్రదాయాలు (తిరుగుబాటు సంఘాలు) లేక పోలేదు. అవి ఛాందస బ్రాహ్మణ సంప్రదాయాలను, విధులను, ఆచారాలను కఠినంగా విమర్శిస్తూ కష్టాలను లక్ష్యపెట్టక, ప్రజలలో మానసిక విప్లవాన్ని (తిరుగుబాటును) సృష్టించాయి. అట్టి మానసిక విప్లవ భావాలను పౌరోహిత బ్రాహ్మల వృత్తికి వ్యతిరేకంగా ప్రజలలో ప్రచారం చేసిన వారలలో ఎక్కువ మంది ద్విజేతరులే (శూద్రులే). సామాన్య ప్రజలు, రాజులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, కళాకారులు, రైతులు, కూలీలు, యీ సాంఘిక విప్లవ సంఘాలకు ఎక్కువగా ఆర్థిక సహాయం (డబ్బు సహాయం) అందజేసి వాటిని (ఆసంఘాలను) గౌరవించేవారట.

ఈ సాంఘిక విప్లవాలను నడిపించిన వారలలో పరివ్రాజకులు, శూన్య వాదులు, లోకాయతులు, చార్వాకులు ముఖ్యులు. వీరి ప్రచారం వల్ల ప్రజలలో పౌరోహిత ఛాందస బ్రాహ్మణత్వం మీద అలక్ష్యం, అసూయ వ్యాపించింది. ప్రజలలో వేదాలయందు నమ్మకం తగ్గసాగెను. అందువల్ల ఛాందస పౌరోహిత బ్రాహ్మలు స్వతంత్ర ఆలోచనగల వారిని ద్వేషించి వారిని నాస్తికులని (దేవుడు లేడనే వారని) పేరు పెట్టారు.

**లోకాయతులు :** వీరు యీ లోకాన్ని మాత్రమే నమ్మారు. పరలోకాన్ని నమ్మేవారు కాదు. వీరిలో గొప్ప గొప్ప పండితులుండేవారట. వారి యొక్క *అమూల్యమైన అనేక సాహిత్య గ్రంధాలను పౌరోహిత బ్రాహ్మలు తగులబెట్టిరట.* లోకాయతులు దేవుని నమ్మేవారు కాదు. దేవుని వల్ల ప్రపంచం పుట్టలేదని వారు వాదించారు. కేవలం ఆడ మగ జతకట్టుటవల్లనే ప్రపంచంలో ప్రాణులు

పుట్టుతున్నాయి అని వీరి నమ్మకం. వీరు కర్మవాదాన్ని నమ్మేవారు కాదు.

ఛాంధస పౌరోహిత బ్రాహ్మల కర్మకాండలతో ఆనాటి అనార్యులు, ఆర్యులు కొందరు విసిగిపోయి యీ లోకాయతులు చెప్పే విషయాలను శ్రద్ధగా విని ఆచరించేవారట.

**చార్వాకులు** – శరీరమే ఆత్మ అనియు, శరీరం నశించిన వెంటనే చైతన్యం (ప్రాణశక్తి) కనబడకుండా పోవునని వీరు చెప్పేవారు. వేదాలలో అర్థంలేని అనుమానాన్ని కలిగించే మంత్రాలెన్నో గలవని వీరు నిరూపించారు. వీరు శ్రాద్ధకర్మలు, యజ్ఞాలు చేయట వ్యర్థమనీ, యజ్ఞాలలో జంతువు స్వర్గానికి వెళ్ళగలిగితే యజ్ఞము చేయువారుగాని, చేయించేవారుగాని తమ తండ్రులను ఎందుకు పంపకూడదని ప్రశ్నించేవారు. చచ్చి పరలోకంలో ఉన్నవారికి శ్రాద్ధకర్మలలోని పచ్చి పిండి వుండలు (పిండాలు) ఆకలి తీర్చగలిగితే, యీ లోకంలో మనం ఎక్కడికైనా ప్రయాణం చేయు సమయంలో మనకు కావలసిన భోజన సామాగ్రిని వెంటతీసుకొని వెళ్ళవలసిన అవసరం లేదుగదా? ఇంటివద్దనే మనకు తిండి యేర్పాటు ఇంటివద్ద వున్నవారు చేసిన సరిపోవును గదా? కాన నిజానికి యీ శ్రాద్ధకర్మకాండ పౌరోహిత బ్రాహ్మల భుక్తికి (తిండికి) సాధనంగా యేర్పాటు చేయబడిందే గాని చచ్చినవారికి మాత్రం దీనివల్ల ఏ మాత్రం లాభంలేదని వీరు (చార్వాకులు) ప్రచారం చేసేవారు. స్వర్గము – నరకము, పాపము – పుణ్యము, దేవుడు – దేవతలు వగైరాలు లేనేలేవని వీరు చెప్పేవారు.

చార్వాకుల బోధలనే మహావీరుడు (జైన మత స్థాపకుడు), బుద్ధుడు అనుసరించారు. ఆ రోజులలో సాంఘిక విప్లవ సంఘాలను, సాంప్రదాయాలను స్థాపించి, ప్రచారం చేసిన వారలలో ఎక్కువ మంది క్షత్రియులు, శూద్రులు, మాత్రమేనట. బుద్ధుడు ఛాందస పౌరోహిత వైదిక బ్రాహ్మల్ని బ్రహ్మకు రూపంలేదని త్రోసిపుచ్చెనట. ఆత్మ ఉన్నదా? లేదా? అనే ప్రశ్నకు బుద్ధుడు జవాబు చెప్పటానికి నిరాకరించెనట. శ్రాద్ధకర్మలను ఆయన గట్టిగా ఖండించాడు. *ఈ దురాచారాల నుండి ప్రజలను త్రిప్పాలంటే ముందు అర్థంలేని వైదిక దేవతలను నాశనం చేయటం తప్ప(తక్క) మరొక దారి కన్పించటం లేదని బుద్ధుడు గట్టిగా*

*చెప్పేవాడట. వర్ణవ్యవస్థను (కులాలను) బుద్ధుడు గట్టిగా ఖండించాడు. కాని నీతికి సత్యానికి బుద్ధుడు ముఖ్యస్థానం ఇచ్చాడు.* అశోక చక్రవర్తి కాలంలో యజ్ఞాలు, పశుహింస ఆపబడ్డాయి. ద్విజులు (బ్రాహ్మలు, క్షత్రియులు, వైశ్యులు) తమ తమ సాంఘిక గొప్పతనాన్ని కోల్పోయారు. ద్విజేతరులు (శూద్రులు) విద్వాంసులుగాను, రాజులుగాను, బోధకులుగాను, రాజకీయ నాయకులుగాను మారి పోయారు. ఆనాడు చదువు, ఆరోగ్యము అందరకూ అందుబాటులో వుండేవట. కులతత్వం కొంతవరకు కూలిపోయిందట. అశోకునికి పూర్వం రోగాలు, కరువులు, రాక్షసులు, దేవతలు వగైరాల వల్ల కలుగుచున్నవని యెంచి దేవతలను సంతృప్తి పరచుటకని యజ్ఞాలు, కొలువులు కొలవటానికి ప్రజలనుండి డబ్బు ధాన్యం, నేయి వగైరాలను బలవంతంగా వసూలుచేసి పౌరోహిత బ్రాహ్మలు మంత్రాలు తంత్రాలు వగైరాలతో పూజలుచేసి దేవతలు, రాక్షసులు తృప్తిపడ్డారని మాయమాటలు చెప్పి వసూలైన డబ్బులోనూ, సామగ్రిలోనూ ఎక్కువ భాగాన్ని తాము ఆరగించేవారట. కాని బుద్ధుని కాలంలో కరువులు, వరదలు దేవతలు కోపం చెందినందున వస్తున్న వనే మూఢనమ్మకాలను వదలి ప్రజలు భూములకు సరియైన నీటివనరులను యేర్పాటు చేసుకొనేవారట. ఇటు ఛాందస పౌరోహిత బ్రాహ్మలు తమ ఆర్థిక లాభం కొరకు ధర్మం, అర్థం , కామం, అనే సిద్ధాంతానికి "మోక్షం" అనేదాన్నిచేర్చి ప్రచారం చేయసాగిరట. "మోక్షం" (ముక్తి) కొరకని శ్రాద్ధకర్మలు చేయించి దానాలు ధర్మాలు దక్షిణలు ప్రజలనుండి గుంజుకో సాగారు. బౌద్ధ విప్లవం ముమ్మరంగా వున్న రోజులలో ధర్మం అర్థం కామం యీ మూడింటినే ప్రజలు పాటించేవారు. మోక్షం అనే దానిని పౌరోహిత బ్రాహ్మలు తమ భుక్తి కొరకు తరువాత చేర్చబడినదని పైన చెప్పబడింది.

*పౌరోహిత బ్రాహ్మణ సంప్రదాయం యొక్క ముఖ్యోద్దేశం యీ లోక సుఖప్రాప్తియే.* కానీ పైకి మాత్రం యజ్ఞాదులు చేసి దానధర్మాలు, దక్షిణలు, కన్యాదానం, గోదానం, భూదానం, సువర్ణదానం (బంగారుదానం), వస్త్రదానం వస్తుదానం వగైరాలను ప్రజలు తమకు చేసినయెడల వారికి (ప్రజలకు) సర్వసుఖాలు లభిస్తాయని పౌరోహిత బ్రాహ్మలు బూటకపు మాటలు చెప్పి దానధర్మాలు వగైరాలతో

తమ జీవితాలను సుఖంగా గడుపుకో సాగారు.

బుద్ధుని కాలంలో స్వర్గం - నరకం, మోక్షం వగైరాలను ద్విజేతురుల (శూద్రులు) లో ఎక్కువ మంది మరచిపోయారు. వారు నీతి మంతులై నిర్భయంగా జీవిస్తూండేవారు. బౌద్ధ విప్లవానికి పూర్వం పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయం వల్ల అణగ త్రొక్కబడిన కులాలన్నీ బౌద్ధమతంలో చేరి పోయాయి. బుద్ధుడు చనిపోయిన తరువాత కూడా నాలుగు వందల సంవత్సరాల వరకు పౌరోహిత బ్రాహ్మలు అణిగిపోయి వుండిరట. వారి ఉపదేశాలను వారి పురాణకథలను ప్రజలు ఎగతాళి చేసేవారట. కానీ బౌద్ధవిప్లవం పౌరోహిత బ్రాహ్మల మతాన్ని గాని, కులవ్యవస్థను గాని పూర్తిగా నిర్మూలింప జాలక పోయింది. ఎందుకన ఛాందస పౌరోహిత వర్గం కపటంతో బౌద్ధమతాన్ని కూలదోయటానికి కుట్ర పన్నెనట. ఆ కుట్రలో ప్రధానపాత్ర వహించింది "నాగార్జునుడు". ఇతడు శుద్ధఛాందస ఆంధ్ర బాపడు. ఇతడు క్రీస్తుకు పూర్వం 150 - 100 సంవత్సరాల మధ్యకాలంలోని వాడు. ఇతడు బౌద్ధమతాన్ని నిర్మూలింప చేయటానికి కపటంతో బౌద్ధమతాన్ని స్వీకరించాడు. ఇతడు పైకి బౌద్ధ భిక్షువుగానే వేషం వేసుకొని బౌద్ధ సిద్ధాంతాలకు బదులు పౌరోహిత బ్రాహ్మల సాంప్రదాయాలను ప్రచారం చేస్తూ పరోక్షంగా (దొంగచాటుగా) బౌద్ధమతాన్ని చావుదెబ్బ కొట్టాడు. ఇతడు "మహాయానము" అనే బౌద్ధ సంప్రదాయాన్ని స్థాపించి పౌరోహిత బ్రాహ్మణదేవతల్ని దానిలో చేర్చి తన క్రొత్త సాంప్రదాయాన్ని మధ్య మార్గమని చెప్పుచూ దానిని పూర్తిగా ఛాందస బ్రాహ్మల మతంగా మార్చి వేశాడు. నాగార్జునుడు దురుద్దేశంతోనే విప్లవాత్మకమైన బౌద్ధమతాన్ని రెండుగా చీల్చి మహాయాన సంప్రదాయానికి తాను సంచాలకుడుగా (నడిపేవాడు) వుండి బౌద్ధమతాన్ని పౌరోహిత బ్రాహ్మల మతానికి దగ్గరగా తీసికొని పోయాడు. ఈ అవకాశాన్ని చూసుకొని పౌరోహిత బ్రాహ్మలు తండోప తండాలుగా (గుంపులు గుంపులుగా) మహాయాన సంప్రదాయంలో చేరి బుద్ధుని బోధనలనే నెపంతో పౌరోహిత బ్రాహ్మల సాంప్రదాయాన్ని ప్రజలలో ప్రచారం చేయసాగారు. ఈ కార్యంలో పౌరోహిత బ్రాహ్మలు ప్రధాన పాత్ర వహించి మహాయాన మార్గము సంస్కరింపబడిన (బాగుచేయబడిన) శుద్ధ బౌద్ధమత సంప్రదాయమని చెప్పి ప్రజలలో తిరిగి మూడ

నమ్మకాలను మూఢాచారాలను ప్రచారం చేస్తూ బౌద్ధమతానికి పతంజలి యోగ సిద్ధాంతాలను జోడించారు. (చేర్చారు)

ఈ రకంగా మహాయాన మార్గం పూర్తిగా పౌరోహిత బ్రాహ్మల చేజిక్కిపోయింది. బౌద్ధసన్యాసులైన బ్రాహ్మలు హిందువుల ఊరేగింపులో పాల్గొనే వారట. స్థానిక (ఆ చుట్టుపట్లగల) బౌద్ధ మఠాలకు సలహాయిచ్చే బౌద్ధ కుటుంబీకులు కూడా బ్రాహ్మల బోధల మీదనే ఆధారపడిపోయారు. వారుకూడా పుట్టుకకు పెండ్లికి చావుకు పౌరోహిత బ్రాహ్మల మీదనే ఆధార పడిపోయారు. బౌద్ధమతస్థులైన సామాన్య ప్రజానీకాన్ని తమ వైపుకు త్రిప్పుకోటానికై బౌద్ధమతం అవలంబించిన వారులాగా నటిస్తున్న పౌరోహిత బ్రాహ్మలు పది అవతారాలతో ఒక అవతారంగా బుద్ధుని చిత్రించి పూజింపసాగారు.

మహాయాన సంప్రదాయకులైన పౌరోహిత బ్రాహ్మలు బౌద్ధమఠాలలో చేరిన తక్కువ కులాల బౌద్ధ భిక్షువులను మఠాలనుండి తరిమివేసి ఆ తావుకి రాకుండా చేసివేసేవారు. ధనముగల మఠాలన్నింటినీ పౌరోహిత బ్రాహ్మలు స్వాధీనం చేసికొని బ్రహ్మలకులానికి చెందిన బౌద్ధ సన్యాసులకు మాత్రమే మఠాలలో ప్రవేశం యిచ్చారు. కొంతకాలానికి పౌరోహిత బ్రాహ్మల బౌద్ధసన్యాసులు ఆ కాలంలోని రాజులచేత శాసనాలు చేయించి తక్కువ కులాలకు చెందిన బౌద్ధభిక్షువులను మఠాలనుండి వెళ్ళగొట్టించారు.

ఈ రకంగా బౌద్ధ భిక్షువులమని చెప్పుకొనే పౌరోహిత బ్రాహ్మలు తమ బ్రాహ్మల మతాభివృద్ధికై మరల చక్కని బాట వేసుకోగలిగారు. మహాయాన సంప్రదాయానికి పూర్వం బౌద్ధ సన్యాసులు ఉదయం అడుక్కొచ్చిన బిచ్చం మీదనే తమ జీవితాలను గడుపు కొనేవారు. కాని యిప్పుడు బౌద్ధమతావలంబులై పౌరోహిత బ్రాహ్మలు మఠాలలోనే నియమంగా మంచి మంచి భోజనాలు తనివితీరా బొక్కసాగారు.

ఈ విధంగా తాత్వికంగాను, రాజకీయంగాను బౌద్ధమతాన్ని మన్నుచేసి పౌరోహిత బ్రాహ్మలు తమ బూటకపు పూర్వపు సాంఘిక ఆధిక్యతను మరల నిలబెట్టుకో గలిగారు. బౌద్ధమతాన్ని నాశనం చేయటంలో పౌరోహిత బ్రాహ్మలు వేదాలకు గాని

సత్యానికిగాని నీతికిగాని ధర్మానికిగాని విరుద్ధమైన సాధనాలను ఉపయోగించటానికీ వెనుకాడలేదు. పౌరోహిత బ్రాహ్మల మతాభిమానమైన పుష్యమిత్రుడు (మగధరాజు) క్రీస్తుకు పూర్వం 200 సంవత్సరాలనాడు పౌరోహిత బ్రాహ్మల సలహా ప్రకారం అశోకుడు నిర్మించిన 84 వేల బౌద్ధస్థూపాలను (స్తంభాలను) పడగొట్టి వేయించాడు. పౌరోహిత బ్రాహ్మలు బౌద్ధమతస్థులైన ద్విజేతర(శూద్ర) కుటుంబీకులను దయా దాక్షిణ్యం లేకుండా ఆనాటి రాజులచే తదాయన (వరుసగా - కట్టించి) నరికి వేయించారు. ఇంతే కాదు బౌద్ధమతస్థులైన శూద్రుల నెందరినో ఉక్కుమ్మడిగా (మొత్తంగా) గ్రామాలుగా గ్రామాలుగా చంపించి ఆ గ్రామాలలో పౌరోహిత బ్రాహ్మణ కుటుంబాలను ప్రవేశపెట్టారు. పౌరోహిత బ్రాహ్మలు బౌద్ధమతస్థులైన శూద్రులను మిహిర్ కులుడను శైవ భక్తుడైన రాజుచేత వూచకోత కోయించారు.

శశాంకుడనే బెంగాలీ రాజు అనేకసార్లు బోధివృక్షాన్ని పౌరోహిత బ్రాహ్మల సలహా ననుసరించి నరకటానికి ప్రయత్నించాడు. కుమారిలభట్టు సలహావల్ల అనేకమంది బౌద్ధమతస్థులైన శూద్రులు కేరళరాష్ట్రం నుండి వెళ్ళగొట్ట బడ్డారు. తమిళ ప్రాంతంలో కూడా బౌద్ధమతస్థులైన శూద్రులు వేలాది సంఖ్యలో హత్య చేయబడ్డారు.

హిందూదేశ మంతటా మరల బహుదేవతల విగ్రహారాధన ఆరంభింప బడ్డది. పౌరోహిత బ్రాహ్మలు మొదలుకొని సామాన్య ప్రజల వరకూ అనేక దేవతల విగ్రహాలను పూజింప సాగారు. ఇష్టం లేక పోయినా కొంతమంది బుద్ధిజీవులు (చదువుకొన్నవారు) కూడా సంఘానికి భయపడి సామాన్య ప్రజానీకాన్ని అనుసరింప వలసి వచ్చింది. బౌద్ధమతం, సాంఘిక సమానత్వాన్ని ప్రచారం చేసింది. రంగు భేదాన్ని రూపుమాపింది. కులతత్వాన్ని కూలద్రోయ ప్రయత్నించింది. ఆడ మగ అనే తేడాను తెగటార్చింది. యజ్ఞయాగాదులను, శ్రాద్ధ కర్మకాండను ఆపుటకు ప్రయత్నించింది. ఈ పనులు పౌరోహిత బ్రాహ్మలకు బొత్తిగా గిట్టలేదు. అందువలన వారు తమ మత సంప్రదాయాన్ని తిరిగి స్థిరపరచుకోడానికి తమకు అనుకూలమైన శాస్త్రాల్ని వ్రాసుకని మను మహారాజుచేత అమలు జరిపించ ప్రారంభించారు. ఆ శాస్త్రానికి "మనుస్మృతి" లేక "మనుధర్మశాస్త్రము" అని పేరు పెట్టబడ్డది. దీనినే

నిజమైన మానవ ధర్మ శాస్త్రమని చదువు సంధ్యలులేని సామాన్య శూద్ర ప్రజానీకంలో ప్రచారం చేయబడింది. మనుశాస్త్రంలో స్త్రీలను శూద్రులను గురించి అతి నీచమైన వర్ణన వుంది. సరిగ్గా యీ మనుస్మృతి అడుగు జాడలలోనే గోస్వామీ (ఇంద్రియాలను స్వాధీనంలో వుంచుకొన్న దిట్ట) అనియు రామభక్త కవులలో సర్వ ప్రథముడనీ పేరుమోసిన శుద్ధ ఛాందస బ్రాహ్మడైన తులసీదాసు 16 వ శతాబ్దంలో – నేటికి సుమారు 400 ల సంవత్సరాలనాడు – హిందీలో తాను రచించిన "రామ చరిత మానస్" అనే గ్రంథంలో ఆడదానిని, శూద్రుణ్ణి, డోలును ఎడా పెడా దంచి వదలాలని సెలవిచ్చారు. నిజమే. కాంమాంధుడైన (ఆడదాని ఉపస్థకై పడి చచ్చేవాడు) తనను రామభక్తుడిగా మార్చిన శీలవతియైన తన భార్యను యీ మాత్రమైనా సంస్కరించకపోతే ఆయన గోస్వామిత్వానికి (ఆయన ఇంద్రియ నిగ్రహానికి) ఆయన పురుషత్వానికి (మగతనానికి) కళంకం రాదా? (మచ్చ – అపకీర్తి) .

## 3

ప్రత్యేకంగా పరమాత్మ (దేవుడు) జీవాత్మ వగైరాలను గురించి తెలిసికొను టను "వేదము" అంటారు. పరమాత్మ, జీవాత్మ, వగైరాలను గురించి తెలిసికొనుట పూర్తి అయినపుడు దానిని "వేదాంతము" అంటారు. దర్శన శాస్త్రాలలో గల "ఉత్తర

మీమాంస" అంటే ఇదే. ఉత్తర మీమాంసలోని వేదాంతవాదంలో కొన్ని శాఖలు ఏర్పడ్డాయి. ఆ శాఖలను "సాంప్రదాయాలు' అని గాని "వాదాలు" అని గాని "మతాలు" అని గాని అంటారు. ఈ వాదాలు నాలుగు రకాలు – 1. అద్వైతవాదము; 2. విశిష్టాద్వైతవాదము; 3. ద్వైతవాదము; 4. శుద్ధాద్వైతవాదము.

లోగడ చెప్పబడిన ఆరు దర్శన శాస్త్రాలలో అయిదు ద్వైతవాదాలే. ద్వైతమనే శబ్దానికి రెండు గలది = భేదము= సందేహము= భ్రమ= అజ్ఞానము మొదలైన అర్థాలు గలవు. అద్వైతమనే శబ్దానికి రెండవది లేనిది= ఏకాకి = ఒంటరియైనది = ఒకటి = సాటిలేనిది = దీనికే దేవుడు మొదలయిన అర్థాలు కలవు.

**1. అద్వైత వాదము :** ఇది పరమాత్మకు (దేవునికి), జీవాత్మకు మధ్య భేదం లేదనియు, యీ రెండూ ఒక్కటేననీ చెప్పును. పరమాత్మ (దేవుడు) నిర్గుణుడు, నిరాకారుడు, అద్వితీయుడు, సర్వవ్యాపి అని బోధించేదే అద్వైత వాదము. జీవాత్మ, పరమాత్మ రూపమే. కాని మాయవల్ల (అజ్ఞానంవల్ల) జీవాత్మ యీ సత్యాన్ని గ్రహించడం లేదట. జ్ఞానం ద్వారా యీ సత్యాన్ని గ్రహించినపుడు తనకు, పరమాత్మకు మధ్య భేదం లేదని జీవాత్మ గ్రహించ గలుగుతుందట. ఇటువంటి జ్ఞానాన్ని పొంది జీవాత్మ పరమాత్మ అయిపోతుందట. అంటే జీవాత్మ పరమాత్మలో లీనమై పోతుందట.

ఈ వాదాన్ని మొట్టమొదటగా శంకరాచార్యుడు బోధించెనని కొంతమంది వేదాంతులంటారు. కాని శంకరాచార్యునికి పూర్వమే గౌడపాదుడు, గోవిందుడు– యీ యిద్దరూ యీ వాదానికి పునాది వేసినారట. గోవిందుడు శంకరాచార్యుని గురువు, గౌడపాదుడు గోవిందుని గురువు.

**2. విశిష్టాద్వైతము :** ఈ వాదములో జీవాత్మ, జగత్తు– యీ రెండూ పరమాత్మకు (దేవునికి) వేరుగా కన్పించినప్పటికీ వాస్తవంగా వేరుకాదనీ, పరమాత్మ, జీవాత్మ, జగత్తు – యీ మూడూ అసల్లో ఒకటేననీ కానీ పనులలో ఒకదాని కొకటి వేరుగా కన్పించుననీ తెలుపబడింది. సూర్యునికి కిరణానికి ఎటువంటి సంబంధం గలదో, పరమాత్మకు జీవాత్మకు అటువంటి సంబంధం గలదనీ, సూర్యకిరణము సూర్యుని కంటే చిన్నదనీ, సూర్యుడు పెద్దవాడనీ అట్లే పరమాత్మ జీవాత్మకంటే పెద్దవాడనీ యీ వాదములో చెప్పబడింది. ఈ వాదములో పరమాత్మ ఒక్కడుగానూ,

అనేకంగానూ ఉండుననీ చెప్పబడింది. ఈ వాదము ద్వైతానికి అద్వైతానికి మధ్య మార్గమట. అంటే యిది ద్వైతాన్ని అద్వైతాన్ని కలుపుటకు ప్రయత్నించింది. ఈ వాదాన్ని రామానుజాచార్యులు కనిపెట్టి ప్రచారం చేసెనట. దీనిని భేదాభేదవాదము లేక ద్వైతాద్వైత వాదము అని కూడా అంటారు. జీవాత్మ ఆఖరుకు పరమాత్మలో కలిసోవునట. కాని అది పరమాత్మ శక్తిని మాత్రం పొందజాలదని యీ వాదము చెబుతుంది. ఈ వాదములో రెండు ఖాఖలు గలవు. -- (1) శైవ విశిష్టాద్వైత వాదము(2) వైష్ణవ విశిష్టాద్వైత వాదము.

శైవ విశిష్టాద్వైత వాదాన్ని శ్రీకంఠ శివాచార్యులును, వైష్ణవ విశిష్టాద్వైత వాదాన్ని రామానుజాచార్యులును బోధించిరట. శివుడే దేవుడని అంటారు శైవ విశిష్టాద్వైతవాదులు. విష్ణువే దేవుడని అంటారు వైష్ణవ విశిష్టాద్వైత వాదులు. అంటే దేవునికి అడ్డబొట్టా? నిలువు బొట్టా? దేవుడు పిలక జుట్టు కలవాడా? నెత్తి వెనుక భాగాన గుప్పెడు (గోష్పాద మంత ) జుట్టు గలవాడా? దేవుడు గద్ర నెక్కినవాడా? ఎద్దు నెక్కినవాడా? అనేదే వీరికి గల భేదాభిప్రాయాలని ముక్తసరిగా చెప్పవచ్చు.

ఈ వాదము ననుసరించే దేవుడు సాకారుడు (ఆకారం గలవాడు) కనుక దేవుని రూపాన్ని పూజించి ముక్తిని బొందవచ్చునట. రామనుజాచార్యులు బ్రాహ్మణ కులంలో పుట్టినా ఆయన కులభేదాలను, అంటరాని తనాన్ని పాటించేవారు కాదట. ఆయన శిష్యులలో మాలలు, మాదిగలు, శూద్రులు వగైరా తక్కువ కులాల వారుండేవారట.

**3. ద్వైత వాదము :** ఈ వాదాన్ని మధ్వాచార్యులు బోధించెనట. పరమాత్మ వేరు. జీవాత్మ వేరు. ఈ రెండూ ఎన్నటికీ కలవజాలవు అని యీ వాదము చెబుతుంది. ద్వైతవాదులు విష్ణువుని దేవునిగా భావిస్తారు. దేవుడు సాకారుడు, సద్గుణుడు అని యీ వాదము బోధిస్తుంది. విష్ణువుతో పాటు కొంతకాలం నుంచి కృష్ణుని కూడా (ఏ కృష్ణుడో తెలియదు) యీ ద్వైతవాదులు దేవుడని పూజింప సాగారు. భక్తివల్ల జీవాత్మ ముక్తిని పొందవచ్చునని యీ వాదము చెబుతుంది. ద్వైతవాదులు ఆర్య దేవతలైన విష్ణువు, కృష్ణునితో పాటు అనార్య దేవతలైన శివుని, దుర్గను, వినాయకుని, ఆంజనేయుని, సబ్రహ్మమణ్యేశ్వరున్ని, వేంకటేశ్వరుని కూడా పూజిస్తున్నారు.

**4. శుద్ధాద్వైత వాదము :** ఈ వాదాన్ని వల్లభాచార్యులు బోధించాడు. ప్రపంచం అంతా దేవుడే. ఆయన అంతటా వుంటాడు. ఆయన అంతర్యామి. ఆయన జీవాత్మ, జగత్తు, పరమాత్మ అనే మూడు రూపాలు ధరించారట.

శ్రీకృష్ణుడే దేవుడు. ఆయనను పూజించు వారు మోక్షము పొందుతారు. జీవుడు దేవుని రూపమే. కనుక జీవుడు కఠోరమైన నియమాలను పాటించి తనను హింసింప చేసుకోకూడదు. తనను హింసించుకోవడమంటే దేవుని హింసించడమే. కనుక ప్రతి దైవభక్తుడు సుఖ భోగాలతోను, విలాసాలతోను కూడిన జీవితాన్ని అనుభవించవచ్చు. ఈ సాంప్రదాయాన్ని స్థాపించినవాడు శ్రీకృష్ణచైతన్య చంద్రుడు. ఈయనను చైతన్య మహాప్రభు అని అంటారు. ఈ మతము కూడా వైష్ణవ మతమే. శ్రీకృష్ణునే గొప్ప భక్తి, ప్రేమలతో ఆరాధించాలని యీసంప్రదాయం చెబుతుంది. రాధ, శ్రీకృష్ణుని ఎలా ప్రేమించిందో భక్తులు శ్రీకృష్ణుని అలా ప్రేమించాలని యీ సాంప్రదాయం బోధించును. రాధాకృష్ణుల ప్రేమలీల, ఒక కామ కలాపం (కామమును తెలిపే కథ) కాదు. అది పరమాత్మ జీవాత్మల అన్యోన్య సంబంధం తెలిపే ఆధ్యాత్మిక గాథ అని చెప్పును.

దేవుణ్ణి గురించి యిన్ని చర్చలు, యిన్ని వాదాలు జరిగినప్పటికీ నేడు హిందువుడంటే కుల భేదాలను పాటించే మనిషి అనే అర్థం ప్రసిద్ధిజెందింది. అనాది కాలంలో భారతీయ ఆర్యులలో కులభేదాలు లేనే లేవట. ఈ సంగతి వేదాలలోనే గలదట. ఆనాడు వర్గ భేదాలు కూడా వుండేవి కాదట. ఎవరి చేతనైన పనిని వారు చేసి, జీవనోపాధిని (తిండిని) కల్పించుకొనేవారట. ఋగ్వేదంలో ఒక శ్లోకంలో వర్ణములను తిరస్కరించినట్లు నిదర్శనాలు గలవు. ఒక ఋషి యిలా అంటాడు: “నేను వేద ఋక్కులను (మంత్రాలను) రచించాను. నా తండ్రి వైద్యం చేస్తాడు. నా తల్లి యితరుల యిండ్లయందు పిండి విసిరి డబ్బు సంపాదిస్తుంది”

ఈ విధంగా వైదిక కాలంలో వివిధ వృత్తులతో అనేక మంది జీవిస్తూ వుండేవారట. వేరు వేరు వృత్తులతో జీవితాలను గడిపే వారే వేద మంత్రాలను వ్రాసినట్లు వేదాలలోనే వ్రాయబడింది. ఆనాడు వర్ణ వ్యవస్థ (కుల వ్యవస్థ) వున్నప్పటికీ వృత్తి భేదాలు కులములుగా పరిగణింపబడేవి కాదట.

అందరూ తాము ఒక జాతి వారమనే భావం కలిగివుండే వారట. కాని కాలం గడచిన కొద్ది వృత్తి వంశానుగతమైంది. దానితో ఏ వృత్తిని అవలంబించేవారు ఆ వృత్తిని ఒక కులంగా భావించడం జరిగింది. క్షత్రియులు అగ్రకులంగాను, ఋషులు మునులు (బ్రాహ్మణులు) రెండవ కులంగాను పరిగణింపబడిన కాలం కూడా వుండెనట. కాలక్రమేపి యీ కులాలు విస్తరిల్లి (వృద్ధిచెంది) నేడు భారతదేశంలో దాదాపుగా నాలుగు వేలకు మించి పోయినవట. కుల భేదాలు అర్థం లేనివని నేడు హిందువులలో కొందరు గ్రహింప సాగారు. ఇది భారత జాతికి ముఖ్యంగా హిందూ జాతికి ఒక గొప్ప శుభ సూచకమని చెప్పక తప్పదు.

## 4

"దేవుడు" అనే మాట మానవుని అజ్ఞాన దశలో పుట్టింది. అది మానవుడు తన చుట్టూ కనిపించే వస్తువులను, జరిగే పనులను అర్థం చేసుకోలేక తనకన్న వేరుగా ఏదో ఒక శక్తి వుందని ఊహించాడు. నిప్పు, నీరు, గాలి, నేల, ఎండ, మొదలయిన వాటికి దైవత్వం (దైవమహిమను) అరోపించి మొట్ట మొదటగా దేవుళ్ళను సృష్టింపసాగెను. అతడు కొండను, ఏరును, చెట్లను దేవుళ్ళని భావించెను. తరువాత జంతువులను దేవుళ్ళని నమ్మెను. ఆ తర్వాత మనిషిని దేవుడని నమ్మెను. తుదకు నిరాకారుడయిన (ఆకారములేని) నిర్గుణుడయిన (ఏ గుణములేని) దేవుడు గలదని

నమ్మేను. చిట్ట చివరకు దేవుడు కనిపంచకుండా పోయాడు. అంతే. మత సిద్ధాంతాలు పెరిగిన కొద్దీ (మానవుని ఆలోచనా శక్తి పెరిగిన కొద్దీ) దేవుడు ప్రకృతి శక్తులతో (గాలి, నీరు వగైరాతో) తనకున్న సంబంధాన్ని తెంచుకొని ఊహా ప్రపంచంలోనికి (ఆలోచనాలోకానికి) వెళ్ళిపోయాడు. కాని నిరాకారుడయిన దేవుడికి పరాన్నభుక్కులైన (ఇతరుల, కష్టార్జితాన్ని తిని బ్రతికేవారు) కొంతమంది సోమరిపోతు పూజారులు, పండితులు తమ ఆర్థిక స్వార్థం కొరకు (తమ సొంత లాభం కొరకు) మళ్ళీ ఒక ఆకారాన్ని కల్పించారు.

ఈ సోమరిపోతు పూజారులు దేవుళ్ళకు పూజా పురస్కారాలు, నామకరణం (పేరు పెట్టుట), అన్నప్రాశనము ( అన్నము తినిపించుట), పెళ్ళి పేరంటం, పవళింపు సేవ (జత కట్టించుట) మొదలయిన అమాంబాపతు మానవ గుణాలన్నింటినీ అంటగట్టారు. తిండిపోతు దోపిడీగాండ్రయిన యీ పూజారులు దేవుడు, పాప–పుణ్యాలు, నరకం – స్వర్గం, మోక్షం అనే బూచులను తమ స్వార్థం కోసం (తమ సొంత లాభం కొరకు) వినియోగించుకుంటున్నారు. యిపుడు కూడా వినియోగించుకుంటున్నారు. నిజానికి మనుషులు చేసిన దేవుళ్ళ చేతిలో మనుషులే నేడు బానిసలై (దాసులయి) పోతున్నారు. దేవుడనే బూచిని చూపి మనిషి మెదడుపైన (ఆలోచనలపైన) మతమనే మత్తు మందు జల్లుబడుతోంది. ఈ మతం పేరిట మానవుల మధ్య పడగొట్టడానికి వీలుకాని బలమైన అడ్డుగోడలు కట్టబడ్డాయి. ఆ అడ్డుగోడలను పూజారులు, పౌరోహితులు, పండితులు, సిద్ధాంతులు కలిసి తమ ఆర్థిక లాభం కొరకు కట్టించారు. మతం పేరటే మతోన్మాదులయిన మత కర్తలు ఇతర మతస్థులయిన అనేకమంది మానవులను ఊచకోత కోయించి మానవ నెత్తుర్ని ఏరుల్లాగా పారించారు. ఆది శంకరుడు లాంటి "నేనే బ్రహ్మను" అన్న గొప్ప తత్వవేత్త కూడా (వేదాంతి కూడా) యీ మత దురహంకార పిశాచానికి దాసుడై జైన, బౌద్ధ, చార్వాకుల చెవుల్లో సీసం కాసి పోయించాడు. వేల కొలది బౌద్ధులను దాయకట్టించి నరికించాడు. అనేకమందిని గానుగలో వేయించి త్రిప్పించి చంపించాడు.

ఈ రకంగానే ఆర్యులు ఆనార్యులను, యూదులు క్రైస్తవులను, కేథలిక్కులు ప్రొటెస్టెంట్లను, సున్నీలు షియాలను, వైష్ణవులు శైవులను, శైవులు వైష్ణవులను,

అకాలీలు నిరంకారీలను మతం, సాంప్రదాయాల పేరిట ఒకరినొకరు క్రూరమృగాల కన్నా దారుణంగా (భయంకరంగా) అమానుషంగా (మానవుడు చేయకూడని విధంగా) చిత్రవధ చేశారు. చేయించారు. ఒకరి ఆడవారిని మరొకరు ఘోరంగా అవమానపరచి మానభంగాలు (చెరచుట) చేశారట. చేయించారు. గొరికి పార వేసిన బొచ్చునిస్తే తిరుపతి వెంకన్న దేవుడు మురిసిపోయి కోరిన ఫలాన్ని యిస్తాడనీ రోగాలు పోగొట్టుతాడనే అంతదాకా, యీ మతమే నేడు చదువుకున్న, చదువులేని జనంలో ప్రచారం చేస్తున్నది. ఈ రకంగా మతాన్ని అంటిపెట్టుకొని భుక్తిని సంపాదించుకునే పూజారులు, పౌరోహితులు, సిద్ధాంతులు వగైరా పరాన్న భుక్కులే దేవుణ్ని గురించి ప్రచారం చేస్తున్నారు. చేయిస్తున్నారు. పెంటతినే కాకి ముట్టిన శ్రాద్ధకూటిని చనిపోయిన పెద్దలకు వేస్తే వాళ్ళకు (పెద్దలకు) స్వర్గంలో సీటు (చోటు) గ్యారంటీ వుంటుందని చెప్పి యీ మతమే చచ్చిన తరువాత స్వర్గాన్ని చూపిబెల్లి స్తుంది. (మోసగిస్తుంది). అంచేత యీ మతం, నల్లమందు వంటిది. ఇది తిండిపోతు సోమరులకు కేంద్రం (ముఖ్యమైన చోటు). ఈ మత కర్మకాండను ఆధారంగా చేసుకొని పౌరోహితులు, పూజారులు, పండితులు, పోపులు, బిషప్పులు, ఆర్చి బిషప్పులు, ఫాదరీలు, ఫాస్టర్లు, మౌలవీలు, ముల్లాలు వగయిరాలు బీద ప్రజల కష్టార్జితాన్ని మాయమాటలు చెప్పి కాజేస్తూ సుఖంగా జీవిస్తున్నారు. అంచేత యీ మత పిచ్చిని నాశనం చేయనంతదాకా మానవుడు మానవుడుగా మనలేడు. (ఉండలేడు). మావత్వానికి మనుగడలేదు.

ప్రపంచంలోని ఏ దేశంలోనూ లేని "కులం" అనే చిలిపి రోగం మనదేశం లోని హిందువు లనబడే వారికే దాపురించింది. ఒకానొకప్పుడు శ్రమ (శరీరకష్టం) విభజన కోసం (పంచటానికోసం) ఏర్పడ్డ ఈ కుల వ్యవస్థ రానురాను గట్టిపడి, నేడు కులతత్వంగా మారిపోయిందని కొంతమంది మానవశాస్త్రవేత్తలంటారు. ఈ కుల వ్యవస్థయొక్క పుట్టుకను గురించి కొంతమంది ధర్మశాస్త్రవేత్త లనుకొన్నవారు ఈ విధంగా వర్ణించారు. బ్రహ్మఅనే పేరుగల దేవుని మఖమునుండి బ్రాహ్మడు, అతడి భుజాలనుండి క్షత్రియులు (రాజులు), అతని తొడల నుండి వైశ్యులు (కోమట్లు) అతని పాదాలనుండి శూద్రులు (కమ్మ, కాపు, రెడ్డి, వెలమ, జాట్ వగైరాలు) పుట్టారట.

కాని నేడు పంచములనబడే మాల మాదెగలు, బ్రహ్మయొక్క ఏ అవయవమునుండి పుట్టారో ధర్మశాస్త్రవేత్తలైన జన్మగత బ్రాహ్మణ పండితులు చెప్పలేదు. ఈ కులాలు మొదట మూడే తరువాత నాలగయ్యెను. ఇపుడు అవి కొన్నివేల సంఖ్యలోనికి పెరిగి పోయాయి. ఇక ఉపకులాలకు, తెగలకు అంతేలేదు. ఈ విధంగా హిందువు లనబడేవారు అనేక కులాలలోనికి విభజింపబడటమే గాకుండా అంటరాని వారనే అయిదవ కులాన్ని కూడా తరువాత కొంతకాలనికి స్వార్థపరులైన కొంతమంది పండితులు సృష్టించారు. వారిని అంటరానివారని, చూడరానివారని, చెప్పరానివారని మాట్లాడరానివారని, చండాలురని పేర్లు పెట్టి తక్కిన కులాలవారి గ్రామాలకు దూరంగా గూడాలలో వుండాలని ఆనాటి రాజుల చేత జన్మగత బ్రాహ్మణ పండితులు కొందరు శాసనాలు చేయించారు. మాల, మాదెగలను అంటరాని వారనటం, గ్రామాలకు దూరంగా వుంచటం శాస్త్రసమ్మతమేనని (శాస్త్రములు వప్పుకుంటున్నాయని) పూరీ శంకరాచార్యులవంటి జన్మగత బ్రాహ్మణ సన్యాసి నేటికీ సిగ్గు బిడియం లేక నిర్భయంగా ప్రచారంచేసే అంతగా మానవత్వాన్ని కోల్పోవుట విచారకరమైన సంగతి.

పరాన్నభుక్కులైన కొంతమంది జన్మగత బ్రాహ్మణ పండితులు అర్థంలేని ఈ కులాచారాలను, మత మూఢాచారాలను బీదలలోనూ, ధనవంతులలోనూ ప్రచారంచేస్తూ నిజంగా బీదలకున్న జీవితావసరాలను (కూడు, గుడ్డ, వగైరాలను) ఒక మూలకు నెట్టి వారిని (బీదజనులను) యింకా పశువులనుగా చేయటానికి ధనవంతుల తోనూ, స్వార్థపరులైన రాజకీయ నాయకులతోను కుమ్మక్కై కుల, మత, దేవుడు అనే పన్నాగాలు పన్ని తాము అన్ని విధాలా సుఖంగా జీవిస్తున్నారు. కనుక మూఢాచారాలతోను, ముఢనమ్మకాలతోను దేవుడనే బూచితోను కుళ్ళిపోయిన యీ కుల మత తత్త్వాలనే చిలిపి రోగాలను, అంటరానితనం అనే కుష్టురోగాన్ని నేటి సాంఘిక ఎక్కువ తక్కువ అనే మలేరియా రోగాన్ని నిర్మూలింప చేయనంతవరకు ఈ హిందూ దేశానికి నిజమైన సుఖంగాని అభివృద్ధిగాని గౌరవంగాని ఉండజాలదు.

ఆదిమానవులలో ఆ కాలంలో ఉన్నవాడు, లేనివాడు అనే తేడా లేకుండా అందరూ కలసి పనిచేసికొని హాయిగా జీవించేవారు. ఆనాడు మానవ సమాజంలో

ఈ వ్యక్తిగత (సొంత ఆస్తి) ఆస్తిపద్ధతి లేనేలేదు. కానీ మానవులలో ఈ వ్యక్తిగత ఆస్తిపద్ధతి రావడంతో మానవులు డబ్బున్నవారుగను, డబ్బులేనివారిగను చదువుకొన్నవారిగను, చదువుకోనివారిగను రెండు వర్గాలుగా చీలిపోయి, ఒకరి నొకరు ద్వేషించుకొంటూ వుండటం మామూలై పోయింది. కొద్దిమంది డబ్బు, చదువుగలవారు డబ్బు చదువులేని ఎక్కువమంది బీదప్రజల కాయకష్టాన్ని మాయ మాటలు చెప్పి కాజేస్తూ కోటీశ్వరులగుచుంటే కోటానుకోట్ల ప్రజలు కటిక బీదరికంలో అతి నీచంగా బ్రతుకుతున్నారు. అంచేత ఈ ఆర్థిక (డబ్బు సంబంధమైన) సాంఘిక అసమానతలు (తేడాలు) లేని ఒక కొత్త సమాజం నిర్మాణం జరిగిననాడు ఈ హిందూ సమాజం, దానితోపాటు హిందూదేశం బాగుపడగలవు.

రాజకీయంగా 31 సంవత్సరాలు క్రిందట స్వతంత్రమైన మన భారత దేశంలో నేడు ఎక్కడ చూచినా కటికదరిద్రం, గ్రుడ్డి మూఢ నమ్మకాలు, మూఢా చారాలు, కులతత్వం, మతతత్వం, వర్గతత్వం, ఎక్కువ తక్కువలు, మోసాలు, కపట దైవభక్తి, కుటిల దేశభక్తి, దొంగవ్యాపారాలు, లంచగొండితనం, ఉద్యోగస్థుల నిరంకుశత్వం, మానభంగాలు, హింసలు, హత్యలు, త్రాగుడు, బూటకపు వేదాంతాలు, పదవీ వ్యామోహం, నిరుద్యోగసమస్య, (ఉద్యోగాలు లేకపోవుట) వగైరాలు వీరవిహారం (ఇష్టమొచ్చినట్లు) చేస్తున్నాయి.

నేడు సామాన్య ప్రజలకు కావల్సింది దైవభక్తి, దైవపూజ, కుల మత తత్త్వాలు, వేదాంత బోధలు, బ్రహ్మోత్సవాలు, సీతాకళ్యాణాలు, రామకోటి ఉత్సవాలు, పవళింపు సేవలు, తెప్పతిరుణాళ్ళు వగైరాలు కానేవావు. వారికి (బీదలకు) ముఖ్యంగా కావాల్సినవి ఆరోగ్యకరమైన కూడు, మొలచుట్టూ చాలినంత గుడ్డ, తలదాచుకోవడానికి చాలినంత ఆరోగ్యకరమైన గూడు, మానవులుగా బ్రతకటానికి కావలసిన చదువు సంధ్యలు మాత్రమే. కనుక ప్రజలలోని మూఢాచారాలను, దొంగ దైవభక్తిని, మూఢనమ్మకాలను, పోగొట్టనంతవరకు పైనచెప్పిన అవవాశాలు బీద ప్రజలకు లభించుట కల్ల. ఈ మూఢనమ్మకాలను దొంగ దైవభక్తి, మూఢాచారాలను ప్రజలలో లేకుండా చేయటానికి ఒక గొప్ప సాంఘిక విప్లవం (తిరుగుబాటు) లేవదీయుట చాల అవసరం. అందువల్ల సామాన్య ప్రజానీకంలో విప్లవాత్మక మానసిక

మార్పు తీసికొని రావడానికి ప్రజా శ్రేయస్సు (మేలు) కోరువారంతా సాహసంతో ముందుకు వచ్చి ప్రజలలో సాంఘిక చైతన్యాన్ని కలిగించాలి, అప్పుడు మాత్రమే మనది మత ప్రసక్తిలేని ప్రజాస్వామ్య దేశమని మనం చెప్పుకోగలము.

## 5

మానవులలోగల హెచ్చుతగ్గులు (గొప్పోళ్ళు, బీదోళ్ళు, లేనోళ్ళు, ఉన్నోళ్ళూ, గౌరవముగల, గౌరవంలేని) మానవులు నిర్మించిన దేవుళ్ళల్లో కూడా కన్పిస్తున్నాయి. దేవుళ్ళంతా రెండు రకాలుగా కన్పడుతున్నారు. కొందరు దేవుళ్ళు "క్లాసు" దేవుళ్ళుగా ఎంచబడుతున్నారు. అంటే ధనము, చదువు, మడి మట్రా, స్నానం జపం గలవారి నుండి కొబ్బరికాయలు, ఇతర విలువగల నైవేద్యాలు వగైరాలను ఆరగించే దేవుళ్ళు "క్లాసు" దేవుళ్ళుగా చెలామణి అవుతున్నారు. వీరు బంగారంతో గాని, వెండితోగాని, ఒకటవ నెంబరు పాలరాతితోగాని, మంచిగంధపు చెక్కతోగాని నిర్మింపబడుతారు. వీరు పట్టుపీతాంబరాలు, రత్నాలు, ముత్యాలు, పడడాలు, మణులు, వగైరా

విలువలగల రాళ్ళతో కూడిన నగలను, కిరీటాలను ధరిస్తారు. వీరిని ఆవుపాలతోనో, ఆవునేతితోనో, తేనెతోనో, పన్నీరుతోనో, నూనెతోనో, పంచామృతంతోనో స్నానం చేయిస్తారు. వీరికి యేడాదికొకసారి పెండ్లిండ్లు గర్భాదానాలు జరుపబడుతాయి. వీరికి పూజలు, స్నానాలు, పెండ్లిండ్లు వగైరాలను చేయించువారు సామాన్యంగా జన్మగత బ్రాహ్మణ పూజారులై వుంటారు. ఈ దేవుళ్ళ ఆదాయాలు కూడా బాగానే వుంటాయి. ఈ దేవుళ్ళలో కొందరికి జందాలు (మూడు పోగులు కొందరికి, తొమ్మిది పోగులు కొందరికి) ఉంటాయి. ఈ దేవుళ్ళలో శూద్రదేవుళ్ళు(అనార్యులు నిర్మించుకొన్న దేవుళ్ళుకూడా), గలరట. శివుడు, వెంకన్న, గణపతి, అంజన్న, దుర్గమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరుడు, వీరభద్రుడు వగైరాలు అనార్య దేవుళ్ళేనట. విష్ణువు, బ్రహ్మ, సరస్వతి, లక్ష్మి, రాముడు, కృష్ణుడు, వగైరాలు ఆర్యుల దేవుళ్ళట. ఈ ఆర్య, అనార్య దేవుళ్ళంతా శాకాహారులేనట. కాని రాముడు, కృష్ణుడు మాత్రం మాంసాహారులగా కూడా కన్పిస్తున్నారు. ఈ దేవుళ్ళంతా ఫలహారాలు, దద్ధోజనం, పులిహోర, గారెలు, పాయసము వగైరాలు మాత్రమే ఆరగిస్తారట.

ఇక రెండవరకం దేవుళ్ళు “మాస్” (mass) దేవుళ్ళు. అంటే ఈ దేవుళ్ళు చదువు, ధనము, మడులు, జపాలు, తపాలు, కపటము, మోసములేని సామాన్య ప్రజలనుండి పశువులను పక్షులను బలికోరుతారట. వీరికి ముఖ్యంగా మాంసము, త్రాగుడు, వగైరాలు ఉండాలట. ఈ దేవుళ్ళంతా (శూద్రకులాలకు, అనార్యులకు) చెందిన క్షుద్ర (నీచమైన) దేవుళ్ళట. పోలమ్మ+పోలేరమ్మ, ముత్తెమ్మ+ముత్యాలమ్మ, అంకమ్మ+అంకాలమ్మ, గంగమ్మ+గంగానమ్మ, పెద్దింటమ్మ, పోతరాజు వగైరాలు శూద్రప్రజల దేవుళ్ళుగా ఎంచబడుతున్నారు. దేవుళ్ళలోకూడా మానవులవలె వాళ్ళ వాళ్ళ పూర్వజన్మలలో చేసిన పాపపుణ్యాలు, వాళ్ళ వాళ్ళ నొసట రాసిన రాతలు వగైరాలనుబట్టి, అదృష్టవంతులు అదృష్టహీనులు గొప్పోళ్ళు బీదోళ్ళు అవుతారని మన పూర్వీకులలో గొప్ప గొప్ప పండితులు ఎప్పుడో ఘంటాపథంగా (గట్టిగా) తేల్చి తాటాకులమీద భద్రంగా చెక్కుచెదరని రీతిలో ఉక్కు గంటాలతో మరీ రాసిపెట్టారు. ఈ సిద్ధాంతాలను కాదనే దమ్ము (ధైర్యం) దేవుళ్ళకే లేదట. అటువంటప్పుడు చచ్చు దద్దమ్మలమైన (చావుగల) మన కెక్కడిది?

చూడండి, మనుషులను పట్టి పీడించే కర్మ సిద్ధాంతం పైకి ఎంతో క్రూర మైనదిగా కనిపించినా నిజానికి అది చాల నిష్పక్షపాతిగా (అందర్ని సమానంగా చూచి) వ్యవహరించును. ఈ కర్మసిద్ధాంతం పాపం దేవుళ్ళను కూడా వదిలిపెట్టదు. అదృష్టహీనుడైన – పేదవాడైన – దేవుడు తన పూర్వజన్మలో ఏం పాపం చేశాడో? అదృష్టవంతుడైన – ధనముగల దేవుడు తన పూర్వజన్మలో ఏం పుణ్యం చేశాడో? అసలింతకీ ఏం పుణ్యం చేసి వీళ్ళంతా (ఈ దేవుళ్ళంతా) దేవుళ్ళుగా పుట్టారో? ఎన్ని జన్మల పుణ్య ఫలితమో? ఆ రహస్యం (చాటు మాట) చెప్పనైనా చెబితే ఎంత బాగుండును? ఎందుకంటే మనుషులలో చాలమందికి దేవుళ్ళుగా పుట్టాలన్న దురాశ కల్గింది. నిరుపేదగావున్న దేవుడు తానేం పాపం చేశాడో చెబితే ఆ పాపం యిక యీ దేవుళ్ళుగా పుట్టాలనుకొన్న పెద్దమనుషులు చెయ్యకుండానన్నా ఉంటారు. పాపం. వారు దేవుళ్ళవ్వాలని తహతహలాడి పోతున్నారు పాపం. కాని ఒకే పేరుగల దేవునికి పాపం ఒకచోట ఒక ఆలయంలో నిత్య ధూప దీప నైవేద్యాలు, పూజలు, పెండ్లి గర్భాదానం, తెప్పతిరునాళ్ళు వుంటుండగా అదే దేవునికి వేరొకచోట పడిపోయిన గోడలమధ్య చీకటిలో గబ్బిలాలు నివసించే గర్భగుడిలో ఆజన్మ ఖైదీగా వుంచబడుతున్నాడు. ఏడాది కొకసారైనా తలుపులు తెరచి దుమ్ము దులిపి కొబ్బరికాయను గాని, కోడిపిల్లనుగాని అర్పిస్తే, ఆ దేవుడక్కడికి అదృష్టవంతుడే. పెండ్లి, గర్భాదానాలు లేకపోతే మా పీడాబాయె!

గంగానమ్మ, పోలేరమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, కాళికమ్మ, పోతురాజు, వగైరాలు నీచమైన దేవుళ్ళట. వీరిని కొలిచేవారంతా మూఢులట. అనాగరికులట. పశువుకంటే హీనులట. మాంసాహారులట. ఆచారాలు తెలియని అధములట. కాని ఏ బాబానో, ఏ అమ్మనో, ఓ లక్ష్మినో పూజించే వారంతా గొప్ప దైవభక్తులట. దేవునికి కొబ్బరికాయ కొడితే మూఢాచారం , అనాగరికత కాదట. దేవునికి జంతుబలి యిస్తే మూఢాచారం అనాగరికత అట. కాని మౌలికంగాచూస్తే (లోతుగాచూస్తే) యీ రెండు పూజాపద్ధతులూ మూఢాచారాలే. ఎందుకన ఉభయులు ప్రాణంలేని, కదలా మెదలాలేని విగ్రహాలనే ( బొమ్మలనే ) పూజించేది. వీటన్నిటికీ మూలపురుషుడు ఆదిమానవుడే. ఇది చేదు నిజం (గిట్టని సత్యం).

ఈ రోజులలో – ఈ రోదసీ యుగంలో – కూడా గ్రహణం రాహుకేతువుల వల్ల వస్తుందని సముద్రాలలోనూ, నదులలోనూ, సరస్సులలోనూ, చెరువులలోనూ, కాల్వల్లోనూ స్నానాలు చేసి తర్పణాల విడిచి జన్మగత బ్రాహ్మణ పురోహితులచేత సంకల్పం చెప్పించుకొని వారికి (పురోహితులకు) దక్షిణలు, దానాలు వగైరాలిచ్చే మూఢత్వంలో మనమింకా మునిగి తేలుతున్నామంటే, యీ పూజారులకు, యీ పురోహితులకు, యీ పండితులకు, యీ మఠాధిపతులకు, యీ సన్యాసులకు, యీ బైరాగులకు పట్టరాని కోపం వస్తుంది. ఎందుకంటే సామాన్య ప్రజానీకం మానసికంగాను, బౌద్ధికంగానూ (తెలివితేటలలో) పెరిగితే కులం, మతం, దేవుళ్ళు, పూజలు, దానాలు, ధర్మాలు, మూఢాచారాలు, వగైరాలు దెబ్బతిని పోతాయి. అందువల్ల దేవుడు, మతము, కులము, మూఢాచారాలు వగైరాలను ఆధారంగా చేసికొని బ్రతికే యీ అమాంబాపతు సోమరిపోతుల ప్రాబల్యం, స్వార్ధం, భుక్తి – గోవిందోహరి! (నాశనమైపోతాయి). అందుకే వారందరికీ అంత కోపం. అంత ద్వేషం. అంత క్రూరత్వం. అంత దుష్టత్వం.

ఈశ్వరుడంటే శాసకుడట. ఆయనను సర్వేశ్వరుడు, పరబ్రహ్మ, పరమాత్మ, దేవుడు అనికూడా అంటారట. ఈశ్వరుడే దేవతలు, దేవదూతలు వగైరా అమాంబాపతు చిల్లర మొల్లర దేవుళ్లకు అధిపతియట(యజమాని). ఆ చిల్లర దేవుళ్ళు స్వతంత్రమైనవి కావట. ప్రతి దేవత, ప్రతి దేవదూత, ఈశ్వరుని ఆజ్ఞలను అనుసరించి నడవవల్సిందేనట.

మానవులంతా ఈశ్వరుని అంశములేనట (భాగాలేనట). అందువలన మావవులమైన మనం ఈశ్వరుని కంటే తక్కువ హోదాగల ఈశ్వరుల మన్నమాట.

పరమాత్మ–జీవాత్మలమైన మన మందరికి తండ్రియట. అయితే మనమంతా కుల, మత, వర్గ భేదం లేకుండా సోదర సోదరీల మన్నమాట. అంటే ఈశ్వరుడే చిన్న ఈశ్వరులమైన మనయందరికీ తండ్రియట. ఈశ్వరుడే వేరు వేరు అవతారాలుగా యీ భూలోకంలోని అధర్మాన్ని అణచి ధర్మాన్ని స్థాపించడానికి యీ భూలోకంలో అపుడపుడు అవతరించునట,

ఆయన (ఈశ్వరుడు) తనకు విశ్వాసపాత్రులైన కొందరిని సేవకులుగను.

కొందరిని స్నేహితులుగను, కొందరిని కుమారులుగను భూలోకంలోనికి పంపుచుండునట.

స్వర్గలోకపు ఉపదేవతలనియు, దేదూతలనియు, చెప్పబడే వారంతా ఈశ్వరుడు నియమించిన ప్రాణికోటి సేవకులు మాత్రమేనట. యజమాని, పనివారివలె (నౌకర్లవలె) నీచమైన కోరికలు కలిగి వుండడట. అట్లే ఈశ్వరుడు సంపూర్ణమైన సుఖసంపత్తులతో తులతూగుచూ వుంటాడట. ఆయనకు నీచమైన కోరికలు ఉండనే వుండవట.

ఈశ్వరుడు సృష్టించిన ప్రాణులు అనేక రకాలు. దేవతలు, ఉపదేవతలు, మానవులు, జంతువులు. పక్షులు, పురుగులు వగైరాలు ఈశ్వరునిచే నిర్మింపబడు చున్నవట. అయితే రాక్షసులు, పిశాచాలు, భూతాలు వగైరాలను ఎవరు సృష్టించారో, ఎక్కడ కూడా చెప్పబడలేదు. వారికి (రాక్షసులు వగైరాలకు) మరొక సృష్టికర్త కలడో లేడో కూడా శాస్త్రాలలో ఎక్కడా చెప్పబడలేదు. చిన్న ఈశ్వరుడైన జీవాత్మ తాను చేసే పనులకు తనే బాధ్యుడట. అయితే విధి అంటారు దాని సంగతి ఏమిటి? ఈశ్వరుడు ప్రకృతి ద్వారా జీవాత్మకు పనులు చేయటానికి అవకాశాలు కలిగించునట. సత్యస్వరూపియైన పరబ్రహ్మను (ఈశ్వరుని) తెలిసికొన్న వాడే బ్రాహ్మడట. ఓమ్‌తత్ సత్ అనేదే ఈశ్వరుని స్వరూపమట. ఇదే సృష్టి కంతకు మూలమట. కాని కొందరు మునులు ఈశ్వరునికి ఆకారం లేదనియు, ఆయనకు విగ్రహాలతో నిమిత్తం లేదని అంటారు. కాని కొంతమంది ధనకాంక్షగల స్వార్థపరులు ఈశ్వరుడు సాకారుడుగను, నిరాకారుడుగను, రెండు రకాలుగా వుంటాడని తమ మత గ్రంథాలలో వ్రాసుకొన్నారు. ఆ గ్రంథాలలో రాముడు, కృష్ణుడు, బుద్ధుడు దేవుని (ఈశ్వరుని) రూపాలను ధరించిన అవతారాలని కూడ తమ గ్రంథాలలో వ్రాసుకున్నారు. మరీ పూర్వకాలంలో బ్రహ్మ, విష్ణువు రుద్రుడు, యీ ముగ్గురు కూడా ఈశ్వరుని అవతారాలేనని కూడా తమ గ్రంథాలలో వ్రాసుకొన్నారు. ఈ అవతారాల విగ్రాహాలను ఉపాసించి వారి అనుగ్రహం వల్ల చిత్తశుద్ధి పొందిన తరువాత నిరాకారుడైన ఈశ్వరుని పొందవచ్చునంటారు కొంతమంది స్వార్దపరులైన పండితులు. కాని మన ఋషులు ప్రపంచంలోని సమస్త పదార్థాలను పరిశోధించి బాగా చర్చించి రెండవది లేనిదిగను,

ఒక్కటిగను, అంతటా వ్యాపించి యుండునదిగను, మాటకు, పనికి అందనిదిగను, సకల ప్రపంచాన్ని ప్రకాశింపజేయు స్వప్రకాశముగను, జ్ఞానమే స్వరూపముగను ఏది గలదో అదే నిర్గుణ నిరాకార పరబ్రహ్మ అని (నిరాకార ఈశ్వరుడని) అనేక వేల సంవత్సరాల పాటు అడవులలో తపస్సు, యోగము, ధ్యానము, చేసి చేసి తెలిసికొన్నారట. ఇంకా వారేమన్నారంటే "నిరాకారుడైన ఈశ్వరుడే సత్యము.ఆయనయే కాలము." అట్టి నిరాకారుడైన దేవుణ్ణి స్వార్థపరులైన కొంతమంది మానవులు తమ రూపంలో నిర్మించుకొని తమ ఉదర పోషణకై (పొట్టపోషణకై) దానిని పూజింప మొదలిడిరట. వారు మొదటగా, దేవుణ్ణి, దేవతలను తమవలె వుండుననుకొని, తయవలెనే వాటి విగ్రహాలను నిర్మించుకుని, పూజింపసాగిరి. తరువాత కొంతకాలానికి దేవుడు, దేవతలు తమకంటే ఎక్కువ శక్తి గలవారని అనుకొని వారి విగ్రహాలను వేరు వేరు ఆకారాలలో నిర్మించుకొని పూజింపసాగిరి. దేవుని రూపాన్ని గురించి ఎవరి యిష్టమొచ్చినట్లు వారు ఊహింపసాగారు. ఇంకొంతమంది ఋషులు దేవుని గురించి ఏమన్నారో వినండి : "దేవుడు లేనిచోటు లేనేలేదు, ఆయన ఉన్నాడనిగాని లేడనిగాని చెప్పటానికి సరియైన ప్రమాణాలు ఏ మత గ్రంథాలలోనూ (వేదాలు, బైబిలు, ఖురాన్, వగైరాలలో) చెప్పబడలేదు. ఆయన రూపము గాని, గుణముగాని వర్ణింపబడజాలదు. ఆయనకు చావు పుట్టుకలు లేవు. ఆయన అందరకూ ఎంత దగ్గరగా ఉండునో, అంత దూరంగా కూడా ఉంటాడు. ఆయనకు మానవునివలె అవయవాలుగాని, మనస్సుగాని, జ్ఞానంగాని లేనేలేవు. ఆయనకు పేరే లేదు." కాని కొంతమంది స్వార్థపరులైన మానవులు తమ భుక్తికై ఆయనకు (భగవంతునికి ) ఏదో ఒక రూపం కల్పించి, ఏదో ఒక పేరు పెట్టి పూజించుచున్నట్లు నటించుచూ అమాయక ప్రజలనుండి కానుకలు, నైవేద్యాలు వగైరాలు పొంది వాటిని తాము అనుభవిస్తూ సుఖంగా వుంటున్నారు.

ఈ రకమైన పూజలవల్ల మనం దేవుణ్ణి పొందలేమట. కాని ఆయన చేత నిర్మింపబడి కష్టాలనుభవించుచున్న చిన్న ఈశ్వరులైన మన తోటి సోదరులకు మన శక్తికొలది ఏదో ఒక సహాయం చేయుటే నిజమైన దైవపూజ కాగలదని కొంతమంది పండితులంటారు.

పెదాలతో బిగ్గరగా భజనలు, ప్రార్ధనలు, స్తోత్రాలు, సుప్రభాతాలు, వగైరాలు చేయుట కేవలం తాము గొప్ప దైవ భక్తులమని లోకానికి చూపించి లోకులను ఆర్థికంగానూ మానసికంగాను దోచుకోటానికి పన్నిన పన్నాగమే. నాలుకతో అమృతాన్ని కురిపిస్తూ హృదయాన్ని విషపూరితంగా వుంచుకొన్నంతవరకు మన ప్రార్ధనలు, మన పూజలు, మన భజనలు, మన నైవేద్యాలు, వగైరాలను ఈశ్వరుడు స్వీకరించడట. హృదయానికి కూడా దేవుడు అందడట. మరి కొంతమంది ఋషులు అనేక సంవత్సరాల పాటు ఈశ్వరుని గురించి అనేక పరిశోధనలు జరిపి జరిపి చివరకు తేల్చిందేమంటే దేవుడనేవాడొకడుంటే అతని పేరు "నేతి నేతి" అని నిర్ణయించిరి. అనగా దేవుడు "అంతము లేని వాడట (Infinite) దేవునికి అందరూ సమానులేనట, ఆయనకు కులం, మతం, తెగ, వర్గము, జాతి ఆడ మగ భేదాలు లేనేలేవట. ఆయనను తెలుసుకోవాలంటే అతి తేలిక మార్గం గలదట. అదేమనగా మనం కోపమును, స్వార్ధమును. ఈర్ష్య (చుప్పనాతి తనం) కుల, మత, వర్గ, జాతి, తెగ భేదాలు వగైరాలను విడిచిపెట్టి సత్యమార్గాన, నిరాడంబరంగా నడుచుకొనుటే.

మనం కనిపించని దేవుని గురించి తెలిసికోవాలనే ఆరాటంతో సతమత మగుటకంటే మన కంటికి కన్పించే యీ భూదేవి గురించి తెలిసికొనుటవల్ల అనేక లాభాలు కలుగగలవలట. మనం ఒక అతి విచిత్రమైన అయింద్ర జాలిక భూలోకంలో నివసిస్తున్నాము. మనము నివసిస్తున్న యీ భూమి రోదసీలో (ఆకాశమున భూమికి మధ్యగల ప్రదేశంలో) గొప్పగొప్ప సముద్రాలను, పర్వతాలను, నదులను, విశాలమైన మైదానాలను, అడవులను, కోట్లకొలది మనుషులను జంతువులను పక్షులను, పురుగులను, తన వెంటబెట్టుకొని గ్రహాలు, సూర్యుడు నక్షత్రాలు వగైరాల యొక్క ఆకర్షణ శక్తి ద్వారా గంటకు 72 వేల మైళ్ళ వేగంతో తాను గిరగిరా తిరుగుతూ తనకు 9 కోట్ల 28 లక్షల 30 వేల మైళ్ళ దూరంలో వున్న సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నదని భూగోళశాస్త్రజ్ఞు లంటున్నారు.

అంత దూరానగల సూర్యుని వేడి, వెల్తురు, భూమిమీద పడుచుండుట వలన కోటానుకోట్ల ప్రాణులు జీవిస్తున్నాయి. ఈ అద్భుత కార్యాలను మనం రోజుకు కనీసం ఒక నిమిషమైనా ఆలోచిస్తున్నామా? వాయుమండలములో (రోదసీలో)

కంటికి కనిపించని ఆకర్షణశక్తివల్ల గిరగిరా తిరిగే భూమితో పాటు మనం కూడా, మన ఇండ్లు – వాకిళ్ళుతోను, పిల్లా జిల్లాతోను, గొడ్డూ గోదలతోనూ, పొలం పుట్రలతోనూ, గిరగిరా నిరంతరం తిరుగుతూ వుంటున్నామంటే ఎవరైనా నమ్ముతారా? మనలను పిచ్చివాళ్లకింద లెక్కవేయరా?

ఇట్టి అతి విచిత్రమైన భూగోళాన్ని సృష్టించిన ఒక అద్భుతమైన శక్తి గలదని ఎక్కువమందికి నమ్మకం గలదు. ఆ శక్తి అనాదియైనది. సనాతనమైనది. ఆజన్మమైంది. అవినాశనమైంది. అంతటా వ్యాపించింది అని కొందరంటారు. ఆ శక్తినే ఎక్కువ మంది దేవుడు అనీ అంటారు. ఆ దేవుని మనం చూడలేమట, ఆ దేవుని మనం కనుగొనలేమట. ఆయన పరమాణువుకంటే కూడా మిక్కిలి చిన్నవాడట. సముద్రం కంటే కూడా మిక్కిలి పెద్దవాడట. ఆయన కాలానికి కూడా అందడట. ఇటువంటి రూపం లేని దేవుణ్ణి ఏదేని రూపంలేని వస్తువు ద్వారానే తెలిసికోగలమేమో నని కొందరంటారు. మంత్రాలతోనూ, తంత్రాలతోనూ, పూజలతోనూ, ప్రార్ధనలతోనూ, స్తోత్రాలతోను, నైవేద్యాలతోనూ, కానుకలతోనూ, వేదాధ్యయనంతోను, శాస్త్ర పాండిత్యంతోను, దేవుణ్ణి ఎవ్వడూ ఎన్నటికీ పొందలేడట. కానీ యీ పూజలు, యీ నైవేద్యాలు, యీ కానుకలు వగైరాలు పరాన్నభుక్కులైన కొంతమంది శ్రమ దొంగలు తమ భుక్తికై పన్నిన పన్నాగాలేనట.

దేవుడు ప్రతి ప్రాణిలోనూ వుంటున్నాడట. ప్రాణులన్నింటిలోనూ మానవుడు గొప్పవాడని శాస్త్రాలలో చెప్పబడింది. అంటే మానవుడు ఈశ్వరాంశము గలవాడట. అందువల్ల మానవుడు చిన్న ఈశ్వరుడేనట. ఈ చిన్న ఈశ్వరుడైన మానవుడు తన శరీరానికై తిండి, గుడ్డ, గూడు, లేక అనేక కష్టాలను అనుభవిస్తూ వుంటే ఆ చిన్న ఈశ్వరునికి సహాయం చేయకుండా ప్రాణంలేని రాతి విగ్రహానికి ఈశ్వరుడని పేరు పెట్టి దానికి తిండిని, గుడ్డని, గూడుని, నగలనీ చెప్పి పూజించుట చిన్న ఈశ్వరులమైన మనకు తగిన పనియేనా? నిజానికి చిన్న ఈశ్వరుడైన మానవుని కష్టాలనుండి కాపాడుటే సర్వ వ్యాపి యైన, అంతర్యామి యైన ఆ పెద్ద యీశ్వరుని సేవ చేయుటేనని పండితులు కొందరంటారు.

## 6.

దానము, ధర్మము, పుణ్యము, మొదలైనవి హిందూజాతి విశేష గుణాలుగా చాలాకాలంనుండి సమాజంలో వుంటూ ఉన్నాయి. కాని నేడు హిందువులనబడే వారిలో ఈ దానధర్మాలు, ఈ పుణ్యాలు వె(ఱ్రితలలు వేశాయి. (పనికిమాలినవిగా మారిపోయాయి). ఎందుకన హిందువులలో ఎక్కువమంది యోగ్యతాయోగ్యతలను విచారించకుండా కళ్ళు మూసుకొని బుద్ధిని మరుగుపరచి దానధర్మాలు చేయటం వల్ల హిందూసంఘంలో సోమరిపోతుల తెగ ఒకటి శరీరబలం, బుద్ధిబలం వున్నప్పటికీ ఈ అర్థంలేని దాన ధర్మాలకు అలవాటుపడి సంఘానికి (ప్రజలకు) భరింపరాని బరువైపోతున్నది. అందువల్ల సంఘంలో అవినీతి, అసత్యం, అత్యా చారాలు, మోసాలు వగైరాలు ఎక్కువైపోవుటేగాక, దేశం ఆర్థికంగాను. పారి శ్రామికంగాను దెబ్బతిని పోతున్నది. దీని కంతటికీ కారణం ఎవరికైనా దానం చేస్తే పుణ్యం కలుగుననే మూఢనమ్మకమే. ఈ మూఢనమ్మకాన్ని ఆధారంగా చేసికొని హిందువులలో కొందరు సోమరుపోతులై దానాలకు అలవాటుపడి సంఘానికి చీడపురుగుల్లా తయారై పోతున్నారు.

మన దేశంలో హిందువులలో అనేకమంది సాధువులు, సన్యాసులు, మహంతులు, పీఠాధిపతులు, మఠాధిపతులు, మండలేశ్వరులు, బాబాలు, అమ్మలు, యోగులు, వగైరాలు దాన ధర్మాల మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరందరూ ప్రజానీకాన్ని తమ భుక్తి (తిండి) కొరకు అనేక రకాలుగా పీడిస్తున్నారు. ఈ పరాన్న భుక్కులైన సాధువులు, సన్యాసులు, వగైరాలలో ఎక్కువ మంది ఒక చోట స్థిరంగా వుండక దేశం నలుమూలల తిరుగుతూ తమ తిండి, గుడ్డలకై ప్రజలను అనేక రకాలుగా పీడిస్తూ వుంటారు. చాలామంది సన్యాసులు తలా ఒక రాతి దేవతను

పెట్టుకొని దాని ద్వారా జీవిస్తూ ఉంటారు. *ఈ విధంగా మన దేశంలో నానాటికీ వర్షాకాలపు కప్పలవలె దేవుళ్ళ సంఖ్య పెరిగిపోతూనే వుంది.*

సాధువులలోనూ, సన్యాసులలోనూ అనేక రకాలవారు గలరు. కొందరు చిమటాను, జడలను ధరిస్తారు. కొందరు తాంబురులను వాయిస్తూ తిరుగుతూ వుంటారు. కొందరు అనేక రకాల చిత్రవిచిత్ర వేషాలు వేస్తూ తిరుగుతూ వుంటారు. కొందరు మానవ పుర్రెల దండను మెడలో ధరించి తిరుగుతూ వుంటారు. కొందరు దిగంబరులుగా (గుడ్డలు లేకుండా) గ్రామాలలో తిరుగుతూ భిక్షమడుక్కొంటూ వుంటారు. కొందరు లింగాన్ని (మగగుఱిని) ఇనుప రేకులతో గట్టిగా బిగించి తమను ఇంద్రియ నిగ్రహం గలవారమని (కామాన్ని వశపరచుకొన్న వారమని) చెప్పుకొంటూ తిరుగుతూ వుంటారు. కొందరు ఒక చేతిని కొన్ని సంవత్సరాలు పైకెత్తి వుంచుతూ తాము గొప్ప తపశ్శాలురమని చెప్పుకొంటూ ఎక్కువ దానాలను కోరుతూ వుంటారు. కొందరు లోతు నీళ్లల్లో నిలబడి జపం చేస్తున్నట్లు నటిస్తూ ఉంటారు. ఒంటికాలుమీద నిలబడి కొంగజపం చేస్తూ వుంటారు. కొందరు కాశీ కావడి అనే పేరుతో యింటింటికీ వెళ్ళి బిచ్చమెత్తుకుంటూ వుంటారు. వీరందరూ యిన్ని వేషాలు వేయటానికి ముఖ్యకారణం భుక్తియే. స్వాములవార్లు, గుసాయిలు, పీఠాధిపతులు, మఠాధిపతులు, వగైరాలు కూడా సన్యాసులలోని వారే. వీరికంటే గొప్ప సన్యాసులమని చెప్పుకొనే వారు కూడా వున్నారు. వారిని మహంతులు అంటారు. వారు ఏనుగులమీద ఎక్కి తిరుగుతూ భిక్షాటన (బిచ్చము) చేస్తూ వుంటారు. మరికొంతమంది సన్యాసులు పీఠాధిపతులమనే పేరుతో పల్లకీల మీద నుండి అడుక్కొంటూ ఉంటారు. కొంతమంది సన్యాసులను మండలేశ్వరులంటారు. వారు నాలుగైదు అంతస్థులుగల మేడలలో పట్టుపరుపులు, పట్టుదిండ్లు వగైరాల మీద శయనిస్తూ పట్టువస్త్రాలను ధరిస్తూ వుంటారు. వీరు మోటారు కార్లమీద నుండి బిచ్చమడుక్కుంటారు.

ఈ సాధువులు, సన్యాసులు, పీఠాధిపతులు, వగైరాలు తమ అవసరాలను, కోరికలను సామాన్య ప్రజలు నెరవేర్చని యెడల వారిని (ప్రజలను) శపిస్తామని భయపెట్టి తమకు కావలసిన సమస్త సామాగ్రిని, ధనాన్ని దౌర్జన్యంగా వసూలు చేసుకుంటూ బ్రతుకుతున్నారు.

ఈ సాధువులు, సన్యాసులు, మఠాధిపతులు, వగైరాలలో ఎక్కువ మంది జన్మగత బ్రాహ్మలే. ఎందుకన హిందూ సంఘంలో యిప్పటకి కూడా బ్రాహ్మణ సన్యాసులు, బ్రాహ్మణ సాధువులు, బ్రాహ్మణ మఠాధిపతులు అంటే గౌరవము, భక్తి భావము ప్రజలలోవుంది. తక్కిన కులాలకు చెందిన సన్యాసులు, సాధువులు వగైరాలకు హిందూ సంఘంలో ముఖ్యంగా పౌరోహిత బ్రాహ్మణ సంఘంలో గౌరవస్థానం లేనేలేదు.

ఈ సన్యాసులు, సాధువులు, మఠాధిపతులు, వగైరాలలో ఎక్కువ మంది పెండ్లి పేరంటం లేని బడుద్ధాయిలే. అందువల్ల వారిలో చాలమంది నడతలు చాల నీచంగా ఉంటాయి. వారి హృదయాలలో నీచ భావాలు, నోళ్ళలో శాపాలు, దూషణ వాక్యాలు, (తిట్లు) వుంటాయి. ఈ విధంగా హిందువులలో పరాన్నభుక్కులైన సాధువులు, సన్యాసులు వగైరాలు సామాన్య ప్రజలలోని ధర్మ భావాన్ని, పరోపకార బుద్ధిని, భక్తిభావాన్ని, అమాయకత్వాన్ని వుపయోగించుకొని అక్షరాల వారిని నిలువు దోపిడీ చేసిగాని వదలరు. అమాయకులైన సామాన్య ప్రజలు యీ స్వార్ధపరులైన సన్యాసుల కపటము, మోసము, పాపపు కోరికలను అర్థంచేసికోలేక నైతికంగాను, ఆర్థికంగాను పతనమైపోతున్నారు. (చెడిపోతున్నారు.)

ఈ సన్యాసులు, పీఠాధిపతులు, మహంతులు, వగైరాలు మత గ్రంథాలలో తమకు అనుకూలంగా ధర్మాలను వ్రాసుకొనిరి. అవి సామాన్య ప్రజలకు అర్థం కాని భాషలో వ్రాయబడ్డాయి. అలంకార భాషలో మాటల ఆడంబరంతో(డాబుతో) అవి వ్రాయబడ్డాయి. సామాన్య ప్రజలు తమ కష్టార్జితంలో కొంత భాగాన్ని సాధువులకు, సన్యాసులకు, మఠాధిపతులకు దానం చేసిన యెడల పుణ్యము కలుగునని ఆ గ్రంథాలలో వ్రాయబడ్డది. వాటిని చదువు సంధ్యలులేని అమాయక కష్టజీవులు నిజమని నమ్మి తమకష్టార్జితంలో కొంత భాగాన్ని దానంగా పరాన్న భుక్కులైన సాధువులు వగైరాలకు సమర్పించుకొని ఒక సోమరుపోతు వర్గాన్ని తయారు చేస్తున్నారు. ఈ బూటకపు సాధువులు సన్యాసులు మొదలైన వారు సామాన్య ప్రజల కష్టార్జితపు డబ్బుతో సుఖంగా జీవిస్తూ వుంటే, ఇటు పొద్దస్తమానం శరీరకష్టం చేసే కష్టజీవులైన కార్మిక, కర్షకులు, (రైతులు) చాలినంత తిండి, గుడ్డ, గూడు,

(ఇల్లు) చదువు, ఆరోగ్యము వగైరాలు లేక బాధపడుతూ, "మా ఖర్మ ఇంతే" ననే కర్మ సిద్ధాంతానికి కట్టుబడి ఉండేలాగున జన్మగత బ్రాహ్మణ పండితులు వగైరాలు వారికి (ప్రజలకు) బోధిస్తున్నారు. ఈ మత మోసగాళ్ళ బూటకపు మాటలకు సామాన్య ప్రజలు మోసపోవటానికి ముఖ్య కారణం ఒకటి గలదు. సామాన్య ప్రజానీకంలో ముఖ్యంగా శూద్రులలోనూ, పంచములలోనూ కొన్నివేల సంవత్సరాల నుండి మూఢాచారాలు, మూఢభక్తి నాటుకుపోయి, ఈ మూఢాచారాలకు మూల కారణం విద్యలేనితనమే(అవిద్య). చదువు లేనపుడు మానవులలో స్వతంత్ర ఆలోచనలు వుండజాలవు. అందుకై కొన్నివేల సంవత్సరాలనుండి శూద్రులు, పంచములు అనబడేవార్కి, చదువు సంధ్యలు లేకుండా చేసివేసి వారిని నేటికీ దైవం, మతం, కులం, పుణ్యము, మోక్షము అని చెప్పి ఆర్థికంగా దోచుకొని తినే వారలలో ఎక్కువ మంది జన్మగత బ్రాహ్మలే. శూద్రులనబడే కమ్మ, కాపు, వెలమ, రెడ్డి, రాజు, కుమ్మరి, చాకలి వగైరా వారిలో చదువు సంధ్యలు, డబ్బుగలవారు ఏ కొద్ది మందో వున్నప్పటికీ వారు కూడా సంఘానికి లొంగిపోయి సంఘాన్ని అనుసరించే నడుస్తున్నారు. కులాచారాలు, కుల కట్టుబాట్లు, సంఘాచారాలు, వారిని పెనవేసుకొని వున్నాయి. వాటిని ధిక్కరించుట పాపమనే భయం కూడ ఒక ప్రక్కన ప్రజానీకాన్ని లోకభీతితో పాటు పట్టి పీడిస్తున్నది. ఇపుడు ప్రజలలో మూఢాచారాలు, మూఢనమ్మకాలు, కుల, మత దురభిమానాలు పోవాలంటే ప్రజలలో విమర్శనాదృష్టి వుండాలి. విమర్శనా (ఆలోచనా) దృష్టి కలగాలంటే వారికి సరియైన విద్యావకాశాలు వుండాలి. కేవలం భుక్తి సంపాదనను నేర్పే విద్యేకాకుండా "నడతను" ఆత్మ విశ్వాసాన్ని "ఆత్మ గౌరవాన్ని" నేర్పే విద్య (చదువు) కూడా ఉండాలి. అంటే మానవునికి కర్తవ్యాలను నేర్పే విద్యతోపాటు అతనికి ఆత్మవిశ్వాసము (తనశక్తి మీద నమ్మకము) ఆత్మ గౌరవము) (తాను కూడా ఒక మనిషిననే భావము) మొదలైన వాటిని తెలిపే చదువు కూడా అవసరం. ఇట్టి అవకాశాలు ప్రజలందరికీ కలిగిననాడు, మతము, కులము, దేవుడు, తమకు ఎంతవరకు అవసరమో వారే నిర్ణయించుకో గలుగుతారు.

# 7

ప్రపంచంలో ప్రతి దేశంలోనూ ఏదో ఒక రూపంలో మూఢనమ్మకాలు, మూఢాచారాలు, ఈ రోదసీ యుగంలో కూడా వుంటూనే వున్నాయి. అందులో మన భారతదేశం సంగతి చెప్పనక్కరలేదు. నేడు మన స్వతంత్ర భారతదేశం మూఢ నమ్మకాలకు, మూఢాచారాలకు, విగ్రహారాధనకు పుట్టిల్లయిపోయింది. ఇక కపట దైవభక్తిలోనూ, కుటిల దేశభక్తిలోనూ, ధనకాంక్షలోనూ మన దేశానికి సాటివచ్చే దేశం ప్రపంచం మొత్తంలో ఎక్కడా లేనే లేదని చెప్పాలి. నేటి మన స్వతంత్ర భారత దేశంలో మూఢనమ్మకాలు, మూఢాచారాలు, చదువుకొన్న, చదువుకోని వారందరి లోనూ బాగా వ్యాపించి, నేడు అతి భయంకర రోగాలుగా మారిపోయాయి.

సామాన్య జనాన్ని మూఢ నమ్మకాలతో, మూఢ భక్తితో వెనక్కి మళ్లించడానికి కొంతమంది పరాన్నభుక్కులైన (ఇతరుల కష్టార్జితాన్ని తిని బతికేవారు) ఛాందస (పూర్వాచార) మత పిచ్చిగాండ్రు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. ఇటవంటి సంఘ విద్రోహులు (సంఘానికి కీడు చేయువారు), యిటువంటి సోంబేరులు నేడు గొప్ప దైవభక్తులుగాను, సంఘసంస్కర్తలుగాను చెలామణి కావడమే గొప్ప విచిత్రము.

భద్రాద్రి సీతారామ కళ్యాణాలు, తిరుపతి వెంకన్న బ్రహ్మోత్సవాలు, దేవుళ్ళకు తెప్పతిరునాళ్ళు, నదులులోను సముద్రాలలోనూ, వైకుంఠ ఏకాదశీ వగైరాల సందర్భంలో లక్షలాది యాత్రికులు స్నానాలు, పితృతర్పణాలు, (చచ్చినవారికి తిండి) కొత్త దేవాలయాల నిర్మాణాలు, పాత దేవాలయాలు, మసీదులు, చర్చిలు వగైరాల

మరమ్మత్తులు, మత సంబంధమైన సభలు, సమావేశాలు, మొదలైనవి, మతసంబంధం లేదని చెప్పే మన ప్రజాస్వామ్య ప్రభుత్వ నాయకుల సహాయము, ప్రోత్సాహాల ద్వారానే జరుగుతున్నాయి. అంటే మన రాజకీయ నాయకులు కూడా కపట దైవభక్తిని ప్రత్యక్షంగానో పరోక్షంగాను (చాటుగా) బలపరచి మూఢనమ్మకాలను, మూఢా చారాలను ప్రోత్సహిస్తున్నారన్నమాట.

మన దేశంలో కపట దైవభక్తి, కుటిల దేశభక్తి, మూఢాచారాలు నానాటికీ పెరిగి పోవటానికి గల ముఖ్యకారణం సామాన్య ప్రజల ఆలోచనాశక్తిని మూఢాచారాలు, మూఢ నమ్మకాలనే మరమేకులతో బంధించి ప్రభుత్వ అండను చూచుకొని కొంతమంది పూర్వాచార పరాయణులు మూఢాచారాన్ని, మూఢ నమ్మకాల్ని, కపట దైవభక్తిని పెద్ద ఎత్తున ప్రచారం సాగించారు. మూఢాచారాలను, మూఢనమ్మకాలను, కపట దైవ భక్తిని ప్రచారం చేయటానికి దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు వగైరాలు ఆధారంగా తీసుకోబడుతున్నాయి. అందుచేత మన దేశంలో దేవుని పేరిట కట్టబడిన ఆలయాలు చాలా గలవట. ఒక్క మన ఆంధ్రరాష్ట్రంలోనే 17 వేలకు మించి వున్నవట. ఒక్కొక్క దేవాలయానికి ఒక్కొక్క పూజారి తప్పక ఉండాలి. కాని కొన్ని దేవాలయాల్లో ఇంకా ఎక్కువ మంది పూజారు లుంటారు. తిరుపతి, శ్రీశైలం, భద్రాచలం మొదలయిన దేవాలయాల్లో వందల కొలది పూజారులు వుంటారట.

కొంతమంది పరాన్నభుక్కులైన మత పిచ్చగాళ్ళు కరువు నివారణకనీ, వానలు కురవటానికని, ప్రపంచ శాంతికనీ, చెప్పి ప్రజల నుండి డబ్బు, ధాన్యాదులు, నేయి వగైరాలను యజ్ఞాలు, వ్రతాలు, హోమాలు, వగైరాల పేరుతో వసూలు చేసుకొని తినివేస్తున్నారనుటకు అనేక నిదర్శనాలు వున్నాయి.

1971 డిశెంబరు 8 నుండి 72 జనవరి 21 వరకు కరువు పోగొట్టటానికని "కోటి కుంకుమార్చన మహారుద్ర శతచండీ యాగము" 50 వేల రూపాయల ఖర్చుతో జన్మగత బ్రాహ్మణ పురోహితులద్వారా కనకదుర్గ దేవాలయ ధర్మకర్తలు విజయవాడలో జరిపించారట. సర్వ ప్రపంచాన్ని రక్షించటానికి అవతరించిన దేవుడని చెప్పబడే తిరుపతి వెంకన్నకు 16 లక్షల రూపాయల ఖర్చుతో వజ్రాలతో నగలు

చేయించాలని గుడి ధర్మకర్తల బోర్డు నిర్ణయించిందట. పట్టెడన్నానికి నోచుకోలేక జనం అల్లల్లాడి పోతోంటేను, భరింపరాని బీదరికాన్ని అనుభవించలేక జనం ఆత్మహత్యలు చేసుకొంటుంటేను, మన దేవాలయ ధర్మాదాయ శాఖ వారు తిరుపతి వెంకన్నకు నగలు చేయిస్తూ, పడిపోయిన గోపురాలను తిరిగి లేపేందుకు కార్మిక కర్షకుల కష్టార్జితపు కోట్లకొలది రూపాయలను దుబారా చేసివేస్తున్నారు. పుణ్యభూమి అని పేరు గాంచిన మన భారత దేశంలో కూడు, గూడు, గుడ్డలేని బీదప్రజలకు దేవుడు "ఆత్మహత్య" రూపంలో ప్రత్యక్షమగుచున్నాడు. 1971 ఫిబ్రవరి నెలలో రూ.40 లక్షల ఖర్చుతో ఢిల్లీలోని రామకృష్ణపురంలో "సుబ్రహ్మణ్యేశ్వరస్వామి" (అనార్యుల దేవతయైన) దేవాలయం మొదటి ఘట్టం పూర్తయ్యిందట. దానిని పూర్తిగా కట్టడానికి ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టబడునట.

1971 లోనే నాసిక్‌లో (మహారాష్ట్రలో) 45 లక్షల రూపాలయ ఖర్చుతో ఒక దేవాలయం నిర్మింపబడినదట. 1974 లో గుజరాత్‌లో సోమనాథ్ దేవాలయానికి 5 లక్షల రూపాయలతో "దిగ్విజయ ద్వారం" నిర్మించబడినదట, ఈ ఆలయము యొక్క ఆవరణలోనే 80 లక్షల రూపాయల ఖర్చుతో "నర్తనశాల" (డాన్సు హాల్) నిర్మింపబడిందట.

మధుర మీనాక్షి ఆలయంయొక్క గర్భ గుడిలో పూజలు చేయించే పూజారులకు చెమట పోయకుండా వుంటానికని గర్భగుడి మొత్తానికి "ఎయిర్ కండీషన్ "యేర్పాటు చేయబడినదట.

కేరళ రాష్ట్రంలో గురువాయూర్‌లో గల శ్రీకృష్ణుని ఆలయ గర్భ గుడి మొత్తానికి 50 లక్షల రూపాయల ఖర్చుతో బంగారపు పూత పూయించేందుకు యత్నాలు జరుగుతున్నాయట. 1976 లో హైదరాబాద్‌లో (ఆంధ్రరాష్ట్రంలో) 1000 టన్నుల పాల రాళ్ళను 50 లక్షల రూపాయలకు కొని "వేంకటేశ్వర" ఆలయము నిర్మింపబడినదట. విగ్రహాలకు, నగలు నట్రకు యింకెన్ని కోట్ల రూపాయలు ఖర్చుగునో ఆ వెంకన్నకే తెలియాలట. 1978 ఫిబ్రవరి 14 నుండి 20 వ తేదీవరకు అహమదాబాద్‌లో సబర్మతి నది ఒడ్డున "గాయత్రీ" యజ్ఞము ప్రపంచ శాంతి కనియు, ప్రపంచ ప్రజలలో ద్వేషాలు, క్రోధాలు, మోసాలు, యుద్ధాలు లేకుండా

చేయడానికని జరుపబడెనట. దీనిని జరపడానికి 7 వేల మంది వేద పండితులని చెప్పబడే జన్మగత బ్రాహ్మలు 24 కోట్ల సార్లు “గాయత్రీ మంత్రం” జపించి 7 వేల అగ్ని గుంటలలో 32 వేల కిలోల నెయ్యి, 50 వేల లీటర్ల పాలు, (నెయ్యి, పాలు, ఆవులవో, గేదెలవో తెలిసికోవలసిన అవసరంలేదు, కాని ఆవులవని ఎవరైనా చెప్పితే చాలు, కాకపోయినా పరవాలేదు. ఎందుకంటే అలా అబద్ధం చెప్పిన వారికే పాపం తగులుతుందిగాని ఉపయోగించిన వారికి పాపం తగులదట). 250 క్వింటాళ్ళ బియ్యం 250 క్వింటాళ్ళ నూనె, యింకా యితర ధాన్యాలు, కొన్ని వేల టన్నుల వంటచెరకు (కట్టెలు) వగైరాలు బుగ్గిపాలు చేసివేశారట. 7 వేలమంది జన్మగత బ్రాహ్మలు వేదపండితులని చెప్పబడే వారే గాక యింకా అనేక వేల మంది జన్మగత బ్రాహ్మలు, ఒక వారం రోజుల పాటు ముప్పొద్దుల తృప్తిగా సమస్త పిండివంటలతో భోంచేసి 8 లక్షల రూపాయలను దక్షిణ రూపంలో పొందిరట. ఈ యజ్ఞం చేయించిన జన్మగత బ్రాహ్మణ స్వాముల వారి ఆశీర్వచనాన్ని మన జనతా ప్రభుత్వపు విదేశాంగ మంత్రియైన శ్రీ వాజ్‌పాయ్, ఆరోగ్యశాఖామాత్యుడైన శ్రీ రాజనారాయణ పొంది తరించారట. ఈ యజ్ఞానికి ఒకకోటి రూపాయలు ఖర్చయిందట.

ఈ మహాయజ్ఞానికి కొన్ని నెలల పూర్వమే ఈ సబర్మతీ నది ఒడ్డునే “సాకేత యజ్ఞము” నకై 25 లక్షల రూపాయలు ఖర్చయ్యేనట. దానికి కూడా వేల కొలది జన్మగత బ్రాహ్మణులు హాజరై ఒక వారం రోజుల పాటు మూడు పూటలా తనివితీరా భోంచేసి చివర రోజున కొన్ని నెలలకు సరిపోయే భోజన సామాగ్రిని, కొన్ని వేల రూపాయల దక్షిణలు పట్టుకొని పోయిరట.

మన స్వతంత్ర భారతదేశంలో నేటికీ కొన్ని ప్రాంతాలలో కప్పలను ఊరేగించిన వానలు కురియునని నమ్మేవారి సంఖ్య చాల ఎక్కువగా కన్పిస్తున్నది. ఇటువంటి మూఢ నమ్మకాలకు శాస్త్రాధారాలు గలవని కొంతమంది స్వార్థపరులైన జన్మగత బ్రాహ్మణ పండితులు చెప్పుతారట.

ఈ మూఢాచారాల్ని, మూఢనమ్మకాల్ని, కపట దైవభక్తిని, కుటిల దేశభక్తిని ఆధారంగా చేసుకొని పౌరోహితులు, పూజారులు, సిద్ధాంతులు, వేదాంతులు, పీఠాధిపతులు, మఠాధిపతులు, మహంతులు, మండలేశ్వరులు, బాబాలు, యోగులు,

సాధువులు, సన్యాసులు, అమ్మలు, బిచ్చగాంఁడ్రు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, వ్యాపారస్థులు, వగైరాలు సామాన్య ప్రజల కాయకష్టాన్నే కాకుండా వారి బుద్ధిని కూడా దోచుకొనుచూ వారిని మూర్ఖులుగా చేసివేస్తున్నారు.

సామన్య ప్రజలు బౌద్ధికంగా యింతగా దిగజారి పోవటానికి మొదటి కారణం, వారికి మొదటి నుండి అనగా కొన్ని వేల సంవత్సరాల నుండి విద్యాభ్యాసానికి అవకాశాల్లేకుండా చేయబడెనట. రెండవ కారణం ప్రజలలో స్వతంత్ర ఆలోచనాశక్తి కలుగకుండా చేసి వారిలో మూఢాచారాలు, మూఢనమ్మకాలు, మూఢదైవభక్తి తగ్గకుండా వుంచటానికి పూజారులు, పౌరోహితులు, పండితులు, సిద్ధాంతులు, వగైరాలతోపాటు తీర్ధస్నానాలు, దేవాలయాలు, భజన సమాజాలు, వేదాంత గోష్ఠులు, పురాణ కాలక్షేపాలు, రేడియో కేంద్రాలు, విద్యాలయాలు, ప్రభుత్వము వగైరాలే నిరంతరం యత్నిస్తున్నాయి. ఇంతే కాకుండా ఈ సంస్థలో పనిచేసే వారలలో ఎక్కువమంది జన్మగత బ్రాహ్మలే నియమింపబడుట గమనించవలసిన విషయం.

ఈ కాలంలో జన్మగత బ్రాహ్మలలో నూటికి 99 మంది దేవుణ్ణి, దేవాలయాలను తమ సొంత సొత్తుగా భావించి దేవుని మీద, దేవాలయాల మీద ఈగను కూడా వాలనివ్వరు. ఇదంతా వారు దేవుని మీద, దేవాలయాల మీద నిజమైన భక్తితో చేస్తున్నారనుకోకండి. దేవుడు, దేవాలయాలు, అను పేరుతో వారి కులంవారు ఎక్కువ మంది జీవిస్తున్నారన్న సంగతి వారికి (బ్రాహ్మలకు ) తెలుసు. అందువల్ల వారు కొంతమంది తమ కులస్థుల భుక్తికి ఆధారభూతమైన దేవుణ్ణి, దేవాలయాలను చూస్తూ చూస్తు వదలుకోగలరా? నేడు తమ సర్వస్వమునైనా ఒడ్డి దేవుణ్ణి, దేవాలయాలను రక్షించి తమ కులం వార్కి మేలు చేయ ప్రయత్నించి తీరుతారు. ఇంతేకాదు, యిందుకై (దేవుని, దేవాలయాలను రక్షించటానికై) సత్యాన్ని, అహింసను, వేదాలను, నీతినియమాలను వదలుకోవలసి వచ్చినా వెనుకాడరు. ఈ నీతిని నియమాలు వగైరాలను తుంగలో తొక్కి తమ కులం వారి భుక్తికి (తిండికి) ఆధారభూతమైన దేవుణ్ణి, దేవాలయాలను తప్పక రక్షించి తీరుతారు.

సంఘంలో యిటువంటి కులతత్వము, మతతత్వము, కపట దైవభక్తి,

కుటిల దేశభక్తి, విద్య, దనం, అహంకారాలు, మూఢాచారాలు వగైరాలు ఉన్నంతవరకు హిందూసఘం బాగుపడుట కల్ల. ఈ కులతత్వము, మతతత్వము, శారీరక సోమరితనము, సాంఘిక అసమానతలు నిర్మూలింపబడ నంతవరకు హిందూదేశం వృద్ధిచెందజాలదు.

## 8

అకారం లేని దేవునికి ఆకారం కల్పించి ఆయనకు గుడి కట్టించి ఆయనకు పూజలు, నైవేద్యాలు అనే నెపంతో దైవారాధనను కూడా ఒక వ్యాపారంగా కొంతమంది స్వార్ధపరులు చేసివేశారు. రహదారికి అడ్డంగా నాలుగు ఇటుకలు పేర్చి కొన్ని పూవులు, పత్రి (ఆకులు) పడేస్తే చాలు! ఆ వైపుకు కన్నెత్తి చూసి ప్రజలకు అడ్డంగా వుందని అనేదమ్ము (ధైర్యం) మన ప్రజా ప్రభుత్వాలమని చెప్పుకొనే జనతా, కాంగ్రెసు ప్రభుత్వాలకు అసలే లేదు. ఇక్కడ నడిబజారులో గుడి ఏమిటి? కాస్త పక్కన ఏర్పాటు చేసుకోకూడదా? అన్న వాళ్ళందరకు నాస్తికత్వ (దేవుడు లేడనే) ముద్ర వేసి దైవ ద్రోహులంటూ విరుచుకు పడతారు. పూర్వాచారపరాయణులైన ప్రజలు ప్రజా నాయకులను కొనే దొంగ రాజకీయవేత్తలు, దైవంపేర వచ్చే కానుకలను కాజేస్తూ నైవేద్యాలను నాకివేసే పూజారులు.

చిన్నతనంలో దారితప్పి చదువు సంధ్యలు వంటబట్టక, శరీర పరిశ్రమకు దొంగలై దేశం మీద బడిన బాబాలు, సన్యాసులు, సాధువులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, మహంతులు, యోగులు, కపట దైవ విశ్వాసాన్ని, మూఢభక్తిని తమ

స్వార్ధానికి (సొంత లాభానికి) వాడుకుంటూ రాజభోగాలు అనుభవిస్తున్నారు. ఇలాంటి కపట సన్యాసుల్లో ధీరేంద్ర బ్రహ్మచారి, పుట్టపర్తి శాయిబాబా లాంటి వాళ్ళు ప్రజలనేకాక, ప్రభుత్వ అధినేతలనబడే వారిని కూడా (గొప్ప గొప్ప నాయకులను కూడా) తమ శిష్యులుగా చేసికొని కోటలో పాగా వేస్తున్నారు. అనేక అక్రమ మార్గాలలో ప్రజలను కొల్లగొట్టి కోట్లకు పడగలెత్తిన కుబేరులు  కోట్ల రూపాయల ఖర్చుతో మందిరాలు, ఆశ్రమాలు, నిర్మిస్తున్నారు. ఇందులో కూడా కావలసినన్ని వ్యాపార రహస్యాలున్నాయి. ఈ వ్యాపారాన్ని- యీ దైవ వ్యాపారాన్ని కూడా లాభసాటిగా నడపగల శక్తి సామర్ధ్యాలు ఈ సన్యాసులకు వున్నాయనడంలో సందేహం లేదు. ఒక రాతి ముక్కను గాని ఒక రాగి ముక్కను గాని దేవునిగా చేసి చలవరాతితో దేవుని భక్తికి అందమైన సమాధి కట్టి ప్రజల నమ్మకాన్ని వుపయోగించుకొని లక్షలు కోట్లు ఆర్జించడం జరిగిపోతుంది. పాపభీతి వున్న జనం తాము పరమ పవిత్ర మైనవని నమ్ముకున్న తీర్థాలకు (యాత్ర స్థలాలకు) యాత్రలకు వెళ్ళితే అక్కడ తారసిల్లేదెవరు? బిచ్చగాళ్ళు, బ్రహ్మచారులైన సన్యాసులు, దేశదిమ్మర్లు, మాత్రమే కాదు. ఇలాంటి వాళ్లకు తోడుగా దొంగలు, వ్యభిచారులు, మోసగాళ్ళు అక్కడ అడ్డా జమాయించి (స్థిరవాసం యేర్పాటు చేసుకొని) వుంటారు. వారు ప్రజలలోని మూఢ దైవభక్తిని అమాయకత్వాన్ని వుపయోగించుకొని వారిని (ప్రజలను) అక్షరాలా నిలువు దోపిడీ చేసివదులుతారు.

పురాతన ఆచార, సంప్రదాయాలు, మూఢనమ్మకాలు, యింకా బలీయంగా వున్న ఉత్తర భారతదేశంలో యే తీర్థస్థానం చూసినా, పచ్చి స్వార్ధపరులైన హృదయం (జాలి) లేని పండాల (పూజారుల) భండరియాల (పండాలకు యాత్రికులను తీసుకొని వెళ్ళి అప్పగించుతారట) తండాలు (గుంపులు) గుండాల్లగ (దుర్మార్గుల్లాగా) వ్యవహరిస్తూ యాత్రికుల్ని నానా విధాలా డబ్బుకై పీడిస్తున్న దృశ్యాలు కనిపిస్తాయి. కాశీ, ప్రయాగ, గయా, పూరీ, జగన్నాధం వంటి పుణ్యక్షేత్రాలు అనబడే కేంద్రాలలో ఈ దేవుని ప్రతినిధులు (పండాలు, పూజారులు, భండరియాలు) చేయు మోసము, దౌర్జన్యం గురించి ఎన్నో ఘటనలు (జరిగిన పనులు) గలవు.

భగవంతుని "ప్రసాదం" అనే పేరుతో కంట్రాక్టర్లు సప్లయిచేసిన నాసిరకం బియ్యాన్ని ఉడికించి ఈగలు ముసురుతూ అసహ్యంగా, అనారోగ్యకరంగా వున్నా

ఆ వంటకాన్ని (కూడును) విపరీతమైన ధరకు అమ్మి భక్తులకు రోగాలను, తమకు భోగాలనూ పూజారులు, మహంతులు పండాలు పంపకం చేస్తూవుంటారు.

ఒక వైపున కోట్లాది జనం "ఆకలో రామచంద్రా" అంటూ ఆక్రందిస్తూ (ఏడుస్తూ) వుంటే, పాలు, నెయ్యి, బియ్యం, గోధుమలు, నూనె, వగైరా వేలకొలది టన్నుల ఆహార పదార్థాలను యజ్ఞ యాగాదుల పేరిట బుగ్గిచేయడం (బూడిదచేయటం) జరిగిపోతోంది. ఈ యాగాలతో ప్రపంచ శాంతిని, జగత్కళ్యాణాన్ని (మేలును) సాధిస్తాంను. సుష్టుగా (బాగా) ముప్పూటలా ఆరగించే మహనీయులు సెలవిస్తున్నారు. ఈ దుబారా ఖర్చును అరికట్టడానికి (అడ్డగించడానికి) బదులు, సెక్యులర్ డెమొక్రసీ (మత సంబంధంలేని లౌకిక ప్రజాస్వామ్యమును) అనుసరిస్తా మంటున్న మన ప్రభుత్వ పాలకులు, ఇంకా ప్రోత్సహిస్తూ తమను గొప్ప దైవభక్తులని ప్రజలు అనుకొనేటట్లుగా నటిస్తున్నారు.

పోనీ ఈ యజ్ఞాలద్వారా, ఈ దైవ ఉత్సవాల ద్వారా, ఈ దేవాలయాలలోని పూజలద్వారా, ఈ రామకోటి ఉత్సవాలద్వారా, ఈ బాబాల బోధలద్వారా, ఈ దైవ భజనలద్వారా, ఈ వేదాంత గోష్ఠులద్వారా, దేశంలో వ్యాపారాలద్వారా, ఈ స్వాముల ద్వారా, గురోపదేశాలద్వారా, దేశంలో కరువులు కాటకాలు, వరదలు, ఉప్పెనలు, దారిద్ర్యం వగైరా బాధలను పోగొడతారంటే, అది సాధ్యం కాని పని అనిన్నీ, ఆ కష్టాలన్నీ "పైవాడి (దేవుడి) లీలలనీ" (ఆటలనీ) చెబుతారు. పొట్టనిండా భోంచేసే పండితవరేణ్యులు (పూజ్యులైన పండితులు) ఈ రకపు బూటకపు జీవితాలను గడుపుకొనుచున్న పండితులు, పూజారులు, పౌరోహితులు వగైరాల బారినుండి (హింసనుండి) సామాన్య ప్రజానీకం ఏనాటికైనా తప్పించుకోవటానికి ప్రయత్నించి తీరుతుంది.

# 9

ఒక రాతి ముక్కకు దేవుడని పేరు పెట్టి దానిపేర వచ్చే కానుకలు, ముడుపులు, దానాలు, భిక్షలు, నైవేద్యాలు వగైరాలతో జీవించే పూజారులు, పౌరోహితులు, పండితులు, సన్యాసులు వగైరాలు మన దేశంలో కోట్లకొలది మంది గలరట. వారంతా దేవాలయాలను, మఠాలను, ఆశ్రమాలను, తీర్థస్థానాలను, ఆశ్రయించుకొని బ్రతుకుతున్నారట. పనీ పాటలు చేయని ఇటువంటి సోంబేరులలో చాల మంది జన్మగత బ్రాహ్మణ బ్రహ్మచారులేనట. వారంతా అమాయక ప్రజలను దేవుడు, పుణ్యము అనే నెపంతో మోసగించి వారి (ప్రజల) కష్టార్జితాన్ని అనుభవిస్తూ హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. మతాన్ని, దేవుణ్ణి అడ్డుపెట్టుకొని ధనాన్ని సంపాదించుకొనుచున్న కొంతమంది మంత్రులు, పరాన్నభుక్కులైన పూజారుల, పౌరోహితుల, పండితుల, సిద్ధాంతుల ఆశీస్సులు, పొగడ్తలు పొందటానికో అన్నట్లు దేవాలయాల ఆదాయంలో ఎక్కువ భాగం యికనుండి విద్యాలయాలకు, పుస్తకాలయాలకు ఖర్చుపెట్టక సామాన్య ప్రజలలో దైవ భక్తిని, ఆధ్యాత్మిక చింతన (దేవుని గురించిన ఆలోచనలను) ఎక్కువ చేయడానికి మాత్రమే ఖర్చుచేయాలని శాసించెదమని ఇటీవల కాలంలో సెలవిచ్చారు. కాని దేశంలోని దరిద్రమనే నిప్పును ఆధ్యాత్మిక చింతనమనే నీళ్ళతో ఆర్పాలన్నది నిరుద్యోగులైన (పనిలేని) కొంతమంది జన్మగత బ్రాహ్మణ పండితులకు మాత్రం పనిని కల్పించాలనే దురాలోచనో లేక దూరాలోచనో మంత్రివరేణ్యులే సెలవివ్వాలి.

దేశంలో లక్షలాది మంది యువకులు, యువతులు ఉద్యోగాలు (పనులు) లేకను, కోట్లకొలది బీద ప్రజలు తలదాచుకోడానికి కూడా కొంపలు లేకను, కోట్ల కొలది కూలిచేసుకుని బ్రతికే బీదలు, రోజుకు ఒక సారైనా కడుపు నింపుకునే

దారిలేకను, కోట్లకొలది బీదలు మొలచుట్టూ చుట్టుకోవడానికి చాలినంత గుడ్డలేక అనేక ఇబ్బందులు పడతూవుంటే, ఆధ్యాత్మిక చింతన, దైవారాధన, (పూజ) యజ్ఞాలు, కొత్త దేవాలయాలు, మసీదులు, చర్చిలు, రాజమందిరాలు, మొదలైనవాటి నిర్మాణాలు, పాడుపడిన గుళ్ళు గోపురాల మరమ్మతులు చేయడానికి ప్రజల కష్టార్జితపు డబ్బును, అంటే ప్రజల నెత్తుర్ని ఖర్చుపెట్టాలని చెప్పే మంత్రులను ఏమనాలో వారు నమ్మే రాతిదేవుళ్లే చెప్పాలి.

ఆధ్యాత్మిక చింతన దైవపూజ, దైవభక్తి, యజ్ఞాలు, సీతాకళ్యాణాలు, రామకోటి ఉత్సవాలు, గీతోపన్యాసాలు, వేదాంత సభలు జరిపితే ప్రజల బీదరికం, నిరుద్యోగ సమస్య, నిరక్షరాస్యత (చదువులేనితనము) రోగాలు, ద్వేషాలు, అసమానతలు (హెచ్చుతగ్గులు) మోసాలు, హింసలు తొలగిపోగలవా? బీదల కష్టాలు తీరగలవా? లేక మన ఖర్మ యింతే! అన్న చైతన్యరహితమైన (ప్రాణంలేని) నిరాశా నిస్పృహ స్థితిలోనికి (ఆశలేని స్థితిలోనికి) అమాయక బీద ప్రజలను నెట్టటానికి యిదొక పన్నాగము కాదుకగా? మన ప్రజాప్రభుత్వ పరిపాలకులలో ఎక్కువమంది హిందువులే. వారిలో ఎక్కువ మంది కులానికి మతానికి అమ్ముడుబోయిన వారే. వారికి తరతరాలనుండి (అనేక వంశాలనుండి) ఉగ్గుపాలతో రంగరించి పోసిన కులం, మతం మత్తుమందులు వారి నరనరాలలోనూ జీర్ణించి వున్నందున వారికి తమ హిందూమతం మీద ఏమాత్రమైనా ఎక్కువ అభిమానం ఉండితీరుతుంది. అందువల్లనే ప్రభుత్వం యొక్క ఏ క్రొత్తపనినైనా మొదలు పెట్టాలంటే తప్పనిసరిగా వేదమంత్రాలు మాత్రం ఉండి తీరాలి. అందులో కూడా, కుల మత తత్వాలు (భావాలు) పరోక్షంగా (కనిపించకుండా) పనిచేస్తున్నాయన్నమాట! ఈ వైదిక తంతువలన కొంతమంది జన్మగత బ్రాహ్మణ పండితులనబడేవారు ఆర్థిక లాభంతో పాటు సంఘంలో గౌరవస్థానం సంపాదించుకో గలుగుతున్నారు.

నేడు మన స్వతంత్ర భారతదేశంలో వారఫలాలు, వర్జ్యం, వారం, తిథి, లగ్నం మొదలైన మూఢనమ్మకాలు, మూఢాచారాలు రోజురోజుకూ ఎక్కువై పోతున్నాయి. ధనవంతుల్ని, చదువుకొన్న వారిని చూచి తిండి గుడ్డ కొంప సరిగాలేని బీదప్రజలలో కూడా ఈ మూఢనమ్మకాలు, ఈ మూఢాచారాలు, ఈ మూఢ దైవభక్తి

ఎక్కువై పోతున్నాయి. ఎందుకంటే వారు (బీద ప్రజలు) వీటివల్ల నైనా తమ కష్టాలు తీరునేమోననే భ్రమలో పడిపోతున్నారు.

ఈ వారఫలాలు, వర్జ్యం, వారం తిథి, లగ్నం వగైరాలు నిర్ణయించి చెప్పేవారు వ్రాసేవారు, ప్రచారం చేసేవారు ఎక్కువగా జన్మగత బ్రాహ్మణ పండితులే. ఈ పండితులమని చెప్పుకొనే జన్మగత బ్రాహ్మలలో చాలమంది ఆర్థికంగానే గాక, నైతికంగాకూడా చాల పతనమై (చెడి) పోయారనుటలో అసత్యమేమీలేదు.

నేడు మన భారతదేశంలో సామాన్య ప్రజానీకాన్ని సరియైన తోవను నడిపించగల, నీతిగల నిస్వార్ధపరులైన (సొంతలాభము మాత్రమే కోరనివారు) నాయకులేరి? దైవం ఒకడున్నాడు వాడు మానవులుచేయు తప్పులకై వారిని శిక్షించును. కనుక మానవులమైన మనం తప్పులు చేయకూడదని చెప్పే మతబోధకులే తప్పులు చేయచుండుట మనం చూస్తున్నాము. పైకి ప్రార్ధనలు, పూజలు స్తోత్రాలు చేయువారలలో నూటికి ఒక్కరు కూడా నిజం పలుకనే పలుకరు గదా! పైపెచ్చు నిజం చెప్పేవార్కి ఈ కాలంలో కూడున్నదా? అనే వాడుక మాటను చెప్పి తప్పించుకొని అబద్ధమాడేవారే ఎక్కువమంది కన్పిస్తున్నారు. ఎక్కువ మంది మనసులో ఒక ఆలోచన, నోటితో చెప్పేది మరొకటి, చేతితో చేసేది ఇంకొకటిగా ప్రవర్తిస్తున్నారు. అందువల్ల వారిని ఆదర్శంగా తీసుకొని సామాన్య ప్రజలు కూడా కపటంతోనే నడుచు కొంటున్నారు. అందువల్ల సంఘం అనేక దుర్గుణాలకు కేంద్రమైపోయింది. ముఖ్యంగా మన హిందూ సంఘం యింతగా దిగజారి, కలుషితమై పోవటానికి ఎక్కువ బాధ్యులు చదువు సంధ్యలు, ధనం గల ద్విజులు, ద్విజేతరులే. (బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య శూద్రులే). కనుక ముందు వీరందరూ నైతికంగా బాగుపడితే అంటే వీరంతా నీతినియమాలతో నడిస్తే తక్కిన అమాయక ప్రజలు చాల తేలికగా బాగుపడగల రనుటలో సందేహములేదు. సంఘం బాగు పడాలంటే మన రాజకీయ పరిస్థితులు కూడా అనుకూలంగా వుండాలి. రాజకీయ పరిస్థితులు అనుకూలంగా వుండాలంటే మన నైతిక సాంఘిక పరిస్థితులు బాగుపడాలి. కానీ నేడు మన నైతిక పరిస్థితులు ఎంతగా దిగజారిపోయాయంటే మనం చేయవలసిన ఏ పనికి కూడా సత్యము, న్యాయము, నీతి మొదలైన మంచి గుణాలతో పనేలేదు. నేడు బుద్ధుడు,

గాంధీ పుట్టిన దేశంలో, అడుగడుగునా గుళ్ళు, గోపురాలు, అణువణువునా నైతిక చింతన వుంటున్న పవిత్ర భూమిలో మాటలకూ  చేతలకూ (పనులకు) మధ్యవున్న వైరుధ్యం (వ్యతిరేకత) ఈ సమస్త ప్రపంచలో ఎక్కడా లేదని చెప్పుట అసత్యం కానేరదు. మన భారతదేశంలో వున్నన్ని రాజకీయ పార్టీలు, కులాలు, ఉపకులాలు, మతాలు, మతసంప్రదాయాలు, వేదాంత సాంప్రదాయాలు, దేవుళ్ళు, దేవాలయాలు, సన్యాసులు, ఫకీర్లు, బైరాగులు, యోగులు, బిచ్చగాళ్ళు, మఠాలు, మసీదులు, పీఠాలు, ఆశ్రమాలు, సత్రవులు, ప్రపంచంలో మరే దేశంలోనూ లేనేలేవు. ఇన్ని కులాలు, ఇన్ని మతాలు, ఇన్ని మత సంప్రదాయాలు, ఇంత మంది దేవుళ్ళు, దేవతలు, ఇన్ని రాజకీయ పార్టీలు, ఇన్ని మూఢాచారాలు, మూఢ నమ్మకాలు, ఇంత కపట దైవభక్తి, యింత కుటిల రాజనీతి, ఇంత ఆర్థిక దోపిడీ వగైరా వగైరాలు గల మనదేశంలో ప్రజాస్వామ్య సిద్ధాంతం తూ.చా. తప్పకుండా అమలు జరగాలంటే ఎన్నియుగాలు పట్టునో ఎవరు చెప్పగలరు?

# 10

దేవుళ్లు, దైవపూజలు, దేవుని ఉత్సవాలు, కొత్తదేవాలయాల నిర్మాణాలు వేదండితులకు సన్మానాలు, వేదాంత గోష్టులు, గీతోపన్యాసాలు, రామకోటి ఉత్సవాలు, తీర్థయాత్రలు వగైరా పనులు చేయటంలో మన ఆంధ్రప్రాంతానిదే అన్నిటికంటే పైచేయి. ఈ పనులను నిర్వహించాలంటే డబ్బు ముఖ్యం.

మన దేశం రాజకీయంగా స్వతంత్ర మైనప్పటినుండి మన ఆధ్రప్రాంతంలో

మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, వడ్డీ వ్యాపారులు, రాజకీయ నాయకులనబడే దేశభక్తులు ఆర్థికంగా ఎంతో బాగుపడ్డారు. పడుతున్నారు. నేడు వారివద్ద నల్లడబ్బు (అక్రమ పద్ధతులతో సంపాదించిన డబ్బు) కుప్పలు కుప్పలుగా పోగుపడింది. దానిని రక్షించుకోటానికై వారు దైవపూజలు, సత్యనారాయణ వ్రతాలు, తీర్థయాత్రలు, కొత్తదేవాలయాల నిర్మాణాలకు, యజ్ఞయాగాదులకు తమ అక్రమ సంపాదనలోనుంచి కొంతభాగాన్ని ఖర్చుపెట్టి తాము నిష్పాపులం, (తప్పు చేయని వారము) నిర్దోషులము అయినామని తృప్తిపడుచున్నారు. కాని నిజానికి సంఘాన్ని బీద శ్రమజీవులను ఆర్థికంగా పట్టపగలే దోపిడీ చేస్తున్న ఈ సంఘ విద్రోహులకు ఎప్పటికైనా సంఘం (బీద ప్రజానీకం) శాస్తి (శిక్ష) చేసి తీరుతుంది.

నల్ల డబ్బు కానుకల రూపంగా బహిరంగంగాను, చాటుగాను కోకొల్లలుగా వస్తున్నందున "తిరుపతి వెంకన్న" భూలోక కుబేరుడైపోయి దేవతలందరిలోనూ గొప్ప మహిమగల దేవుడుగా కొనియాడబడుతున్నాడు. ఇంతేకాదు. సదరు వెంకన్న ఆదాయం రోజు రోజుకూ పెరుగుతూనే ఉంటున్నది. ఆదాయం పెరిగే కొద్దీ వెంకన్న మహిమ కూడా పెరుగుతున్నదని పరాన్నభుక్కులయిన పూజారులు, పండితులు, చెప్పుతూ ఆయనను స్తోత్రం చేస్తున్నారు. అంటే వెంకన్న మహిమ, గౌరవము వెంకన్న ఆదాయం మీదనే ఆధారపడివున్నవిగా కన్పిస్తున్నది గానీ వెంకన్న శక్తిమీద కాదని రుజువగుచున్నది. పాపం నిజానికి వెంకన్న నోరూవాయీలేని ఒక ప్రాణం లేని రాతి ముక్కేగా! అయినప్పుడు ఆయన విగ్రహంలో ఏమిశక్తి వుండగలదు? కాని పరాన్నభుక్కులైన పూజారులు, పండితులు, దొంగ దైవభక్తులు వగైరాల చేతుల్లో పాపం ఆయన ఒక కీలుబొమ్మ మాత్రమే. వెంకన్న యొక్క యీ బూటకపు మహిమ ముందు భద్రాచలం శ్రీరామచంద్రుడంతటి గొప్ప మహిమగల దేవుడు కూడా సోదిలో కూడా లేకుండా పోయాడు. ఇంతేకాదు వెంకన్న యీ బూటకపు మహిమ మన దేశంతోనే ఆగక వేల మైళ్ళ దూరాన గల తెల్లోళ్ళ దేశాలవరకు పాకిపోయింది. ఆ దేశాలలో వెంకన్న భక్తులు వెంకన్నకు ఆయన డబ్బుతోనే గుళ్ళు కట్టించి ఆయన ప్రతిమలకు (విగ్రహాలకు) పూజలు చేయటానికి మన దేశంనుండి శ్రద్ధ ఛాందస జన్మగత బ్రాహ్మణ పూజారులను ఎగుమతి చేస్తున్నారట. ఇంకను అచ్చట

దేవాలయాలను తెరవటానికి వెంకన్న మన ఆంధ్రుల యిష్టదేవుడు యగుటవల్ల మన ఆంధ్రప్రాంతపు కొంతమంది మంత్రివరేణ్యులు కూడా ఆహ్వానింపబడిరని వింటున్నాము.

వెంకన్న గొప్ప దేవుడని, మహిమ గల దేవుడని పొగుడుతూ నిరంతరం ప్రచారం చేసే వారిలో ఎక్కువ మంది జన్మగత బ్రాహ్మణ పూజారులు, పండితులే. అందువలన వెంకన్న ఆదాయంలో ఎక్కువ భాగం డబ్బును ఏదో ఒక రూపంలో అనుభవించే వారలలో కూడా ఎక్కువ మంది జన్మగత బ్రాహ్మలే. వెంకన్నకు స్నానాలు, పూజలు, వగైరాలు చేయువారంతా జన్మగత బ్రాహ్మణ పూజారులే. ఎందుకంటే తక్కిన కులాలవారు వెంకన్నకు సేవచేసిన యెడల వెంకన్న అపవిత్రుడై పోతాడని శాస్త్రాలలో గలదు గదా? అందువల్ల తక్కిన కులాలవారు వెంకన్నకు సేవ చేయగూడదు.

నిజంగా మన జన్మగత బ్రాహ్మణ పండితులు తలచుకుంటే వారు చేయ జాలని పని అంటూ వున్నదా? వారికి కొన్ని వేల సంవత్సరాల అనుభవం గలదు. ముఖ్యంగా దేవుళ్ళ సంగతి వారికి తెలిసినంతగా మరెవరికీ తెలియనే తెలియదు. ఇక మనుష్యుల సంగతి వారికి ఒక లెక్కా? సాక్షాత్ దేవుళ్ళనే తమ చెప్పు చేతల్లో వుంచుకోగలిగిన వారికి ఏ పని సాధ్యంకాదు? రాముణ్ణి, కృష్ణుణ్ణి, శంకరాచార్యులను తమ యిష్టమొచ్చినట్లు ఆడించగల మన జన్మగత బ్రాహ్మణ పండితులు చేయజాలని పని అంటూ వున్నదా? మన వెంకన్న వెనుక యిటువంటి హేమా హేమీలైన (గొప్ప) జన్మగత బ్రాహ్మణ పండితులే గాక దొంగ వ్యాపారస్తులు, కుటిల రాజకీయ వేత్తలు, కపట దైవభక్తులు, ప్రభుత్వాలను తల్లకిందులు చేయగల లంచగొండి ఉద్యోగులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, మహంతులు, మండలేశ్వరులు, కావలసినంత మంది సాధువులు, సన్యాసులు, బిచ్చగాళ్ళు, దొంగలు, మోసగాళ్ళు వగైరాలు కొమ్ముకాచి నిలబడి యున్నారు. ఈ రకమైన అండ వెంకన్నకు చాలా వుంది. అందువల్ల వెంకన్న మహిమగల దేవుడుగా ఎంచబడుచున్నాడు. వెంకన్న మూలాన పాపం తక్కిన చిల్లరదేవుళ్ళ (Demigods) ముఖం కూడా చూసేవారు లేనేలేరు. వాటికి పాపం వుంటానికి సరియైన కొంపగాని, తింటానికి చాలినంత

నైవేద్యం గాని, కట్టుకోవటానికి తగిన గుడ్డా, గోచిగాని, జత కట్టడానికి పెండ్లి – పేరంటం గాని, జన్మదినోత్సవాలు గాని చేయువారుగాని, చేయించేవారుగాని, కన్పిచనందున పాపం అవి పాడుపడిన స్థితిలో వుంటున్నాయి. ఈ రకంగా ప్రజలెవ్వరూ పాపం చిల్లరదేవుళ్ల సంగతి అసలు పట్టించుకోవటమే లేదు. కాని యీ కపట పరాన్నభుక్కులైన పూజారులు, పండితులు, భక్తులు పాపం వెంకన్న కొంప ఎప్పుడు కూలదోస్తారో తెలియదు. ఎందుకన యీ పరాన్నభుక్కులైన పూజారులు, పండితులు, భక్తులు వగైరాలు పూర్తిగా వెంకన్న ముడుపులు, కానుకలు డబ్బు మీదనే ఆధారపడి బ్రతుకుతన్నారు. కనక ప్రజలలోని నల్లడబ్బు ప్రజా శ్రేయస్సుకోరు ప్రజాస్వామ్య ప్రభుత్వం పట్టివేసిననాడు. వెంకన్న యొక్క దొంగ ఆదాయం పూర్తిగా పడిపోకతప్పదు. వెంకన్న ఆదాయం పడిపోయిందా వెంకన్నకు పూజలు, ఉత్సవాలు, పెండ్లిండ్లు పవళింపు సేవలు వగైరాలు బందయిపోవుట తథ్యం. అప్పుడు వెంకన్నను మహిమగల దేవడని నేడు కొనియాడి కొలిచే పూజారులు గాని, పండితులు గాని, భక్తులు గాని, మహంతులు గానీ, సన్యాసులుగానీ, వెంకన్న దరిదాపులకు చేరనే చేరరు. పైపెచ్చు వెంకన్నలో మహిమేమీ లేదని కూడా ప్రచారం చేయవచ్చును. ఇంతేకాదు, వెంకన్నను ఆధారంగా చేసుకొని ఏడుకొండల మీద లాభసాటి వ్యాపారాలు సాగిస్తున్న వారంతా ఎవరి దారిని వారు పలాయనం చిత్తగిస్తారు. (చెప్పకుండా జెండా పీకుతారు) .అప్పుడు పాపం వెంకన్న ఏకాకియై ఆకలి దప్పికలతో అల్లల్లాడిపోతాడు. ఇదే వెంకన్న మహిమయెక్క అసలు సంగతి.

నిరుపేదలు, నీతివంతులు, నీజాయితీపరులు, నిష్కపటులు, నిరాడంబరులు, నిస్వార్థులు, (తమ లాభం కోరనివారు) అంటే ఏడుకొండల వెంకన్నకు అసలు గిట్టనే గిట్టదు. ఇటువంటి వారిని వెంకన్న కన్నెత్తి కూడా చూడనే చూడడు. ఒకవేళ తాను చూడాలనుకొన్నా పూజారులు, పండితులు మాత్రం చూడటానికి అనుమతి యివ్వనే యివ్వరు. ఎందుకన డబ్బు యివ్వలేని నిజాయితీ పరులైన బీద భక్తులకై టైమ్ వేస్టు (కాలం వృధా) చేస్తే వెంకన్న ఆదాయం తగ్గిపోదా? అందువలన పాపం వెంకన్న ఏమి చేయగలడు? పాపం ఆయన పూజారుల చేతులలో కీలు బొమ్మ మాత్రమేనని లోగడ చెప్పామనకుంటాను. కనుక వెంకన్నను పూజారులు,

పండితులు, వగైరాలు తమ ఇష్టం వచ్చినట్లు తమ స్వార్ధం కొరకు ఉపయోగించుకొంటున్నారన్న మాట. ఒకవేళ వెంకన్న తిరగబడి వారి మాట కాదంటాడా. పాపం వెంకన్నకు బొచ్చుకూడా దక్కకుండా కూడా చేస్తారు. కనుక వెంకన్న సర్వకాల సర్వావస్థలయందు పూజారులకు, పండితులకు "దాసోహం" అనవలసిందే. మరియు వెంకన్నకు కానుకలు, ముడుపులు, బొచ్చు ఎవరైతే ఎక్కువగా యిస్తారో వార్కి వెంకన్న ముందుగా, ఆలస్యం లేకుండా దర్శనమిస్తాడు. ఎవరైతే తక్కువ కానుకలిస్తారో వార్కి కాస్త ఆలస్యంగా దర్శనమిస్తాడు. గంటలకొలది వరుసలో నిలబడితేనేగాని దర్శనం లభించదు. (దొరకదు) డబ్బు యివ్వలేని వారికి దర్శనమేలేదు. కనక వెంకన్నను చూడాలనుకొంటే ఏ మాత్రమైనా డబ్బు ఓపిక వుండి తీరాలి. వెంకన్న ప్రసాదం కళ్ళకద్దుకొని తినాలంటే డబ్బుండాలి. వెంకన్న దర్శనం చేయాలంటే డబ్బుతో పాటు వరుసలో గంటలకొద్ది నిలబడటానికి ఓపిక ఉండితీరాలి. వెంకన్న కొండ ఎక్కాలంటే డబ్బుండాలి. వెంకన్న చెంత కొన్ని రోజులుండాలంటే డబ్బుండాలి. వెంకన్న కొండమీద పెండ్లి చేసుకోవాలంటే డబ్బుండాలి. వెంకన్న కొండమీద వడుగు (జందెం వేసుకోవాలంటే) చేసుకోవాలంటే డబ్బుండాలి. వెంకన్నకు బొచ్చు యివ్వాలంటే డబ్బుండాలి. ఈ రకంగా వెంకన్న కొంపలుతీసే తెలివిగల బలే పక్కా మార్వాడీ వ్యాపారిగా తయారైనాడనటం కల్లకాదు.

కాని లక్షల కోట్ల ఆదాయం వున్నా మనలో మనమాట, వెంకన్న మాత్రం పాపం తనకై ఒక దమ్మిడీ కూడా, ఒక్క నయాపైసా కూడా వాడుకోడు, కానీ పూజారులు, పండితులు ఆయన కళ్ళుకప్పి బలవంతంగా ఆయనకు నైవేద్యాలని పెట్టి ఆయన పేరు చెప్పుకొని తామే వాటిని భోంచేస్తారు సుష్టుగా. పాపం వెంకన్నకు వట్టి విస్తరి, పచ్చి మంచినీళ్ళే. వెంకన్నకు కట్టాలని ఎక్కువ విలువైన వస్త్రాలను వేల లక్షల రూపాయలను ఖర్చుచేసికొని ఒకటి రెండు రోజుల పాటు వెంకన్నకు చుట్టి తరువాత బ్లాక్ మార్కెట్లో వాటిని అమ్మటంగాని, పూజారులు, పండితులు, తమకై ఉపయోగించటం గాని జరుగుతుంది. లక్షల కోట్ల రూపాయల విలువగల బంగారు వెండి, నగలు, రత్నాలు, ముత్యాలు, కెంపులు, పగడాలు, వగైరా విలువగల రాళ్ళతో చేయించి వెంకన్నకు యిష్టం లేకపోయినా బలవంతంగా పూజారులు

ధరింపజేస్తారు. ఇంతేకాదు సంవత్సరాని కొకసారి వెంకన్నకు మంగమ్మకు పెండ్లిచేసి చివరకు పవళింపు సేవకై (జతకట్టడానికి) వెంకన్నను బలవంతంగా వప్పిస్తారట.

ఈ రకంగా లోకోద్ధారకుడు, దీననాధుడు, ఆపద్భాంధవుడు, దిక్కులేనివారికి దిక్కని పరాన్నభుక్కులైన జన్మగత బ్రాహ్మల, పండితులచేత పొగడబడే ఏడుకొండల వెంకన్న దీనులకు, దిక్కులేని బీదప్రజలకు, అట్టడుగున పడివున్న పేదవారికి దూరంగా వుండటమే గాకుండా, ఏ మాత్రం స్వేచ్ఛలేనివాడై బ్రతుకుతున్నాడు. సారాంశం పూజారులు, పండితులు చెప్పినట్లు వెంకన్న తూ.చ. తప్పకుండా నడిచి తీరాలి. కటిక చలిరోజులలో కూడా చన్నీళ్ళతో స్నానం చేయమంటే చేసితీరాలి, గజగజ వణుకుతూ. గుడ్డలు ధరించమంటే మోయలేని గుడ్డలైనా ధరించి తీరాలి. నగలు పెట్టుకోమంటే పెట్టుకోవలసిందే. నిద్రించమంటే నిద్రపోవాలి. లేవమంటే లేచితీరాలి. ఎంత బద్ధకంగా వున్నాసరే చివరకు ఆరోగ్యం సరిగా లేకున్నా మంగమ్మతో పవళింపు సేవ చేయమంటే చేసితీరవలసిందే. భక్తులు గొప్ప భక్తిశ్రద్ధలతో సమర్పించే బొచ్చును ఆరగించమంటే గొంతుకు అడ్డుపడినా సరే, ఆరగించి తీరాల్సిందే. ప్రసాదం చల్ది వాసన కొడుతూ బూజుపట్టి వున్నా సరే దాన్ని ఆరగించమంటే ఆరగించి తీరాల్సిందే. జిడ్డు జిడ్డుగా ఉన్నాసరే పంచామృతంతో (తేనె, పాలు, పెరుగు, నేయి, పంచదార లతో తయారైన ద్రవ పదార్థం) స్నానం చేయాల్సిందే. పాపం నోరూవాయి లేని వెంకన్న కదలా మెదలలేని రాతి వెంకన్న జన్మగత బ్రాహ్మల పూజారుల, పండితుల చెప్పుచేతల్లో కీలుబొమ్మగా వుండక ఏంచేస్తాడు. వెంకన్నను యీ విధంగా కీలు బొమ్మగా వుండక ఏంచేస్తాడు? వెంకన్నను ఈ విధంగా కీలు బొమ్మగా చేసి పైకి వెంకన్నలో గొప్ప మహిమ గలదనియు, ఆయనను పూజించిన వారికి, కానుకలిచ్చిన వారికి అన్ని కోరికలు తీరుననియు, రోగాలు పోవుననియు, ఎన్నికలలో విజయలక్ష్మి వరించుననియు, పరీక్షలలో చదవకుండా ప్యాస్ కావచ్చు ననియు, మంత్రిపదవి లభించుననియు, ఉద్యోగము దొరుకుననియు, సఖ్యతలేని దంపతులలో సఖ్యత కలుగుననియు, మగతం లేనివారికి మగతనం కలుగుననియు, పిల్లలులేని వారికి పిల్లలు కలుగుననియు, బ్లాకు మార్కెట్టు చేసి నల్ల డబ్బును కూడబెట్టి వారు ప్రభుత్వంచేత పట్టుబడరనియు, ఎన్ని లంచాలు తిన్నా వెంకన్నకు ముడుపులు

చెల్లిస్తామని మొక్కుకుంటే చేసిన పాడుపనులన్నీ పారిపోవుననియు, ఎన్ని హత్యలు చేసినా వెంకన్న పేరు మీద ఒక ఆలయం కట్టించినయెడల హత్యల వల్ల కలిగే పాపాలు, శిక్షలు తొలగిపోగలవనియు, ఎన్ని అబద్ధాలాడి మోసాలు చేసి డబ్బు సంపాదించినా భక్తితో వెంకన్నకు కానుకలు చెల్లించిన యెడల పాపపరిహారం కాగలదనియు, పెండ్లి కానివారు వెంకన్నకు ముడుపులు కట్టి వెంకన్నకు సమర్పించిన వెంటనే పెండ్లి కుదిరిపోవుననియు, మందులు తిని తిని విసిగిపోయిన దీర్ఘరోగులు వెంకన్నకు ముడుపుల కట్టినయెడల దీర్ఘరోగాలు మటుమాయమైపోతాయనియు, కాలేజీలో సీటు దొరకనపుడు వెంకన్నకు మనిఆర్డరుద్వారా ముడుపుడబ్బును పంపిన వెంటనే సీటు గ్యారంటీగా దొరుకుననియు, చదవకపోయినా వెంకన్నకు తల వెంట్రుకలు (నీలాలను) సమర్పిస్తామని మొక్కుకుంటే తప్పక ప్యాసు కాగలదనియు, ఎన్ని దొంగతనాలు చేసినా దొంగసొత్తులో కొంతభాగాన్ని వెంకన్నకు ముడుపుగా చెల్లించిన యెడల దొంగసొత్తు ఖాయంగా వుండిపోతుందనీ, ఎటువంటి పని అయినా సరే వెంకన్నకు కానుక అర్పిస్తే అయ్యితీరుతుందని పరాన్నభుక్కులైన బ్రాహ్మలు, పండితులు, అదేపనిగా బోధిస్తూ వుంటారు. అందుకై వెంకన్న మహిమలను వారు స్తోత్రాలు, సుప్రభాత కీర్తనలు, బుర్రకథలు, హరికథలు, జంగం కథలు, పిచ్చిగుంటల వాళ్ళ కథలు, కావ్యాలు, భజనలు, కోలాట కీర్తనలు, చెక్క భజనలు, బుడబుక్కల వాళ్ళ మాటలు, సోది వగైరాల ద్వారా ప్రచారం చేసి ఆర్థిక లాభం పొందుతున్నారు. ఈ భగవన్నిర్మాతలైన (దేవుని సృష్టించగలవారు) జన్మగత బ్రాహ్మల పండితుల యీ బూటకపు ప్రచారాన్ని చదువు సంధ్యలులేని సామాన్య ప్రజానీకమే కాకుండా డొక్కశుద్ధిగల (చదువుకొన్న) మేధావులైన (తెలివిగల) ద్విజేతరులుకూడా (శూద్రులు) నిజమని నమ్మి వెంకన్నకు కానుకలు, ముడుపులు, నిలువు దోపిడీలు, బొచ్చు వగైరాలన్నీ తమ జీవిత కాలంలో కనీసం ఒక సారైనా తప్పక భక్తి శ్రద్ధలతో అర్పించాలని ఉవ్విళ్ళూరుతారుట. (తొందరపడుచుందురట). ఈ విధంగా సామాన్య జనంలో మానవ నిర్మిత దేవుని మీద, మతం మీద వున్న మూఢనమ్మకాన్ని, మూఢభక్తిని జన్మగత బ్రాహ్మలు, పండితులు, పూజారులు, తమ స్వార్థానికి వాడుకొంటూ మహారాజ భోగాన్ని అనుభవిస్తున్నారు.

జన్మగత బ్రాహ్మల పండితులు తిరుపతి వెంకన్నది పూజారుల తంతుఅని తెలిసికొని కూడా దానిని బహిరంగంగా గాని, చాటుగా గాని ఖండించరు. ఎందుకంటే వెంకన్న తంతుని ఖండించినట్లయితే తమ కులస్థులైన వేలకొలది పూజారుల భుక్తికి భంగం కలుగుతుంది. అందువల్ల వారు (పండితులు) కూడా పైకి వెంకన్న (ఆనార్య దేవుడైనప్పటికీ) భక్తుల్లాగా నటిస్తూ పామరజనాన్ని మభ్యపెట్టటానికి (మోసగించటానికి) తాము కూడా నామ మాత్రపు ముడుపులను చెల్లించి వెంట్రుకలిస్తారుకూడా.

జన్మగత బ్రాహ్మల పండితులు కొందరు సామాన్య ప్రజలకు అర్థం కాని భాషలో వెంకన్ననుగురించి బూటకపు స్తోత్రాలు, ప్రార్థనలు చేసి అమాయకపు ప్రజలను వెంకన్న మూఢభక్తిలో పరవశుల్ని చేసివేసి (భక్తిలో మునిగిపోయేటట్లు) వారి కష్టార్జితాన్ని కానుకలుగాను, ముడుపులుగాను అందుకొని వెంకన్న పుణ్యమా అంటూ హాయిగా తమ జీవితాల్ని గడుపుకుంటున్నారు. సదరు పూజారులు వెంకన్న స్తోత్రంచేయడం, ప్రార్థించడం తమ మోక్షంకొరకు కాదు, కేవలం భుక్తికొరకేనని స్పష్టంగా తెలుస్తోంది.

కదలమెదలలేని రాతిని చైతన్యవంతమైన అంతటా వ్యాపించి వున్న సర్వే శ్వరుడని చెప్పి అమాయకపు ప్రజానీకాన్ని మోసగించి బ్రతుకుటే వృత్తిగా (జీవనో పాధిగా) పెట్టుకొన్న కొంతమంది స్వార్థపరుల పచ్చి పన్నాగమే (మోసమే) వెంకన్న దేవుడు. ఈ పచ్చి పన్నాగాన్ని ప్రజలు తెలుసుకునే రోజు ఎప్పుడు వస్తుందో కదా!

# 11

దేవుడు, దేవత, దేవీ, అనే పేర్లతో ప్రతిమల్ని (బొమ్మల్ని) రాతితోగాని మరేదేని లోహంతో గాని చేయించి వాటిని నీరు, నేయి, నూనె, పాలు, లేక పంచామృతం వగైరాలతో స్నానం చేయించి వాటికి నైవేద్యాలు పెట్టి బట్టలు, నగలు ధరింపజేసి పూజించేవారిని పూజారులు లేక అర్చకులు అంటారు. విష్ణువు, శ్రీకృష్ణుడు, రాముడు యీ ముగ్గురూ భారతీయ ఆర్యుల దేవుళ్ళుగా యెంచబడుతున్నారు. వీరిని పూజించువారిని వైష్ణవులంటారు. వైష్ణవ పూజారుల్ని 'నంబులు' అని కూడా అంటారు. ఈ వైష్ణవ సంప్రదాయానికి గుర్తుగా తల మీద వెనుక భాగాన గుప్పెడు (గోష్పాదమంత = ఆవు గిట్టంత) జుట్టును, నొసలు భుజాలు రొమ్ము వగైరా అవయవాల మీద పంగనామాలు ధరింపబడతాయి. విష్ణువు, కృష్ణుడు రాముడు వగైరా దేవతలను పూజించే పూజారులందరూ జన్మగత బ్రాహ్మలే. ఒకప్పుడు వైష్ణవులకు అనార్యజాతి దేవుడైన శివుడంటే సరిపడేది కాదు. ఇప్పుడు ఆర్యబ్రాహ్మలనేమంది శివభక్తులే (శైవులే).

శివుడు ఆనార్యుల (శూద్రుల, ద్రావిడుల) దేవుడు. ఈ దేవుని ద్రావిడులు సుమారు 6 వేల సంవత్సరాల నుండి పూజిస్తున్నారు. శివుని పూజించు వారిని శైవులు అని అంటారు. శివుని పూజించు పూజారుల్ని "తంబులు" లేక "తంబళులు" అని అంటారు. శైవులు శివుని లింగరూపంలోనూ, శక్తిని భగరూపంలోనూ పూజిస్తారు. శైవులు నెత్తిమీద చిటికెడు పిలక జుట్టూ, నొసలు, భుజాలు రొమ్ము వగైరా అవయవాల మీద అడ్డంగా మూడు విభూతి రేఖలు (బూడెదతో బొట్టు) ధరిస్తారు. ఒకప్పుడు ఆర్యవైష్ణవులకూ, అనార్య శైవులకూ సరిపడేది కాదు. కాని, నేడు శివలింగాన్ని పూజించే పూజారు లందరూ జన్మగత ఆర్య బ్రాహ్మలే.

పూజలు చేయించటానికి కావలసిన మంత్రాల్ని సంస్కృత భాషలో పూజారులు చిన్నప్పటినుండే వంశపారంపర్యంగా నేర్చుకొంటూ వున్నారు.

మంత్రాలకు అర్థం తెలిసినా, తెలియకపోయినా తొందర లేదు. అర్థం తెలియని మత్రాలతోనే ఎక్కువ మహిమ గలదని సామాన్య ప్రజలు నమ్ముతున్నారు. మంత్రాలు ఎవ్వరికీ అర్థంకాకుండా వుంటేనే మంత్రాలు గొప్ప మహిమగలవిగా ఎంచబడతాయట. ఇంతేకాదు, మంత్రాలకు అర్థం అడగకూడదు. అడిగినవార్కి పాపం తగులుతుందని చిన్నప్పటినుండి శూద్రులు వారి పెద్దల ద్వారా వింటూ వచ్చారు. అందువల్ల శూద్రులెవ్వరూ మంత్రాలకు అర్థం అడగటానికి సాహసించేవారు కాదు. మంత్రాలు పవిత్రమైన దేవభాషలో వున్నాయి. అందువల్ల వాటిని అపవిత్రమైన అనార్య (తెలుగు, తమిళ, కన్నడము, మళయాళము) భాషలలోనికి అనువదించి చదువకూడదు. అట్లు అనువదించుట మహాపాపమని శాస్త్రాలలో వ్రాసుకున్నారు. కనుక మంత్రాలు అనార్య జాతులకు తెలియని భాషలోనే వుండాలి. అనార్యులు (శూద్రులు) మంత్రాలకు అర్థం తెలుసుకోకూడదు. ఎందుకంటే మంత్రాల భాష దేవభాష. దేవభాషను అనార్యులు చదువనే చదువకూడదు. మంత్రాల దేవభాషను అనార్యులు ఎందుకని నేర్చుకోకూడదని ప్రశ్నించుటకే అనార్యులకు దమ్ముండేది కాదట. అనార్యులు వేద మంత్రాలను విననుకూడ వినకూడదని "మను" ధర్మశాస్త్రంలో వ్రాయబడినదట.

వైదికకాలంలో శూద్రులనే ప్రజలకు సామాన్య చదువు కూడా చెప్పబడేది కాదు. ఇంతేకాదు, శూద్రులకు చదువు, శుభ్రత, శుచి అనవసరమని బోధింపబడేవి. కనుక శూద్రులకు చదువు శుచి శుభ్రతలు లేనేలేవట. ఆ కాలంలో చదువు సంధ్యలు లేని శూద్రులను మాయమంత్రాలతో మాయ పుచ్చుతూ కొన్ని వేలసంవత్సరాల వరకూ మూర్ఖులుగాను, అనారోగ్యవంతులుగాను వుంచారట. కాని రోజులు మారాయి. తెల్లదొర్ల పుణ్యమా అంటూ ద్విజేతరులు (శూద్రులు-కమ్మ, కాపు, వెలమ, రెడ్డి, కమ్మరి, కుమ్మరి, మాల, మాదిగ వగైరా కులాలవారు) కొందరు చదువు సంధ్యలు నేర్చుకోవటానికి అవకాశాలను పొందిరి. కొందరు అనార్యులు ద్విజులమని అబద్ధమాడి వేదభాషయగు సంస్కృత భాషను కూడా నేర్చుకొనసాగిరట. ఎందుకన ఆ రోజులలో ద్విజులకు ముఖ్యంగా బ్రాహ్మలనబడే వారికి దివ్యదృష్టి (చాటున జరిగే విషయాలను తెలిసికొను చూపు) సన్నగిల్లి పోవుట వల్ల శూద్రులాడిన

అబద్ధాలను తెలిసికొనలేక వారిని కూడా (శూద్రులను కూడా) ద్విజులనుకొని దేవభాషయగు సంస్కృతమును నేర్పసాగిరి. ఆ రోజులలో బ్రాహ్మలనుకొనుటకు గుర్తు జంధ్యమేనట. జందెము వేసుకొన్న వారంతా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులుగా ఎంచబడేవారట.

కొంతకాలనికి అంగ్లేయుల ప్రయత్నం వల్ల వేదాలు దర్శన శాస్త్రాలు భగవద్గీత వగైరా దేవభాషలోని గ్రంథాలు యితర భాషలలోనికి మార్చబడ్డాయట. అందువల్ల అనార్యులు చాలామంది వేదాలను, దర్శన శాస్త్రాలు వగైరాలను బాగుగా చదివి వాటిలోని అసలు విషయాలను సామాన్య ప్రజానీకానికి తెలియజెప్పసాగిరట. అందువల్ల వేదాలలో గల మంత్రతంత్రాల గుట్టు, జన్మగత బ్రాహ్మల కుతంత్రాల కుళ్ళు ప్రజలకు స్పష్టంగా తెలిసిపోసాగెను. వేదాలను బాగుగా పరిశీలించిన మీదట (బాగా చదివి అర్థం చేసికొన్నమీదట) వైదిక ఋషులమని చెప్పబడే వారిలో చాలా మంది భౌతికవాదులే గాని ఆధ్యాత్మిక వాదులు కానేకాదని తెలిసిపోయింది. అట్టి భౌతిక వాదులైన ఋషుల సంతతివారమని చెప్పుకొనే నేటి జన్మగత బ్రాహ్మలు వగైరాలు యిప్పటికి కూడా సామాన్యప్రజలకు అర్థంకాని భాషలోనే కర్మకాండలు, పెండ్లి, పేరంటం, వగైరాలను చేయిస్తూనే వున్నారు. సుప్రభాతాలు, స్తోత్రాలు, ప్రార్థనలు, సూక్తిముక్తావళి, నీతి వాక్యాలు, వగైరాలు రోజూ రేడియోల ద్వారా సామాన్య ప్రజలకు అర్థంకాని భాషలోనే గంటలకొలది ప్రసారం చేయబడుతోంది. ఇంతేకాదు. ఉదయం- సాయంకాలం నూటికి నూరుమంది సామాన్యప్రజలకు అర్థం కాని సంస్కృత భాషలో వార్తలు కూడా చెప్పబడుతున్నాయి. ఈ కార్యక్రమాలకు ఉద్యోగులుగా నియమింప బడిన వారిలో ఎక్కువ మంది (నూటికి 75 మంది) నూటికి ముగ్గురు గల జన్మగత బ్రాహ్మలే.

కొన్ని స్తోత్రాలలోనూ, ప్రార్థనలలోనూ, అశ్లీల (బూతు) భావాలు కన్పిస్తున్నవట. అట్టి స్తోత్రాలు ప్రార్థనలు ఎక్కుగా సంస్కృత భాషలోనే గలవు. సంస్కృత భాషను ప్రజలలో నూటికి ఒక్కరూ కూడా అర్థం చేసుకోలేరు. అయినప్పటికీ యీ కార్యక్రమం ఎందుకు ఏర్పాటు చేయబడిందంటే కొంతమంది జన్మగత బ్రాహ్మణ పండితులకు దీనివల్ల భుక్తి లభిస్తుంది. ఈ రకంగా నూటికి తొంభైమంది ప్రజలకు

ఉపయోగంలేని కార్యక్రమాలకై ప్రజల రెక్కల కష్టార్జితపు కోట్లకొలది రూపాయలు దుబారా చేయబడుతున్నాయి.

ప్రజలకు తెలియని భాషలో చేయబడే ప్రార్థనలలో కొన్నింటిలో అశ్లీలత (బూతు) కూడా వుంటున్నదని లోగడ చెప్పాను. కాని ఆ అశ్లీల భావాలకు ఏదో ఒక డొంక తిరుగుడు అర్థం చెప్పి అసలు అర్థాన్ని కప్పి వేస్తారు పరాన్నభుక్కులైన పండితవరేణ్యులు.

ఇక్కడ అట్టి అశ్లీలతగల కొన్ని శ్లోకాలు యివ్వబడుతున్నాయి. భగస్తోత్రాన్ని వినండి.

"అశ్వత్థపత్రమాకారం, దుర్వాభరణ శోభితమ్!
కదలీఫల నైవేద్యం, భగదేవీ! నమోస్తుతే"

దీని అర్థం చూడండి "ఓ భగదేవీ! నీ ఆకారం రావి ఆకు ఆకారాన్ని పోలివున్నది. నీవు చెంగల్వ దుబ్బువలె బొచ్చును కలిగివుండి అందంగా శోభిస్తున్నావు. అరటిపండు నీకు నైవేద్యంగా సమర్పింప బడుతున్నది. ఓ భగదేవీ ! నీకు నమస్కారము"

భగము అంటే చాలామంది తెలుగు ప్రజలకు తెలియదనుకుంటాను. అందుకని దానికి తెలుగు మాట చెప్పక తప్పుటలేదు. భగమును తెలుగులో "ఆడగురి, వత్త, పూకు" అని అంటారు. దేవికి అందమైన అవయవాలు యింకా ఉండగా కేవలం భగాన్ని గురించే ఎందుకు చెప్పబడిందో నా చేత కూర్చబడిన "పెళ్ళెందుకు" అనే పుస్తకాన్ని చదివిన విశదము కాగలదు.

ఇంక లింగాన్ని గురించి ఋషులు అనబడేవారు ఏ విధంగా వర్ణించారో కూడా చూద్దాం.

లింగమును సంస్కృత భాషలో "శిశ్నము" అని అంటారు. శిశ్నము అంటే కూడా చాల మంది తెలుగు ప్రజలకు తెలియదనుకుంటాను. అందుకని శిశ్నము తెలుగులో ఏమంటారో చెప్పవలసి వస్తున్నది. పాఠకులు నన్ను మన్నించెదరు గాక! శిశ్నమును తెలుగులో "మగగురి, బెల్లకాయ, చుల్లి" అని అంటారు. కొంతమంది ఋషులు శిశ్నమును పాపాల భైరవుడని (గొప్ప పాపాత్ముడని) వర్ణించిన కొన్ని

శ్లోకాలు యిక్కడ యివ్వవలసి వచ్చినందుకు విచారపడుతున్నాను.

శిశ్నము పాపాలుచేయు దుష్టుడనియు, తాము మాత్రం పాపం చేయడం లేదనియు చెప్పి శిశ్నాన్ని యీ విధంగా వర్ణిస్తారు.

తన తపోబలంతో చావు లేకుండా చిరంజీవిగా వున్నాడని పురాణాలలో చెప్పబడిన మార్కండేయ మహర్షిగారు శిశ్నాన్ని గురించి యిలా అంటారు.

"నృణాం, కుక్షేరర దధోభాగే, నాభిదేశాత్, షడంగులే॥

పాపాఖ్యం, పురుషః సమ్యగాశ్రిత, హృది, వర్ధయన్"

పురుషులయొక్క పొట్టకు క్రింది భాగమందు బొడ్డునుండి ఆరంగుళముల దూరమందు పాపుడనే పురుషుడు హృదయమందు వృద్ధినొందుచూ బాగుగా ఆశ్రయించి యున్నాడు.

తన భార్య అహల్య ఇంద్రునితో జత కట్టినదని తన దివ్యదృష్టితో కనుగొని ఆమెను "రాయి" అయిపొమ్మని శపించిన గౌతమ మహర్షిగారు శిశ్నాన్నీ గురించి ఏ విధంగా వర్ణించారో చూడండి:

నృణాం, నాభేరధోభాగే, పాపపురష, సదావసన్!

పాపాని, వర్ధయన్ ధర్మం, భక్షయస్సర్వ మంగళమ్ "

పురుషుని యొక్క నాభిక్రింది భాగమందు పాపియైన పురుషుడు ఎల్లప్పుడూ నివసించుచూ పాపములను వృద్ధినొందించుచూ ధర్మమును భక్షించుచూ సమస్త శుభములు కలవాడై యున్నాడు.

వేదవ్యాస మహాముని శిష్యుడును గొప్ప ధర్మ శాస్త్రవేత్తయునగు దేవలఋషి శిశ్నాన్ని గురించిన తన అనుభవాన్ని పామర జనానికి ఏవిధంగా బోధించెనో చూడండి.

"మను జానాం, నాభిరంధ్రాదధోభాగే, షడంగులే,

ఆశ్రిత్య తత్రపాపీయాన్, పురుషోవర్తతేసదా,"

"మనుష్యులయొక్క (పురుషులయొక్క) నాభి రంధ్రంనుండి క్రింది భాగమందు ఆరు అంగుళముల దూరంనుండి ఆశ్రయించి అచ్చట పాపాత్ముడైన పురుషుడు ఎల్లప్పుడూ ఉండును.

ఋషులు, మునులు, యతీశ్వరులు, అనబడే మహానుభావులలో ఎక్కువమంది తాము లింగముతో చేయు తప్పులు తమ లింగానివి మాత్రమేనని సెలవిస్తున్నారు. ఇటువంటి బూతులు గల స్తోత్రాలు సంస్కృత సాహిత్యంలో కోకొల్లలుగా గలవట. ఈ విధమైన వర్ణనలను చూడగా ఆ కాలంలో దైవభక్తులు, తత్త్వవేత్తలు (వేదాంతులు) అని చెప్పబడే వారిలో ఎక్కువమంది కామాతురులై, యీ రకపు బూతు సాహిత్యాన్ని ఆధారంగా చేసికొని కాంతా (ఆడది), కాంచనాల(బంగారం, డబ్బు) కు దాసులై పోవడమే కాకుండా సోంబేరులై అమాయక ప్రజల రెక్కల కష్టార్జితాన్ని నిలువునా దోపిడీ చేస్తూ వుండేవారట.

ఈ రకపు జీవితాలను గడుపుకొనుచూ వున్న పరాన్నభుక్కులు కొందరు నేటికీ సంఘంలో కన్పించుట చాల విచారకరమైన విషయము, ఇటువంటి సంఘ విద్రోహులకు, యిటువంటి సోంబేరులకు, యిటువంటి సంఘ దోపిడీగాంఢ్రకు, యిటువంటి దొంగ దైవభక్తులకు, సామాన్య ప్రజానీకం శాస్తి (శిక్ష) చేయగల శుభ సమయం ఎప్పుడు వస్తుందో తెలియదుగదా?

# 12

మన భారతదేశంలో ప్రస్తుతం బీదప్రజానీకం ఆర్థిక బాధలతో పాటు మూఢ నమ్మకాలు, మూఢాచారాలు వగైరాల వల్ల అనేక కష్టాలకు లోను కావలసి వస్తుంది. ఈ మూఢ నమ్మకాలు రోజురోజుకూ పెరిగిపోతూనే వున్నాయి. సామాన్య ప్రజలు స్వంతంత్ర రాజకీయ వాతావరణంలో వున్నప్పటికీ మూఢాచారాలవల్ల శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎక్కువకులాల వారికి బానిసలుగా వుండవలసి వస్తున్నది. కాని ఆర్థిక శారీరక బానిసత్వాల కంటే కూడా మానసిక బానిసత్వం ఎక్కువ హానికరమైనదని పెద్దలంటారు. అయినప్పటికీ సామాన్య ప్రజలకు తగిన విద్య లేనందున వారు జన్మగత బ్రాహ్మల, పండితుల స్వార్ధ పూరిత మాయ మాటలను అర్థం చేసుకోలేక పోతున్నారు. అందువల్ల వారు (సామాన్య ప్రజలు) సాంఘికంగాను, ధార్మికంగాను, (మత సంబంధమైన పనులలోనూ) జన్మగత బ్రాహ్మల పండితుల చేతులలోనూ, ఆర్థికంగానూ శారీరకంగానూ ధనికుల, ఉద్యోగస్తుల, రాజకీయ నాయకుల చేతులలోనూ, కీలుబొమ్మలై పోవలసి వస్తోంది.

సామాన్య ప్రజలకు పుట్టిన నక్షత్రం యొక్క మంచిచెడ్డలు, పుట్టెంటుకులు తీయటానికి మంచిరోజు, అన్నము ముట్టించడానికి మంచి తిధి, అక్షరాభ్యాసానికి, పెండ్లికి, మంచి లగ్నాలు, చనిపోయినప్పుడు నక్షత్రం యొక్క మంచిచెడ్డలు, నిత్య కార్యక్రమానికై వారం వర్జం వగైరాలను చెప్పేది జన్మగత బ్రాహ్మల పండితులే. చచ్చినవార్కి శ్రాద్ధకర్మ (దినము) తర్పణాలు, పిండాలు వగైరాలను చేయించేది జన్మగత బ్రాహ్మల పురోహితులే. దానాలు, దక్షిణలు, వగైరాలును పెట్టేది జన్మగత బ్రాహ్మల పురోహితులే.

ఇక ఇటు ప్రజల వ్యావహారిక, నిత్య జీవితము కరణాలు అనే పేరుగల జన్మగత బ్రాహ్మలమీద పూర్తిగా ఆధారపడి వుంటుంది. ఎందుకన ప్రజల భూమి బుట్రను కొలచి హద్దులు పెట్టేది కరణమే. భూమిపన్నులు విధించేది కరణమే. ప్రజల భూమి వగైరాలకు సంబంధించిన లెక్కలు, ప్లానులు యావత్తూ కరణం

వద్దనే వుంటవి. కరణం అంటే సామాన్యంగా లెక్కలు వ్రాయువాడు. ఈ కరణాలు సామాన్యంగా వైష్ణవ సంప్రదాయకులే. కరణాలను నియోగులనిగాని, నియోగి బ్రాహ్మలనిగాని అంటారు. వీరు గ్రామస్తులను తమ చెప్పుచేతల్లో వుంచుకొని వారిని తమ యిష్టమొచ్చినట్లు ఆర్థికంగా దోచుకుంటూ వుంటారు. అందుకని ఈ కరణాలకు గ్రామాదులలో మంచిపేరు వుండదు. ఈ కరణాలు ప్రజలను సానుభూతితో చూడరు. చాలా కఠినంగా వ్యవహరిస్తూ ఉంటారు. వీరు గ్రామాలలోని ప్రజలను కులాల వారీగా చీలదీసి కులాలకూ, కులాలకు మధ్య తగాదాలను సృష్టించి అందరికీ తామే మధ్యవర్తులుగా వుంటూ వున్నట్లు నటించి తమకు ఎదురుతిరిగిన కులాలవారిని సోదిలో కూడా లేకుండా అణగతొక్కించి వేయదురు. పైకి తాము మాత్రం ఏ పక్షానికీ చెందనివారుగా కన్పిస్తారు. కరణానికి సెంటు భూమి లేకపోయినా ఆర్థికంగా పిల్లజమిందార్ లాగ సకల భోగాలతో జీవితాన్ని నిశ్చింతగా గడుపుకుంటూ వుంటాడు. ఇంతే కాకుండా కరణం గ్రామంలో వివిధ కులాల వారిలో ఐకమత్యం లేకుండా చేయటానికి నిరంతరం ఏదో ఒక పన్నాగము (పన్నుగడ – మోసము) పన్నుతూనే వుంటాడు. పైకి అందరకూ అనుకూలంగా వున్నట్లు కనబడుతూ కపట జీవితం గడుపుటను "కరణీకం" అంటారు.

ఈ విధంగా కరణం జీవించటానికి ముఖ్య కారణం గ్రామ ప్రజల అమాయకత్వం, చదువులేనితనము. ఈ రెంటినీ ఆధారంగా చేసికొని అతడు (కరణం) వారిని ఏ విధంగానూ పైకి రాకుండా తొక్కిపట్టి వుంచటానికే నిత్యమూ కుట్రలు పన్నుతూ వుంటాడు. కాని సంఘంమీద (సామాన్య ప్రజలమీద) పురోహిత బ్రాహ్మలకున్నంత ఆధిపత్యం కరణానికి కన్పించదు. కాని ఆర్థిక దోపిడీలో మాత్రం పౌరోహిత బ్రాహ్మడికంటే కూడా కరణానిదే పైచేయి. కాని కరణం బిడ్డ మానసిక దోపిడిలో పురోహిత బ్రాహ్మడంత క్రూరుడు (కఠినుడు) మాత్రం కాడని చెప్పవచ్చు. ఎందుకన పౌరోహిత బ్రాహ్మడు ప్రజలను మానసికంగా ఖూనీ చేస్తాడు. కాని కరణం బిడ్డ ఆర్థికంగా మాత్రమే ప్రజలను బాధపెడతాడు. అంటే కరణం బిడ్డ సంఘానికి పౌరోహిత బ్రహ్మడంత సంఘద్రోహి మాత్రం కాదు.

ఈ రకంగా సామాన్య ప్రజానీకం పౌరోహితబ్రాహ్మడికి, నియోగి బ్రాహ్మడికి

మధ్య ఆర్థికంగాను, శారీరకంగాను, మానసికంగాను నలిగి పోవలసి వస్తోంది. స్వతంత్ర భారతదేశంలో వున్నప్పటికీ సామాన్య ప్రజలు తెల్లదొరల పరిపాలనాకాలంలో కంటే నల్లదొరల పరిపాలనా కాలంలో (ప్రస్తుత కాలంలో) శారీరకంగానూ, ఆర్థికంగానూ, నైతికంగానూ, మానసికంగానూ (బౌద్ధికంగా) ఎక్కువ బానిసత్వంలో వుంటున్నారని చెప్పుటకు విచారపడుతున్నాను. నేడు సామాన్యప్రజానీకం నైతికంగాను, ఆర్దికంగాను, మానసికంగాను యింతగా దిగజారిపోవుటకు ముఖ్య కారణం మూఢాచారాలు, మూఢనమ్మకాలు కర్మవాదము మొదలైనవే. ఈ మూఢాచారాలు, మూఢనమ్మకాలు వగైరాలు మానవుని ఆలోచనాశక్తిని ఎదగనివ్వక అతనిని పిరికిపందగా తయారుచేయును. కనుక మూఢాచారాలను, మూఢనమ్మ కాలను, కర్మవాదాన్ని ప్రోత్సహించే గ్రంథాల్ని నిషేధించాలి (నిరాకరించాలి). మూఢాచారాల్ని, మూఢనమ్మకాల్ని, కులతత్వాల్ని, మతతత్వాన్ని ప్రత్యక్షంగా గానీ పరోక్షంగాగానీ రెచ్చగొట్టే వ్యక్తుల్ని (మనుషుల్ని) గాని సంస్థల్ని గాని అదుపులో పెట్టాలి. లేనిచో సామాన్య ప్రజల ఆర్థిక, సాంఘిక, నైతిక, మానసిక, శారీరక, పరిస్థితులు చక్కబడుట అసంభవము(జరుగదు).

నేడు మన భారత దేశం అనేకమంది దేవీదేవతలకు పుట్టిల్లయిపోయింది. అంతేకాదు రోజురోజుకూ కొత్త కొత్త దేవతల్ని ఏదో ఒక మూలనుండి ఎవరో ఒకరు పొట్టగడవని భక్తుడు సృష్టిస్తూనే వుంటున్నాడు. ఆ దేవీదేవతల విగ్రహాలు (ప్రతిమలు) రాతితోనో, రాగితోనో, మంచిగంధపు చెక్కతోనో, మట్టితోనో నిర్మింపబడు తున్నాయి. ఆ విగ్రహాలకు మానవులకువలె తిండీ తిప్పలు, గుడ్డాగోచి, కొంపా గోడు, నగలునట్రా, పెండ్లీ పేరంటం, గర్భాదానం, సంతానం వగైరా అమాంబాపతు నిత్యావసరాలు అవసరమవుతున్నాయి.

ఈ దేవీదేవతలలో ఎక్కువమంది మానవునివలే అవయవాలు, ఆకారాలు, గుణాలు, కలిగి ఉంటున్నారు. కొద్దిమంది మాత్రం మానవుని కంటే ఎక్కువ చేతులు, తలలు కలిగివుంటున్నారు. వారిలో కొందరు మానవునివలె రెండేకాళ్ళు కలిగివుండి ఎక్కువ చేతులు,ఎక్కువ తలలు కలిగివుంటున్నారు. వారు అన్ని తలలను చేతులను రెండుకాళ్ళమీద మోస్తూ ఎంత బాధపడుతున్నారో పాపం వారికీ వారి భక్తులకూ

మాత్రమే తెలియాలి.

ఈ దేవీదేవతలందరూ  ఒకేసారి మాత్రం సృష్టించబడలేదు. (పుట్టింప బడలేదు).  ఎప్పుడెప్పుడు ఏ భక్తునికి పొట్ట గడవలేపోయేనో అప్పుడప్పుడల్లా దేవీ దేవతలు పుట్టింపబడేవారు. ప్రస్తుతం అమలులో (వాడుకలో) వున్న దీవీదేవతలలో కూడా మానవులవలె జాతి, వర్ణ, వర్గ మొదలయిన హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి.

ఈ దేవీ దేవతలలో ఎక్కువ మంది మానవులవలె గృహస్థులు (పెండ్లయిన వారు) గానే వుంటున్నారు. కొద్దిమంది మాత్రం ఆజన్మ (బ్రతికి వున్నంత కాలం) అస్ఖలిత (ఇంద్రియాన్ని పారబోసుకోకుండా) బ్రహ్మచారులుగా (పెండ్లికానివారిగా) వుంటూనే భక్తులు – భక్తురాండ్రు కోరినపుడు వార్కి బిడ్డలను ప్రసాదిస్తూ (ఇస్తూ) వుంటారు. కాని భారతీయ ఆర్యఋషుల వేదాలలో ఎక్కడా ప్రస్తుతం వాడుకలో వున్న దేవీదేవతలు “ఊసే” కంచుకాగడా పెట్టి వెతికినా (బాగా) కనిపించడంలేదు. అయినప్పటికీ హిందూవులనబడే వారిలో ప్రస్తుతం అమలులో వుండి మంచి ఫైలులో వున్న దేవీదేవల భోగట్టాను గురించి కాస్త తెలిసికొందాం.

**శివుడు:** ఈయన అనార్యుల (ద్రావిడుల, శూద్రుల) దేవుడు. భారతీయ ఆర్యులు మనదేశం రాకపూర్వం సుమారు నాలుగువేల సంవత్సరాల నాడు పంజాబు ప్రాంతంలో “హరప్పా” మొహెన్‌జో – దారో  నగరములు నిర్మింపబడిన కాలంలో ద్రావిడు లనబడేవారు ఈ దేవుణ్ణి మొట్టమొదటగా కనిపెట్టి పూజింప సాగారు. ఈ దేవుడు అనార్యులకు చెందిన వాడైనప్పటికీ ప్రస్తుత కాలంలో ఆర్య ద్విజులలో (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుడు) ఒక సంప్రదాయానికి చెందిన వారు (శైవులు) ఈ దేవుని ముఖ్యదేవునిగా ఎంచి పూజిస్తున్నారు.

అనార్యులు (ద్రావిడులు) ఈ దేవుని యొక్క లింగాకారం గలం విగ్రహాన్ని రాతితో గాని, రాగితోగాని, నిర్మించుకొని దానిని పూజింపసాగారు. వారి లింగపూజను చూచి భారతీయ ఆర్యులు వారిని (అనార్యులను) “శిశ్నదేవ పూజకులు” అని ఎగతాళి చేసి వారిని అతినీచంగా చూచేవారని వేదాలలోనే వ్రాయబడింది. కానీ యీ శివుడే “రుద్రుడు” అనే పేరుతో పూజింపబడేవాడని తరువాత కొంతకాలనికి వేదాలలోనే కొందరు యిరికించారు. తరువాత పౌరాణికకాలంలో యీ శివుడే

శంకరుడు, మహాదేవుడు అనే పేర్లతో ప్రసిద్ధి చెందాడు.

ఈయన రూపము, వేషము, పనులు విచిత్రంగా కన్పిస్తవి. ఈయన తల మీద గంగా నదిని, నొసలు మీద అర్థచంద్రుని, మూడవ నేత్రాన్ని, మెడలో పాముల్ని, మనుషుల పుర్రెలదండను, శరీరమంతా భస్మమును, పులి చర్మాన్ని ధరించేవాడట. ఈయన తన శరీరంలో ఎడమ భాగంలో తన పెండ్లామైన పార్వతిని (దుర్గను) కలిగివుండేవాడట. అందువల్ల యితనిని అర్ధనారీశ్వరుడనే వారు. అంటే ఈయన శరీరంలో సగభాగం ఆడరూపంలోనూ, సగభాగం మగరూపంలోనూ ఉండేది. ఇక సంభోగము (జతకట్టుట), సంతానం ఎట్లా కలిగిందో ఆయనకు, ఆయన పెండ్లానికి, ఆయన పరమ భక్తులకే తెలియాలిగాని యితరులకు ఆ గుట్టు అంతుపట్టదు.

ఈయనకు మానవునివలె రెండు కాళ్ళు, రెండు చేతులు, ఒక తల వుండేది. ఈయన గొప్ప తపస్వి. యోగి అని పేరుగాంచెను. ఈయన సంగీతానికి, నృత్యానికి మొదటి గురువట. ఈయనను పూజించువారిని శైవులంటారని లోగడ చెప్పాము, ఈయనకు "బోలానాథ్" అనే పేరుకూడ ఉండేది. అంటే ఈయన అమాయక శిరోమణియట (గొప్ప అమాయకుడట). ఈయన అల్పసంతోషియట. అందువల్ల ఎవరికి బడితే వారికి వరాలు గుప్పించి వేసేవాడట. వాటి ఫలితాన్ని ఆలోచించే పనేలేదట. అందువల్ల ఈయన ఈ అమాయకత్వంవల్ల ప్రపంచానికి అనేక (అనర్థకాలు) కష్టాలు వచ్చి పడేవట. ఈయన ముఖ్యమైన పని ప్రాణకోటిని చంపడమేనట. ఈయన శరీరం నల్లగా వుండేదట. అందువల్ల ఈయన అనార్య జాతివాడై యుండవచ్చునని కొందరంటారు. యీయనకు ముగ్గురు కుమారులట. ఒకాయన పేరు వినాయకుడు, రెండవ ఆయనపేరు కార్తికేయుడు, ఆయనను కుమారస్వామి, సుబ్రహమణ్యేశ్వరస్వామి అనికూడా అంటారు. మూడవ కుమారుడు వీరభద్రస్వామి.

శివుడు ఎద్దునెక్కి తిరిగేవాడట. అందువల్ల ఈయనను నందీశ్వరుడని కూడా అనేవారట.

**విష్ణువు:** ఈయన ఆర్యద్విజులకు (బ్రాహ్మణ క్షత్రీయ వైశ్యులకు) ప్రధానమైన

దేవత. యీయన ప్రాణికోటిని పోషించే దేవుడు. యీయన వేదకాలంలో ధనము, వీర్యము, బలమునిచ్చే దేవునిగా చెలామణి అయ్యాడు. ప్రపంచంలో చెడు ఎక్కువయినప్పుడల్లా యీయన అవతరించి (పుట్టి) చెడును నిర్మూలిస్తూ వుంటాడట. యీయనకు రెండు కాళ్ళు, నాలుగు చేతులు, ఒక తల ఉండేది. లక్ష్మీదేవి యీయన పెండ్లాము.

ఈయన ఎల్లప్పుడూ యువకుడుగానే వుంటాడట. ఈయన గ్రద్ధనెక్కి తిరిగేవాడట. ఈయనను పూజించేవారిని వైష్ణవులంటారని లోగడ చెప్పాము. వేదకాలంలో యీయన ప్రధాన దేవునిగా ఎంచబడే వాడు కాదట.

వైష్ణవమత సంప్రదాయం ఉత్తర భారతదేశంలోనూ, శైవమత సాంప్రదాయం దక్షిణభారత దేశంలోనూ ఎక్కువగా వుండేదట. నేడు కూడా దక్షిణ భారతదేశంలోనే శైవమత సంప్రదాయం ఎక్కువగా కన్పిస్తుంది.

ఋగ్వేద కాలంలో విష్ణువు అప్రధాన దేవునిగా ఎంచబడినప్పటికీ బ్రాహ్మణ గ్రంథాలలో యీయన (విష్ణువు) గొప్ప దేవునిగా వర్ణింపబడెనట. పంది, చేప, తాబేలు, అవతారాలు ఎత్తింది ఈ విష్ణువేనని వైష్టవులంటారు. ఈయనకు చాలమంది సంతానం కలిగెనట. ఈయనకు వేయికి పైగా పేర్లు గలవట. వాటిలో శ్రీకృష్ణుడు అనే పేరు కూడా గలదట.

**వినాయకుడు:** ఈయనకు రెండు కాళ్ళు, నాలుగు చేతులు, యేనుగు తలవంటి ఒక తల, ఒక దంతము, ఒక పెద్ద పొట్ట వుండేవట. ఈయనకు విఘ్నేశ్వరుడు అని కూడా అంటారు. ఎందుకన ఈయన విఘ్నాలకు దేవుడట. విఘ్నములు అంటే ఆటంకములు లేక కష్టాలు. కనుక ఏ పని ప్రారంభించాలన్నా ఆటంకాలు లేకుండా వుంటానికని ఈయనను పూజించాలట. ఈయనను పూజించి, జన్మగత బ్రాహ్మణ పౌరోహితునికి స్వయంపాక సామాగ్రి, దక్షిణ యివ్వాలట. అంతట ఆ పని ఆటంకం లేకుండా ఈ విఘ్నేశ్వరుడు చేస్తాడట. ఎందుకంటే విఘ్నాలు (ఆటంకాలు) ఈయన ఆధీనంలో వుంటాయని పండితులంటారు.

ఈయనకు మూడు పోగుల జందెం వుండేదట. ఎందుకంటే ఈయన ఆజన్మ బ్రహ్మచారియేనట (బ్రతికి వున్నంత వరకు బ్రహ్మచారియే). వ్యాసుడు భారతం

చెప్పగా ఈయన వ్రాశాడంటారు. కాని ఈయన ఏనుగు నోటితో మానవునివలె ఎట్లా మాటాడ గలిగెనో ఈయనకు, ఈయన భక్తులకు తెలియాలి. ఈయన చిట్టెలుక నెక్కి ప్రయాణం చేసేవాడట. ఇది చాల వింతైన విషయం.

ఈయన పుట్టుకను గురించి తెలిసికొనుట చాలా అవసరం. ఎందుకన తెల్లార్లేస్తే ప్రతి పనికి ముందు ఈయనను తప్పక పూజించాలి గదా! ఈయన పుట్టుకను గురించి అనేక కథలున్నాయి. కాని ఒక కథమాత్రం యిక్కడ తెలియజేస్తాను. శివుని భార్య పార్వతి. ఆమె ఒకరోజున వంటికి నలుగు పెట్టుకొని పిండితో ఒక కుర్రవాని రూపం తయారుచేసి దానికిప్రాణం పోసి ఆ కుర్రవానిని వాకిలి వద్ద కావలి ఉంచి తాను స్నానానికి వెళ్ళిందట. ఇంతలో భూతనాధుడు (పిశాచాల యజమానియైన శివుడు) ఎక్కడనుంచో వచ్చి వాకిలి గుండా లోపలికి రాబోయనట. ఇంతలో నలుగుపిండి కుర్రాడు శివుని అటకాయంచాడట. అప్పుడు శివునికి కోపం వచ్చి ఆ కుర్రవాని తలను నరికివేసి లోపలికి వెళ్ళినాడట. అప్పుడు పార్వతి యింకా స్నానం చేస్తూనే వుండెనట. జరిగిన కథను పార్వతికి శివుడు చెప్పెనట. పార్వతి కుర్రవానికై విచారపడుతుండా శివుడు ప్రక్కనే వున్న పెద్ద ఏనుగు తలను నరికి తీసుకు వచ్చి కుర్రవాని మొండానికి అంటించి మరల కుర్రవాని బ్రతికించెనట. ఆ రోజలలలో దేవతలనబడే వారికి పుట్టించటానికి, చంపటానికి శక్తి ఉండేది కాబోలు. కాని బ్రాహ్మల మంత్రాల శక్తితో బ్రతికే ఆ దేవతలకే అంత శక్తి వుంటే మంత్రాన్ని సృష్టించే మన బ్రాహ్మల పండితులకు ఆ రోజులలో ఎంత శక్తి ఉండేదో ఆలోచించాల్సిన విషయం. నేడు అనార్య దేవతయైన ఈ వినాయకుని పూజలు చేయించేవారంతా ఆర్యబ్రాహ్మల పౌరోహితులే. ఎందుకని? పూజలు చేయించినందుకు కొంత ఆర్థిక లాభం కలుగుతుందికదా! ధనమూలమిదమ్ జగత్ గదా! అందులోనూ డబ్బుకు జాతి, కుల, మత, తెగ, వర్గ విచక్షణ (బేధము) వుండదు గదా ! డబ్బుకు అంటు అసలే లేదుగదా ! కాబట్టి మన జన్మగత బ్రాహ్మణ పౌరోహితులు డబ్బు యిచ్చే దేవతలు ఏ కులానికి, ఏ జాతికి చెందినా పూజలు చేయించటానికి వారికి పట్టింపులేదు. అయినా పాపకార్యం చేసినా దానికీ ప్రాయశ్చిత్త విధానాన్ని మను మహారాజు ఏనాడో వ్రాసిపెట్టాడుగా ! కనుక ఒక డజన్ సార్లు

గాయత్రీ మంత్రం జపించిన యెడల ఎంత గొప్ప పాపకార్యమైనా గాయబ్ (కనిపించకుండా పోవును) అయిపోతుందిగా !

**లక్ష్మీదేవి:** ఈమె విష్ణుమూర్తి భార్య. ఈమెకూడా విష్ణువువలె ఎల్లప్పుడూ పడుచుదిగానే వుండును. ఈమెకు నాలుగు చేతులు, రెండు కాళ్ళు, ఒక తల కలిగి వుండేది. అవును, భర్తకు నాలుగు చేతులుంటే ఈమెకు కూడా నాలుగు చేతులు వుండాలిగా !

ఈమె అందాల రాణియట. ఈమె ధనాన్ని యిచ్చే దేవతయట. ఈమెకు చంచలా, చపలా అనే పేర్లు మిక్కిలి సార్థక మైనవిగా కన్పిస్తున్నవి. ఎందుకన ఈమె ఎల్లప్పుడూ తిరుగుతూనే వుంటుందట. ఒక్క చోట నిలకడగా పట్టుమని పది నిమిషాలు ఎవరివద్దా వుండదట.

ఈ రోజులలో ద్విజులు, ద్విజేతరులు యావన్మందీ ప్రతి శుక్రవారం ధనం కొరకు యీమెను పూజిస్తూ వుంటున్నారు. కొందరు జన్మగత బ్రాహ్మణ పూజారులకు డబ్బిచ్చి తమ కొరకు ఈమెను గురించి పూజలు చేయిస్తూ వుంటున్నారు. ఈమె తండ్రి సముద్రుడట, తల్లి ఎవ్వరో తెలియదు. ఈమెకు కుష్టురోగి మొదలుకొని కుబేరుడు వరకూ అందరూ సమానులే.

**ఆంజనేయస్వామి :** ఈయనకు హనుమంతుడు, వాయుపుత్రుడు, అనే పేర్లు కూడా గలవు. ఆంజనీదేవి పుత్రుడగుట వలన యీయన పేరు ఆంజనేయు డయ్యెను. లావాటి దవడలు కలిగి వుండుటవలన ఈయన పేరు హనుమంతు డయ్యెను. సంస్కృత భాషలో లావాటి దవడను "హను" అంటారు. ఈయన వాయువుకు ఆంజనాదేవి ద్వారా పుట్టుట వలన ఈయనను వాయుపుత్రుడంటారు.

ఈయన అనార్యుడు, కాని ఈయన ఆర్య క్షత్రియుడైన రాముడి యందు గొప్ప భక్తి కలిగివుండేవాడట. ఈయన అస్ఖలిత బ్రహ్మచారియట. అంటే ఈయన ఒకసారి కూడా ఏ ఆడదానితోనూ జతకట్టి ఎరుగని పెండ్లికాని వాడు. కాని కొంతమంది పిల్లలులేని గృహస్థులు యీయనను పిల్లల కొరకు పూజిస్తూ వుంటారు. వారి పూజలను భక్తిని మెచ్చుకొని వారికి పిల్లలను యిస్తూ వుంటాడట. బ్రహ్మచారిగా వుంటున్నప్పటికీ యీయన పిల్లలను ఎట్లా యిస్తాడో ఈ కిటుకు ఈయన భక్తులకు,

ఈయన పూజారులకు బాగా తెలుసు.

ఈయనకు ఈ రోజులలో గుళ్ళు కట్టించబడుతున్నాయి. వాటిలో ఈయన విగ్రహాలకు స్నానాలు, పూజలు, చేయించడానికి నైవేద్యాలు పెట్టడానికి జన్మగత బ్రాహ్మణ పూజారులే తయారుగా వుంటున్నారు. ఈయన కొరకు అర్పింపబడే పండ్లు నైవేద్యాలు కానుకలు, వగైరాలను పూజారులు తమ ఇండ్లల్లో జాగ్రత్త పరుస్తారు. అంటే వాటిని పూజారులు తమకొరకు వాడుకొంటూ వుంటారు.

ఆంజనేయస్వామి అనార్యజాతి (శూద్రుల) దేవత అయిపన్నటికీ డబ్బు వచ్చే వనరులున్నప్పుడు ఆర్య బ్రాహ్మణ పూజారులు జార విడచిపోనివ్వరు. డబ్బు వచ్చే వీలున్న ఏ పనినైనా చేయటానికి మన జన్మగత బ్రాహ్మణ పూజారులు వెనుకాడేది లేదు.

వెంకన్న, పోతురాజు, గంగానమ్మ, కాళిక, దుర్గ మొదలైన దేవతలంతా అనార్య దేవతలే కాని, వీటిలో డబ్బు రాబడి ఎక్కువగా వున్న దేవతలకు పూజలు చేయించే వారంతా జన్మగత ఆర్య బ్రాహ్మణ పూజారులే. దేవాలయాల్ని నిర్మింపజేసి (కట్టించి) దేవతలకు కానుకలు, నైవేద్యాలు గుడ్డా, గోచీ, నగలు, నట్రా వగైరాలు సమర్పించేది అనార్యులా! శూద్రులా? మంత్రాలు, పూజలు, జరిపించి కానుకలను నైవేద్యాలను అనుభవించే జన్మగత ఆర్య బ్రాహ్మణ పూజారులా?

మన దేశసంఖ్య సుమారు 63 కోట్లకు చేరుకున్నదట. అందులో సన్యాసులు, సాధువులు, మహంతులు, మండలేశ్వరులు, పీఠాధిపతులు, మఠాధిపతులు, బాబాలు, అమ్మలు, యోగులు, పూజారులు, పౌరోహితులు, బిచ్చగాళ్ళు వగైరాల సంఖ్య దేశ జనసంఖ్యలో సుమారు 10 వ వంతు మించి ఉందట, అంటే మన భారతదేశంలో దేవుళ్ళు, దేవతలు, దేవాలయాలు, మఠాలు, ఆశ్రమాలు, తీర్థ స్థలాలు, పూజలు వగైరా వాటిని ఆశ్రయించుకొని బ్రతికే పరాన్న భుక్కులైన సోంబేరుల సంఖ్య సుమారు ఆరుకోటక్లు మించి వుందట.

ఇంతే కాకుండా ప్రజా ప్రభుత్వాలని చెప్పుకునే కాంగ్రెస్, జనతా ప్రభుత్వాల పుణ్యమా అంటూ మన దేశంలో రోజు రోజుకూ కొత్త కొత్త దేవుళ్ళు, దేవతలు, దేవాలయాలు, యోగులు, బాబాలు వానాకాలపు కప్పల వలె పుట్టుకొస్తున్నారు.

కాని యింతమంది దేవుళ్ళు, దేవతలు, యోగులు, బాబాలు, దేవాలయాలు, మసీదులు, చర్చీలు వున్నప్పటికీ మన దేశంలో కటిక దారిద్ర్యం, అవినీతి, హింస, దౌర్జన్యము, అబద్దాలు, హత్యలు, దోపిడీలు, మోసాలు, కపట దైవభక్తి, లంచగొండి తనము, కుటిల దేశభక్తి, కుల, మత, వర్గ, వ్యక్తిగత వైషమ్యాలు, సాంఘిక అసమానతలు, (హెచ్చుతగ్గులు) విద్యా విహీనత (చదువులేని తనము), అనారోగ్యము వగైరాలు వున్నప్పటికీ సంఘంలోని యీ దుర్గుణాలు రోజుకోజుకూ పెరుగుతూనే వున్నాయి గాని తరుగుటలేదు. ఇంతమంది దేవుళ్ళు, దేవతలు, యోగులు, బాబాలు, వగైరాలు వున్నప్పటికీ సంఘంలోని యీ దుర్గుణాలు రోజురోజుకూ పెరుగుటకు కారణం ఏమైవుంటుందో మనం తెలిసికోవటానికి ప్రయత్నించాలి. మనలో మన మాట, నిజానికి యీ దేవతలు, యీ దేవుళ్ళు, యీ దేవాలయాలు, యీ మసీదులు, యీ చర్చిలు, పాపం వాటంతటవి అవతరించినవి కావుగదా? వీటిని కొంతమంది స్వార్ధపరులైన సోంబేరులు తమ ఆర్థిక లాభం కొరకు సృష్టించారనుట కల్లకాదు.

ఈ దేవుళ్ళు దేవతలు, రాతితోనో, రాగితోనో చేయబడినవే కనుక వాటిలో చైతన్యశక్తి ఎలా వుంటుంది? ఏ మాత్రమైనా వున్నట్టయితే మన దేశంలో సహించ టానికి వీలుకాని యీ దుర్గుణాల్ని నిర్మూలించకుండా వుండగలవా? కాని యివి ప్రాణంలేని బొమ్మలు మాత్రమే. ప్రాకృతిక నియమానుసారము వీటిలో చైతన్యశక్తి వుండుట అస్వాభావికము. అసంభవము. అయితే యిక యివి ఎందుకు? ఎవరి కొరకు సృష్టింపబడినవో యింతకు ముందు స్పష్టంగా చెప్పబడినది. కొంతమంది సోమరులు కాయకష్టం చేయలేక తమ భుక్తి కొరకు యీ ప్రాణంలేని దేవుళ్ళను దేవతల్ని సృష్టించి వాటి కొరకని నైవేద్యాలు, కానుకలు, వగైరాలను ప్రజలనుండి తీసుకొంటూ వాటితో తాము సుఖజీవనం చేస్తున్నారనుట పరమ సత్యము.

ఈ దేవీదేవతలు, దేవుళ్ళు ప్రాణంలేనివని పూజారులు, పండితులు, మహంతులు, వగైరాలకు తెలిసిన విషయమే. వారు కేవలం తమ భుక్తికై యీ బూటకపు వట్టొట్టి దేవతలను, దేవుళ్ళను సృష్టించి అమాయక ప్రజలనే కాకుండా కొంతమంది బుద్ధిజీవులను కూడా మూఢులనుగా చేసివేసి వారిని నిలువు దోపిడీ చేయటానికి అలవాటున పడిపోయిరి. కాని పైకి మాత్రం యీ ప్రాణంలేని

విగ్రహాలలో గొప్ప మహిమ గలదని అర్థంకాని మంత్రాలను, స్తోత్రాలను, ప్రార్థనలను రచించి రేడియోల ద్వారాను, హరికథలు పురాణాల ద్వారానూ ప్రచారం చేయిస్తున్నారు. పైపెచ్చు ఆ విగ్రహాలను దూషించినా, పూజించకపోయినా కీడు కలుగునని ప్రజలను భయపెట్టుతారు. ఇది యీ దేవుళ్ళు దేవతలు అవతరించటానికి అసలు రహస్యం.

కనక ఇకనైనూ సామాన్య ప్రజలు జన్మగత బ్రాహ్మణ పూజారులు, పండితులు బాబాలు, యోగులు, వగైరాల యీ దేవుడనే పచ్చిమోసాన్ని, యీ కపట దైవభక్తిని తెలిసికొని చైతన్య రహితమైన (ప్రాణంలేని) రాతి దేవుళ్ళకు పూజలు, ముడుపులు, కానుకలు, నైవేద్యాలు, భూదానాలు, వగైరాల్ని సమర్పించుకొనుట మానుకొని, చైతన్యవంతమై దేవుని ప్రతినిధి యని చెప్పబడే తోటి మానవుని కష్టాలను తమ శక్తికొలది తీర్చుటకు ప్రయత్నిస్తారని ఆశిద్దాం.

# 13

ప్రపంచంలో ప్రతి దేశంలోనూ కొన్ని స్థలాలు పుణ్య స్థలాలుగా యెంచబడు తున్నాయి. వాటిని తీర్థములు అనిగాని, తీర్థ స్థానాలని గాని అంటారు. ఈ తీర్థ స్థానాలు కొన్ని కొండల మీదను, కొన్ని నదుల ఒడ్డున, కొన్ని సముద్ర తీరాన, కొన్ని పెద్ద పెద్ద కోనేరుల వద్ద (పెద్ద చెరువుల వద్ద) యేర్పాటు చేయబడుతున్నాయి. మన దేశంలో యీ తీర్థస్థలాలు నలుమూలల యేర్పాటు చేయబడ్డాయి.

కాశీ, ప్రయాగ, హరిద్వారము, బదరీనాథ్, ద్వారకా, జగన్నాథ్, గయ, శ్రీశైలం, తిరుపతి, రామేశ్వరము మొదలైనవి మన దేశంలో పేరుపొందిన తీర్థస్థలాలు.

ప్రతి తీర్థ స్థానంలోనూ ఏదో ఒక దేవాలయం తప్పక ఉండి తీరుతుంది. ఆ దేవాలయంలోని విగ్రహానికి స్నానాలు, పూజలు, నైవేద్యాలు (తిండ్లు) వగైరాలు జరుపుటకు పూజారులుంటారు. ఆ పూజారులు ఎక్కువగా జన్మగత ఆర్య బ్రాహ్మలై వుంటారు. ఈ పూజారుల వేష భాషలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకంగా వుంటాయి.

కాశీ, ప్రయాగ, జగన్నాథం, పూరీ, హరిద్వారం, బదరికానాథ్ వగైరా ఉత్తర భారతీయ తీర్థ స్థానాలలో ఉండే పూజారులు, పౌరోహితులు, ఆ ప్రదేశంలో నివసించే సామాన్య ప్రజలవలెనే ధోతీ, కమీజు, పైనుంచి ధరించి తలమీద ముందువైపున చిన్న క్రాపు, వెనక వైపున చిన్న పిలక జుట్టు కలిగివూంటూ నొసలు మీదే నిలువుగాను, అడ్డంగానూ సన్నని బొట్టు పెట్టుకుంటారు. జందెమును ధరిస్తారు. కాని అది చొక్కా కింద పడివుండును. అందువలన తాము బ్రాహ్మలమని తెలియటానికి  మెడవద్ద జందెమును పైకి తీసికొని వుంచుకొంటారు.

ఉత్తర భారతదేశంలో పౌరోహితులను, పూజారులను పండాలు అంటారు. పండాలు తరచుగా ఖారాకిల్లీనిగాని సురతీని గాని నములుతూ ఉంటారు. ఖారాఖిల్లీ, సురతీ యీ రెంటిలోనూ పుగాకు చూర్ణము వుంటుంది. మన ఆంధ్రప్రాంతంలో చుట్ట, బీడి, సిగరెట్టు ఎంత విపరీతంగా వాడబడునో ఉత్తర భారత ప్రాంతంలో ఖారాఖిల్లీ, సురతీలు, అంత ఎక్కువగా వాడబడతాయి. ఒకవైపున హుక్కా ప్రచారం

కూడా వుంది. కొందరు నవనాగరికులు సిగరెట్టు, బీడీలు కూడా త్రాగుతారు. ఆడ మగ అందరు ఖారాఖిల్లీ, సురతీని వాడుతారు. ఇక పండాల సంగతి చెప్పనక్కరలేదు. వారు వీటిని ఎల్లప్పుడూ నములుతూనే వుంటారు.

పండాలలో గొప్ప గొప్ప ధనవంతులు కూడా వున్నారు. వారికి చదువు సంధ్యలు మన ప్రాంతంలోని పూజారులు, పౌరోహితులవలె చాల తక్కువ. ఈ పండాలు యాత్రకు వచ్చినవారినుండి దాన ధర్మాలు, దక్షిణలు గుంజుతూ వుంటారు. యాత్రికులకు ఉండటానికి వసతులను కూడా పండాలే ఏర్పాటు చేస్తారు.

వారు ముందుగానే కొన్ని యిండ్లను తక్కువ అద్దెలకు తీసికొని యాత్రికుల నుండి ఎక్కువ అద్దెలు వసూలు చేస్తూ వుంటారు. అద్దెల ద్వారా కూడా పండాలకు మంచి ఆదాయం వస్తుంది. ఈ పండాల వద్దకు యాత్రికులను తీసుకొని వెళ్ళి వప్పచెప్పటానికి కొంతమంది దళారులుంటారు. వారిని "భండరియాలు" అంటారు. వీరు ఎక్కువగా గొల్లలు, పల్లెకార్లు, చాకళ్ళు, వగైరా శూద్రులుగానే వుంటారు. కానీ వీరు తమను "జోషీ" బ్రాహ్మణులమని చెప్పుకుంటారు. వీరు శారీరకంగా చాల బలంగా వుంటారు. పండాలు వీరికి ఎల్లప్పుడూ లొంగి వుండవలసిందే. వీరు చెప్పినట్లు పండాలు తప్పనిసరిగా నడచుకోవల్సిందే. భండారియాలు యాత్రికులను దారిలోనే కలిసికొని పండాలవద్దకు వారిని తీసికొని వెళ్తారు. యాత్రికులను తీసుకొచ్చినందుకు ఒక్కక్క యాత్రీకునకింత కమిషన్ అని వీరికి పండాలు యిస్తారు. యాత్రికులు కూడా యీ భండారియాలకు కొంత సొమ్ము మామూళ్ళ రూపంలో యిస్తూ వుంటారు. భండారియాలు మన ఆంధ్రప్రాంతపు యాత్రికులను విజయవాడ వద్దనో, బరహమ్‌పురమ్ వద్దనో కలసి వారిని పండాల వద్దకు తీసుకొని వెళ్తారు. ఈ భండరియాలు యాత్రికులను నదిలో స్నానం చేయడానికి, దేవదర్శనానికి, ఏవయినా వస్తువులు కొనుక్కోవడానికి బజారుకు తీసుకొనివెళతారు. అందుకై భండరియాలకు పూజారుల నుండి, పౌరోహితుల నుండి, దుకాణదారులనుండి కొంత కమిషన్ లభిస్తుంది. ఈ రకంగా భండారియాలు కూడా చాల డబ్బును ఆర్జిస్తూ వుంటారు. ఈ భండారియాలు దక్షిణ ప్రాంతీయ భాషలను కూడా మాట్లాడ గలుగుతారు. యాత్రికులు భండారియాలకు యివ్వవలసిన

మామూళ్ళు సరిగా యివ్వని యెడల యాత్రికులను భండారియాలు పెట్టే యిబ్బందులు యిన్నిన్ని కావు. వారు కొన్ని సందర్భాలలో తిట్టటమేగాక, చేయికూడా చేసుకొనేంత మోటుగా ప్రవర్తిస్తారు.

ఇక పండాల సంగతి చెప్పనక్కర్లేదు. వీరిలోగాని, భండరియాలలో గాని దైవభావంగాని, మానవత్వంగాని చాలా తక్కువగా కన్పిస్తాయి. కాని ధనకాంక్ష, దౌర్జన్యం, మోసం ఎక్కువగా కన్పిస్తాయి. వారి నడతను వారి ధనకాంక్షను చూచిన తరువాత కాస్త వివేచనా జ్ఞానం గల యాత్రికులకు తీర్థయాత్రల మీద ఒక రకమైన విరక్తి అసూయ కలుగక మానదు. సామాన్య యాత్రికులలో కూడా తీర్థ స్థానాలలో గొప్ప పుణ్యం ఉన్నదన్న భావం కూడా సన్నగిల్లిపోతుంది.

పండాలు ముందుగానే తక్కువ అద్దెకు తీసుకుని వుంచిన యిండ్లల్లోని చిన్న చిన్న గదులలో ఎక్కువమంది యాత్రికులను రోజూ అద్దె షరతు మీద వుంచుతూ నాలుగైదు రెట్ల ఎక్కువ అద్దెను వసూలు చేసుకొంటారు. ఇరుకు గదులలో ఎక్కువమంది యాత్రికులుండుటవల్ల, ఎక్కువ మందికి ఒకే మరుగుదొడ్డి వుండుటవల్ల యాత్రికులలో ఎక్కువ మంది జబ్బు పడుతూ వుంటారు. పండాలు పిండదానాలని, తర్పణదానాలని, దక్షిణలని, సంకల్పదానమని యాత్రికులనుండి మితిమీరిన డబ్బును బలవంతంగా వసూలు చేస్తారు. యాత్రికులలో ఎవరైనా కష్టాలను భరించలేక అదేమని అంటే పండాలు గూండాలను పిలిపించి వారిని (యాత్రికులను) మర్ధన చేయించి పంపుతారు. ఒక్కొక్క పండాకింద కొంతమంది గుండాలు (పెళ్ళి పేరంటంలేని బడుద్ధాయిలు) వుంటారు. వారి పనల్లా, పండాలకు ఎదురు తిరిగిన యాత్రికులను మర్థించడమే.

పండాలు ధనవంతులైన యాత్రికులు వచ్చినట్లు పసికట్టి వారికి ప్రత్యే సౌకర్యాలనే నెపంతో వారి వద్దనుండి అమితంగా డబ్బును గుంజేస్తారు. ఒక్కొక్కప్పుడు భార్యా భర్తలు యిద్దరేవస్తే వారిని అయిపు లేకుండా మిసిమిల్లా చేసి వారి ధనాన్ని యావత్తూ అపహరించిన ఘటనలు ఎన్నోగలవట. ఈ పనులను పండాలు గుండాల ద్వారా చేయిస్తూవుంటారు. పండాలు ముందుగానే రక్షణశాఖ సోదరులకు (పోలీసువార్కి) చాలినంత లంచం యిచ్చి వారిని తమ చెప్పుచేతల్లో వుంచుకొంటూ

వుంటారు. అందువల్ల పోలీసులు ఎటువంటి హత్యనైనా బయటకు రానివ్వరట. సామాన్యంగా యాత్రికులు పుణ్యమనే మూఢనమ్మకంతో కష్టాలను లక్ష్యపెట్టక వాటిని సహిస్తూ చచ్చిచెడి చివరకు కొన ఊపిరితో యిండ్లకు చేరుకుంటారు. పండాలు, భండరియాల గూఢ భాష యాత్రికులకు అర్థం కానందున పండాలు, భండరియాలు యాత్రికులను నిలువు దోపిడీ చేసిగాని విడిచిపెట్టరు. నిజానికి యీ తీర్థ స్థలాలు పండాలు, బంధరియాలు, గుండాల కాయకష్టం చేయకుండా సుఖంగా బ్రతకటానికే యేర్పడ్డాయి. ఈ పండాలు భండరియాలు, గుండాలు ఎక్కువగా జన్మగత బ్రాహ్మలుగానే వుంటారు.

ఇక మన దక్షిణ భారత తీర్థ స్థానాలవద్దకు వద్దాం. మన దక్షిణ ప్రాంతంలో తిరుపతి, శ్రీశైలం, రామేశ్వరపురం, వగైరాలు గొప్ప పుణ్యక్షేత్రాలుగా ఎంచబడు తున్నాయి. ఈ క్షేత్రాలలో గల పూజారులు, పౌరోహితుల వేషభాషలు (కట్టు, జుట్టు, బొట్టు, ) ఉత్తర భారత దేశంలోని పండాల వేషభాఫలకు చాల భిన్నంగా కన్పిస్తాయి. మన దక్షిణ భారతదేశంలోని పూజారులు, పౌరోహితులు సామాన్య ప్రజల వేషభాషలలో వుండక వేరుగా కన్పిస్తారు.

వైష్ణవ పూజారులు తమ తలలమీద వెనుకభాగాన ఆవు గిట్టలంత వెడల్పయిన జుట్టును కలిగి వుంటారు. బిళ్ళ గోచీలు పెట్టి వెడల్పు అంచులు గల ధోవతులను పై పంచెలను ధరిస్తారు. తొమ్మిది పోగులు గల లావాటి జంధ్యాన్ని, నొసలు, ముక్కు, భూజాలు, రొమ్ము వగైరాల మీద పంగనామాలు ధరిస్తారు. కొందరు గూడకట్టు కట్టుకొని పై పంచెను ధరిస్తారు. ఎవరూ కూడా చొక్కాలను ధరించరు.

శైవ పూజారులు, పౌరోహితులు బిళ్ళగోచి పెట్టి సన్నని అంచుగల ధోవతిని, పై పంచెని ధరిస్తారు. వీరు కూడా చొక్కాలను ధరించరు. వీరు తమ తలల మీద మధ్య భాగాన సన్నని పిలకజుట్టును పెంచుతారు. వీరు కూడా తొమ్మిది పోగులు గల జందేన్ని ధరిస్తారు. నొసలు, భుజాలు, రొమ్ము వగైరాల మీద మూడు విభూతి రేఖలు అడ్డంగా ధరిస్తారు.

ఈ రకం శైవ వైష్టవ పూజారులు, పౌరోహితులు జుట్టు, బొట్టు, కట్టు వగైరా బాహ్య వేషాలతో సామాన్య ప్రజానీకానికి తాము గొప్ప సంస్కృతి (ఆచారము)

గల వారమని చూపించటానికే తంటాలు పడుతూ వుంటారు. ఈ ఆడంబరం (ఈ పై వేషం) అంతా ఆర్థికలాభం కొరకు మాత్రమే.

ఇక మనం యిపుడు తిరుపతి కొండమీదకు పోదాం. తిరుపతి కొండమీద జరిగే తంతులను, వ్యాపారాలను చూద్దాంరండి. తిరుపతి వెంకన్న ఎత్తైన కొండమీద వేంచేసి వున్నాడు. ఆయనకు పూజలు చేయు పూజారులు, ఆయన ఖజానాను కాపాడే వుద్యోగస్తులు, రక్షక భటులు (పోలీసు వారు) ఆయన భక్తులకు కావలసిన జీవితావసర వస్తువులను డబ్బుకు సప్లయి చేసే వ్యాపారస్థులు, కాంట్రాక్టుదారులు, వగైరా అమాంబాపతు వారందరి ఏకైక లక్ష్యం ధన సంపాదనగా కన్పిస్తుంది. వ్యాపారస్థులు, వస్తువులలో కల్తీ కలపడం, కొండమీద కొండ కిందకంటే ఎన్నో రెట్లు ఎక్కువై పోయిందట, పూజారులు పైకి భక్తి గలవారుగా కన్పిస్తారు. కాని వారు నిత్యజీవితం అనేక దురభ్యాసాలకు లోనై పోయిందిట. ముక్కుపొడి, ఖారాకిల్లి, నల్లమందు, గంజాయి, భంగు, చివరకు సారాయి మొదలైన మత్తు వస్తువులకు చాలామంది పూజారులు దాసులై పోయిరట. చివరకు వ్యభిచారాన్ని కూడా వారు చవిచూస్తున్నారని వినికిడి. నిజంగా వెంకన్నలో మహిమ గనుక వుంటేనూ, వెంకన్నలో మహిమ గలదనే విశ్వాసం పూజారులను నిజంగా వుంటేనూ వారు యీ రకపు నీచ కార్యాలను చేయటానికి సాహసించగలరా?లేదు. వెంకన్నలో మహిమలేదు. ఈ సంగతి పూజారులకు, అక్కడ ఖజానా వద్ద కావలి వున్నవారికి బాగా తెలుసు. కనుకనే వారు సకల భోగాలను నిర్భయంగా వెంకన్న ఎదుటనే అనుభవింప గలుగుతున్నారు.

ఇక వెంకన్న ఖజానా (డబ్బు) సంగతి చూద్దాం పదండి. వెంకన్నలో నిజంగా మహిమ గనుక వుంటే ఆయన ఖజానాకు రక్షక భటులు కావలి ఎందుకు ? మానవులను రక్షించగలవాడు తన ఖజానాను రక్షించుకోలేడా? లేదు వెంకన్నలో మహిమ లేనేలేదు. ఈ సంగతి ఆయన ఖజానా కావలి వారికి బాగా తెలుసు. అందువల్లనే అప్పుడప్పుడూ వెంకన్న ఖజానాలో నుండి కొంత ధనం మాయమై పోతూ వుంటుంది. అంటే కావలి వారు ఉద్యోస్థులు, పూజారులు ఏకమై వెంకన్నకు కళ్ళు కనపడకుండా పంగనామాలు పెట్టి ఆయన సొమ్మును కైంకర్యం చేస్తూ వుంటారు.

ఇక కొండమీది వ్యాపారుల సంగతి చూద్దాం పదండి. వ్యాపారస్థుల సంగతి వేరే చెప్పక్కర్లేదు. వారికి సంపూర్ణ స్వాతంత్ర్యము గలదు.వారు వెంకన్న కంటే కూడా ఎక్కువగా వెంకన్న భక్తులను నిలువు దోపిడి చేస్తారు. భూలోకనాధుడైన వెంకన్న యెక్క పవిత్ర కొండమీద వస్తువులను కొనేటప్పుడు బేరాలాడకూడదు. వ్యాపారస్తులు చెప్పిన ధరలకు తక్కువ అడుగుట పాపం. ఈ మూఢ విశ్వాసంతో చాలమంది యాత్రికులు బేరమాడిన పాపం తగులుననే భయంతో కళ్ళు మూసుకొని వ్యాపారస్తులు చెప్పిన ధరలకే వస్తువులను కొనేస్తూ వుంటారు. అందువలన వ్యాపారస్తులు తమ ఇష్టమెచ్చిన ధరలకు వస్తువులను అమ్ముకుని కుబేరులై పోతున్నారు. కొండమీద ఒక చిన్న దుకాణం పెట్టుకోడానికి చోటు యిచ్చినందులకు ఖరీదుగాక కొన్ని వేల రూపాయల లాభం (గుడ్‌విల్) యిచ్చేవారున్నారట. అంటే కొండమీద వెంకన్న పేరును ఆసరాగా (ఆధారంగా) చేసికొని ప్రజలను దోపిడీ చేయడానికి ఎంతైనా అవకాశం వున్నదన్నమాట. ఇక వ్యాపారులు అమ్మే వస్తువులలో కల్తీ లేని వస్తువంటూ కన్పించదు. పాపం వెంకన్న యీ మోసాలను- యీ పచ్చి మోసాలను- చూడ్డానికి ఆయన కళ్ళు కప్పబడి వుంటాయిగా. కనుక పాపం వెంకన్న యీ మోసాలు చూడజాలడు.

ఇక మత్తు పదార్ధాల వ్యాపారం సంగతి చెప్పనక్కరలేదు. రక్షణ శాఖవారు (పోలీసులు) లంచాలు తీసికొనుటకు అలవాటు పడినప్పటి నుండి యీ మత్తు పదార్థాల వ్యాపారం యింకా ఎక్కువైపోయిన సంగతి అందరకూ తెలిసిందే. గంజాయి, నల్లమందు, భంగు వంటివి దైవభక్తులైన సన్యాసులకు, సాధువులకు, గోస్వాములకు, పీఠాధిపతులకు, మహంతులకు, బాబాలకు చాల అవసరమగుతున్నాయి. వాటిని సేవించనిదే యీ దైవ భక్తులకు దైవధ్యానం సరిగా వుండదు. వారితో పాటు ఉద్యోగస్తులలో కొందరు కూడా ఈ మత్తు పదార్థాలను సేవించి దైవ సాన్నిధ్యాన్ని కాసేపైనా పొందాలని ఉవ్విళ్ళూరుతూ వుంటారు.

ఎక్కువ మత్తు కావాలనుకుంటే సారాయి, బ్రాందీ వగైరాలను సేవించెదరు. చదువుకొన్న నవనాగరికులు చాల మంది విలువగల విదేశీ సారాయిలను తమ పనులకు భంగం కలుగకుండా గుప్‌చుప్‌గ సేవిస్తూ వుంటారు. ఈ మత్తు పదార్థాలను

సేవించిన యెడల కాసేపైనా శారీరక శ్రమను మరచిపోయి సుఖించగలమనే మూఢ నమ్మకం మేధావులు మొదలుకొని పామరజనం వరకూ గలదు. అందువలన సారాయి, బ్రాందీ మొదలైన మత్తు ద్రవ పదార్థాలను వెంకన్న పూజారులు మొదలుకొని వెంకన్న పాకీవాళ్ళ వరకూ రోజుకు కనీసం ఒక సారియైనా తప్పక సేవించి తాత్కాలిక సుఖాన్ని పొందుతారని వినికిడి.

ఈ రోజులలో అన్నిటికంటే గొప్ప లాభసాటి వ్యాపారం స్త్రీల శీల వ్యాపారం (వ్యభిచార గృహాలను నడుపు వ్యాపారము). ప్రస్తుత కాలంలో నాగరికతగల ప్రతి దేశంలోనూ స్త్రీల శీల వ్యాపారం అతి జోరుగా సాగుతున్నదని చెప్పటానికి సిగ్గుతో విచారపడవలసి వస్తున్నది. ఏ జాతికైనా గౌరవ మర్యాదలను కలిగించేది స్త్రీల శీలమే (మంచి నడత). ఏ జాతిలో స్త్రీలు తమ శీలాన్ని ఎంత అదుపులో వుంచుకొంటారో ఆ జాతి అంత సాహసము, పరాక్రమము, జవసత్వాలు, గౌరవ మర్యాదలు గలదిగా వుండగలదు. ఏ జాతి నైతికంగాను, సాంఘికంగాను, శారీరకంగాను చెడిపోయిందంటే ఆ జాతి స్త్రీలు తమ శీలాన్ని రక్షించుకోటానికి తగిన, అవసరమైన అవకాశాలు యేర్పాటులు పొందలేక పోయారను కోవాలి. ఇట్టి విలువ గల బలముగల గౌరవముగల స్త్రీల శీలాన్ని పొందలేకపోయారను కోవాలి. ఇట్టి విలువగల బలముగల గౌరవముగల స్త్రీల శీలాన్ని నేడు నడి బజారులలో అమ్ముతున్నారని వింటున్నాము. ఏ జాతి యీ నీచ కార్యాన్ని ప్రోత్సహిస్తుందో ఆ జాతికి పతనం ఎప్పటికైనా తప్పదు. ఆ జాతి మరల ఆరోగ్యకరమైన మానవజాతి విత్తనాన్ని మరొక ఆరోగ్యకరమైన జాతి నుండి అరువు తీసుకోవలసి వస్తుంది. ఇటువంటి వినాశకరమైన వ్యభిచారం వెంకన్న పరిసరాల్లో (యిరుగు పొరుగున) చాటుగానే అనుకోండి, జరుగుతూ వుంటే వెంకన్న దానిని ఆపలేకపోవుట వెంకన్నలో ఏమీ శక్తి లేదనే స్పష్టంగా రుజువవుతున్నది.

కనుక తీర్థములు, పవిత్ర దేవస్థానములు, పుణ్యస్థలాలు, అని చెప్పబడే చోట్లల్లో జరిగే చెడ్డపనులు యితర సామాన్య చోట్లలో కరువై పోతున్నవట. పవిత్ర స్థలాలనుకొనే ప్రదేశాల్లో దొంగతనము, మోసము, లంజతనము, మత్తుపానీయాలు, మత్తుపదార్థాలు వగైరా వినాశకరమైన వస్తువులు చాల విచ్చలవిడిగా వీరవిహారం చేస్తున్నాయి.

పూజారులు, పౌరోహితులు, పండాలు, గుండాలు, భండారియాలు. వ్యాపారస్తులు, దళారులు, ఉద్యోగస్తులు, వగైరాల ప్రధాన లక్ష్యం పుణ్యం సంపాదించుకొనుట కానేకాదు. కేవలం ధనసంపాదనే వారి ముఖ్య లక్ష్యంగా కన్పిస్తున్నది, వీరంతా యాత్రికులను ఏ విధంగా ఆర్థికంగా బాధిస్తూ శారీరక కష్టాలు పెడుతున్నారో పైన చెప్పాము. ఇన్ని దురాచారాలకు కేంద్రాలుగా (ముఖ్యచోట్లుగా) వుంటున్న తీర్థస్థానాలు, దైవస్థానాలు వగైరాలను సేవించుట వలన కలిగే లాభాలు తక్కువ నష్టాలు ఎక్కువని అందరకూ తెలిసిందే. కాని ఈ రోజులలో మన తిరుపతి యాత్ర ఒక సర్దాగా తయారైంది. పిన్నలు, పెద్దలు, ఆడ, మగ, పండితుడు, పామరుడు, ధనవంతుడు, ధనహీనుడు, సన్యాసులు, గృహస్తులు, బిచ్చగాళ్ళు వగైరా అమాంబాపతువారు సకల భోగాలకు నిలయమైన మన తిరుపతిని దర్శించి తరించాలని తహతహలాడుచూ వుంటారు. కాని ఇటువంటి అపవిత్రమైన స్థలాలను దర్శించి తరించాలనే భ్రమను విడనాడి, సంఘంలో కటిక బీదరికాన్ని అనుభవిస్తూ కూటికీ గుడ్డకూ గూడుకూ కరువాసిపోయిన కోట్లకొలది బీదజనం యొక్క జీవితావసరాలను మనం మన శక్తికొలది తీర్చగలిగిన యెడల మనం తరించినట్లే.

# 14

దేవుళ్ళెవరికొరకు? అనే విషయం తెలిసికోవటానికి ముందు అసలు దేవుడంటే ఏమిటి? దేవుడెట్లా వుంటాడు? దేవుడు ఎప్పుడు ఎట్లా పుట్టాడు? దేవుడు ఎందుకు పుట్టాడు? అనే ప్రశ్నలు ప్రతివానికి కలుగుతాయి. ఈ ప్రశ్నలకు కొన్ని భిన్న భిన్న జవాబులు కూడా యివ్వబడిన మాట నిజం. కాని దేవుడున్నాడా? లేడా? ఈ ప్రశ్న మానవునికి తీరని సమస్యగా వుండిపోయింది. (చిక్కు విషయం) ఎంతకాలం ఎందరు చర్చించినా, ఎన్నిమతాలు ఎన్నివిధాల సమాచారం సమకూర్చినా ఈ ప్రశ్న మానవుడికి ఎదురుగా ఎల్లప్పుడూ కనిపించి సవాలు చేస్తూనే వున్నది.

మానవుడు ఏ తలుపు తీసికొని లోపలికి ప్రవేశించాడో, ఆ తలుపు తెరచుకొని బైటకు వచ్చాడు. అస్తి--నాస్తి (వున్నాడు, లేడు) వాదాలలో అంతు చూడడానికి వాటి లోతుల్ని కొలత బద్దలతో, కొలిచి కొలిచి ఆ కృషి (ప్రయత్నం) వ్యర్థమని ఆశను వదులుకొన్నాడు. ఆత్మ – పరమాత్మ వాదనలందు మునిగి మొదలు తుది కనలేకపోయాడు. ఈ విసుగుతో ఆకాశంకేసి చూసి చీకటిలో ప్రాకులాడు ఈ జీవులకు తెన్ను (దారి) చూపెడి దీపమేదీ అని విధిని (బ్రహ్మను) ప్రశ్నించాడు.

"కనులు మూసుకొని నమ్ముటేగతి" అని విధి జవాబు చెప్పింది. చివరకు ఆత్మనే పంపించాడు ఆకాశమంతా గాలించి రమ్మని. అంతటా చూసి వచ్చి "లేదు నరకము సుమ్మి! అన్నియును కూడా నాలోనే వున్నాయి" అని ఆత్మ పలికింది.

కాలం కాళ్ళకింద నుంచి జారిపోతూవుంది. ఇదమిద్ధం అని తేల్చలేని సమస్యలను గురించిన యోచనలతో (ఆలోచనలతో) జీవితాన్ని వృథాచేయక అనుభవించ గలిగిన ఆనందం అంతా అనుభవించు. *భగవంతుడు (దేవుడు) ఉన్నాడని ఏ మతంలోనూ శాస్త్రాధారాలు లేవు. అంటే మత గ్రంథాలేవీ దేవుడున్నాడని రుజువు చేయడంలేదని ఉమర్ ఖయ్యాం అంటాడు.*

ఆయన ఇంకా ఏమన్నాడో వినండి:-

"తర్క విదులు, వేదాంతులు, తరచి తరచి
ఇహము పరమని వాదించి రహముమీద
పోయె వాదాలు, వారును పోయినారు
ఇట్టి వాదాలకే అవహేళనముగ
ఇప్పుడా నోరులను మూసె ఇంతమట్టి"

దేవుణ్ణి సృష్టికర్త అని కొందరంటారు. దేవుడు అనేది నిజముగ వుందో లేదో, ఉందనుకోవడం, లేదనుకోవడం మతే గతిగ ఎవరికి వారు ఊహిస్తున్నారు. సృష్టికర్త ఎవరైనా వుండివుంటే సృష్టిని ఎందుకు చేసినట్లు? మనుషులకువలె వాడును వ్యసనములు (చెడ్డ కోరికలు) గలవాడా? అట్లయితే వాడు మానవాతీతుడు (మానవులకు అందని వాడు) మాత్రం గాడని ఖచ్చితముగా చెప్పవచ్చును. మనుషులు, పశువులు, పురుగులు వగైరాలవలె బ్రతికిన తొలి (మొదటి) రోజులలో వారికి ఆలోచనా పరిమితిలో (హద్దులో) దేవుడు అనేది ఏదో ఒకటి వుండివుంటుందని, అది కనిపించేది కాదని అనుకొని కూడ, రాళ్ళను చెట్లను, పుల్లను దేవుళ్ళనుగా కొలవడం ఆరంభమయ్యింది.

కాలక్రమంగా ఆలోచనాశక్తి పెరిగిన కొందరు మనుషులలో కాస్త శక్తి మంతులను, పరిపాలకులను, దైవములుగా ఆరాధింపసాగారు. తరువాత మరికొందరు దేవునికి రూపమంటూ లేదు, అతడు నిరాకారుడు, అని నమ్మసాగారు. ఇప్పటికీ మన దేశంలో యీ అన్ని బాపతుల నమ్మకాలు గలవారున్నారు. క్రైస్తవులు ఒకే దైవాన్ని నిర్మించుకొని సంతృప్తి పడ్డారు. అలాగే మహమ్మదీయులు (తురకలు) ఒకే దేవుణ్ణి ఏర్పాటు చేసుకొన్నారు. కాని హిందూమతస్థులు మాత్రం వేల కొలది, లక్షల కొలది కోట్ల కొలది దేవుళ్ళను నిర్మించుకొన్నారు. ఈ నాటికీ యింకా కొత్తకొత్త దేవుళ్ళను సృష్టిస్తూనే వున్నారు.

ఈ దేశంలో నాస్తికత్వం (దేవుడు లేడనేతత్వం) వ్యాపించే కొలదీ హిందూమత వ్యాపారులు (పూజారులు) పౌరోహితులు, పండితులు (సిద్ధాంతులు) యీ దేవుళ్ళను విదేశాలకు కూడా ఎగుమతిచేసి అక్కడ కూడా దేవాలయాలను

నెలకొల్పి (కట్టించి) అక్కడున్న అమాయకులను ఆర్థికంగా దోచుకోవడానికి యత్నిస్తున్నారు. ఇదంతా హిందూ పూజారి వర్గం చేస్తున్న కపట వ్యాపారం మాత్రమే.

కొందరు గారడీ విద్యలు, మెస్మరిజం నేర్చుకొని (యోగనిద్రను కలిగించే విద్య) దేవుళ్ళుగా కొనియాడ బడుతున్నారు. హిందూ సమాజాన్ని మతమనే పిశాచం లక్షా తొంభై కులాలుగా విభజించి (చీల్చి) ఒక కులం కంటే మరొక కులం ఎక్కువనీ, తక్కువనీ లేనిపోని అర్హతలను (యోగ్యతలను), అంతఃకలహాలను సృష్టించింది. ఈ మతమే సాంఘిక ఆర్థిక అసమానత్వాలను, కష్ట సుఖాలను, కలిమిలేములను, కర్మ సిద్ధాంతంతో ముడిపెట్టి వాటిలో మార్పులు రాకుండా బంధించి వుంచింది. అంతా దైవ నిర్ణయమని నమ్మించి చట్టాలను సహితం ఖాతరు చేయకుండా (లక్ష్య పెట్టకుండా) యీ ఆర్థిక దోపిడీ యధేచ్ఛగా కొనసాగే యేర్పాట్లన్నీ మూఢ నమ్మకాలతో, మూఢభక్తితో ప్రజలు అనుసరించేటట్లు చేసిందీ మతమే.

పండితులు దేవుళ్ళకు దెయ్యాలకు మతాన్ని జన్మస్థానంగా చేశారు. వారు సృష్టించిన యీ కృత్రిమ చిల్లరదేవుళ్ళను తిరిగి యీ మానవులే పోషిస్తూ పూజించేటంత అమాయకులనుగ ప్రజానీకాన్ని దిగజార్చిందీ మతమే. ఈ గుడ్డినమ్మకాలతో ప్రజలు మంచిగ ప్రవర్తింప గలుగుతున్నారా అంటే అదీ లేదు.

ఇక్కడ (మన దేశంలో) దేవుళ్ళూ ఎక్కువే, పాడుపనులు చేసే దైవభక్తులూ ఎక్కువే. పైకి గొప్ప దైవభక్తులుగా కన్పిస్తున్న వారిలో ఎక్కువ మంది సామాన్యప్రజల కంటే ఎక్కువ అవినీతి పరులుగా ప్రవర్తిస్తున్నారు.

ఇంకెందుకీ మతం? ఇంకెందుకీ దేవుళ్ళు?

ప్రపంచంలో ప్రస్తుత సమయంలో అమలులో వున్న అన్ని మతాల లక్ష్యం ఒక్కటే, సామాన్య ప్రజలను మూఢనమ్మకాలతోను, మూఢాచారాలతోనూ దేవుడున్నాడనే భయంతో, సోంబేరులైన కొంతమంది బుద్ధిజీవులు (చదువుకొన్న కృత్రిమ తెలివితేటలు గలవారు) బంధించి వారిని ఆర్థికంగాను, బౌద్ధికంగాను (బుద్ధినికూడా) దోపిడీ చేస్తూ సుఖంగా జీవితాలు గడుపుకొంటున్నారు.

నానాటికీ యీ పచ్చి మతమోసగాండల్లో పచ్చి స్వార్థం (సొంతలాభం) పెచ్చు పెరిగిపోవుటవల్ల ఒకే మతంలో అంతఃకలహాలు (వారిలో వారికి పోట్లాటలు)

రోజురోజుకూ పెచ్చుపెరిగిపోతున్నాయి. హిందూమతంలో వైష్ణవులకు శైవులకు, (నిలువుబొట్టు వారికి అడ్డబొట్టువారికి), ఇస్లామ్ (తురకమతంలో) సున్నీలకు, శియాలకు, మగపిల్లవాని శిశ్నం చివర తోలును కొంచెం కత్తిరించి వడుగు చేసుకోవాలని చెప్పేవారు, ఆ ఆచారం పనికిరాదనే వారు), బౌద్ధులలో మహాయాన, హీనయాన సంప్రదాయకులకు, (యోగాలు తంత్రాలు పనికి రావనేవారు, యోగాలు వగైరా వైదిక సంప్రదాయాలను చేర్చుకొన్నవారు), సిక్కులలో అకాలీలు, నిరంకారీలు (సిక్కు మతంలో మార్పులు వద్దనుకొనేవారు, కావాలనేవారు) మధ్య మనస్పర్ధలు (ద్వేషాలు) నానాటికీ పెరిగిపోతూవున్నందున సామాన్య ప్రజానీకం అన్ని రకాలుగా నలిగిపోతూవున్నది. కాని మతపిచ్చిగాళ్ళు మాత్రం అన్ని విధాలా హాయిగా జీవితం గడుపుకుంటున్నారు.

ప్రపంచంలో రోజురోజుకూ విజ్ఞానం (సైన్స్) విరివిగా వికసిస్తూ ప్రకృతి శక్తులు (మెరుపు, మేఘాలు, గాలి వగైరాలను) అర్థం చేసుకుంటూ, ఇంతవరకు నమ్మినవి వాస్తవం కావని గుర్తిస్తూ ఎన్నెన్నో కనీవినీ ఎరుగని గొప్ప పనులను సాధిస్తూ మారిపోతేవుంటే, మన దేశంలో మన మతాలలో, మన కులాలలో, యీ మూఢనమ్మకాలు మాత్రం పుట్టమచ్చల్లాగా మారలేకపోతున్నాయి. మనకు *దాపరిస్తున్న పాలకులు కూడ (పరిపాలకులైన రాజకీయ నాయకులు కూడ) తిరుపతి పోయి గుండు చేయించుకొని వెంకన్నకు తమ పెరిగే పెరగని బొచ్చును కానుకగా యిస్తున్నారంటే, యిదంతా సామాన్య ప్రజలను మోసపుచ్చటానికి పూజారులు, పరిపాలకులు ఏకమై పన్నిన పన్నాగమే (మోసమే).*

లక్షల కోట్లకొలది రూపాయలను యజ్ఞ యాగాదులకు దుబారా చేస్తున్నారంటే మూఢనమ్మకాలకు ఎరువులు వేసి ఏపుగా పెరగటానికి మాత్రమే. సామాన్యమనిషి తనకు గూడు (కొంప) కట్టుకోలేపోయినా, దేవుడికి గుడికట్టించడానికి యత్నిస్తున్నాడు. తనకు కడుపునిండా కూడు లేకపోయినా, దేవునికి నిత్య నైవేద్యం (రోజూ ఒకపూట తిండి) సమర్పిస్తున్నాడు. తనకు మొలచుట్టూ చాలినంత గుడ్డ లేకపోయినా, దేవునికి పట్టుగుడ్డలు కట్టపెడుతున్నాడు. తోటి బీద మానవునికి

జానెడు నేలను యివ్వలేకపోయినా, దేవునికి ఎకరాలు ఎకరాలు దానం చేస్తున్నాడు. మన దేశంలో లెక్కవేస్తే పాఠశాలలు, కర్మాగారాలు, వగైరాల కంటే, బీద ప్రజలను నిత్యం దోచుకునే "గుళ్ళు" ఎక్కువగా వున్నాయని తేలింది.

హిందూమతం అని చెప్పబడే ఛాంధస వైదిక మతంలో అంటరాని తనం యింకా వుందంటే ఆ మతం యొక్క నీచత్వానికి, నిరంకుశత్వానికి అదినిదర్శనం (మచ్చుతునక). ఈ అంటరానితనం హిందూమతానికి కుష్టురోగము వంటిది. ఏ కాలంలోనో యీ అంటరానివారి పూర్వీకులు సంఘమునకు ఏదో కీడు కలిగించే పని చేశారని యీ కాలంలో వారి బిడ్డలను యీ విధంగా అంటరాని వారని ఊరికి దూరంగా వుంచి వారలకు సాంఘిక, ఆర్థిక వనరులను లేకుండా చేసి అన్ని విధాలా అట్టడుగున వుంచుటకు నేటి ప్రపంచంలోని నాగరికతగల మానవులు సహించజాలరు. వారినిలా (అంటరాని వారిని) హింసించి నిరుపేదలుగాను, అనారోగ్యవంతులుగాను, చదువులేని వారలనుగాను చేయ ప్రయత్నిస్తున్న మానవ ద్రోహులను, సంఘవిద్రోహులను మానవత్వం యిక మన్నింపజాలదు. తగిన శాస్తి (శిక్ష) చేసి తీరుతుంది.

ఈ రోదసీ యుగంలో మన జనతా, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాములో (పరిపాలనలో) ఒక సవర్ణ హిందూ నాయకుని విగ్రహానికి పూల మాల వేసిన ఒక గొప్ప దేశభక్తుడు జన్మగత హరిజనుడుగుటచేత కదలా మెదలాలేని ఆ రాతి విగ్రహం అపవిత్రమై (చెడ్డవాసన కొట్టిందని) పోయిందని చెప్పి పరాన్నభుక్కులైన ఆ జన్మగత ఆర్యబ్రాహ్మలు కొందరు గంగాజలంతో (అందరూ స్నానం చేసిన నీటితో) కడిగి పవిత్రంగా చేసినామని తృప్తిపడిరట.

నోరూ వాయీలేని ఆ విగ్రహాన్ని ఆ మత దురహంకారులు పవిత్రంగా చేశారా? అపవిత్రంగా చేశారా? అనేది ఊహింపదగిన విషయం. ఇటువంటి మత పిచ్చిగల యీ దేశం – యీ ఆర్య భూమి– ఎంత అపవిత్రంగాను, ఎంత నీచంగాను ప్రపంచ దృష్టిలో ఎంచబడుతున్నదో యీ కూపస్థ మండూక ఛాందస వైదిక మత పిచ్చిగాండ్లకు ఏమి తెలుస్తుంది?

ఇంత అపవిత్రమైన (చెడ్డదైన), యింత అహంకారపూరితమైన, యింత

నిరంకుశమైన మతం చాటున బ్రతికే సోంబేరులైన పూజారులు, పౌరోహితులు, పండాలు, పండితులు, సిద్ధాంతులు, మఠాధిపతులు, మండలేశ్వరులు, గురువులు, యోగులు, బాబాలు, అమ్మలు మొదలైన అమాంబాపతు పరాన్నభుక్కులకు దాసోహం అని (బానిసలము), మద్దతు (సహాయం) యిస్తూవున్న యీ పచ్చి స్వార్థపూరిత పాలకవర్గం పూర్తిగా తుడిచిపెట్టుకు పోయిననాడే యీ దేశం అన్ని విధాలా బాగుపడేది.

## 15

ఆది మానవుల పుట్టుకనుగురించి మానవ శాస్త్రవేత్తలలో వేరు వేరు అభిప్రాయాలు గలవు. కాని ఆదిమానవులు ఆఫ్రికా, మధ్య ఆసియా, ఉత్తరధృవము, సుమిత్రా, జావా, ఫిలిప్పైన్స్ దీవులలో పుట్టి యుండవచ్చునని యెక్కువ మంది మానవ శాస్త్రవేతలు అభిప్రాయపడుతున్నారు. మన దేశంలోఉత్తరాన వాయవ్యమూల భూగర్భశాస్త్రవేత్తలు కొంతకాలం నుండి (1930నుండి) సింధునదీ ప్రాంతాన పశ్చిమ పంజాబ్ ప్రాంతంలో త్రవ్వకాలు ప్రారంభించగా సింధూనదీ ప్రాంతంలో మొహెన్‌జో – దారో, హరప్పా నగరాలయొక్క అవశేషాలు (శిధిలాలు) బయటపడ్డాయి. ఈ రెండు నగరాలు క్రీస్తుకు పూర్వం సుమారు 5–6 వేల సంవత్సరాలనాడు నిర్మింపబడి యుండవచ్చునని భూగర్భ శాస్త్రవేత్తలంటున్నారు. ఆనాటి నాగరికత (ఆచార వ్యవహారాలు) 5–6 వేల సంవత్సరాల పాటు ఉత్తరభారత ప్రాంత మంతటా వ్యాపించి యుండవచ్చునని పురాతత్త్వ శాస్త్రవేత్త లంటున్నారు. ఆ నగరాలను త్రవ్వగా కొన్ని మానవ పుర్రెలు దొరికాయి. ఆ పుర్రెలను పరీక్షించగా అవి ఆస్ట్రేలియా ఖండములోని

నల్లజాతివారివి వలె కన్పిస్తున్నవని కొంతమంది శాస్త్రవేత్తలంటున్నారు. కాని జావా, సుమిత్రా, ఫిలిప్పైన్స్ దీవులు ఆస్ట్రేలియాకు సమీపంలో వున్నందున ఆనాటి ఆది మానవులు కొందరు ఫిలిప్పైన్స్ దీవుల నుండి ఆస్త్రేలియాకు వలస వెళ్ళి యుండవచ్చునని కొందరి అభిప్రాయము. ఎందుకన ఆదిమానవుల పుట్టుక ఆస్ట్రేలియాలో జరుగలేదు.

కనుక హరప్పా, మొహెన్‌జో - దారోలో దొరికిన పుర్రెలు జావా ఫిలిఫైన్స్ దీవులలోని ఆది మానవులవై యుండవచ్చని ఎక్కువ మంది మానవ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. జావా, సుమిత్రా ఫిలిప్పైన్స్ దీవులలో నేటికి సుమారు 7లక్షల 70 వేల సంవత్సరాలకు పూర్వమే మానవులు పుట్టియుండిరట. కొందరు 10 లక్షల సంవత్సరాలకు పూర్వమే అక్కడ పుట్టిరని అంటున్నారు.

కాని నేటికి సుమారు 7-8 వేల సంవత్సరాలనాడు ఫిలిప్పైన్స్ దీవులనుండి ఆది మానవులు భారతదేశపు ఉత్తరభాగానికి వలస బయలు దేరారు. (దేశము విడచి పరదేశమునకు వెళ్ళుట) వారిలో కొందరు ప్రయాగ ప్రాంతములో దిగబడిపోయిరి. తక్కినవారు పంజాబులోని సింధూ నదీ ప్రాంతానికి వెళ్ళి నివసించసాగారు. వారిలో కొందరు కొంతకాలం తరువాత పశ్చిమ పంజాబ్ ప్రాంతానికి వెళ్ళారు. ఆ ప్రాంతంలో కొంత కాలానికి వారు గొప్ప గొప్ప నగరాలను నిర్మించి వ్యవసాయముతో పాటు అనేక రకాల చేతిపనులు, శిల్పము, చిత్రలేఖనము, వెండి బంగారపు నగలు వగైరాలను తయారుచేయుటలో, పశుపోషణ, పడవలు, ఓడలు నిర్మించుటలోనూ, సన్నని గుడ్డలు తయారు చేయటలోనూ గొప్ప నిపుణత్వము సంపాదించుకొనిరి. పంజాబు ప్రాంతంలోని త్రవ్వకాలలో వెలువడిన హరప్పా, మొహన్‌జో - దారో నగరాలు అగ్రశ్రేణికి (తరగతికి) చెందిన నాగరికత యొక్క స్మృతి చిహ్నాలని భూగర్భశాస్త్రవేత్తల అభిప్రాయం.

అచ్చట త్రవ్వకాలలో దొరికిన కొయ్య, వెండి, బంగారము, రాగి, ఇత్తడి, దంతము, మట్టి వగైరా పనిముట్లు, నగలు, ఎంతో అందముగాను. పనితనంగాను వున్నవట. అచ్చటి ప్రజలు విద్యలోనూ, వ్యాపారములోనూ, వ్యవసాయంలోనూ ఆరితేరిన దిట్టలుగా వుండిరట(నేర్పరులుగా వుండిరి). సన్నని వస్త్రములు, వెండి,

బంగారము, రాగి నగలు, దంతము, కొయ్య బొమ్మలు, పనిముట్లు వగైరాలను తాము నిర్మించిన ఓడలమీద ఈజిప్టు, గ్రీసు, చైనా, అరబ్, మధ్య ఆసియా వగైరా దేశాలకు ఎగుమతి చేశారట.

వారు నిర్మించిన హరప్పా, మొహెన్‌జో – దారో నగరములలో అధునిక కాలంలో (యీ కాలంలో) పాశ్చాత్య ఉన్నత దేశాలలోని నగరములలో కంటే ఎక్కువ యాంత్రిక విధానాలతో నీరు పోవుటకు, స్నానాలు వగైరాలకు ఏర్పాటు లుండినవట. ఆ నగరాలలోని భవనాలు ఇటుకరాళ్ళతో కట్టబడి వుండెను. వ్యవసాయం, పశు పోషణ వగైరాలలో చాలా అభివృద్ధిని సాధించినట్లు కన్పించెను. చిత్రలేఖనలో కూడా వారు గొప్ప నిపుణులుగా వుండిరి. వారు ఆవులను, ఎడ్లను, మేకలను, పాలు, వ్యవసాయము, మాంసము కొరకు పెంచేవారని ఊహింప బడుతున్నది. ఆనాటి ప్రజలు ఎక్కువగా శాకాహారులగా యుండి యుండవచ్చునట. మాంసాహారులు గోమాంసం వాడినట్లు నిదర్శనలు కన్పించుటలేదు. పైపెచ్చు వారు ఆవును, ఎద్దును పూజించిన నిదర్శనాలు కన్పిస్తున్నాయట. వారు దేవుని విషయం కంటే ఎక్కువగా మానవుని పుట్టుక గురించి ఆలోచించి ఆలోచించి తుదకు (చివరకు) ఆడ మగ జత కట్టుట వల్లనే మానవులు పుట్టుచున్నారని ఊహించిరి. మరికొంత కాలనికి ఆడ మగ ఏఏ అవయవాలద్వారా జత కట్టుటవలన సంతానం కలుగుచున్నదో ఆ ఆవయవాల రూపాలను రాతితో తయారు చేసికొని వాటిని పూజింపసాగారు. అంటే పరుషుని లింగము (మగగుటి) స్త్రీ భగము (ఆడగుటి) యొక్క ప్రతిమలను రాతితో చేయించి రెంటినీ మొదట విడివిడిగా పూజించారు. మరికొంతకాలానికి భగము ఆకారంగల ప్రతిమమీద లింగాకార ప్రతిమను వుంచి రెంటికీ “శివలింగము” అని పేరు పెట్టి వాటిని పూజింపసాగారు.

కొంత కాలానికి మన భారత దేశానికి మధ్య ఆసియా నుండి వలస వచ్చిన ఆర్యులు శివ లింగాన్ని పూజించే సింధు ప్రాంతపు ప్రజలను “శిశ్న దేవ పూజకులు” అని ఎగతాళి చేసి వారిని నీచంగా చూసేవారని వేదాలలో వ్రాయబడింది. సింధు ప్రాంతపు ప్రజలను ద్రావిడ జాతికి చెందినవారని చరిత్రకారులు నిర్ణయించిరి. సింధు ప్రాంతపు ద్రావిడులు మూడు ముఖాలు, కొమ్ములుగల దేవతను కూడా

పూజించేవారు.వారు లింగానికి శివుడనియు, భగమునకు దుర్గ అనియు పేరుపెట్టి పూజించేవారు. అంటే ద్రావిడుల ముఖ్య దేవుడు శివుడనియు, వారి ముఖ్య దేవి దుర్గ అనియు భావించబడుతున్నది.

కొంత కాలానికి సింధుప్రాంతీయ ద్రావిడులు దక్షిణ భారత ప్రాంతానికి ఆర్యులచేత పారతోలబడిరని కొంతమంది చరిత్ర కారుల అభిప్రాయము. ఆర్యుల చేత తరమబడి దక్షిణభారతానికి పారిపోయినపుడు సింధు ప్రాంతపు ద్రావిడులు తాము పూజించుచున్న లింగాన్ని తమవెంట దక్షిణానికి తీసుకొని వెళ్ళి దానిని అక్కడ ప్రచారం చేయసాగిరి. కొంతకాలానికి ఈ శివునికి మహాదేవుడనియు, దేవికి దుర్గ అనియు పేర్లు పెట్టి వారి విగ్రహాలను రాతితో చేయించి దేవాలయాలలో వాటిని స్థాపించి పూజింపసాగారు. మరికొంతకాలానికి ద్రావిడులు లింగము, భగము యీ రెంటి ఆకారములు గల ఒక వెండి లేక బంగారపు గుండ్రని బిళ్ళనుపెండ్లి సమయములో పెండ్లికుమార్తె మెడలో పెండ్లి కుమారునిచేత పెండ్లికి గుర్తుగా కట్టింపసాగారు. యీ గుండ్రని బిళ్ళకు "మంగళ సూత్రము" అని పేరు పెట్టబడింది. నేడు యీ మంగళ సూత్రమును దక్షిణ ప్రాంతములోని భారతీయ ఆర్యుల, అనార్యుల (ద్రావిడులు) స్త్రీలు అందరూ పవిత్రమైనదిగా ఎంచి పెండ్లి సమయములో ధరిస్తున్నారు. కాని ఉత్తర భారతదేశంలోని భారతీయ ఆర్యుల, అనార్యుల (శూద్రుల) స్త్రీలు ఎవ్వరూ పెండ్లి సమయంలో పెండ్లికి గుర్తుగా యీ మంగళసూత్రాన్ని ధరించుటలేదు. అచ్చట పెండ్లికి గుర్తుగా పెండ్లి కుమార్తె పాపటలో కుంకుమ బొట్టు పెండ్లి కుమారుడు పెడ్తాడు.

పెండ్లికి మంగళసూత్రం అశ్లీలమైన గుర్తు కనక (బూతు గుర్తు) ఇకనైనా ఆత్మ గౌరవము, అత్మాభిమానము గల ఆడవారు పెండ్లి సమయంలో యీ అశ్లీల గుర్తు అయిన మంగళసూత్రాన్ని ధరించుట మానగలరని ఆశిద్దాం.

# 16

భారతీయ ఆర్యులు మన దేశానికి వచ్చిన తొలిరోజులలో వారు మూడు తరగతులకు చెందినవారుగా వుండేవారట. వారిలో మొదటి తరగతికి చెందిన వారు రెక్క బలము, పిక్క బలము, గల యోధులు(యుద్ధం చేయువారు). వీరు మన దేశంలోని అనార్య జాతుల వారిని (ద్రావిడులు, గోండ్లు, నాగాలు, వగైరాలను) ఓడించి వారి ఆస్తిపాస్తులను స్వాధీనపర్చుకొని వారి ఆడవాళ్ళను కూడా వశపరచుకొని వారిని వాడుకొనే వారట.

ఇక రెండవ తరగతికి చెందిన వారిని పౌరోహితులనే వారు. వీరు కర్మకాండ కాలము యొక్క మంచి చెడ్డలు సంఘంలోని తక్కిన వార్కి తెలిపేవారట, మూడవ తరగతికి చెందిన వారు సామాన్య ప్రజలు. వీరు వ్యవసాయము, ఇతర పనులు చేసేవారట, పౌరోహితుల యీ సామాన్య ప్రజల పరిస్థితులు ఇంచుమించుగా ఒకేరకంగా వుండేవట.

అప్పట్లో భారతీయ ఆర్యులలో వర్ణ వ్యవస్థ (కుల వ్యవస్థ) లేనే లేదు. అందువలన అనేకమంది అనార్యులను ఆర్యులు (పౌరోహితులు) తమ సమాజంలో చేర్చుకొనేవారు. వారిని కూడా ఆర్యులు తమవలెనే గౌరవించేవారు. అనార్యులైన వశిష్టుడు, అగస్త్యుడు, కణ్వుడు, వ్యాసుడు, అంగీరసుడు, వాల్మీకి, మొదలైన ఋషులు ఆర్యులలో కలుపుకోబడిన వారే.వీరంతా అనార్యజాతి ఆడవాళ్ళకు పుట్టిన వారే. అందుకు నిదర్శనం వీరంతా నల్లని శరీరం గలవారు. ఆ రోజులలో నల్లని శరీరం గల వారంతా అనార్యులుగాని, అనార్యులకు ఆర్యులకు పుట్టిన వారుగా గాని అయి వుంటారని ఋగ్వేదంలో వ్రాయబడింది.

అనార్య జాతికి చెందిన అనేక మంది మేధావులను (తెలివిగల వారిని) శక్తీ సామర్థ్యాలు గలవారిని (శారీరక బలపరాక్రమం గలవారిని) ఆర్య జాతి పురోహితులు తమ ఆర్య జాతిలో కలుపుకొనుచుండేవారు. మరి కొన్నాళ్ళకు అంటే నేటికి సుమారు 2600 ల సంవత్సరాల క్రితం ఆర్యులు తమ జాతి గౌరవప్రతిష్టలు

(గొప్పదనం ) అనార్యులను అదేపనిగా తమ జాతిలో చేర్చుకోవడం వల్ల తగ్గిపోతున్నదనే భయంతో తమ సమాజాన్ని కొన్ని కట్టుదిట్టాలలో వుంచాలని నిశ్చయించుకొని ఋగ్వేదకాలం చివర భాగంలో తమ సమాజాన్ని నాలుగు వర్ణాలుగా (కులాలుగా) వారి వారి గుణ కర్మలను (పనులను) బట్టి విడదీసిరి, మొదటి వర్ణమువార్కి బ్రాహ్మలని, రెండవ వర్ణము వార్కి క్షత్రియులని, మూడవవర్ణము వారికి వైశ్యులని, నాల్గవ వర్ణము వారికి శూద్రులని పేర్లు పెట్టబడెను.

ఆ రోజుల్లో పంచములను వారు (అంటరాని వారు) లేనే లేరు. కాని అంటరాని వారనబడే మాల మాదెగలు యిటీవల కాలంలో పై బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల వర్ణములలో తప్పులు చేసినవారి సంతానమని శాస్త్రాలలో వ్రాయబడినదని కొందరు పండితులు అంటారు. వర్ణము అంటే సంస్కృత భాషలో "రంగు" అనే అర్థంగలదు. అంటే భారతీయ ఆర్యులు రంగును, గుణమును, కర్మను, (పనిని) బట్టి తమ సమాజాన్ని నాలుగు భాగాలుగా విడదీసి యుండవచ్చునని కొందరి అభిప్రాయము. కొంత కాలానికి యీవర్ణ శబ్దమునకు బదులు "కులము" అనే మాట వాడుకలోకి వచ్చింది. ప్రాచీన ఆర్య సమాజ విభాగము ననుసరించి బ్రాహ్మడు సంఘంలో అందరికంటే ఎక్కువ గౌరవము గలవాడుగా ఎంచబడేవాడు అతడు వేదాలు వగైరాలు చదువుకొని బ్రహ్మజ్ఞానం (దేవుని ఎరుక) సంపాదించుకొని క్షత్రియులకు, వైశ్యులకు, మాత్రమే వేదాలు యితర చదువుల్ని జ్ఞానాన్ని బోధించేవాడు. అతడు అడగకుండా అభించే ఆహార పదార్థాన్ని. పంటచేలో పడివున్న వరిగను (పైరును తీసుకొనిపోగా మిగిలిన పైరుకంకెలు) ఏరుకొని వాటితో స్వేచ్ఛగా జీవితాన్ని పోషించుకుంటూ వుండేవాడు. అతను తన యింద్రియాలను (శరీరాన్ని) అదుపులో వుంచుకొని ఓర్పుతోనూ, శాంతితోనూ, ఇతరులకు ముఖ్యంగా క్షత్రీయులకు, వైశ్యులకు మాత్రమే జ్ఞాన బోధ చేస్తూ ఉండేవాడు. అతడు మత్తుపదార్థాలను, సువాసన గల వస్తువులను, గుడ్డలను, వెన్నను, ధాన్యాదులను, అన్నమును ఎన్నడూ అమ్మకూడదు. అతడు ఎల్లప్పుడూ సంఘానికి (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు) మేలు చేస్తూ ఉండేవాడు. ఇంతేకాదు అతనికి సొంత ఆస్తి పాస్తులు వుండేవి కావు. రేటికి తిండి ఎట్లా అనే చింత వుంచుకొనే వాడు కాదు, అందువలన ఆనాటిబ్రాహ్మడు

అందరిచేత పూజింపబడేవాడు. అతనిని యిందుకే “భూసురుడు” అనేవారట. అంటే బ్రాహ్మణుడిని ‘భూలోక దేవుడు’ అనేవారట.

క్షత్రము లేక క్షాత్రము అంటే బలము, పరాక్రమము అని అర్ధములున్నాయి. క్షత్రియుడంటే బల పరాక్రమము గలవాడని అర్ధము. క్షత్రియుడు వేదాలు వగైరాలు చదువుకోవచ్చును. కాని యితరులకు చెప్పకూడదు. ఇతడు దాన ధర్మాలు, యజ్ఞాలు, వగైరా చేయవచ్చును. ఇతడు భోగ విలాసాలకు దూరంగా వుండేవాడు. ఇతడు తన భుజబలంతో పగవారి నుండి తన సమాజాన్ని రక్షిస్తూ వుండేవాడు. ఇతడు న్యాయబుద్ధితో వ్యవహారములను పరిష్కరిస్తూ ఉండేవాడు. వైశ్యుడు అంటే కోమటి, ఇతడు కూడా వేదాలు వగైరాలు చదువుకోవచ్చును కాని యితరులకు బోధించకూడదు. ఇతడు ముఖ్యంగా వ్యవసాయము, పశుపోషణ తప్పక చేస్తూ వుండేవాడు. వ్యాపారం కూడా సంఘ శ్రేయస్సు కొరకు చేస్తూ వుండేవాడు. కాని యితడు మత్తు వస్తువులను అమ్మే వాడు కాదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను “ద్విజులు” అని కూడా అంటారు. ద్విజులంటే అసలు అర్థం రెండు సార్లు పుట్టినవాడు లేక పుట్టినవి. పక్షులను ద్విజు లనవచ్చును. ఎందుకన పక్షులు ముందుగా గ్రుడ్డుగా పుట్టి తరువాత కొన్ని రోజులకు పిల్లగా మారిపోవును. ఇక బ్రాహ్మలు వగైరాలను ద్విజులనుట ఎందుకనగా యీ మూడు వర్ణములవారు పుట్టినపుడు “శూద్రులేనట, కాని జందెము వేసుకొన్న తరువాత మాత్రం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులుగా యెంచబడేవారట.

ఆఖరు వర్ణమునకు చెందినవాడు శూద్రుడు, వీడు ముఖ్యముగా అనార్య జాతికి చెందిన వాడు, వీడు ఏ విధమైన చదువులు నేర్వకూడదు. వేదాలు అసలు విననుకూడా వినకూడదు. ఇంతే కాదు. ఇతడు యుద్ధాలను గాని దేశ రక్షణ పనిగాని, వ్యవసాయం గాని, పశుపోషణ గాని, వ్యాపారం గాని ఏ యితర చేతి పని కూడా చేయకూడదు. ఇతని పనల్లా పై మూడు వర్ణముల వార్కి అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు అడ్డమైన వెట్టి చాకిరీ (కూలిలేని పని) చేయటమే. వారి యిండ్ల యందు వాకిళ్ళు ఊడ్చి, కళ్ళాపి జల్లి వారి మల మూత్రములను (ఉచ్చ, పెంట) ఎత్తి పారవేసి శుభ్రం చేయాలి. వారు తినగా మిగిలిన చల్దికూడు

ఏమైనా వుంటే వీడికి పడేసేవారు. వీడు ఈ పనులు తప్ప మరే పనినీ చేయకూడదని సంఘంలో కట్టుబాట్లుండేవి. శాస్త్రగ్రంథాల్లో కూడా ఆ కట్టుబాట్లు వ్రాయబడ్డాయి. వీడు మరేపనైనా చేస్తే వీడిని కఠినంగా శిక్షించే వారు. ఇతడు పెద్ద గుడ్డను కట్టుకోకూడదు. చాలీ చాలని తక్కువ వెడల్పు గల గుడ్డను మోకాళ్లపైకి, మొలచుట్టూ చుట్టుకొని పని చేయాలి. స్నానం కూడా ఇతడు చాల తక్కువ నీళ్ళతో చేయాలి. ఎక్కువ నీళ్ళు ఖర్చు చేయుట పాపమని ఇతనికి బోధింపడేది. ముఖము కూడా చిన్న పుల్లతో కడుక్కొవాలి. నాలుక కూడా ఎక్కువ గీచుకోకూడదు. ఇతనికి దాసుడు, దస్యుడు (దొంగ, రాక్షసుడు) ద్విజసేవకుడు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల బానిస) ద్విజ దాసుడు, జఘన్యుడు (నీచ జాతివాడు) పాదజుడు (పాదాలనుండి పుట్టిన వాడు) వృషణుడు (పాపాలు చేయువాడు) మొదలైన పేర్లు పెట్టబడ్డాయి.

నేడు మన ఆంధ్రప్రాంతంలో యీ శూద్ర వర్ణము అనేక భిన్న భిన్న కులాలు గాను. ఉప కులాలుగాను. తెగలుగాను మారిపోయింది. ఎరుకల, కంసాలి, కమ్మ, కమ్మరి, కాపు, కుమ్మరి, గవళ్ళ, గొల్ల, చాకలి, చుంద్రు, జంగం, తెలగ, దొమ్మరి, పల్లికార్లు, పెరికల, మంగలి, ముతరాజు, మేదర, యానాది, రాజు, రెడ్డి, వడ్డెర, వెలమ, వడ్రంగి, సాలి వగైరాలు శూద్రులేనట,

పూర్వకాలంలో గుణ – కర్మలను బట్టి ఆనాటి భారతీయ ఆర్యులలో వర్ణాలు ఏర్పడెనని లోగడ చెప్పాము, కాని యీనాడు భారతీయ ఆర్యుల సంతతి వారమని చెప్పుకొనే ద్విజులనబడుచున్న హిందువుల్లో గుణ – కర్మలను బట్టి గాక జన్మను బట్టి వర్ణము (కులము) గుర్తింపబడుతున్నది. అంటే ద్విజులని లోగడ కాలంలో చెప్పబడిన బ్రహ్మ క్షత్రియ వైశ్యులలో నేడు ఆయా వర్ణాలకు వుండవలసిన గుణాలు గాని, పనులు గాని ఎక్కువ మందిలో కన్పించుటలేదు. కానీ వారు తమను ద్విజులమని చెప్పుకొంటూనే వున్నారు. వారి యీచర్య (నడవడి) ఆర్య వర్ణవ్యవస్థకు పూర్తిగా విరుద్ధమైంది. అనుచితమైనది కూడా.

పూర్వకాలంలో గుణ – కర్మలను బట్టే వర్ణము (కులము) నిర్ణయింప బడేది. జన్మనుబట్టి మాత్రం కాదు. ఈ విషయం ఆర్యరుషులే తమ గ్రంథాలలో వ్రాసి పెట్టారు. ఈ విషయం ఋగ్వేదంలో ఒక ఉదాహరణ ద్వారా కూడా

చూపించబడ్డది. ఆ సంగతి మరొక చోటున యీ పుస్తకంలోనే మీరు చదవగలరు.

కనుక నేడు మరల వర్ణ వ్యవస్థను, గుణకర్మలను బట్టి మార్చనన్నా మార్చాలి లేక ప్రస్తుత హిందూ సమాజంలో వ్యాపించియున్న అవకతవక నామమాత్రపు జన్మగత కులాలను నిర్మూలింపజేసి చైతన్యవంతమైన ఒకే ఒక నవ సమాజాన్ని నిర్మించనన్నా నిర్మించాలి. ఇది జరిగిన నాడు మాత్రమే హిందూ సమాజం మరల తన పూర్వ ఔన్నత్యాన్ని, గౌరవాన్ని శక్తి సామర్ధ్యాలను పొందగలుగుతుంది.

నేడు బ్రాహ్మలమని చెప్పుకొనేవారిలో ఎక్కువమంది బ్రాహ్మడికి వుండవలసిన గుణాల్ని గాని బ్రాహ్మడు చేయదగిన పనులు గాని కలిగి వుండుట లేదన్న సంగతి లోక విదితమే. (అందరకూ తెలిసినదే) అట్టే క్షత్రీయులు, వైశ్యులు అనుకొనే వారు కూడా తమతమ వర్ణాలకు నిర్ణయింప బడిన కర్మల్ని అనుసరించి నడుచుటలేదు.

ఇక శూద్రులనబడే వారిలో ఎక్కువ మంది ద్విజుల కుండవలసిన గుణకర్మల్ని కలిగి వున్నారన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఉదాహరణకు అంబేద్కర్‌ను హిందూ సమాజం ఒకప్పుడు అపర యాజ్ఞవల్క్య మహామునియని కొనియాడింది. అట్లే నేడుశూద్రులు, పంచములు అనబడేవారిలో ఎంతో మంది ద్విజుల కుండవలసిన గుణాల్ని కర్మల్ని కలిగివున్నారు. దీనికి ముఖ్య కారణం మన దేశం మీద విదేశీయులు జరిపిన దండయాత్రల యొక్క, జైన, బౌద్ధ మతాల ప్రభావము యొక్క ఫలితంగా మన దేశంలోని తక్కువ వర్ణాలవారు (శూద్రులు, పంచములు) చదువు సంధ్యలు నేర్చి గొప్పపండితులుగాను. బలపరాక్రములు గల రాజులు గాను వ్యవసాయం వ్యాపారం వగైరాలు చేసే గొప్పగొప్ప ధనవంతులు గానూ తయారయ్యారు. ఈ విధంగా తక్కువ కులాలవారనబడే వారు చాలమంది అన్ని విధాల అభివృద్ధి చెందటానికి అన్ని అవకాశాలు లభించాయి. అందువల్ల నేడు హిందూ సమాజంలో వర్ణ వ్యవస్థ తలక్రిందులుగా మారిపోయింది.

నిజం చెప్పాలంటే జైన, బౌద్ధ, చార్వాక సాంఘిక విప్లవాల వల్లనూ, తెల్లోళ్ళ పుణ్యమా అంటూ వెనుకబడిన వర్ణాలవారిలో చాలా మందికి విద్య సంపాదించుకొని వేదాలు పురాణాల వగైరా మత గ్రంధాలను చదవటానికి అనేక

అవకాశాలు లభించాయి అందువల్ల శూద్రులు, పంచములు అనబడే వారిలో చాలా మంది సంస్కృతము, ఇంగ్లీషు, తెలుగు వగైరా భాషలలో పాండిత్యం సంపాదించగలిగారు. వారలలో కొందరు ప్రధానన్యాయధీశులుగను, కొందరు సైనికాధ్యక్షులుగను, అనేకమంది జిల్లా కలెక్టర్లుగను, అనేకమంది విశ్వవిద్యాలయాల్లో వివిధ శాఖలకు ఆచార్యులుగను, కొందరు వైస్‌ఛాన్స్‌లర్‌లుగను, నియమింప బడుతున్నారు. అనేకమంది వేదాలు, పురాణాలు, వగైరాలను క్షుణ్ణంగా చదివి వేదాంతచర్చలలో ఆరితేరిన దిట్టలుగాను. చాలమంది సాహిత్యాన్ని బాగా చదివి గొప్ప గొప్ప కవులుగాను, రచయితలుగాను. రచయిత్రులుగాను. పత్రికా సంపాదకులు గాను, ఉపాధ్యాయులుగాను. విశ్వవిద్యాలయాలకు ప్రిన్సిపాల్స్‌గానూ పనిచేయు చున్నారు. వాణిజ్యంలోనూ, వ్యవసాయం లోను, పశుపోషణలోను అనేకమంది శూద్రులు, పంచములు అనబడేవారు గొప్పగొప్ప అనుభవాలను పొంది, ప్రభుత్వము యొక్క అవార్డులను పొందగలుగుతున్నారు. గొప్ప గొప్ప పరిశ్రమలు స్థాపించి సామర్థ్యం గల పారిశ్రామిక వేత్తలుగా పేరు పొందిన వారు చాల మంది గలరు.

మన ఆంధ్రప్రాంతంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు, తాపీ ధర్మారావు, రామస్వామి చౌదరి, జాషువా, దక్షిణ ప్రాంతంలో రామస్వామి నాయకర్, డా॥ నాయర్, ఉత్తర ప్రాంతంలో రామస్వరూప వర్మ వంటి సంఘ సంస్కర్తలు, కవులు ఎంతోమంది శూద్ర పంచమ కులాలనబడే వారిలో పుట్టారు.

ఇక రాజకీయ క్షేత్రం సంగతి వేరే చెప్పనక్కర్లేదు. అనేక మంది శూద్రులు, పంచములు, అనబడే వారు మంత్రులుగాను, ముఖ్యమంత్రులుగాను, రాష్ట్రపతులు గాను, నియమింపబడుతున్నారు. నేడు విద్యాబోధ, పరిపాలన, వాణిజ్యం, వ్యవసాయం, పశుపోషణ వగైరాలు చేసేవారంతా ద్విజుల క్రింద లెక్కే.

కాని నేడు యిట్టి వర్ణ వ్యవస్థ మార్పిడికి ఛాందస హిందూ మతజన్మ గత బ్రాహ్మణ నామమాత్రపు పండితులు ఒక పెట్టున సమ్మతించరు. ఎందుకన నేడు పూర్వాచారాలు మూఢనమ్మకాలు, మూఢాచారాలు, బూటకపు దైవభక్తి వగైరాలలో మునిగియున్న చదువు సంధ్యలు తక్కువగల ఎంతో మంది ద్విజేతరులలో (శూద్రులు పంచములు వగైరాలలో) కుల మత దురభిమానాలు నాటుకొని పోయినందున

వారంతా యీ ఛాందస జన్మగత బ్రాహ్మణ బూటకపు పండితుల వెనక నిలబడి వారిని సమర్థిస్తున్నారు. వారి (ద్విజేతరుల) అమాయకత్వాన్ని, కులమత దురభిమానా లను, ఆసరాగా చేసుకొని (ఊతగా) జన్మగత ద్విజులు కొందరు సంఘంలో అరాచకాన్ని, అవినీతినీ, దౌర్జన్యాన్ని, కులతత్వాన్ని, రెచ్చగొట్టి సంఘాన్ని చిందరవందర చేసి, సంఘాన్ని బూటకపు దైవ భక్తితో నింపివేసి సంఘంలో తమ ఆధిక్యతను (పలుకుబడిని) నిలబెట్టు కోటానికి ప్రత్యక్షంగాను. పరోక్షంగాను ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల దేశంలో ఇంకా అశాంతి, అలజడులు, దోపిడీలు, అవినీతి, కుల మత తత్వాలు ఎక్కువై సంఘవిద్రోహ శక్తులు విజృంభించి సంఘాన్నిఛిన్నాభిన్నం చేయగలవు. మరియు ద్విజులమని చెప్పుకొనే జన్మగత బ్రాహ్మణులు, జన్మగత వైశ్యులు, ప్రస్తుతం వారు చేస్తున్న కార్యములే వారు జన్మగత ద్విజులే గాని గుణగత ద్విజులు కానేకారని రుజువు చేస్తున్నాయి. అంటే నేడు పూర్వం నిర్ణయింప బడిన వర్ణాలన్నీ దారి తప్పి తారుమారై పోయాయి. కనుక మానవ సమాజాభివృద్ధి కోరే వారంతా ప్రస్తుతం నేతిబీరకాయ వలె వున్న జన్మగత కులాలన్నింటినీ నిర్మూలింప జేసి ఒకే ఒక మానవ సమాజాన్ని స్థాపించి ఛిన్నాభిన్న మైన దేశాన్ని అభివృద్ధి మార్గాన నడపగలరని ఆశిద్దాం.

# 17

మధ్యఆసియా నుండి కొంత మంది ఆదిమానవులు మన శారతదేశానికి నేటికి సుమారు 4 వేల సంవత్సరాలనాడు వచ్చినపుడు, యిచ్చటి వారివల్ల గౌరవ మర్యాదలు పొందాలనే కోరికతోనే వారు తమను “ఆర్యులము” అని చెప్పుకొన్నారు. ఆర్యులు అంటే గౌరవనీయులు, పూజ్యులు, గొప్పవారు. అని అర్థం. తరువాత కొన్నాళ్ళకు మహమ్మదీయులు (తురకలు) దండెత్తి వచ్చినపుడు

వారుకూడా తమను "సాహిబ్‌లము' అని గొప్ప చెప్పుకున్నారు. సాహిబ్ అంటే మహాశయుడు, గొప్పవాడు అని అర్థం. సామాన్యంగా సాహీబ్ లేక సాహెబ్ అంటే మన తెలుగు భాషలో 'గారు' అని అర్థంకూడ కలదు. వెంకటప్పయ్య సాహెబ్ అంటే వెంకటప్పయ్యగారు అని అర్ధం. అట్టే తెల్లోళ్ళు మన దేశానికి వర్తకానికి వచ్చినప్పుడు వారుకూడా తమను "దొరలము" అని చెప్పుకొన్నారు. దొరలు అనగా యజమానులు లేక ప్రభువులు అని అర్థం. ఈ రకంగా మహమ్మదీయలు, ఆంగ్లేయులు ఆనాటి మన దేశస్తుల దృష్టిలో గొప్ప వాళ్ళ మనిపించుకోటానికని ఆర్యుల అడుగుజాడలలోనే నడచినట్లుగుపడుతోంది. మధ్య ఆసియా నుండి బయలుదేరిన ఆది మానవులలలోని కొందరు పార్శీ దేశంలోనే దిగబడిపోయి అక్కడే నివసించసాగారు. మిగతావారు మన దేశానికి వలసవచ్చి పంజాబులోని సింధునదీ తీరాన నివసింప సాగారు అందువలన పార్శీ దేశం మొదలుకొని గంగా యమునా నదుల వరకు గల భూమిని "ఆర్యావర్తము" లేక ఆర్యభూమి" అనేవారు. మహాభారతం రఘువంశం గ్రంథాలలో పారస్వ, పారసీకుల ప్రసంగం (సంగతి) కన్పిస్తుంది, అంటే పూర్వకాలంలో మన భారతదేశానికి పార్శీ దేశానికి రాకపోకలుండేవన్న మాట.

ప్రాచీన పార్శీ భాషలో సంస్కృత "స" అక్షరాన్ని "హ" గా పలికే వారట, అందువల్ల సంస్కృతి భాషలోని "సప్త" అనే పదాన్ని పార్శీ భాషలో "హప్తా" అని అంటారు. మధ్య ఆసియానుండి వచ్చిన భారతీయ ఆర్యులు సింధూనదీ తీరాన నివసించుచున్నప్పుడు మన దేశానికి వచ్చిన పార్శీకులు "సింధు" అనే మాటను "హిందూ" అని ఉచ్చరింప సాగారు. (పలుకసాగారు)ఈ విధంగా ఆర్యులు నివసించుచున్న సింధు ప్రాంతానికి "హిందు" "హిందూ" హింద్" అనే పేర్లు కల్గాయి. క్రమక్రమంగా "హిందు" అనే పేరు మనం దేశం మొత్తాన్ని చివరకు ఒక మతాన్ని తెల్పేదిగా మారిపోయింది. కాని 'హిందు' అనే మాట మన దేశ చరిత్రలో గాని, వేదాలలోనగాని, సాహిత్యంలోగాని ఎక్కడా కన్పించడం లేదు. నిజానికి హిందూ అంటే హింద్ (సింధ్) అనే చోటున నివసించే వారని అర్థం అంతేకాని అది ఒక ప్రత్యేక దేశమునుగాని మతమునుగాని తెల్పేది కాదని స్పష్టమైంది.

పూర్వ కాలంలో గ్రీకులకు పార్శీలకు రాకపోక లుండేవట. అందువలన గ్రీకులు మన దేశం పేరు తెలుసుకొని, తమ ఉచ్ఛారణను బట్టి హింద్ అనే మాటను ఇండ్ లేక ఇండికా అని అనసాగిరట. ఆంగ్లేయులు (తెల్లోళ్ళు) మన దేశానికి వచ్చినపుడు ఇండికా అనే మాటను ఇండియాగా ఉచ్ఛరింసాగారు. ఈ విధంగా మన దేశం ఇండియా అని పిలువబడిందట.

మనదేశానికి భారత్ అనే పేరు భారతీయ ఆర్యులలో ఒక రాజకుమారుని పేరిట పెట్టబడింది. అప్పటినుండి మన దేశానికి భరతఖండము. భారత వర్షము, భారత దేశము అనే పేర్లు కలిగాయి.

భారతదేశానికి వచ్చి ఆర్యులమని చెప్పుకొనే ఆదిమానవులు మొదట తమ మొలలచుట్టూ మాత్రమే మోకాళ్ళకు పైకి వెడల్పు తక్కువైన నారచీరెలను కట్టుకొనేవారట. చొక్కాగాని, పైపంచెగాని, బిళ్ళగోచీ పెట్టుకోటానికి వీలైన వెడల్పైన అంచుగల ధోవతులు గాని ధరించడమే వార్కి తెలియనే తెలియదట, ఇదే విధంగా వారి ఆడవాళ్ళకు కూడా మొలల చుట్టూ మాత్రమే నారచీరెలను ధరించి తక్కిన శరీరాన్ని పూవులతో గాని ఆకులతో గాని అలంకరించుకొనే వారట.

భారతీయ ఆర్యులు చకుముకి రాతితో గాని. రెండు ఎండిన పుల్లల రాపిడితో గాని నిప్పును తయారు చేసుకొనేవారు. వారు ఎక్కువగా పశుపోషణ చేసేవారు. చాలా కాలం వరకు వారికి వ్యవసాయం చేయటం తెలియనే తెలియదు. ఎక్కడ పచ్చిక ఎక్కువగా వుండునో అక్కడకల్లా తమ పశువుల మందను తోలుకొని వెళ్ళి వాటిని మేపుకొనుచూ అక్కడే కొంతకాలం నివసించేవారు. ఆంతవరకు వారికి స్థిరంగా ఒక చోట ఉండాలనే ఆలోచనే వుండేది కాదు.

ఆర్యుల ఆహారంలో గోమాంసం చాలా ముఖ్యమట కనుక ఎడ్లను, కోడెదూడలను మాంసం కొరకున్నూ.. ఆవులను పాలకొరకున్నూ పెంచే వారట, ఇంటికి అతిధి (ఎవరి యింటికైనను ముందుగా తెలుపకుండా తిండికై వచ్చిన పరిచయం లేని మనిషి) వచ్చినపుడు అతనికి ఆ యింటి యజమాని మధుపర్కముతో పాటు(పాలు, పెరుగు, నేయి, జలము, తేనె, పంచదార) గోమాంసము పెట్టుట గొప్ప పుణ్య (మంచి) కార్యమని యెంచబడేదట. ఇంతేకాదు అతిధికి ఆ యజమాని తన భార్యను కూడా జతకట్టటానికి యిచ్చేవాడట.

ఆనాడు భారతీయ ఆర్యులు మాట్లాడే భాష నేటి సంస్కరింప బడిన సంస్కృతమని చెప్పబడే భాషకు కొంచెం చేరువుగా వుండేదట. అందువలన ఆనాటి వారి భాషలోఅతిథిని "గోఘ్న" అనేవారట, గోఘ్న అంటే ఆవును చంపువాడు. అంటే ఎవని మూలాన మాంసము కొరకు ఆవు (ఎద్దు) చంపబడునో వానిని గోఘ్న అనేవారట. దీనిని బట్టి ఆ కాలంలో (వైదిక కాలంలో) ఆర్యులలో గోమాంసం ముఖ్య ఆహారంగా ఎంచబడేదని స్పష్టమౌతుంది.

భారతీయ ఆర్యులు నిప్పు, నీరు, గాలి, సూర్యుడు. వగైరాలను దేవతలుగా భావించి వాటికి నైవేద్యాలతో పాటు పశువులను. పక్షులను బలి యిచ్చి దేవతలను సంతృప్తి పరచామని అనుకొనే వారట. ఇంకనూ దేవతలను సంతోషపెట్టుటకని పశువులను, ధాన్యాదులను నిప్పు గుంటలలో (అగ్ని గుండాలలో) పడవేసి బుగ్గిపాలు చేసే వారట. ఈ నిప్పులలో పశువులను ధాన్యాదులను కాల్చుకొని "యజ్ఞము" అనేవారు. ఈ యజ్ఞాల ద్వారా నోరులేని అనేక పశువులు, పక్షులే గాక అనేక వేల టన్నుల ధాన్యాలు, నేయి వగైరాలను బుగ్గి(బూడిద)పాలు చేయబడేదట. ఈ యజ్ఞాలు చేయించే వారంతా పౌరోహిత బ్రాహ్మణపండితులేనట. దేవతలకు పూజలు వగైరాలు చేయు పూజలు చేయు పూజారులు కూడా బ్రాహ్మలే.

కొన్నాళ్ళ తరువాత భారతీయ ఆర్యులు చచ్చిన వార్కి "కర్మ" చేయసాగిరట. కర్మను శ్రాద్ధకర్మ లేక దినము అంటారు. ఈ శ్రాద్ధకర్మ వగైరాలు చేయించే దానము, దక్షిణలు పొందేవారంతా పౌరోహిత బ్రాహ్మలే. ఈ శ్రాద్ధ కర్మలను చేయించే పౌరోహిత బ్రాహ్మడిని ఉత్తర భారతదేశంలో "మహాబ్రాహ్మడు" అని పిలుస్తారు. మహాబ్రాహ్మడంటే నికృష్ట (నీచమైన) బ్రాహ్మడని అర్థము. ఉత్తర భారతదేశంలో శ్రాద్ధకర్మలు చేయించ యీ బ్రాహ్మలతో సహపంక్తి భోజనాలు (సరసన కూర్చుని భోంచేయుట) గాని వారితో పెండ్లిండ్లు గాని తక్కిన బ్రాహ్మలు చేయరు. కాని మన దక్షిణ భారతదేశంలో మాత్రం శ్రాద్ధకర్మలు చేయించే పౌరోహిత బ్రాహ్మడు చనిపోయిన వారి పరలోకంలో పుణ్యగతిని (మంచిస్థితిని) కలిగించగల గొప్ప మహత్తు గల పుణ్యాత్ముడని యెంచి అతనిని గౌరవించి దక్షిణలు, దానాలు, వగైరాలతో సత్కరిస్తున్నారు. కాని పౌరోహిత బ్రాహ్మలు కేవలం తమ భుక్తి (తిండి) కొరకు పన్నిన శ్రాద్ధకర్మ అనే పన్నాగాన్ని (మోసాన్ని) ద్విజేతరులు (శూద్రులు) ఎప్పుడు తెలసికోగలరో తెలియదు.

# 18

మన దేశంలోని బీదరికాన్ని, సాంఘిక అసమానతల్ని, మూఢ నమ్మకాల్ని, మూఢాచారాల్ని, దోపిడీ విధానాన్ని నిర్మూలింపజేయటానికని మనం అనేక కష్టాలను అనుభవించి బ్రిటిష్ పరిపాలనను మనదేశంలో లేకుండా చేసి వేసి మన దేశాన్ని రాజకీయస్వాతంత్ర్యం గలదిగా చేసివేశాము. కాని మన దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చి మూడు దశాబ్దాలు ( 30 సంవత్సరాలు) గడచిపోయిన తరువాత కూడా మనదేశంలో బీదరికం, రకరకాల మూఢనమ్మకాలు, మూఢాచారాలు, రకరకాల దేవుళ్ళు, కులమతతత్వాలు, వర్గద్వేషాలు, (ధనిక, పేద, భేదాలు) అనేక కొత్త రూపాలలో మతప్రచారకులు, పెట్టుబడి దారీ పరిపాలక వర్గాల (ధనికులైన పరిపాలకులు) ద్వారా నానాటికీ పెరిగి పోతూనే వున్నాయి. పూజారులు, పౌరోహితులు, సిద్ధాంతులు. పండితులు, రాజకీయ నాయకులు వగైరాల పాత్ర (జోక్యము) యీ మహాయజ్ఞంలో ఎక్కువగా కన్పిస్తున్నది. బాబాలకు, అమ్మలకు, మఠాధిపతులకు పీఠాధిపతులకు అధికార లాంఛనాలతో స్వాగతసత్కారాలు, పాలకుల ఆయురారోగ్య ములకై పూజలు యజ్ఞాలు అధికారికంగా జరిపించడము, వాస్తవజీవిత సమస్యల నుండి (కూడు, గుడ్డ, గూడు, విద్య ఆరోగ్యము) ప్రజల దృష్టిని మళ్ళించడానికి ఇది ఒక కుట్రే. ఇంద్రజాల మహత్తులు గలవని బాబాలను, అమ్మలను అకాశానికి ఎత్తడము (బాగా పొగడుట) ఇవన్నీ యీ తిరోగమన (వెనక్కుపోయే) శక్తుల విజృంభణలో (చెలరేగుటలో) భాగాలే. అందుకే నేడు జాతీయపునరుజ్జీవ నోద్యమ(జాతిని మేల్కొలుపునని) వైతాళికులు (మేల్కొలుపు వారు) రాజా రామ్‌మోహన రాయ్, ఈశ్వర చంద్రవిద్యాసాగర్, వీరేశలింగం , తాపీ ధర్మారావు రుఘుపతి వెంకటరత్నం నాయుడు. మున్నగు మహనీయుల కృషి, నవయుగ ఆంధ్ర నిర్మాతలైన గురజాడ, గిడుగు, శీశమ్రాజు, రామస్వామి చౌదరి, గోరా తదితరులు. సాగించిన ప్రగతి (అభివృద్ధి) శీల ఉద్యమాల ప్రసక్తి (సంబంధం) నేడు ఎక్కడా వినిపించడం లేదు. కాదు వినబడనిచ్చుట లేదు. వారు నిర్మించిన సంస్థలు వారి స్మృతి చిహ్నాలు

(గుర్తులు) శిథిలమైపోతున్నా ఎవరికీ పట్టదు. మూఢాచారాలవల్ల ప్రజలు మానసికంగాకూడా బానిసలై పోతున్నారు. నేడు చాలామంది స్వార్థపరులైన కొంత మంది పండితులు మూఢాచారాల్ని, మూఢనమ్మకాల్ని, ప్రోత్సహించడం క్షమించరాని అపరాధము. వారు భారత జాతికి జీవనాధారాలు భారత రామయణాలంటూ, నేటి యువతీ యువకులు తమ సత్ప్రవర్తనకు తద్వారా జ్ఞానసముపార్జనకు భారత, రామాయణాలను విధిగా చదవాలని బోధింపసాగారు. వారు యింకా యిలా సెలవిచ్చారు. భారతయుద్ధం జరిగిందో లేదోగాని 1977 లో మాత్రం జరిగింది. ధర్మం జయించింది. అంటే జనతా పార్టీ పరిపాలనలోకి వచ్చిందనియు. యిక ధర్మం నాలుగు పాదాల నడుస్తుందని వారి నమ్మకమట.

వారు భగవంతుని సాక్షాత్కారానికి తేలిక గోసాయీ చిట్కా ఒకటి బయట పెట్టారు. ప్రతి మనుజుడు సత్య ధర్మాచరణ ద్వారా తన లోని పాశవిక శక్తుల్ని (పశు స్వభావాన్ని) తొలగించుకొని తనలోని ప్రతి అణువుని అంతర్ముఖం చేసిననాడే. పరమేశ్వర సాక్షాత్కారాన్ని పొందగలుగుతారు అని సెలవిచ్చారు.

ఈ విధంగా నీతి బోధలు చేసే మహానుభావులే రెండు నడకలు నడుస్తూ శ్రీరంగనీతులు చెపుతూ తాము ఆచరించకుండా సామాన్యప్రజానీకాన్ని యింకా యీ రోదసీ యుగంలో కూడా మోసగింప ప్రయత్నించుట దుస్సాహసం కాగలదు. ఆచరణలేని ఉపదేశాలు చేయు మహానుభావులను చూడగానే ఉల్లిపాయ పండితుడు జ్ఞాపకం వస్తున్నాడు. ఆయన అందరికీ ఉల్లిపాయలు తినవద్దని చెప్పి తన భార్యతో మనకు మాత్రం ఉల్లిపాయ వాడవచ్చునని చెప్పిన విధంగా ఉపదేశించే మహానుభావుల సంఖ్య ఎప్పుడూ ఎక్కువే! కాని ఆ ఉపదేశాలను ఆచరించే వారి సంఖ్య మాత్రం చాలా తక్కువ, ఇటువంటి బూటకపు ఉపదేశాలు, సూక్తులు, నిత్యము మన రేడియో కేంద్రం ద్వారా వింటూనే వున్నాము. ఆ ఉపదేశాలు, సూక్తులు బోధలు, కబుర్లు, పురాణ కాలక్షేపణ. హరికథలు, బుర్రకథలు, చెప్పే వారంతా ఎక్కువగా జన్మగత బ్రాహ్మలే. వీరంతా ఎక్కువగా కేవలం భుక్తికొరకే యీ బోధనలను. యీ సూక్తులను చిలుక పలుకుల్లాగ వల్లె వేస్తున్నారే గాని తాము ఆచరించి ప్రజలు నిజంగా వాటిని ఆచరించాలనే ఆకాంక్షతో (కోరిక) మాత్రం కాదని గట్టిగా చెప్పవచ్చు

తాము ఆచరించకుండా చెప్పేవారి బోధలు, సూక్తులు, వగైరాలవల్ల కాలము, ప్రజల ధనము వృధా చేయటమే అవుతుంది. కాని బోధచేసే పండితులకు మాత్రం భుక్తి తప్పక లభిస్తుంది. కేవలం భుక్తి కొరకే పండితులు వగైరాలు యీ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. నిజానికి యిటువంటి ఉపదేశాల వల్ల, సూక్తులవల్ల, కబుర్ల వల్ల ప్రజలకుమేలు కలుగుట సున్న. ఇటువంటి కార్యక్రమాలను రేడియో కేంద్ర అధికారులు పండితులు వగైరాల భుక్తిని దృష్టిలో వుంచుకొని ఏర్పాటు చేస్తున్నారనుట అసత్యము కాదు. రేడియో ద్వారా చెప్పబడే ఉపదేశాలు, సూక్తులు, హరికథలు, వగైరాలను వినుటకు కష్టజీవులైన సామాన్య ప్రజానీకానికి తీరికేలేదనే సంగతి రేడియో కేంద్రం వారికి తెలియని విషయం కాదు. కాని పండితులు పోషింపబడాలిగా, ప్రజల సొమ్మును యీ విధంగా కొంతమంది సోమరిపోతులను పోషించుటకు ఖర్చుపెట్టుట ఘోర అన్యాయం. అధర్మము. కనుక రేడియో కేంద్ర కార్యక్రమ నిర్వాహకులు ఇకనైనా సామాన్య ప్రజల నిత్యజీవితాల కవసరమైన కార్యక్రమాలను ఏర్పాటు చేయగలరని ఆశిద్దాం.

## 19

నేడు ప్రపంచంలో ఎక్కువ జనసంఖ్యగల మతాలు మూడే మూడు గలవని లోగడ చెప్పాము. కానీ యీ మూడు మతాలేకాక యింకా చిల్లర మల్లర మతాలు యింకెన్నో గలవు. ఈ మతాలన్నింటి ఏకైక లక్ష్యం కొంతమంది స్వార్ధంతప్ప మరేదీ కానట్టు కన్పిస్తుంది. స్వార్ధం అంటే తన ఉద్దేశం, తన ప్రయోజనము, తన మేలు. తన లాభము, యిన్ని అర్ధాలు కలవు. లాభము అనేక రూపాలలో వుండును. ముఖ్యముగా అది మూడు రూపాలలోవుండును. ఆర్థిక లాభము, శారీరక లాభము.

ఆధ్యాత్మిక లాభము. (నైతిక లాభము). కాని నేడు స్వార్ధం అంటే కేవలం ఆర్థిక లాభంగానే అర్థం చెప్పవలసి వస్తున్నది. ఎందుకన ఎంత చదువు చదివినా, ఎంత వుద్యోగం చేసినా, ఎంత వ్యాపారం చేసినా, ఎంత సంఘసేవ చేసినా, ఎంత కూలి పని చేసినా కేవలం డబ్బుకొరకుగానే విన్పిస్తున్నది. నీతీ నిజాయితీ, పర ఉపకారము, పర సహాయము, వగైరాలు నేడు సంఘంలో ఎక్కడా కన్పించవు. ఆర్థిక లాభం విద్యవల్లనో, వ్యాపారం వల్లనో ఏ దేని శారీక పరిశ్రమ వల్లనో కలుగుతుంది. కాని మతము పేరిట పొందే ఆర్థిక లాభం వీటికి భిన్నంగా (వేరుగా) ఉంది. అది మోసంతో కూడుకొని వుంది. అంటే ప్రజలను మోసగించి వారి కష్టార్జితాన్ని బూటకపు మాటలు చెప్పి కాజేయబడుతున్నది.

నేడు ప్రపంచంలో మతము ముఖ్యంగా దేవుడనే ఆధారం మీద ఆధారపడి వుంది. దేవుడు అనేది మానవుని మొదదులో ఆర్థిక స్వార్దబుద్ధి పుట్టినప్పుడే పుట్టింది. స్వార్ధమునకు తోడు సోమరితనముతోడై స్వార్థాన్ని బలపర్చింది సోమరితనంవల్లనే స్వార్ధం చిరంజీవిగా (చావులేకుండా) వుండగలదు. మానవులలో సోమరితనం ఉన్నంతకాలం యీ స్వార్దబుద్ధి అమాయకులైన ప్రజలను దోపిడీచేసే విధానం ఉండి తీరుతుంది.

మతాలకు ఆధారం దేవుడు. దేవుడు స్వార్ధపరులు సృష్టించిన ఒక బూచి. ఈ బూచి పేరు చెప్పి. ఈ బూచీ రూపాన్ని చూపించి బూచి స్వభావాన్ని గురించి అనేక కల్పిత కథలను కల్పించి వాటి ద్వారా చదువుసంధ్యలులేని అమాయక ప్రజలనే గాక డొక్కశుద్ధిగల కొంతమంది స్వార్ధపరులైన బుద్ధిజీవులను కూడా వశపరుచుకొని శరీర పరిశ్రమ ఏమాత్రం చేయకుండా హాయిగా కొంతమంది తమ జీవితాలను గడుపుకొంటున్నారు. సోమరి తనం అనే పిశాచం పట్టి పీడించుట వలన ఎంతో మంది పండితులు అవినీతి పరులుగాను. మోసగాళ్ళుగాను, తయారై పోవుచుండుట విచారకరమైన సంగతి.

మోసముకూడా అనేక రకాలుగా వుండును. మాటలతోను. పనులతోను. ఆలోచనలతోను. సలహాలతోను ఇతరులను మోసగించవచ్చు. మాయమాటలు చెప్పి తన స్వార్ధం కొరకు యితరుల అమాయకత్వాన్ని మూఢ

నమ్మకాల్ని, మూఢదైవభక్తిని ఆధారంగా చేసికొని జీవించేవారు చాలమంది వున్నారు.

ఇక మతం సంగతికి వద్దాం. మతం దేవుని మీద ఆధారపడి వుంటున్నదని లోగడ చెప్పాము. అసలు మతం అనేది వ్యక్తిగత విషయం. అంటే ప్రతిమనిషికి సొంత విషయము. తిండి, గుడ్డలు, గూడు, వగైరాలను ఎంపిక చేసుకొనుటలో ప్రతిమనిషికీ స్వాతంత్ర్యం ఉన్నట్లే దేవుని ఉనికిని (ఉన్నాడు) గురించి స్వభావాన్ని గురించి ఆలోచన చేసి దాని ననుసరించి నడవటమే "మతము". ఇది సంఘానికి గాని, రాజకీయాలకు గాని చెందనంత వరకు దీనివల్ల హాని లేదు. కాని మతం రాజకీయాలలో గాని, సంఘంలోగాని ప్రవేశిస్తేనూ, లేక మతమే రాజకీయాలకుగాని, సంఘానికి గాని ప్రాతిపదిక (ఆధారము) అయితే ఇక ఆ రాజకీయాలలోగాని ఆ సంఘంలోగాని మానవత్వం కంటే ద్వేషాలకే ప్రాధాన్యత లభిస్తుంది.

మతముతో సంబంధం గల రాజకీయాలే ఆనాడు మన భారతదేశ విభజనకు కారణమైంది. ఆ మతద్వేషాలవల్లనే దేశ విభజనకు ముందూ, తరువాతా ఎంతో ప్రాణ నష్టం, ఆస్తినష్టం, గృహదహనాలు, బాహాటంగా జరిగిపోయాయి. మత సంస్థలు రాజకీయాలలో జోక్యం చేసుకుంటూ వున్నంతవరకూ అవి రాజకీయాలలో ప్రముఖ పాత్ర వహిస్తూ వున్నంత వరకూ మన దేశంలో ప్రజాస్వామ్యంగాని మరే రాజ్యాంగ విధానంగాని వ్రేళ్ళూన జాలదు. (స్థిరపడజాలదు) ఇంతే కాకుండా మతాలు భావి భారత పౌరులను తీర్చిదిద్దే విద్యాసంస్థలలోనూ, పాఠ్యగ్రంధాలలోనూ ప్రవేశిస్తే ఎంత చెరుపు జరుగుతుందో చెప్పనక్కర్లేదు. మన విద్యాలయాలలోని పాఠ్యగ్రంధాలలో ఎక్కువ భాగం మతసంబంధమైన పాఠాలే వుంటున్నాయి. నిజంగా విద్యాసంస్థలు చాలా పవిత్రమైనవి. ఎందుకన విద్యాలయాలు, జాతి, మత, కుల, వర్గ విభేదాలకు అతీతమైన మానవీయ వ్యవస్థలు, మానవుడు మానవునిపట్ల మానవునిగా నడచుకొనుటకు నేర్పేవే నిజమైన విద్యాసంస్థలు. కాని విద్యార్థులు చిన్ననాడే మతం మత్తులో పడిపోతే ఇక దేశ భవిష్యత్తు ఏమైపోవాలి? ప్రజాస్వామ్యం పురోగతి ఏమి కావాలి? విద్యార్థులలో సంకుచితతత్వం, అన్యమతద్వేషం, స్వీయమత దురభిమానం, బాల్యదశలోనే అనగా వికసించే దశలోనే ఏర్పడితే అవి జీవితాంతం వరకు వారి మనస్సులపైన చెరగని ముద్రవేయవా? కనుక విద్యారంగంలో మతమునకు

రాజకీయాలకు సంబంధించిన సంస్థలను ప్రవేశింప నివ్వకూడదు.

ప్రస్తుతం మన దేశంలో అనేకచోట్ల మతకలహాలు, కుల ద్వేషాలు, వగైరాలవల్ల అనేక నష్టాలు, వాటిల్లుతున్న విషయం మనం చూస్తూనే వున్నాము. మన దేశం ప్రపంచ దృష్టిలో అపకీర్తి పాలు అయిపోతున్నది. కనుక మత, కుల సంస్థలను వెంటనే మన జాతీయ ప్రభుత్వం నిషేధించాలి. లేకపోతే మత కుల సంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ వుంటే మన సెక్యూలర్ వ్యవస్థకే (మత ప్రసక్తిలేని రాజ్యాంగ విధానానికే) ప్రమాదం వాటిల్లటం తథ్యం.

# 20

దేవుడు ఎన్నడూ పుట్టలేదు. పుట్టడుకూడా, రాముడు కృష్ణుడు, బుద్ధుడు వగైరాలు పుట్టి చచ్చిరి. కాని దేవుడు యీ ప్రపంచంలో అన్ని వస్తువులలోనూ, నిప్పులోనూ, నీటిలోనూ, గాలిలోనూ, ఓషధులలోనూ, మొక్కలలోనూ, జంతువులలోనూ, మనుషులలోనూ, పక్షులలోనూ, పురుగులలోనూ, మట్టిలోనూ, ఉంటాడు, కనుక దేవుడు చచ్చే వాడుకాదు. పుట్టేవాడు కాదు అని కొంతమంది వేదాంతులంటారు.

మానవ శరీరంలో 14 లక్షల 40 వేల అనుకూల ప్రతికూల నరాలు వ్యాపించి వున్నాయి. వాటికి మధ్య ఒక గుండ్రని ఆకారంలో "ఆత్మ" ప్రకాశించునని మరికొంతమంది తత్వవేత్తలంటారు.

దేవుడు అణువకంటే చిన్నవాడు, హిమాలయములకంటే పెద్దవాడు, దేవుడు నీటిచుక్క కంటే చిన్నవాడు, ఏడు సముద్రాల కంటే పెద్దవాడు అని ఇంకొంతమంది తత్వ, శాస్త్ర వేత్తలంటారు.

దేవుడు ఇట్టి వాడని గుర్తింపదగినవాడు కాదు. ఇంద్రియాలకు (కన్ను

వగైరాలకు) కనిపించదు. దేవునిగురించి అనాదియైనవని చెప్పబడే భారతీయ ఆర్యుల మత గ్రంథములైన వేదాలు కూడా నేతినేతి (అంతము లేదు అంతులేదు ఇదికాదు ఇదికాదు) అని చెప్పి మౌనము వహించాయని చాలమంది ఋషులు చెప్పారు. దేవుడు కాళ్ళు లేకుండా నడుస్తాడు. చేతులు లేకుండా పనులు చేస్తాడు. నాలుక లేకుండా మాట్లాడుతాడు. శరీరం లేకుండా అంటుకుంటాడు. ముక్కులేకుండా వాసన చూస్తాడు. ఈ రకంగా దేవుని పనులన్నీ విచిత్రంగా కన్పిస్తాయి. ఇటువంటి దేవుడెలా వుంటాడనుకోవాలి? మనం ఎలా నమ్మాలి? దేవుడు అంతా తెలుసుకుంటాడు. కాని ఆయనను ఎవ్వరూ తెలుసుకోలేరు. అటువంటి దేవుడే పరమాత్మ, ఈశ్వరుడు అని కొంతమంది, యోగీశ్వరుడు అని కొంతమంది యోగీశ్వరులన్నారు. మనం దేవుణ్ణి కళ్ళతో చూడలేమని వేదాలే చెప్పతున్నాయి. కాని జ్ఞాననేత్రంతో ఆయనను చూడగలము, పూజాద్రవ్యాల తోనూ నైవేద్యాలతోనూ, వస్త్రాలతోనూ, నగలు, డబ్బు వగైరాలతోనూ, ఆయనను మనం చూడలేమని కొంతమంది మునులన్నారు.

ఈ ప్రపంచమంతా వ్యాపించి స్థూల సూక్ష్మ ప్రపంచమంతా తన దేహమున ధరించియున్న పరిపూర్ణ మయిన బ్రహ్మమే దేవుడని ఇంకొంతమంది వేదాంతు లంటారు. ఈ దేవునికి స్థూలసూక్ష్మ దేహాములెట్లనో అటులనే జీవులమైన మనకునూ, స్థూల సూక్ష్మ దేహాలు వున్నాయి. జ్ఞానేంద్రియాలు (కన్ను, ముక్కు, వగైరాలు) కర్మేంద్రియాలు (కాలు, చేతులు వగైరాలు) పంచప్రాణాలు (ప్రాణ,అపాన వగైరాలు) మనస్సు, బుద్ధి వీటిని కలిగివున్నది సూక్ష్మశరీరము. ఇట్టి దేహంతోకూడిన జీవులకున్నూ దేవునికి గల సంబంధం ఏమనగా దేవుని దేహమైన యీ ప్రపంచములో జీవకోటిక యంతయు తమతమ స్థూల సూక్ష్మ దేహాలతో అణువుల వలె యిమిడి వున్నాయి. కనక ఈ లోకము యొక్క క్షేమమే, (మంచి చెడ్డల)జీవులమైన మన యొక్క క్షేమము, అని మరికొంతమంది తత్వవేత్తలంటారు.

దేవుడు సృష్టి కాలమున యీ జనుల్ని సృష్టించిన వారలు కడతేరుటకై వేద శాస్త్రాలను ప్రకటింపజేసి ధర్మశాస్త్రాలని చెప్పబడుచున్న వర్ణాశ్రమ ధర్మములు ఇట్టివని యేర్పరచి యున్నాడు. వాటిలో యీ లోకంయొక్క సముదాయ క్షేమమును గలుగజేయుటయే స్వధర్మమని (మానవ ధర్మమని) చెప్పబడింది. ఆ విధమున

వాని స్వధర్మమును అనుసరించుటయే సామాన్యముగా లోకమునకున్నూ దానిచే జీవులమైన మనకున్నూ క్షేమము కలుగజేయుట. అట్లుగాక లోకమున ఇతరుల క్షేమం వేరు తన క్షేమం వేరు అని విభజించుకొని సమాదాయ క్షేమమును (సంఘ క్షేమమును) గోరక తన క్షేమమునే గోరువాడు దుఃఖమును, బంధమును పొందును స్వప్రయోజనమనునది లోకసముదాయ ప్రయోజనమును యిమిడి పోవాలి. ఇట్టి తలంపుతో ఫలాపేక్షను విడిచి లోక క్షేమమునకై వాని వాని ధర్మమును (గుణమును బట్టి నిర్ణయించబడిన) దైవార్పణముగ చేయుచుండుటయే జీవులమైన మన కర్తవ్యం. అట్లు చేసినయెడల చిత్తశుద్ధిచేత జ్ఞానము, జ్ఞానముచేత మోక్షము (సుఖమున్నూ) పొందుటకు మార్గమిదేగాని మరొక మార్గం లేదని ఇంకొంతమంది తత్వవేత్తలంటారు.

ఈ విధంగా దేవుని ఉనికి రూపము, స్వభావము, గురించి నిర్ధారణగా చెప్పగలవారంటూ ఎవరూ లేరు. అంటే దేవుని వునికిని గురించి రూపాన్ని గురించి స్వభావాన్ని గురించి యింతవరకూ ఎవ్వరూ నిర్ధారణగా ఏమీ చెప్పలేకపోయారు. కనుక దేవుని గురించిన ఆలోచనను విడనాడి దేవుని ప్రతినిధియని చెప్పబడే మానవ మాత్రునికి అవసరమైన సహాయాన్ని సమకూర్చుటే మానవులమైన మన ముఖ్యకర్తవ్యము. మన జీవిత లక్ష్యము.

## 21

ప్రస్తుతం హిందూ మతంలోబాగా పలుకుబడి, ఆర్జనగల దేవుళ్ళు కొందరున్నారు. విఘ్నేశ్వరుడు, కనకదుర్గ, వెంకటేశ్వరస్వామి (తిరుపతి వెంకన్న) కాళికాదేవి, వీరాంజనేయులు, లక్ష్మీదేవి, అయ్యప్ప మొదలైన దేవుళ్ళు ప్రస్తుతం మంచిపేరులోనూ, ఆర్జనలోనూ ఉన్నారు. రాముడు, కృష్ణుడు, విష్ణువు, శివుడు, మొదలైన దేవుళ్ళు పాత దేవుళ్ళుగా ఎంచబడుతున్నారు. అయినా కూడా వారికి కూడా భూమి, బొట్రలు, నగలు, నట్ర, దివ్యమైన గుడ్డలు, గుళ్ళు గోపురాలు,

పూజలు, నైవేద్యాలు, కూడా వుంటున్నాయి. ఈ దేవతల విగ్రహాలను సువాసన ద్రవ్యాలతో స్నానాలు చేయించి, నగలు, బట్టలు, వగైరాలతో అలంకరింప జేసి వేళకు నైవేధ్యాలు ఏడాదికొకసారి పెండ్లి పేరంటం, పవళింపు సేవ (గర్భాదానం) చేయించటానికి జన్మగత బ్రాహ్మణ పూజారులు (అర్చకులు) తైనాతులుగా వుంటారు. మనం యిప్పుడు తెలుసుకోవలసింది దేవుడు ఒక్కడా! లేక అనేక మందా? దేవునికి, పెండ్లి, సంతానము, పవళింపు సేవలు,వుంటాయా? పెండ్లాలు ఎవరు? ఆయనకు ఏ మగుదురు.?అన్ని మతాల వారికి ఒకే దేవుడా? కాదా? భార్యాభర్తలకు ఒకే దేవుడేనా? భార్యను పుట్టించిన వాడు, భర్తను పుట్టించిన వాడు వేరు వేరా? వేరు వేరు అయితే దేవుళ్ళు ఎక్కువమంది గలరా? దేవుడు పూవులు, పండ్లు కాయలు, ఆకులు, నైవేద్యాలు, పక్షులను, పశువులను, నరులను తినునా? వాటిని పుట్టించిన దేవుడు వాటిని తినునా? అంటే తాను పండించిన కూరగాయలను ధాన్యాదులను రైతులు తిన్నట్లా? లేక కూరగాయలను ధాన్యాదులను పండించని మానవులు వాటిని తిన్నట్టా?

నేడు మనమందరం శ్రీ శంకరాచార్యులు చెప్పినట్టు నేనే బ్రహ్మమును (నేనే దేవుణ్ణి) అన్న ఉపదేశాన్ని అనుసరించి మనలనే పూజించుకోవాలా? బ్రహ్మ మొదలగు గడ్డిపరక వరకు గల వస్తువులను మన ఆత్మల యెడ వున్నవిగా, ఎంచి మనం పూజించాలా? అయినప్పుడు యీ ప్రపంచంలో కుల, మత, వర్గ, లింగ, భేదాలు ఎందుకు? ఎప్పుడు కల్గాయి?

ఎవడు ఆత్మ అంతా ఒక్కటే అని భావించి నన్ను సకల చరాచర భూతాలలో (అన్ని ప్రాణులలో) ఉన్నవానిగా పూజించి భుజించునో వాడు నాయందే వున్నాడు. ప్రళయకాలంలో(చనిపోయినప్పుడు) భూతాలన్ని (ప్రాణులన్నీ) నాలోనే లీనమై పోతాయి. మరల వాటిని సృష్టించువాడను నేనే. ఇందులో దిక్కులేకుండా ఏ భూతం (ఏ ప్రాణి) వుండజాలదు. అని కృష్ణుడు భగవద్గీతలో చెప్పినప్పుడు ఇక పాఋుడు (బ్రాహ్మడు) పాకీవాడు, తురక, క్రీస్తు, మొదలయిన వారు ఎట్లు కలిగిరి? ఇక కుల, మత, భేదాలెక్కడివి?

సకల చరాచర వస్తువులలో ఎల్లప్పుడూ వున్న ఒక్కడైన వికారంలేని నన్ను

సాత్విక జ్ఞానం గల మానవుడు చూడగలడని కృష్ణుడు గీతలో చెప్పినట్లు, చూడగలిగిన వాడు నాలుగు వేదాలు చదివిన బాపనయ్యలో (బ్రాహ్మలలో) నే లేరే, యిక సామాన్య మానవులలో నేడు కన్పించే భక్తులు, సన్యాసులు, యోగులు, మఠాధిపతులు, పీఠాధిపతులు, బాబాలు, సాత్వికజ్ఞానం గలవారని నమ్మగలమా? ఇప్పుడు రాతి విగ్రహాలకు దేవుళ్ళని పేరుపెట్టి కొంతమంది స్వార్థపరులు వాటిని అపహాస్యంపాలు (నవ్వుల పాలు, ఎగతాళి పాలు) చేస్తున్నారు. వాటిని గురించి కొంతమంది కవుల అనుభవాలను చూడండి:

1. ప్రతిమల పెండ్లి సేయుటకు
వందలు వేలు వ్యయించు గాని
దుఃఖిత మతులైన పేదల
పకీరుల శూన్యములైన న పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని
ముప్పది మూడు కోట్ల దేవత
లెగబడ్డ దేశమున భాగ్య వి
హీనుల క్షుత్తులారునే?

2. ముక్కు మొగము జెక్కి మూలవిరాటంచు
నొక్కరాయి దెచ్చి యుంచి గుడుల,
గూడు, గుడ్డలిచ్చి కొల్తురు ప్రజలెల్ల
గొంటె పనులగావె కుప్పుస్వామి

3. మల మల మాడు పొట్ట
తెగ మాసిన బట్ట
కలంత బెట్టగా,
విల విల యేడ్చుచున్న
నిఱు పేదకు జాలిని
జూపకుండను
త్తల పడి పోయి

జీవరహితంబగు
బొమ్మకు నిండ్లు వాకిళుల్
పొలమును బొట్ర నిచ్చెడి
ప్రబుద్ధ వదాన్యుల
నిచ్చుమెచ్చెదన్॥

4. ఇప్పుడు గుండురాతివలె నీశ్వరుడై (లింగం)
ముడుపుల్ గ్రహించు కోటప్ప యొకానొక్కప్పుడు
గృహస్థుడు మానవమాత్రులైన రాల్రప్పలు
వేల్పులై సకల రాసులు మ్రింగక మిన్నకుండునే?

5. నను సృష్టించినవాడె నా వెనుక జన్మం బెత్తునే.
నోరెఱుఁగని నన్నీ పదివేల రూపములతో
కంగారు గావించునే?
కనకం పుం గుడిగోపురాల్లనకు కాంక్షించునే?
కానుకల్గొనునే? యిట్టివి మోసగాండ్రయిన
భక్తుల్ పన్ను పన్నాగముల్ ॥

6. ఈ టకబొంకు లేమిటికి ?
నిల్లును వాకిలి గట్టిపెట్టి
యేటేటను బెండ్లి సేయమని
యే నెపుడు నిను గోరియుంటినే ?
ఏటికి నీ యబద్ధ మరరే । యిక
సాగునే ధూర్త మానవా ?

7. ఏ నొక జాతి కూడు భుజియించుచు
మిక్కిలి తక్కు జాతుల హీనముగాగ జాతునని
యెవ్వరు చెప్పిరి నీకు వంచకా ?
మానవు లందరున్ సరిసమానులు
గారొకొ నాకు ? మాయురే ?

మానక నీవ యిట్టి యవమానము
జేతువె ధూర్త మానవా ?

8. చిత్రమే కద । జనుల చరిత్ర చూడ.
చచ్చిపోయిన వారిలో మచ్చునకును
ఒక్కరును రారు చెప్పగా అక్కడి కథ
కాలమైపోయి మనము అక్కడకు చేరి
తిరిగి రాలేము ఆ కథ తెలుపలేము

9. మీనంబెప్పుడు నీటనే మున్గు
దామేషంబు పర్ణాశనందే
నిత్యం బొనరించు
బాము పవనంబే గ్రోలునే ప్రొద్దు
నద్దాన న్వానికి నేనమి పుణ్యఫల
మొంచ గల్గెను ?

10. ఎన్ని రసములున్న నేను రుచించును
నుప్పులేని కూర చప్పనగును
కోటి గుణములున్న గోఁగావు నీతి
యొక్కండు లేకయున్న ॥

11. చచ్చిపోయిన వెంటనే జన్మమెత్తు
జీవి, కుడువ గర్మ మటందు జెప్పుచుందు
రిట్టులైనచో పితృలోక మెట్టు వచ్చు
గుటిల జనవృష్టి గాదొక్క ?

12. పలికి ఎరుగని నిర్జీవ ప్రతిమ కెపుడు
పట్టు పీతాంబరము గట్టబె ట్టెదీవు
వస్త్రమే లేక చలిలోన వడకిపోవు
మానవులపైన నీ దృష్టి మరలదేల ?

13. డొక్క నిండుగ కతికెడు కుక్క కెపుడు

పెరుగు పాల్వెన్న మీగడల్ పెట్టెదీవు
కడుపు మంటతో కాలంబు గడుపు నట్టి
కటిక పేదపై దృష్టి కలుగదేల ?

14. పందులను గాడిదల నెత్తి పాముకొనిన
స్నానమను మాట తలవవు గాని నీవు
మానవుని తాకినంతనె మైల పోవ
శుద్ధి జేయించుకొనెడు దుర్బుద్ధి ఏల ?

15. గుడివిడిచి రావోయి. ?
మడి విడిచి రావోయి ?
గుడిలోని రాతిలో
ముడి వద్ద దేవుడా ॥

16. గుడిమైల వద్దదోయీ ।
యింకేల గుడినంటి యుందువోయీ ।
మడత గోచుల వారి
పిడివాదముల వారి
చెడు తిట్ల జల్లులో
గుడిమైల పద్దదోయీ ॥ గుడి॥

17. దేవాలయంబులో
నిర్జీవ ప్రతిమలో
లేదురా । దేవుండు
లేదురా । లేదురా ॥

18. మానవ శవాల మంటపాలపై
ప్రభువుల పతాక లెగిరే భువిలో
రాతి విగ్రహం రక్షించునా ?
పూజా మంత్రం బువ్వెట్టునా ?

క్రీస్తు శకము 3వ శతాబ్దంలో (300) ఉత్తర భారత దేశంలో కౌరవులు, పాండవులు, యాదవులు, శాక్యులు, ఇంకా కొన్ని క్షత్రియ వంశములలో బౌద్ధమతము పూర్తిగా వ్యాపించి వుంది. అందువలన క్షత్రియులంతా యజ్ఞాలు, పశుబలులు, శ్రాద్ధకర్మలు, వగైరా ఛాందస పౌరోహిత బ్రాహ్మణ సంప్రదాయాన్ని పూర్తిగా మాని వేసిరి. అందువలన పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయం పూర్తిగా దెబ్బతిని పోయింది. బ్రాహ్మలకు సంఘంలో ఆర్థికంగా గొప్ప నష్టం సంభవించింది. సంఘంలో ముఖ్యంగా క్షత్రియ సంఘంలో పౌరోహిత బ్రాహ్మలకు గౌరవం పూర్తిగా లేకుండా పోయింది. అందువలన పౌరోహిత బాహ్మలు తమ బ్రాహ్మణ సంప్రదాయాన్ని పునరుద్ధరించు కోటానికి కుతంత్రాలు ఆలోచింపసాగారు. వారు తమలో తాము బాగా ఆలోచించుకొని "చొప్పను చొప్పతోనే కట్టాలనే" సామెతను గుర్తు చేసుకొని బౌద్ధ మతస్థులైన క్షత్రియులను క్షత్రియుల ద్వారానే పౌరోహిత బ్రాహ్మణ సంప్రదాయం లోనికి మరల మార్చుడమో లేక వారిని హతమార్చుడమో (చంపించడమో) జరిపించాలని ఒక కుట్ర పన్నసాగారు.

పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయాన్ని ప్రజలలో ప్రచారం చేసి దానిలో గల సందేహాలను నిర్మూలింపగల ఉపదేశము చేయగల ఒక గొప్ప క్షత్రియుడు వారికి కావలసివచ్చి అతనికై వెతకసాగారు. ఎందుకన ఆ ఉపదేశకుడు క్షత్రియుడుగా వుంటేనే క్షత్రియులకు నచ్చుజెప్పి వప్పించగలడని వారి నమ్మకం. కనుక ఈ పనికై యాదవ వంశస్థుడైన శ్రీకృష్ణుడు అన్ని విధాలా తగిన వాడని తెలిసికొని ముందు ఆయనను తమ సంప్రదాయం లోనికి మార్చుడానికి పౌరోహిత బ్రాహ్మలు ప్రయత్నింపసాగిరి. శ్రీకృష్ణుణ్ణి ఒక గొప్ప మహిమగల వ్యక్తి అనియు, అవతార పురుషుడనియు ప్రజలలో ప్రచారం చేయగోరిరి. కాని శ్రీకృష్ణుని తమ పౌరోహిత బ్రాహ్మణ సంప్రదాయంలోనికి ఏ ఆధారంతో మార్చాలా అని ఆలోచింపసాగిరి. ఆ రోజులలో యాదవ వంశస్థులైన క్షత్రియులకు తక్కిన క్షత్రియ వంశస్థులలో అంత గౌరవము వుండేది కాదట. అందులోనూ శాక్యవంశపు క్షత్రియులు యాదవ వంశపు క్షత్రియులను క్షత్రియులుగా భావించి గౌరవించేవారు కాదట. అందువల్ల శాక్యవంశపు క్షత్రియులకు యాదవ వంశపు క్షత్రియులకు మొదటి నుండీ పరోక్షంగా ద్వేషాలుండేవి.

కాని బుద్ధుని పవిత్ర ఆచరణ జ్ఞానం, కులాభిమానం మొదలైన వాటి ప్రభావం వల్ల క్షత్రియులనబడే వారందరూ తమతమ ద్వేషాలను మరచిపోయి బౌద్ధమతాన్ని స్వీకరించారు. కనుక వారిని పౌరోహిత బ్రాహ్మణ సంప్రదాయంలోనికి మార్చటానికి గాని, హతమార్చటానికిగాని ధైర్యముగల బుద్ధుని వంశానికి బద్ధవిరోధియైన వ్యక్తి శ్రీకృష్ణుడేనని నిశ్చయంచుకొని పౌరోహిత బ్రాహ్మలు శ్రీకృష్ణుని చెంతచేరి ఆయనకు తమపన్నాగము ప్రకారము శాక్యులకు ఆయన వంశమునకుగల పూర్వపువైషమ్యాలను రగుల్కొలిపి ఆయనకు పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయాన్ని గురించి బాగా నూరిపోసి ఆయనను పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయంలోకి మార్చివేశారు. ఈ విధంగా పౌరోహిత బ్రాహ్మలు కుట్రను పన్ని బౌద్ధమతస్థులైన క్షత్రియులందరినీ పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయం లోనికి మర్చే బాధ్యతగాని, హతమార్చే బాధ్యతను శ్రీకృష్ణునికి వప్పజెప్పి తాము వెనుకనుండి సమస్త సలహాలను, ఆలోచనలను చెప్పసాగిరి.

తరువాత శ్రీకృష్ణుడు పౌరోహిత బ్రాహ్మణులు ఏకమై ముఖ్యంగా కౌరవులను, పాండవులను తిరిగి పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయం లోనికి మార్చడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాని కౌరవ పాండవులే కాదు క్షత్రియులన్న వారెవ్వరూ బౌద్ధమతాన్ని వదలిపెట్టటానికి యిష్టపడలేదు. ఎందుకన ప్రజలు పౌరోహిత బ్రాహ్మల దౌర్జన్యం. అహంకారం, పశుహింస మొదలైన వాటివల్ల విసిగిపోయారు. ఇప్పుడు ఏదో ఒక పన్నాగము పన్ని ముందు కౌరవులలోనూ, పాండవులలోనూ ద్వేషం కలిగించాలని పౌరోహిత బ్రాహ్మలు శ్రీకృష్ణుడు నిశ్చయించుకొని ఆలోచింపసాగిరి అదే సమయంలో కౌరవులకు పాండవులకు రాజ్యవిభజన వ్యవహారంలో తగాదావచ్చెను. పాండవులకు అయిదు గ్రామాలు కూడా ఇచ్చేది లేదని కౌరవులు ముఖ్యంగా ధుర్యోధనుడు అనేటట్లు కొంతమంది పౌరోహిత బ్రాహ్మలు కృత్రిమ బుద్ధితో పన్నాగము పన్నారు. అటు శ్రీకృష్ణుడు పాండవుల తరపున తమ వాటాకై పట్టుపట్టమని పాండవులను ముఖ్యంగా అర్జునుని, భీముని రెచ్చగొట్టాడు. ఇటు కౌరవులను ముఖ్యంగా దుర్యోధనుని రెచ్చగొట్టిరి కొంతమంది బ్రాహ్మలు, అందువల్ల ఉభయులు (కౌరవులు పాండవులు) ఒకరినొకరు ద్వేషించు కొనసాగిరి. ఉభయులు రాజీపడి యుద్ధం చేయరేమోననే భయంతో కృష్ణుడే ఒక కృత్రిమ రాయబారాన్ని

నడిపి తుదకు రాజీ పడకుండా ఉభయులను రెచ్చగొట్టి యుద్ధానికి సన్నద్ధులనుగా చేశాడు. ఆయన ఒక్కడే పాండవుల తరపున యుద్ధం చేయటానికి కావలసిన యేర్పాటులన్నీ చేశారు. చివరకు ఉభయుల సేనలలోనూ లక్షలాది బౌద్ధ మతావలంబులైన క్షత్రియలు చేరారు. పౌరోహిత బ్రాహ్మలు శ్రీకృష్ణుని పదిల పరచటానికి గాను ఆయనను వారు విష్ణువు యొక్క అవతారమనియు ధర్మమూర్తి అనియు, మావనజాతి రక్షకుడనియు దుష్టులను శిక్షించి ధర్మాన్ని స్థాపించువాడనియు, గొప్ప మహిమ గల వాడనియు అదేపనిగా పొగడారు. వారి వట్టొట్టి పొగడ్తలను గ్రహించక వాటికై ఉబ్బిపోయి శ్రీకృష్ణుడు తాను నిజంగానే అవతార పురుషుడననియు, ధర్మ సంస్థాపకుడననియు అనుకొని యుద్ధంలో న్యాయాన్యాయాలను, ధర్మాధర్మాలను, సత్యాసత్యములను పాటించక కాస్త కాల్చుకోమంటే వళ్ళంతా కాల్చుకున్నట్లు పౌరోహిత బ్రాహ్మల వైష్ణవ మాయలో పడిపోయాడు.

తాను ఒక్కడే పాండవుల తరపున తన సేనంతా కౌరవుల తరపున యుద్ధంలో పాల్గొనన్నుట్లు ఒడంబడికలు చేసుకొని తాను మాత్రం చక్రంపట్టి యుద్ధం చేయనని కపటమాటలతో పదిమంది ఎదుట ప్రతిజ్ఞచేసి తీరా అర్జునునకు భీష్ముని వల్ల అపాయము సంభవింపబోవుతున్నదని భయపడి తటాలున తన ఆయుధమైన చక్రాన్ని పట్టుకొని రథమునుండి దూకి భీష్మునితో యుద్ధానికి తలపడటానికి కపటనాటకము చేసినపుడు ఆయన (శ్రీకృష్ణుని, ప్రతిజ్ఞ భంగమైపోవు ననియు, తాము (పాండవులు) న్యాయము, సత్యము వగైరాలను పాటించువారని జనం అనుకోటానికై అర్జునుడు రథంనుండి దిగివచ్చి శ్రీకృష్ణుని వాటేసుకొని యుద్ధం చేయనివ్వకుండా కపట నాటకం ఆడాడు. యుద్ధంలో యిదొక కపట నాటకమేగాని వాస్తవమైన యుద్ధచర్య మాత్రం కానేకాదు. ఈ విధంగా కపటము, మోసము, అన్యాయము, అసత్యము, క్రూరత్వము, వగైరాలతో కర్ణుడు, దుర్యోధనుడు, అశ్వద్ధామ వగైరా యోధులను శ్రీకృష్ణుడు ప్రత్యక్షంగాను. పౌరోహిత బ్రాహ్మలు పరోక్షంగానూ పాల్గొని కొన్ని లక్షల మంది క్షత్రియులను బౌద్ధమతస్థులగుట వల్ల దయాదాక్షిణ్యాలు లేకుండా హతమార్చారు.

ఈ విధంగా పౌరోహిత బ్రాహ్మలు శ్రీకృష్ణుని ఒక కీలు బొమ్మగా చేసి అతని ద్వారా బౌద్ధమతస్థులైన లక్షలాది క్షత్రియులను విత్తనము లేకుండా సర్వనాశనం చేయించి పౌరోహిత బ్రాహ్మల సంప్రదాయాన్ని అంటే యజ్ఞాలు, పశుబలులు, కర్మకాండలు, దానధర్మాలు, దక్షిణలు వగైరాలను తిరిగి మిగిలిన ప్రజలలో బలవంతంగా అమలుజరుప సాగారు. వారు తిరిగి సంఘంలో గౌరవస్థానం సంపాదించటానికి గల అన్ని అవకాశాలను కల్పించుకొని నెమ్మది నెమ్మదిగా యథాస్థితికి రాగలిగారు.

ఈ యుద్ధానికి మహాభారత యుద్ధం అని పేరు పెట్టి, యిది న్యాయం కొరకు సత్యంకొరకు, నీతి కొరకు జరిగిన యుద్ధం అని పౌరోహిత బ్రాహ్మణ పండితులు గ్రంథాలలో రాసేశారు. ఈ యుద్ధం బౌద్ధమతస్తులైన క్షత్రియులను నాశనం చేయటానికి జరిగిందే గాని అన్నదమ్ములు రాజ్యవిభజనకై చేసిన యుద్ధం మాత్రం కాదని అనేక నిదర్శనాలు ఉన్నాయి. కాని ఆ రోజులలో చదువు సంధ్యలు పౌరోహిత బ్రాహ్మల చేతిలో ఉండుట వల్ల వారు తమ యిష్టమొచ్చినట్లు తమకు అనుకూలంగా గ్రంధాలలో రాసి వేసికొన్నారు.

నేడు మత ప్రసక్తి లేనిదని పైకి చెప్పబడే కాంగ్రెస్, ప్రజాస్వామ్య ప్రభుత్వాల హయాంలో తిరిగి యజ్ఞాలు, శ్రాద్ధకర్మలు, తర్పణలు, దానాలు, దక్షిణలు వగైరాలతో ఆటు మఠాధిపతులకు, పీఠాధిపతులకు బాబాలకు, సన్మానాలను, కొత్త కొత్త దేవుళ్ళకు ఆలయాలు, కొత్త మసీదులు, కొత్త చర్చిలు, రామమందిరాలు, భజనసమాజాలు, మొదలైనవి వానా కాలపు చిరు కప్పల వలె మందలు మందలుగా పుట్టుకొస్తున్నాయి. వాటికి ఆర్థిక (డబ్బు) సహాయం, అనుమతి, మతప్రసక్తి లేని కాంగ్రెసు, జనతా ప్రభుత్వాల పుణ్యమా అంటూ లభిస్తున్నాయి.

మన ప్రభుత్వ శాసకులు బాబాల, అమ్మల, పీఠాధిపతుల, మఠాధిపతుల ఆశీర్వచనాలను పొంది నిష్పాపులగుటకు (పుణ్యాత్ములగుటకు) తహ తహ జెంది వారి (బాబాలు వగైరా) పవిత్ర పాదధూళిని (దుమ్ము) తమశిరస్సులందు ధరించి తరింప గోరుతున్నారు.

ఈ మఠాధిపతులు, పీఠాధిపతులు, బాబాలు, యోగులు, అమ్మలు,

ఎక్కువమంది బ్రాహ్మలేనట.

పౌరోహిత బ్రాహ్మణ పండితులు లోగడ రామరాజ్యంలో జరిగిన అన్యాయాలను తిరిగి నేడు మన ప్రజాస్వామ్య పరిపాలనా కాలంలో కూడా నిర్భయంగా చేయించడానికి, చేయడానికి పరోక్షంగా ప్లానులు (ప్రణాళికలు) శాసకుల సహాయంతో పన్నసాగారు. ఉదాహరణకు బ్రిటిష్ పరిపాలనా కాలంలో కంటే నేడు స్వతంత్ర భారతదేశంలో శ్రాద్ధకర్మలు, యజ్ఞాలు, సంస్కృత భాష వ్యాప్తి, పురాణాలు, హరికథలు, దైవస్తోత్రాలు, సుప్రభాతాలు, వగైరాలను రేడియో కేంద్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలను జరుపు వారలలో ఎక్కువమంది జన్మగత బ్రాహ్మలే.

ఈ రకంగా ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేనివి చదువు కొన్న ద్విజులకు మాత్రమే ఉపయోగపడే కార్యక్రమాలకై కష్టజీవులైన కార్మిక కర్షకుల కష్టార్జితం దుబారా చేయబడతోంది. ఇందుకు కారణం ప్రస్తుత మన దేశంలో ప్రజా బాధ్యతలేని ప్రభుత్వాలు అమలులో ఉండుటే. మరియు పరిపాలకులు ఛాందస భావాలు గల పూర్వాచార భూస్వామి వర్గాలకు చెందిన వారగుటవల్ల ప్రజల కష్టార్జితం యీ విధంగా బుగ్గిపాలు చేయబడుతోంది. ఎంతకాలం వరకు నిజమైన ప్రజా ప్రతినిధుల ప్రభుత్వం స్థాపింపబడదో అంతకాలం వరకు యీ ధార్మిక (మత సంబంధమైన) సాంఘిక ఆర్థికదోపిడీలు జరుగుతూనే ఉంటాయి. కనుక నిజమైన ప్రజా సేవకులు త్యాగము, సాహసము, పట్టుదల, సహనము, (ఓర్పు) వహించి సామాన్య ప్రజలలో విద్యను, సత్ప్రవర్తనను. శ్రమ చేయుటను బోధించి వారిని విద్యావంతులుగానూ, నీతివంతులుగాను, చైతన్యవంతులు గాను చేసిననాడు యీ దోపిడీలు చేసే, చేయించే నరహంతకులు మటుమాయమై పోతారు.

# 22

ప్రపంచంలోప్రతి దేశంలోనూ మూఢాచారాలు, మూఢనమ్మకాలు, మూఢభక్తి ఏదో ఒక రూపంలో వుంటూనే వున్నాయని లోగడ చెప్పాము. పశ్చిమ ఆసియాలో పాలస్తీనా వగైరా దేశాలలో నేటికి సుమారు రెండు వేల సంవత్సరాల నాడు యూదు మతము వ్యాపించి వుంది. యూదులు పెద్ద పెద్ద ఆలయాలను నిర్మించి వాటిలో రక రకాల దేవుళ్ళ విగ్రహాలను స్థాపించి పూజించేవారు. ఆ దేవతలను పూజించటానికి పూజారులు (పాదరీలు) నియమింపబడే వారు. ప్రజలు ఆ విగ్రహాలకు నైవేద్యాలు పశుబలులు, వగైరాలు సమర్పించేవారు. వాటిని ఫాదరీలు ఆరగించే వారు. నైవేద్యాలు, పశువులు వగైరాలకై పూజారులు ప్రజలను అదేపనిగా పీడించే వారు. వార్కి (పూజారులకు) ఆనాటి రాజులు సహాయం చేస్తూ ఉండేవారు. అందువలన పూజారులు, రాజులు కలిసి ప్రజలను ఆర్థికంగా దోచుకొనే వారు. అట్టి సమయంలో నేటికి సుమారు రెండు వేల సంవత్సరాల నాడు జెర్సులమ్ పట్టణంలో ఒక వడ్రంగి యింట ఒక కుర్రవాడు పుట్టాడు. ఆ కుర్రవానికి జీసస్ అని పేరు పెట్టబడింది. జీసస్‌ను ఏసు, క్రీస్తు, క్రైస్తు, ఏసుప్రభువు, ప్రభువు అని అంటారు. ఏసు తన బాల్యంలో తన తండ్రివెంట వెళ్ళి ఉలి, చిత్రిక గుల్ల వగైరా పనిముట్లతో వడ్రంగి పని చేసేవాడట. కాని ఏసు తన చుట్టూ వున్న ప్రజలు, విగ్రహారాధకులైన పూజారులు బాధలవల్ల అనేక కష్టాలకు గురియగుచుండువారిని చూచి వారి కష్టాలకు కారణమైన విగ్రహారాధనను ఖండించే వాడట. ఆయన విగ్రహాలను, ఆలయాలను నిర్మూలింపజేసి ఆకారం లేని భగవంతుని ప్రార్థించమని బోధింపసాగెను. ఆయన ఇంకా ఇలా బోధించేవాడు "భగవంతుడు ఒక్కడే, ఆయనకు రూపంలేదు. అట్టి భగవంతుని అనుగ్రహం పొందాలంటే ప్రార్థనా మందిరాలను నిర్మించి వాటిలో ప్రార్థనలు చేయాలి. అంతేగాని విగ్రహాలను పూజించకూడదు. ఏసు బోధనలను ప్రజలు శ్రద్ధగావిని ఆయన చెప్పిన పద్ధతిలో ప్రార్థనలు చేయసాగిరి. విగ్రహాలను పూజించుట మానుకొనిరి. పూజారుల ఆదాయం పడిపోయెను.

అందువల్ల పూజారులు ఏసును ద్వేషింపసాగిరి. ఆ కాలపు రాజులు కూడా పురోహితులకు సహాయపడి ఏసును నిర్బంధింప ప్రయత్నింప సాగిరి.

ఏసు తన ఏకేశ్వరవాదాన్ని ప్రచారం చేస్తూ తన బోధనలతోపాటు కొన్ని దైవ మహిమలు కూడా చూపించి ప్రజలను తనవైపుకు త్రిప్పుకొనుటకు ప్రయత్నింప సాగెను. ఆయన దైవమహిమలను జూచి సామాన్య ప్రజలు తండోపతండాలుగా ఆయన బోధనలను విని ఆయన మతాన్ని అవలంబించ సాగిరి.

ఏసు జన్మగాథ, ఆయన చూపించిన దైవమహిమలు పుక్కిడి పురాణాలకు పుట్టిల్లయిన మన హిందూమతానికి ఏమాత్రం విడ్డూరమైనవిగను, అసంభవమైనవిగను, అస్వాభావికమైనవిగను, కనిపించకపోవచ్చు. ఎందుకన ఏసుకువలె పుట్టినవారు హిందువుల పురాణాలలో కోకొల్లలుగా వుండిరి. ఆయన (ఏసు) చూపించిన దైవ మహిమలు నేడు మన ఆంధ్రరాష్ట్రంలో కొంతమంది బాబాలు, అమ్మలు, యోగులు, నిత్యమూ తమ భక్తులకు భక్తురాంద్రకు చూపించి వారిని తరింపజేస్తున్నారని వినికిడి. బైబుల్ క్రైస్తవులకు మత గ్రంథం, దానిని క్రైస్తవుల వేదమని కూడా అంటారు. బైబుల్‌లో ప్రపంచ సృష్టి యొక్క వివరమును గురించి చెప్పబడింది. ప్రపంచం తనంతట తాను పుట్టలేదు. కాని నశింపులేని దేవుడనే వాడు దానిని ఆరు రోజులలో సృష్టించాడు . తరువాత మట్టితో ఆదామ్ అనే మొట్టమొదటి మగవాణ్ణి సృష్టించాడు. (మట్టిని దేనితో సృష్టించాడో చెప్పలేదు) ఆ తరువాత ఆదామ్ యొక్క ప్రక్క ఎముకను తీసి దానితో ఈవ్ అనే మొట్టమొదటి ఆడదానిని సృష్టించి ఆదాముకు తోడు అమర్చాడు. తరువాత ఆదామ్, ఈవ్ లిద్దరూ ఈడెన్ అనే ఒక అందమైన తోటలో మొండిమొలలతో తిరుగసాగిరి. ఒకనాడు సైతాను (దీనిని ఎవరు సృష్టించారో చెప్పలేదు) పాము రూపంలో వచ్చి జ్ఞాన ఫలాన్ని తినమని ముందుగా ఈవ్‌తో చెప్పెను. (పాము భాష ఆమెకు ఎట్లా అర్థమయిందో తెలియదు) ఈవ్ ఆ పండులోని కొంత భాగాన్ని తాను తిని మిగతా భాగాన్ని ఆదాముచేత తినిపించెను. తినగూడని ఆ జ్ఞానపండును తినడం వల్ల వారికి జ్ఞానోదయం కల్గెను. అందువల్ల వార్కి దేముడు దూరమయ్యెనట. (ఇతర మత గ్రంథాలలో జ్ఞానోదయం కలిగిన వెంటనే దేవుని దర్శనం కలుగనని

చెప్పబడిందట, కాని బైబుల్ ప్రకారము జ్ఞానం వల్ల దేవుడు దూరమై పోవుట చాల విచిత్రముగా వున్నది. ఈ ఆదామ్ ఈవ్‌ల ద్వారానే సమస్త మానవజాతి పుట్టింది. క్రీస్తు తల్లి పేరు మేరి (మరియమ్మ) క్రీస్తు పుట్టకపూర్వము మేరీ పెండ్లి జోసెఫ్ అనే ఒక వడ్రంగితో ఖాయపరచుకోబడింది. కాని పెండ్లికాక పూర్వమే మేరీకి దేవుని దయవల్ల (చావులేని కనిపించని శక్తివల్ల) ఒక బిడ్డ కలుగ బోతున్నట్లు కన్పించింది. సజ్జనుడైన జోసెఫ్ మేరీని అల్లరిపాలు చేయకుండా రహస్యంగా పెండ్లి సంబంధాన్ని మానుకోవటానికి ఒక పన్నాగము ఆలోచింప సాగెను. ఈ విధంగా జోసెఫ్ తన మనసులో ఆలోచించు చుండగా ఒక దేవదూత అతనికి (జోసెఫ్‌కు) కలలో కనిపించి "ఓయీ బుద్ధిగల జోసెఫ్! డేవిడ్ వారసుడా !మేరీని భార్యగా చేసుకోవటానికి భయపడవద్దు. ఆమె గర్భవతి అయింది. కేవలం దేవుని వల్లనే. ఆమెకు ఒక మగబిడ్డ కలుగును. అతనికి జీసస్ అని పేరు పెట్టుము. ఎందుకన అతడు ప్రజలను పాపాలనుండి (చెడ్డపనుల నుండి) రక్షిస్తాడు" అని అనెను.

తెల్లవారిన తరువాత జోసెఫ్ మేరీని పెండ్లాడెను. కాని ఆమెతో ఆయన ఏసుపుట్టుటకు పూర్వం లైంగిక సంబంధాలు (జతకట్టుట) మాత్రం పెట్టుకోలేదట. బిడ్డకు జీసస్ అని పేరుపెట్టబడింది. తరువాత వెంటనే మరొక దేవదూత జోసెఫ్ కు కలలో కనిపించి "జోసెఫ్! పిల్లవానిని అతని తల్లిని తీసికొని ఈజిప్టుకు పారిపో, నేను మరల చెప్పేవరకు అక్కడ నుండి కదలవద్దు. హెరోడ్ రాజు పిల్ల వానిని చంపాలనుకుంటున్నాడు" అని చెప్పెనట. జోసెఫ్ పిల్లవానిని, తల్లిని తీసికొని హెరోడ్ రాజు చచ్చిపోయేవరకు యీజిప్టులోనే వుండిపోయాడు. మరల కొంతకాలానికి ఇంకొక దేవదూత జోసెఫ్ కలలో కన్పించి "జోసెఫ్! నీవు ఏసును, అతని తల్లిని తీసికొని నీ దేశానికి వెళ్ళిపొమ్ము" అని చెప్పెనట (కలలో కన్పించే దేవదూలు ఎవరిద్వారా పంపబడుతున్నారో చెప్పబడలేదు) మరల కొంతకాలానికి మరొక దేవదూత కలలో కన్పించి "ఓ బుద్ధిగల జోసెఫ్ ! హెరోడ్ రాజు కొడుకు రాజయ్యెను. కనుక నీవు యిక్కడ వుండవద్దు. నజ్‌రత్‌పట్టణానికి వెళ్ళుము" అని చెప్పెనట.

జాన్ అనే మతబోధకుడు (ఫాదరీ) ఒంటె బొచ్చుతో తయారైన గుడ్డలు ధరించేవాడట. అతడు మిడతలను పట్టుకొని తినేవాడట. ఆయనవద్ద ఏసుమతం

పుచ్చుకొని నీళ్ళనుండి బయటకు రాగానే దేవుడు పావురము రూపంలో వచ్చి ఏసుమీద వెల్తురుగా పడెనట. అప్పుడు వెంటనే ఆకాశవాణి "ఏసు నా సొంత ప్రియమైన కుమారుడు. (దేవునికి కూడా సొంత పరాయ బేధాలు గలవు కాబోలు) ఈయన అంటే నాకు చాలా యిష్టం. ఈయన అంటే నాకు ఎంతో సంతోషము కలుగును" అని పలికెనట. (ఆకాశవాణి ఎవరిదో తెలియదు)

కాని ఏసు సైతాను మాయలో పడిపోయి ఒక ఎడారిలో 40 పగళ్ళు, 40 రాత్రుళ్ళు అన్నం నీరు లేకుండా ప్రయాణం చేసెనట. తరువాత సైతాను వచ్చి ఏసుతో " ఓ ఏసూ ! నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్ళను రొట్టెగా మార్చుము" అనెనట. ఈ రకంగా సైతాను ఏసును అనేక సార్లు పరీక్షించెనట. కాని ఏసు సైతానును లక్ష్యపెట్టనందున సైతాను గతిలేక ఏసును విడిచి వెళ్ళిపోయెనట. (ఎక్కడికో తెలియదు)

తరువాత ఏసు గ్రామాదులలో తిరుగుతూ దయ్యాలు, మూర్ఛలు, పక్షవాతము వగైరా జబ్బులు గలవారి జబ్బులను మందులు లేకుండానే ప్రార్థనలతో నయంచేయసాగెనట. ఒకసారి ఒకచోటున జనం అపరిమితంగావచ్చి ఏసును ఊపిరాడకుండా వత్తిడి చేస్తున్నందున ఆయన ఒక కొండమీదకు వెళ్ళి ఈ విధంగా బోధింపసాగెనట:-

1. దేవుని గురించి మేము చాలా వెనుకపడి వున్నామని తెలిసి కొన్నవారే సుఖింతురు.

2. దుఃఖాలను అనుభవించువారే సుఖింతురు.

3. శాంతము గలవారే సుఖింతురు. దేవుడు యిస్తానన్న దానిని వారు పొందుతారు.

4. దేవుడుకోరే దానిని చేయాలని ఎక్కువగా కోరేవారే సుఖింతురు.

5. ఇతరులయందు దయగలవారే సుఖింతురు.దేవుడు వారియందు దయచూపును.

6. పవిత్ర హృదయం కలవారే సుఖింతురు. వారే దేవుణ్ణి చూడగలరు.

7. మానవులలో శాంతిని నెలకొల్పటానికి ప్రయత్నించువారే సుఖింతురు.

వారిని దేవుడు తన కుమారులని పిలచును.

8. అత్యాచారాలను (యితరులను పెట్టే బాధలను) అనుభవించువారే సుఖింతురు. (కాని అత్యాచారాలు చేయువారు సుఖిస్తున్నారుగా)

9. మానవులుగాని దేవతలుగాని నిందించినా కఠినంగా వ్యవహరించినా లేనిపోని నిందలు ఆరోపించినా, దేవుని అనుచరులై, వాటిని సహించుకొనువారే సుఖింతురు.

10. మానవజాతికంతకూ మీరు ఉప్పువంటి వారు. ఉప్పువలె మానవ జీవితాలను ఆనందమయంగా చేయండి. కాని మానవులు ఉప్పును కాళ్ళతో తొక్కుతారు. దానిమీద నడుస్తారు. దానిమీద ఉమ్మివేస్తారు. అట్లే మిమ్ములను కూడా మానవులు అలక్ష్యంగా చూస్తారు. మీరు జాగ్రత్తగా వుండాలి.

11. మనస్సులో ఒక ఆడదానితో జతకట్టాలని అనుకుంటే అది కూడా వ్యభిచారం (లజ్జతనం) కింద లెక్కే, మీ కుడికన్ను పాపం చేస్తే, వెంటనే దానిని తోడివేయండి. ఎందుకంటే అది మొత్తం మీ శరీరాన్నే నరకం లోనికి త్రోసివేసే వస్తువుగా తయారగును. అట్టి దానిని పోగొట్టుకొనుటే మంచిది.

12. మానవుని నోటిలోనికి వెళ్ళే హానిచేసే వస్తువుకంటే వాని నోటినుండి బయటకు వచ్చేదే అతనిని ఆరోగ్యవంతునిగా చేయును. ఎందకంటే లోపలికి వెళ్ళే వస్తువు బయటకు వచ్చివేయును.

13. కుక్కకాటుకు చెప్పుదెబ్బ – దెబ్బకు దెబ్బ అని అంటారు జనం. కాని ఆ సామెతలు సరియైనవి కావు. నీకు హాని కలిగించు వానిమీద పగవహించవద్దు. కాని ఎవరైనా నిన్ను నీ కుడిచెంపమీద కొడితే ఎడమచెంప మీద కొట్టనివ్వుము, ఎడమచెంప చూపించుము. నీ షర్టుమీద ఎవరైనా నా దని కేసుపెట్టితే నీ కోటే యిచ్చివేయుము. సైనికులు నిన్ను ఒక మైలు దూరం వారి సామానులు మోయమంటే, నీవు రెండు మైళ్ళవరకూ మోయుము. ఎవరైనా నిన్ను ఏదైనా యివ్వమని అడిగితే యిచ్చివేయుము. కాని ఎవరైనా నిన్ను వడ్డీకి డబ్బు అడిగితే నీవు వారికి వడ్డీలేకుండా చేబదులుగా యివ్వుము.

14. స్నేహితులను ప్రేమించుము. పగవాళ్ళను ద్వేషించుము. అని

మామూలుగా మనం చెప్పుతూ వుంటాము. కాని నీవు నీ పగవానిని ప్రేమించుము. నిన్ను అనాదరించిన వారికై నీవు దేవుని ప్రార్థించుము. దేవుడు తన జ్ఞానసూర్యుణ్ణి మంచి చెడ్డ మనుషుల మీద ఒకే రకంగా ప్రసరింపజేస్తున్నాడు. నిన్ను ప్రేమించిన వానిని నీవు ప్రేమించుట వల్ల దేవుడు నిన్ను ప్రేమించునని నీవు ఎట్లా అనుకుంటున్నావు?

15. ఇతరులు చూడాలని దానధర్మాలు చేయకుము. అందరూ చూడాలని చేస్తే దేవుడు మెచ్చడు. నీ స్నేహితులకు కూడా తెలియకుండా దానం చేయుము. ఎందుకన దానం స్వవిషయం.

16. అందరకూ తెలిసేలాగా ప్రార్థన బహిరంగంగా చేయకుము. చాలా మంది బజారులో నిలబడి కేకలు వేస్తూ ప్రార్థనలు చేస్తారు. ఎందుకన ప్రజలు తమను గొప్ప దైవభక్తు లనుకోవాలని తమ మనస్సులలో అనుకుంటారు. కాని బిగ్గరగా ప్రార్థనలు చేయకుము. తలుపులు కిటికీలు వగైరాలను వేసుకొని గదిలో ప్రార్థన చేయుము. ఎవ్వరూ లేనిచోటున ప్రార్థన చేయుము. ప్రార్థనలో మాటల ఆడంబరము ఉండకూడదు. అలంకార యుక్తమైన జటిల (కఠిన) భాష ఉండకూడదు.

17. నీవు ఉపవాసం చేసినట్లు ఎవ్వరికీ తెలియకూడదు. మామూలు గానే కళకళలాడుతూ ఉండుము. ఉత్సాహంతో ఉండుము. యూదులు వగైరాలు చేయునట్లు తెలిసేలాగున చేయకుము.

18. భూలోకంలో ధనాన్ని కూడబెట్టకుము. ఎందుకంటే పురుగులు త్రుప్పు పాడుచేస్తాయి. దొంగలు కాజేస్తారు. పరలోకంలో ధనాన్ని కూడబెట్టుకో. డబ్బున్న చోటునే నీ హృదయం లగ్నమై వుంటుంది. ఆహారం కొరకు ఆరాటపడుము. గుడ్డల కొరకు గొణగకుము. జీవితం ఆహారం కంటే గొప్పది. శరీరం గుడ్డలకంటే గొప్పది. పక్షులను చూడుము. అవి మనలాగా ఆహారం కొరకు ఆరాట పడవు. అవి విత్తనాలు జల్లవు. పైరు పోగుచేయవు, కొట్లల్లో పోయవు. కాని వాటిని దేవుడు పోషించును. మీరు పక్షులకంటే ఎక్కువ కాదా ? ఆహారానికై ఆరాట పడకుండా ఎవరున్నారో చెప్పండి? గుడ్డలకై మీరు ఆరాటపడతారెందుకు ?

19. నా వెంట రావాలనుకొన్న వాడు తనను మరచిపోవాలి. ఎవడు తన

ప్రాణాన్ని రక్షించుకోటానికి ప్రయత్నిస్తాడో వాడు దానిని పోగొట్టుకుంటాడు. ఎవడు నాకొరకు ప్రాణం పోగొట్టుకొంటాడో వాడు దానిని కలిగివుంటాడు. ఎవడు అందరికంటే ముందు వుండాలనుకుంటాడో అతడు ప్రజాసేవకుడు కావాలి. నేను సేవ చేయించుకోటానికి రాలేదు. నేను ప్రజాసేవ చేయటానికి వచ్చాను. నేను అనేక మందిని ఉద్ధరించటానికై ప్రాణాలు యివ్వటానికి వచ్చాను.

20. నిజమైన దైవభక్తుడు హృదయము. మెదడు రెంటి యొక్క సమన్వయ మార్గాన పోతూ వుంటాడు. సంఘం నియమించుకొన్న పాప పుణ్యాలు, సత్యాసత్యాలు, ధర్మాధర్మాలు న్యాయాన్యాయాలు వగైరాలను అతడు లక్ష్యపెట్టడు.

21. సామాన్య మానవులు మతము, మత గ్రంథాలు, మత గురువులు చూపించిన మార్గాన్నే నడచుచూ తృప్తి పడతారు. వారు పూర్వాచార పరాయణులగా వుండటమే జీవిత లక్ష్యమనుకుంటారు.

22. ఆవుగాని, మేక గాని త్రాడు ఎంత పొడవుగా వుండునో అంత దూరం వరకే తిరిగి మేయగలదు. అట్లే ఎక్కువ మంది ప్రజలు మత గురువులు వగైరాలు చెప్పే మార్గాన నడచుటయే పుణ్య మనుకుంటారు. మత గురువులు నిర్ణయించిన మార్గాన్ని విడిచిపెట్టి మరొక మార్గాన్ని నడచిన యెడల ఏదో ఒక అనర్థకం వాటిల్లుతుందని భయపడతారు. వారు ఆ విధంగా మతగురువుల మోసపు మాటలకు బంధింపబడి వుంటే సుఖ మనుకుంటారు.

23. ఎవనినైతే ప్రపంచం గొప్పవాడనునో, అవతార పురుషుడుడనునో, వాడు మనోవాక్కాయములతో తన సర్వస్వం అర్పించి మెదడు, హృదయం రెండియెక్క సమన్వయ మార్గాన్ని నడిచేవాడుగా వుంటాడు.

24. సంఘం మనుష్యులతో కూడింది. వ్యక్తి (మనిషి) ఎట్లా వుంటే సంఘం అట్లా తయారౌతుంది.సంఘం వాతావరణం వల్ల వ్యక్తుల ఆలోచనలు దెబ్బతింటాయి.

25. సర్గ నరకాలు వేరే మరోకచోటన లేవు. ప్రతి మానవుడు సుఖంగా వుండుటే స్వర్గము. అంటే దైవభక్తి కలిగి ఆరోగ్యంగా వుండుటే సుఖము.

26. మానవుని నిజమైన స్వాతంత్ర్యం స్వావలంబనమే (తన శక్తి మీదనే బ్రతుకుట) మానవత్వము నాగరికత కంటే గొప్పది.

27. పండితులు, పురోహితులు, ఫాదరీలు, బిషప్పులు, మౌలవీలు, ధనవంతులు, మేధావులు వగైరాల ద్వారా ఈశ్వర రాజ్యం స్థాపింప బడజాలదు. కాని కపట మెరుగని స్త్రీలు, సామాన్య ప్రజలు, శిశువులు వగైరాలే ఈశ్వరరాజ్య స్థాపనకు తగినవారు.

28. సంఘంలో విప్లవం (తిరుగుబాటు) కలిగించాలి. ఎక్కువ తక్కువలు నశించాలి. పరిపాలకుల గర్వం అణగాలి. ఈ మాటలు ఎవ్వరికీ గిట్టవు. ఈ మాటలు చెప్పేవారి ప్రాణాలకు హాని కలుగును. వారు దానికి సిద్ధమై వుండాలి.

29. వ్యక్తి అంటే (మానవుడు) సత్యాన్ని – తెలిసినవాడు. సత్యాన్ని విడనాడుట వ్యక్తిత్వాన్ని (మానవత్వాన్ని) నాశనం చేసికొనుటే, సత్యము లేనినాడు ఎంత ఐశ్వర్యం వున్నా అంతా వ్యర్థమే, రైతు మంచి విత్తనాలు నాటి తప్ప గింజలను పారవేయును.

30. సుఖంలోకలిగే ఆటంకాన్నే పాపము అంటారు. సుఖము అంటే సత్యము. సత్యము అంటే ఆత్మసౌందర్యము. గొప్ప ఐశ్వర్యమంటే ఈశ్వరత్వము. ఈశ్వరుడే సత్యము. వాస్తవంగా ఈశ్వరుడే సుఖజీవితము, సత్యం లేని జీవితం శూన్యంతో సమానమే. సత్యాన్ని ప్రేమించుటే ప్రేమ.

31. అక్షరాలలో వ్రాయబడిన మాట కూడా మానవులకు హాని కలిగించేదే. ఎన్నైతే మత గ్రంథాలు గలవో అవన్నీ మానవులకు హానిని కలిగించుచున్నట్టు రుజువయ్యెను. అంటే వేదాలు ఖురాను, బైబిలు, గురుసాహెబ్ వగైరా మత గ్రంథాలు వగైరాలలో వ్రాయబడిన కొన్ని మాటలు మానవులకు కష్టాలు తెచ్చిపెడుతున్నవట. ఈ గ్రంథాలు మానవులలోని స్వతంత్ర ఆలోచనలను అణచి వేస్తున్నాయి. మీరు ఆలోచించాలనుకొన్న విషయాలు మాలోనే వున్నాయి. మీరు మీ ఆలోచనలను కట్టిపెట్టి మా అనుభవాలను నమ్మండి అందువల్ల మీకు మేలు కలుగును అని మత గ్రంథాలు చెపుతున్నాయి.

32. ఏ వస్తువునూ నీ కొరకు కోరకు. కాని త్యాగం చేయటం నేర్చుకో, త్యాగం ద్వారానే నీకు లభించిన దానిని అనుభవింపుము. వెంట రండి, లేక వంటరిగా వెళ్ళండి. కాని వెంట ఏమీ తీసికొని వెళ్ళవద్దు. డబ్బుగాని, గుడ్డలుగాని, తిండిగాని,

సంచిగాని, వెంటతీసుకొని వెళ్ళవద్దు, దారిద్ర్యాన్ని అలవర్చుకోండి. ఎవరైనా ఏదైనా పెట్టినయెడల దానిని స్వీకరించండి. మీకు దేవాలయాల వద్ద కొరడా దెబ్బలు తగులును. మీరు జైళ్ళల్లో మగ్గిపోతారు. సోదరుడు సోదరుని తండ్రి కుమారుని చావుకు కారణ మవుతారు. శరీర కష్టాన్ని చూచి భయపడకండి. ఎందుకన ఆత్మచావదు. ఈ సత్యాన్ని అందరకూ చెప్పండి. సత్యమునకై తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను, భర్తను బిడ్డలను సోదర సోదరీలను త్యాగం చేయండి. అట్లు చేయని వాడు నా శిష్యుడు కాదు. ఆత్మను పోగొట్టుకొని జీవించుట ఏమి ప్రయోజనము?

33. దేవుని మీద అపారమైన విశ్వాసం వున్నవాడు మానవులను గాఢంగా ప్రేమించగలడు. ఎందుకన దేవుడు అన్ని జీవులలోనూ ఉన్నాడు. దేవుడు అందరికీ తండ్రి. మానవులందరినీ తన సోదరులుగా అంగీకరించినవాడు ధన్యుడు.

34. నీవు నీ వలెనే నీ పొరుగు వారిని చూడుము.

-: ఇక ఏసు చేసిన చమత్కారాలు (మహిమలు) చూద్దాం రండి :-

1. ఒక కుష్టురోగిని ముట్టుకొని యితడు బాగుపడాలి అని అనుకొనెనట. వెంటనే అతడు బాగుపడ్డాడట.

2. జబ్బుపడిన వారివద్దకు వెళ్ళకుండానే ఏసు అనేకమంది రోగుల రోగాలు చూడకుండానే నయం చేసేనట.

3. దయ్యాలు పట్టినవార్కి దయ్యాలు పోగొట్టెనట.

4. తుఫానులో చిక్కుకొని పోయిన మిత్రులను రక్షించటానికి యేసు నీటి అలలను, గాలిని ఆగమని ఆజ్ఞాపించెనట. వెంటనే అవి ఆగిపోయెనట.

5. చచ్చిపోయిన వారిని ఏసు బ్రతికించెనట.

6. ఒక స్త్రీకి బట్ట విడుపు జబ్బు వుండేదట. ఆమె ఏసు చొక్కాను తాకిన తోడనే ఆమె జబ్బు పోయెనట.

7. గుడ్డివాళ్ళకు చూపు, మూగవాళ్లకు మాట, ఏసు ప్రసాదించెనట.

8. కుంటి వాళ్ళు నడవగలిగిరట.

9. ఒకచోట సభలో 5 వేల మంది జనం ఉన్నారట, ఆ సభను యేర్పాటు చేసిన వారి వద్ద కేవలం 5 రొట్టెలు, 2 చేపలు మాత్రం వుండెనట,అంత యేసు

ఆరొట్టెలను చేపలను తన చేతిలోకి తీసుకొని 5వేల మందికి పంచిపెట్టగా ఇంకా 12 తట్టల రొట్టెలు, చేపలు మిగిలినవట.

10. ఒక సరస్సులో ఏసు శిష్యులు కొందరు విహారానికై ఒక పడవలో వెళ్ళగా హఠాత్తుగా తీవ్రమైన గాలి వచ్చెనట, పడవ మునగసాగెనట. ఇంతలో దూరాన ఒక కొండమీద వున్న ఏసును వారు ప్రార్థించగా ఏసు గబగబా నీళ్ళమీద నడచి వెళ్ళి బోటును వారిని రక్షించెనట.

11. పండ్లు కాయని ఒక అత్తి చెట్టు చూచి ఇది యిక ఎన్నడూ కాయలు కాయదని శపించెనట. వెంటనే ఆ చెట్టు ఎండి చచ్చిపోయెనట.

-: ఏసు చచ్చిపోయినపుడు జరిగిన అద్భుత ఘటనలను చూద్దాం :-

1. ఆలయాలలోని తెరగుడ్డలు ముక్కలు ముక్కలుగా చినిగి పోయెను.

2. పర్వతాలు పగిలిపోయెను

3. చనిపోయిన దైవభక్తులు చాలమంది సమాధులనుండి బయటకు వచ్చారు.

4. వారంతా పట్టణంలోనికి వెళ్ళుటను చాలమంది ఆడవాళ్ళు చూశారు.

ఇవన్నీ కట్టుకథలే కావచ్చును. కాని మత ప్రచారం కొరకు యివి వాస్తవంగా జరిగినవని స్వార్ధపరులైన కొంతమంది మేధావులే ప్రచారం చేస్తూ అమాయక ప్రజలను ఆర్ధికంగా దోచివేస్తున్నారనటంలో సందేహం లేదు. ఇంతే కాకుండా నేడు క్రైస్తవమత ప్రచారకులు యేసు యొక్క అనేక మహిమలను గురించి సామాన్య ప్రజలలో ప్రచారం చేస్తూ హిందూ మత ప్రచారకులవలెనే ప్రజలలో మూఢనమ్మకాలను తమ ఆర్థిక లాభం కొరకు స్థిరంగా వుంచటానికే నిరంతరం ప్రయత్నిస్తున్నారు. వారు ఏసు మహిమల వాస్తవికతను గురించి ఆలోచించుట గాని అనుమానించుట గాని పాపమని భయపెట్టి ప్రజలను యదార్ధ విషయము నుండి దూరం చేయటానికి యత్నిస్తున్నారు.

హిందూ పూజారులు రాళ్ళను దేవుళ్ళని చెప్పి వాటి ద్వారా బీద ప్రజల కష్టార్జితాన్ని అపహరిస్తూ కడుపులో నీళ్ళు కదలకుండా సుఖంగా జీవితం గడుపుకొనుచున్నట్టే క్రైస్తవమత ప్రచారకులైన పోపులు, బిషప్పులు, ఆర్చి బిషప్పులు,

ఫాదరీలు, ఫాస్టర్లు వగైరా మత ప్రచారకులంతా దేవుని పేరిట బీద ప్రజానీకాన్ని ఆర్థికంగా దోచివేస్తు వారి బుద్ధిని పెరగనివ్వకుండా వారిని మూఢనమ్మకాలతోను. మూఢాచారాలతోనూ బంధించి వేస్తున్నారు.

కనుక మానవ శ్రేయస్సు కోరు వారందరూ ముందు తాము నిజమైన విద్యావంతులుగాను. నీతిమంతులు గాను, సహన శీలురుగాను, సామాన్య జీవితం గడుపు ఆదర్శ మానవులుగాను, త్యాగ శీలురుగాను. నిరాడంబరులు గాను తయారై ప్రజలలోకి వెళ్ళి తమలాగ వారిని గూడా తయారు చేసిన నాడు. ప్రస్తుతం మన దేశంలో వున్న యీ సాంఘిక అసమానతలు (తేడాలు) యీ ఆర్థిక దోపిడీలు, యీ నైతిక, ఆధ్యాత్మిక మోసాలు, యీ రాజకీయ కుతంత్రాలు, యీ కులమత తత్వాలు మటుమాయమైపోగలవు.

# 23

మహమ్మద్ ను ముహమ్మద్ అని కూడా అంటారు. మహమ్మద్ బోధించిన మతం పేరు ఇస్లామ్. ఇస్లామ్ అంటే శాంతిని పొందుట. శరణు అంటే భగవంతుని శంణు (అండను) చేరుట శాంతిని పొందుట, అంటే భగవంతుడెవడో తెలియక తికమక పడుతున్న మనస్సుకు శాంతిని కలిగించునది. ఇస్లామ్‌మతాన్ని మహమ్మదీయ మతము ముస్లిమ్ మతము, తురక మతము. సాహెబ్‌ల మతము అని అంటాము.

మహమ్మద్ మూలపురుషుడు అబ్రహం కుమారుడైన ఇస్మాయెల్. అబ్రహంకు “శారా” “హగారా” అనే పేర్లుగల యిద్దరు భార్యలుండే వారు. హగారా ఇస్మాయెల్ తల్లి. శారా అబ్రహాంతో చెప్పి హగారాను, కుమారుడు ఇస్మాయెల్‌ను యింటినుండి వెళ్ళగొట్టించింది. పాపము హగారా కుమారుని వెంటబెట్టుకొని అరేబియా ప్రాంతంలో ఒక ఎడారిలో ఒక నీటి బుగ్గ (ఎల్లప్పుడు నీరుండే గుంట)

గల చోటున వుండిపోయెను. ఆ నీటి బుగ్గను "జమ్‌జమ్" అని అంటారు. నీటి బుగ్గకు దగ్గరగా ఒక పెద్ద నల్లరాతి బండ పడివుండెను. అది ఉల్కాపాతమట, (ఆకాశంనుండి పడిన రాయి) అది ఆకాశం నుండి పడినదని అరబ్బుల విశ్వాసం. ఆ రాతిని అరబ్బులు పవిత్రంగా భావించి దానిని పూజిస్తూ వుండేవారు. ఆ ప్రాంతంలోనే ఇస్మాయెల్ సంతతి వారు అనగా మహమ్మద్ పూర్వీకులు ఎక్కువగా వృద్ధి చెందారు.

మహమ్మద్ ఇస్మాయెల్ వంశంలో క్రీస్తుశకము 570 లో మక్కా పట్టణములో పుట్టాడు. క్రీస్తుశకము 632 లో మదీనా పట్టణములో చనిపోయాడు.

మహమ్మద్ 24 సంవత్సరాల వయస్సులో మక్కాలోనే ఒక సంపన్నురాలైన "ఖడీజా" అనే 40 సంవత్సరాల వయస్సుగల ఒక వితంతువును పెండ్లి చేసుకొన్నాడు. ఖడీజాకు అప్పటికే ముగ్గురు బిడ్డలున్నారు. మహమ్మద్ ఖడీజాతో సుమారు 30 సంవత్సరాలు కాపురం చేశాడు. వారిద్దరకూ ఆర్గురు పిల్లలు కల్గిరి. ముఫై సంవత్సరాలు గడచిన తరువాత ఖడీజా చనిపోయింది. అపుడు మహమ్మద్ తన శిష్యుడైన అబుబకర్ కుమార్తెను పెండ్లి చేసుకొన్నాడు. ఆమె ద్వారా మహమ్మద్ కు ఎంత మంది పిల్లలు కలిగిరో తెలియదు. రెండవ పెండ్లి జరిగిన తరువాత మహమ్మద్ మదీనా పట్టణములో నివశింప సాగెను.

మక్కా పట్టణములోని నల్లరాతి బండను "కాబా" అంటారు. ఆ నల్లరాతి బండను మానవజాతికి మూల పురుషుడైన ఆదమ్ స్వర్గం నుండి తెచ్చి తన సంతతివాడైన అబ్రహాంకు ఇచ్చాడు. అబ్రహాం తన కుమారుడైన ఇస్మాయెల్‌కు ఇచ్చినాడని అరబ్బుల మూఢనమ్మకం, మక్కాలోని ప్రజలు మొదట ఆ నల్లరాతి బండయైన డాబాచుట్టూ దేవాలయమును కట్టించి వాటిలో 360 దేవతా విగ్రహాలను స్థాపించి రోజుకు ఒక దేవతకు మొక్కుబడులు నైవేద్యాలు, కానుకలు, అర్పించి పూజించేవారు. అందువల్ల (మౌలవీలు) పూజారులు. మతగురువులు నైవేద్యాలు, ముడుపులు వగైరాలద్వారా జీవితాలను హాయిగా గడుపుకునే వారు. వారికి దేవతా పూజే బ్రతుకుతెరువై పోయెను. గ్రామాదుల నుండి ప్రజలు వచ్చి దేవతలకు ముడుపులు, నైవేద్యాలు, అర్పించి పోతూ వుండేవారు. పూజారులు, మతగురువులు,

ముడుపులు, నైవేద్యాలు, కానుకలు, వగైరాలకై ప్రజలను ఎక్కువగాపీడించుచూ వుండేవారు.

మక్కాపట్టణంలో అన్నిరకాల మనుషులు వుండేవారు. పట్టణంలో వ్యభిచారము త్రాగుడు, జూదము, అబద్దాలు, హింస వగైరా చెడ్డపనులు జోరుగా పట్టపగలే జరుగుతూ ఉండేవి, ప్రజలుఎక్కువ అవినీతి పరులుగా, మోసగాళ్ళుగా తయారై పోయారు. వీరికి తోడు పూజారులు మతగురువులు మరీ అవినీతి పరులై పరాన్నభుక్కులై ప్రజలను ఆర్థికంగా ఎక్కువగా పీడింపసాగారు.

అనేక దేవతలను పూజించుట, పూజారుల, మతగురువుల దౌర్జన్యము. ప్రజలలో చెడ్డ అలవాట్లు నానాటికీ పెరిగిపోతూ వుండటం చూచి మహమ్మద్ చాల విచారపడి తన ఇస్లామ్‌మతాన్ని బోధింప సాగెను. మహమ్మద్ ముందుగా విగ్రహారాధనను ఖండించాడు. కనిపించని ఆకారం లేని ఒకే ఒక భగవంతుని గురించి బోధింపసాగెను. ఆరంభంలో మహమ్మద్ ఇస్లామ్ మతాన్ని చాలా తక్కువ మంది అవలంభించారు. అయినప్పటికీ మహమ్మద్ బోధలవల్ల దేవతలను పూజించుట, ముడుపులు, కానుకలు చెల్లించుట చాలవరకు ఆగిపోయాయి. అందు వల్ల పూజారులు మతగురువులు తమ భుక్తి సాధనాన్ని కోల్పోయిరి. అంతట వారు కోపముచెంది మహమ్మద్ సభలలో అల్లరి చేసి సభలను జరుగకుండా కొంత కాలం వరకు ఆటంకములు కలిగించారు. కాని నెమ్మదిగా మహమ్మద్ఉపదేశాలను ప్రజలు ఎక్కువ సంఖ్యలో వినసాగారు. పూజారులు వగైరాలు మహమ్మద్‌ను చంపాలని కూడా చాఆ సార్లు ప్రయత్నించారు. అందువల్ల మహమ్మద్ మక్కాను వదిలిపెట్టి “యాత్రిబ్” అనే చోటుకు పారిపోయి అక్కడ తన ఇస్లామ్ మతాన్ని బోధించసాగెనుట. అక్కడ మహమ్మద్ కు అనేక మంది శిష్యులు దొరికారు. వారి సహాయంతో మహమ్మద్ మక్కామీద దండెత్తి దానిని స్వాధీన పరచుకొని 360 దేవాలయాలను, విగ్రహాలను ధ్వంసం చేసి వేయించాడు. తరువాత తన ఏకేశ్వర వాదాన్ని బోధించసాగి మక్కాలో మొట్టమొదటి మసీదు నిర్మించాడు.

మహమ్మద్ బోధలు “దేవుడు ఒక్కడే ఆయనకు రూపం లేదు. ఆయనను మానవులు చూడలేరు. మానవుడు కనిపించని దేవునికి తన రూపంగాని, మరేరూపం

గాని కల్పించరాదు. విగ్రహారాధన కూడదు. నేనే నిజమైన దేవదూతను. భగవంతుడు తన సందేశాలను తన దూతల ద్వారా పంపుతూ వుంటాడు. దొంగతనం చేయరాదు, అబద్ధమాడకూడదు. కల్లు, సారాయిలు త్రాగకూడదు. వ్యభిచారం చేయరాదు. బీదలను కనికరించి, వారికి సహాయం చేయాలి. ప్రతిరోజూ అయిదుసార్లు దైవప్రార్ధన చేయాలి. ప్రతి సంవత్సరం మక్కాయాత్ర చేయాలి. అందరినీ సమానంగా చూడాలి. ఎవరిచేతనైనా పని చేయించుకొని వారి చెమట ఆరకముందే వార్కి కూలి యిచ్చివేయాలి. ఖడ్గబలంతో నైనాసరే ఇస్లామ్ మత ప్రచారం చేయవచ్చును.

కాని మహమ్మద్ నరకము – స్వర్గము, పాపము, పుణ్యము దేవతలు, వగైరాలలో నమ్మకాలను కూడా ప్రోత్సహించినట్లు కొన్ని నిదర్శనాలు కన్పిస్తున్నాయి. అందువలన పూజారులు మతగురువులు స్వర్గం – నరకం, పుణ్యం, పాపం, వగైరాలను ఆసరాగా తీసుకొని సామాన్య ప్రజానీకాన్ని హిందూ పూజారులు పౌరోహితులు వగైరాలవలె మోసపు మాటలు చెప్పి ఆర్థికంగా, బౌద్ధికంగా ప్రజలను దోచుకొనచూ సుఖ జీవనం చేస్తున్నారు.

దేవదూతలు దైవసందేశాలు మోసుకొని వచ్చి చదువురాని మహమ్మద్‌కు అందించి ఆయనచేత చదివించుట, మహమ్మద్ ఒకసారి బొందితో స్వర్గానికి వెళ్ళివచ్చినాడని మొదలైన మూఢనమ్మకాలను మహమ్మద్ అనుయాయులమని చెప్పుకొనే మతగురువులు ప్రజలలో ప్రచారం చేసి ప్రజలను మూఢులుగా వుంచడానికి యత్నిస్తున్నారు.

సారరాంశమేమన హిందూ ముస్లిమ్ క్రైస్తవులు మత ప్రచారకులందరి ముఖ్య లక్ష్యం సామాన్య ప్రజానీకాన్ని దేవుడు, స్వర్గము, నరకము, పాపము, పుణ్యము, పరలోకము, వగైరా మూఢనమ్మకాలతో బంధించి వేసి, వారిని అన్ని విధాలా దోపిడీ చేయటమే, ఈ ఆర్థిక మానసిక దోపిడీలను అరికట్టాలంటే ప్రజలలో ఏ మాత్రమైనా చదువుండాలి. కనుక ప్రజలలో మానవులను మానవులుగా గుర్తింపజయగల చదువును వ్యాపింపచేయాలి. అటువంటి విద్యావిధానం నిజమైన ప్రజాస్వామ్య పరిపాలకులే అమలు జరుపగల్గుతారు. కాని మనది పేరుకు

ప్రజాస్వామ్య పరిపాలన . మత సంబంధం లేని ప్రజాస్వామ్యమని చెప్పబడుతున్నదే గాని మన శాసకులంతా భూస్వామి వర్గానికి చెందిన చిన్న పెట్టుబడిదారులే. వీరంతా మతగురువులకు దాసులే కనుక ఇటువంటి స్వార్ధపరులు, మత దురభిమానులు పాలనలో వున్నంతకాలం నిజమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం గాని మత ప్రసక్తే లేని ప్రజారాజ్యాంగ విధానంగాని ఆచరణలోకి రాజాలదు. కనుక సామాన్య ప్రజలనుండే పరిపాలకులు వచ్చిననాడు మత దురహంకారుల బెడదపోయి, మానవులలో భ్రాతృభావం ప్రబలి మతలకలహాలు మటుమాయమై పోగలవు.